

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 26

శుక్రవారం 18-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

# అనగనగా ఒక కథ... రాస్తున్నారు

● యంగ్ టాలెంట్

**చూసే కన్ను ఉండాలేగానీ మన చుట్టూ కథలే! అలాంటి కన్ను స్రవంతి, స్వప్నలకు ఉంది. తాము చూసిన సంఘటనలు, విన్న విషయాలను కథలుగా రాస్తూ- 'శభాష్' అనిపించుకుంటున్నారు...**



తెలంగాణ రాష్ట్రం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం లింగారెడ్డిపేటకు చెదిన ఎస్.స్రవంతి, ఎం.స్వప్నలు ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బీజెడ్సీ మూడో సంవత్సరం చదువుతున్నారు. ప్రతిరోజూ కలిసే కాలేజీకి వెళుతుంటారు. వాళ్లు పుట్టి పెరిగింది గ్రామీణ ప్రాంతం కావడంతో అక్కడి ప్రజల జీవనవిధానం, మానవ సంబంధాల గురించి అవగాహన ఉంది. తాము చూసిన, విన్న విషయాలపై ఇద్దరూ చర్చించుకుంటూ వాటిని కథలుగా రాయాలనుకునేవారు. ఒకరోజు తాము రాసిన కథలను వాళ్ల తెలుగు మాస్టారుకు చూపించారు. వాటిని చదివిన మాస్టారు 'భలే కథలు రాశారు. గుడ్ ఇలాగే రాయండి' అని ప్రోత్సహించారు. గురువు ప్రోత్సాహంతో వారిలో ఉత్సాహం ఉప్పొంగిపోయింది.

**అలా కల నెరవేరింది**

చెరో 15 కథలు రాశారు. ఆ కథలను చదివిన మాస్టారు 'పుస్తకం వేయాల్సిందే' అన్నారు. పుస్తకం అచ్చు వేయడం అంటే డబ్బుతో కూడుకున్న పని. పిల్లలు సొంతంగా అచ్చు వేయించే పరిస్థితి లేదు. గ్రూప్స్ పరీక్షల నిర్వహణ సమయంలో అప్పటి కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనకు టీఎస్‌పీఎస్సీ ద్వారా వచ్చిన రూ.8 వేలను కాలేజీ పిల్లలకు ఏదైనా కాంపిటీషన్ నిర్వహించి బహుమతులు ఇవ్వమని తెలుగు అధ్యాపకుడు శంకర్ చేతిలో పెట్టి ఉన్నారు. ఆ డబ్బులకు తోడు శంకర్, అదే కాలేజీలో పని చేసే అమరేశం, ప్రభాకర్ మరికొందరు అధ్యాపకులు కలిసి స్రవంతి, స్వప్న రాసిన 30 కథలతో పుస్తకాన్ని అచ్చేయించారు. కాలేజీ వార్షికోత్సవ వేదిక మీద స్థానిక ఎమ్మెల్యే, అధికారుల చేతుల మీదుగా పుస్తక ఆవిష్కరణ జరిగింది.

**అలా మొదలైంది...**

కాలేజీ నుంచి ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా ఊళ్లకు వెళ్లినపుడు ఒక చిత్రాన్ని బట్టి కథ చెప్పాలని క్యాంప్ ఇన్‌చార్జీ అనడంతో స్రవంతి, స్వప్న చెరో కథ చెప్పారు. ఇంటికి వెళ్లిన తరువాత చెప్పిన కథలకు అక్షరరూపం ఇచ్చారు. 'ఇలా కాదు అలా' 'అలా కాదు ఇలా' అంటూ కథ ఒక కొలిక్కి వచ్చే వరకు పలు సార్లు తిరగరాశారు.

ఆ ప్రాక్టీస్ మంచి ఫలితాన్ని ఇచ్చింది. భవిష్యత్తులో స్వప్న, స్రవంతిలు మరిన్ని మంచి కథలు రాయాలని కోరుకుందాం.

– ఎస్.వేణుగోపాలాచారి, సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

## మా జనరేషన్ కథలు



కథలు రాయడంతో పాటు ప్రసిద్ధ రచయితల కథలు బాగా చదవాలనుకుంటున్నాను. దీనివల్ల రాసే శైలి మెరుగుపడుతుంది. మా జనరేషన్‌కు సంబంధించి అనుభూతులు, అనుభవాలు, సమస్యలు...ఎన్నో ఉన్నాయి. వాటికి అక్షర రూపం ఇవ్వాలనుకుంటున్నాను. పెద్దల ప్రోత్సాహం ఉత్సాహాన్ని ఇస్తుంది. మా పుస్తకానికి మంచి స్పందన వచ్చింది.

- స్రవంతి

## గ్రామీణ నేపథ్యంతో...



పాఠ్యపుస్తకాలే కాదు సాహిత్య పుస్తకాలు కూడా చదువుతుంటాను. మాది గ్రామీణ ప్రాంతం కావడంతో నేను చూసిన, విన్న సంఘటనలకు అక్షరరూపం ఇచ్చాను. భవిష్యత్తులో మరిన్ని రచనలు చేయాలనుకుంటున్నాను. సాహిత్య ధోరణుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలనుకుంటున్నాను. వాటికి అనుగుణంగా రచనలు చేయాలనుకుంటున్నాను.

- స్వప్న



● టెక్... టాక్

## పోకో ఎఫ్ 7 ప్రో

**డిస్‌ప్లే:** 6.67 అంగుళాలు
**రిఫ్రెష్ రేట్:** 120 హెచ్‌జడ్
**రిజల్యూషన్:** 1440x3200 పిక్సెల్స్
**వోఎస్:** ఆండ్రాయిడ్ 15
**మెమోరీ:** 256జీబి 12జీబి ర్యామ్/ 512 జీబి 12జీబి ర్యామ్
**ఫ్రంట్ కెమెరా:** 20 ఎంపీ
**బ్యాటరీ:** 6000 ఎఎహెచ్



## కాన్వా ఏఐ



ఆస్ట్రేలియాకు చెందిన మల్టీనేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ కాన్వా సరికొత్త విజువల్ సూట్ 2.వోలో భాగంగా తన మొదటి ఏఐ కోడింగ్ టూల్, వాయిస్ ఎనేబుల్డ్ ఏఐ ఫీచర్, ఏఐ ఆధారిత స్ప్రెడిట్ జనరేటర్‌లాంటివి ప్రకటించింది. 'కాన్వా ఏఐ' అని పిలువబడే వాయిస్-ఎనేబుల్డ్, సంభాషణాత్మక ఏఐ సాధానాన్ని ఆవిష్కరించింది. టెక్స్ట్, స్లైడ్‌లు, చిత్రాలను జనరేట్ చేయడం నుంచి ఫోటోలను ఎడిట్ చేయడం, డిజైన్‌లను రీసైజ్ చేయడం... ఇలాంటివి కేవలం ప్రాంప్ట్‌తో జరుగుతాయని కంపెనీ తెలిపింది. యూజర్‌లు కాన్వాలో ఏఐ జనరేటెడ్ డిజైన్‌లను ఎడిట్ చేసుకునే అవకాశం కూడా ఉంది.

## అవును... ఇది నిజమే!



● ప్రపంచంలోనే అత్యధికంగా జపాన్‌లో వెండింగ్ మెషిన్‌లు ఉన్నాయి. దేశంలో ప్రతి 40 మందికి ఒకటి ఉంటుంది. చాలామంది వివిధ రకాల పానీయాలను విక్రయిస్తుంటారు ● యూఎస్ రాష్ట్రాల పేర్లలో కనిపించని ఒకే అక్షరం...క్యూ ● స్కాట్‌లాండ్‌లో మంచుకు 421 పేర్లు ఉన్నాయి ● 'జర్నల్ ఆఫ్ ఎఫెక్టివ్ డిజార్డర్స్'లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం ఆత్మహత్య ప్రయత్నాలను నిరోధించేలా బ్లూలైట్ ప్రభావం చూపగలదు. ఆత్మహత్యలను అడ్డుకట్ట వేయడానికి జపాన్‌లోని ట్రైన్ ప్లాట్‌ఫామ్‌లపై బ్లూ లైట్లు ఏర్పాటు చేస్తారు.

## రియల్ మీ 14



**సైజ్:** 6.67 అంగుళాలు
**ర్యామ్:** 12జీబి
**మోడల్:** 14 5జీ
**రిఫ్రెష్ రేట్:** 120 హెచ్‌జడ్
**రిజల్యూషన్:** 1080x2400 పిక్సెల్స్
**బ్యాటరీ:** 6,000 ఎంఏహెచ్ **కలర్స్:** మెచా సిల్వర్, స్ట్రోర్మ్ టైటానియం, పింక్ వారియర్

● గేమింగ్

## మాయా ప్రపంచంలోకి...



**ఇంజిన్:** అన్‌రియల్ ఇంజిన్ 4
**మోడ్స్:** సింగిల్-ప్లేయర్
**జానర్స్:** యాక్షన్-అడ్వెంచర్
**ప్లాట్‌ఫామ్స్:** విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

యాక్షన్-అడ్వెంచర్ గేమ్ 'సౌత్ ఆఫ్ మిడ్‌నైట్' విడుదల అయింది. సాఫ్ట్ మోషన్ యానిమేషన్ ఆధారంగా రూపొందించిన ఈ గేమ్‌లో పురాణాల అన్వేషణ, రహస్య జీవులను ఎదుర్కోవడంలాంటివి ఉంటాయి. గోతిక్ ఫాంటసీ 'అమెరికన్ డీప్ సౌత్' నేపథ్యంలో గేమ్ సెట్ చేశారు. దారి పొడవునా ఆత్మల మాయాజాలం కనిపిస్తుంది. హైంట్స్ అని పిలవబడే శత్రువులను ప్లేయర్స్ ఎదుర్కోవలసి వస్తుంది.

గేమ్‌లో ప్రధాన పాత్ర హజెల్. మార్మిక శక్తిని ఉపయోగించి ఎన్నెన్నో సాహసాలు చేస్తుంది. పుష్, పుల్, వీవ్‌లాంటి మంత్రాలు ప్లేయర్స్ ఆయుధాగారంలో కీలక సాధనాలు. చీకటి శక్తుల కేంద్రమైన శత్రువర్గం హాంట్స్‌ను తుద ముట్టించడానికి ప్లేయర్స్‌కు పని కల్పించే గేమ్...సౌత్ ఆఫ్ మిడ్‌నైట్.

## లాప్‌టాప్ అమ్ముతున్నారా? రీసైకిల్ చేస్తున్నారా? - జర భద్రం

● టెక్ కేర్



● మీ లాప్‌ట్యాప్ అమ్మడం, రీసైకిల్ లేదా డొనేట్ చేయడానికి ముందు విండోస్ బిల్ట్-ఇన్ ఫ్యాక్టరీ రీసెట్ ఉపయోగించడం మంచిది. ఇది అన్ని యాప్స్, సెట్టింగ్స్, పర్సనల్ ఫైల్స్‌ను డిలీట్ చేస్తుంది ● రీసెట్ తర్వాత కూడా పాస్‌వర్డ్‌లు, డాక్యుమెంట్లు, బ్యాంకు వివరాలను హ్యాకర్లు తిరిగి పొందగలిగే అవకాశం ఉంది. సెకండ్ హ్యాండ్ లాప్‌టాప్, హార్డ్‌డ్రైవ్‌లు, మెమొరీ కార్డులలో 90 శాతం రికవరీ చేయదగిన డేటా ఉంటుంది. చాలామంది కస్టమర్‌లు తమ డివైజ్‌లను రీసేల్ లేదా డిస్పోజ్ చేసేముందు డేటాను వైప్ చేయడంలో విఫలమవుతున్నారు.

**వ్యక్తిగత సమాచారాన్ని సురక్షితంగా ఉంచుకోవడానికి....** ● పర్సనల్ యూజర్‌లు తమ డివైజ్‌లను విక్రయించడానికి లేదా రీసైకిల్ చేయడానికి ముందు డేటా-వైపింగ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాలి. అయితే కొన్ని ట్రెడిషినల్ వైపింగ్ మెథడ్స్ ప్రభావవంతంగా ఉండకపోవచ్చు ● ఆండ్రాయిడ్ ఫోన్‌లలో 'ష్రెడ్‌డిట్'లాంటి యాప్‌లు సురక్షితమైన డేటా-వైపింగ్ ఆప్షన్‌లను అందిస్తాయి ● సమాచారాన్ని తొలిగించడానికి పూర్తి రీసెట్ అత్యంత ప్రభావంతమైన మార్గం ● సర్టిఫైడ్ డేటా-వైపింగ్ సాధనాలను ఉపయోగించడం మంచిది.



● ఇంగ్లీష్ ఇడియమ్స్

**డెడ్ యాజ్ ఏ డోర్‌నెయిల్**
పూర్తిగా ఇన్‌యాక్టివ్ అయ్యే సందర్భాల్లో, ఎంతమాత్రం పని చేయలేని ప్రతికూల పరిస్థితుల్లో వాడే మాట...

**ఉదా:** ఆఫ్టర్ ది స్కాండల్, హిజ్ పొలిటికల్ కెరీర్ వాజ్ డెడ్ యాజ్ ఏ డోర్ నేల్

**ప్లమ్ జాబ్**
ఎక్కువ డిమాండ్ ఉన్న, అత్యధికులు కోరుకునే అత్యున్నత స్థాయి ఉద్యోగం విషయంలో వాడే మాట...ప్లమ్ జాబ్.

**ఉదా:** ది మార్కెటింగ్ డైరెక్టర్ రోల్ ఎట్ ది టాప్ టెక్ కంపెనీ వాజ్ ఏ ప్లమ్ జాబ్ డ్యూ టు ఇట్స్ పెర్క్స్ అండ్ ఇన్నోవేటివ్ ఎన్విరాన్‌మెంట్.

# సాక్షి సినిమా

## సిర్రాకైంది సింగిల్ బతుకు!



● వెన్నెల కిశోర్, శ్రీవిష్ణు

శ్రీవిష్ణు హీరోగా, కేతికా శర్మ, ఇవాన హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సింగిల్'. 'నిను వీడని నీడను నేనే' మూవీ ఫేమ్ కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్‌పై విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మించిన ఈ సినిమా మే 9న విడుదల కానుంది. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'సిర్రాకైంది సింగిల్ బతుకు...' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. ఈ పాటకి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ''సిర్రాకైంది సింగిల్ బతుకు...' పాట ఫ్రస్ట్రేషన్ యాంథమ్‌గా సాగుతుంది. శ్రీవిష్ణు, 'వెన్నెల' కిశోర్ కలిసి ఒంటరితనానికి హ్యూమర్‌ని జోడించి పాడుకునే ఈ పాట వినోదాత్మకంగా ఉంటుంది. ఈ సాంగ్‌లోని సరదా సాహిత్యం, మాస్ అప్పీల్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి కెమేరా: ఆర్. వేల్‌రాజ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అజయ్ గద్దె.

## సెట్‌లో స్టార్ట్



● నాగచైతన్య

వెండితెరపై ప్రేక్షకులకు సరికొత్త ప్రపంచాన్ని చూపించేందుకు రెడీ అవుతున్నారు నాగచైతన్య. 'విరూపాక్ష' సినిమాతో సూపర్ హిట్ సాధించిన కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా ఓ థ్రిల్లర్ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. కొన్ని నెలల క్రితమే ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించారు. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో రూపొందించిన సెట్‌లో గురువారం ప్రారంభమైందని సమాచారం. నాగచైతన్యతో పాటు కొందరు ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. ఇక ఈ చిత్రంలో నాగచైతన్య సరసన మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారని, 'కాంతార' ఫేమ్ అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారని తెలిసింది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2026లో విడుదలయ్యే అవకాశం ఉంది.

## ఆ సమయంలో చాలా బాధపడ్డాను



● సమంత

''మహిళలు ఎంతో సాధిస్తున్నారు. కానీ పీరియడ్స్ గురించి మాట్లాడటానికి ఇప్పటికీ ఇబ్బందికరమైన వాతావరణమే ఉంది. ఈ విషయం గురించి మాట్లాడాలంటే మౌనం... బిడియం... గుసగుసలు... ఇలాంటి పరిస్థితే ఉంది'' అని పేర్కొన్నారు సమంత. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటారామె. ఎప్పటికప్పుడు ఏదో ఒక విషయాన్ని షేర్ చేస్తూ తన అభిమానులతో టచ్‌లో ఉంటారు. ఇందులో భాగంగా తాజాగా తన పాడ్ కాస్ట్‌లో ఆరోగ్య నిపుణురాలు రాశీ చౌదరితో రుతుక్రమ ఆరోగ్య సమస్యల గురించి మాట్లాడారు సమంత. అలాగే ఎండోమెట్రియోసిస్ (గర్భాశయం లోపలి పొర) వంటి దీర్ఘకాలిక రుతుక్రమ రుగ్మతలపై తన అభిప్రాయాలను పంచుకున్నారామె. ''ఎండోమెట్రియోసిస్‌తో ఒక సెలబ్రిటీగా నేను ఇబ్బందులు పడ్డాను. షూటింగ్, పని తాలూకు ఒత్తిడి... ఇలాంటి వాటితో చాలా బాధపడ్డాను. రుతుక్రమ సమస్యల గురించి అమ్మాయిలు మాట్లాడాలి... అవగాహన పెంచుకోవాలి. పురుషులు కూడా తెలుసుకోవాలి'' అని తెలిపారు సమంత. ఇక సినిమాల విషయానికి వస్తే... విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'ఖుషి' (2023) తర్వాత మరో చిత్రంలో నటించలేదు సమంత. అయితే గతేడాది 'సిటాడెల్ హన్నీ బన్నీ' అనే బాలీవుడ్ వెబ్ సిరీస్ ద్వారా ప్రేక్షకులను పలకరించారు. ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' అనే వెబ్ సిరీస్ చేస్తున్నారామె. అలాగే తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌పై సమంత నిర్మించిన తొలి చిత్రం 'శుభం' షూటింగ్ పూర్తయింది. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది.

## హాలీవుడ్ రేంజ్‌లో ఫైట్



● ఎన్టీఆర్

యాక్షన్‌తో 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) షూటింగ్‌ను ఆరంభించనున్నారట ఎన్టీఆర్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా 'డ్రాగన్' అనే చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ ఆర్ట్స్, మైత్రీ మూవీ మేకర్స్ పతాకాలపై కల్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్, కొసరాజు హరికృష్ణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఫిబ్రవరిలో ప్రారంభమైంది. ఎన్టీఆర్ పాల్గొనని సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ నెల 22 నుంచి ఎన్టీఆర్ 'డ్రాగన్' సినిమా చిత్రీకరణలో పాల్గొననున్నారని ఇప్పటికే చిత్రబృందం తెలిపింది. ఈ సినిమా సెట్స్‌లోకి ఎన్టీఆర్ రానుండటం ఇదే తొలిసారి. కాగా ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌తో ఎన్టీఆర్ పాత్ర చిత్రీకరణ ప్రారంభం అవుతుందని, ఈ యాక్షన్ సీక్వెన్స్‌కు హాలీవుడ్ స్థాయి స్టంట్ కొరియోగ్రాఫర్స్ వర్క్ చేస్తారని సమాచారం. అంతే కాదు... ఈ సినిమాలో ఎంతో కీలకమైన ఈ యాక్షన్ సీక్వెన్స్‌ని ముప్పై రోజులకు పైగానే తీస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. మరి... ఈ హాలీవుడ్ రేంజ్ యాక్షన్ ఏ లెవల్లో ఉంటుందో తెరపై చూడాలంటే చాలా సమయం ఉంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 9న విడుదల చేస్తామని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో టొవినో థామస్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. ఈ సినిమాకు సంగీతం: రవి బస్రూర్.

## మా నమ్మకాన్ని నిజం చేసినందుకు థ్యాంక్స్

– సంపత్ నంది




● వశిష్ఠ, సంపత్ నంది, డి. మధు

''ఓదెల 2' సినిమాలో తమన్నా పెర్ఫార్మెన్స్ హైలైట్‌గా ఉంటుందని, తమన్నా, వశిష్ఠ పాత్రల మధ్య పోటా పోటీ పెర్ఫార్మెన్స్ ఉంటుందని ముందే చెప్పాం. అది ఈ రోజు ప్రేక్షకులు చూస్తున్నారు. సైకిల్ ఎపిసోడ్, క్లైమాక్స్‌లో వచ్చే సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్, మరి కొన్ని సీక్వెన్స్‌లు ఆడియన్స్‌ను మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. మేం పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేసిన ఆడియన్స్‌కు ధన్యవాదాలు'' అన్నారు దర్శక-నిర్మాత-రచయిత సంపత్ నంది. తమన్నా ప్రధాన పాత్రలో, వశిష్ఠ, హెబ్బా పటేల్ ఇతర కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఓదెల 2'. 'ఓదెల రైల్వేస్టేషన్' (2022) సినిమాకు సీక్వెల్‌గా 'ఓదెల 2' తెరకెక్కింది. సంపత్ నంది సూపర్ విజన్‌లో అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్ పతాకాలపై డి. మధు నిర్మించిన ఈ చిత్రం నిన్న (గురువారం) విడుదలైంది. ''ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని, ఆడియన్స్‌కు కనెక్ట్ అయ్యింది'' అని గురువారం సాయంత్రం జరిగిన సక్సెస్ మీట్‌లో పేర్కొన్నారు డి. మధు ''ఈ రోజు నాకు స్పెషల్'' అని వశిష్ఠ అన్నారు.

## ఈ సినిమాకి కథే హీరో

- ఉదయ్ రాజ్



● ఉదయ్‌రాజ్

ఉదయ్ రాజ్, వైష్ణవీ సింగ్ జంటగా నటించిన చిత్రం 'మధురం'. రాజేష్ చికిలే దర్శకత్వంలో యం. బంగారాజు నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో హీరో ఉదయ్ రాజ్ మాట్లాడుతూ- ''మధురం' సినిమాకి కథే హీరో. మధు, రామ్ అనే ఇద్దరి జీవితాలు ఈ సినిమాలో కనిపిస్తాయి. 1990 నేపథ్యంలో పదో తరగతి అమ్మాయి, తొమ్మిదో తరగతి అబ్బాయి మధ్య నడిచే ప్రేమ కథగా 'మధురం' సినిమా సాగుతుంది. ఈ మూవీలో మూడు వేరియేషన్స్ ఉన్న వ్యక్తిగా కనిపిస్తాను. సన్నగా కనిపించే సన్నివేశాల కోసం కొన్ని రోజులు ఆహారం తీసుకోలేదు. కేవలం మంచి నీరే తాగాను. దర్శకుడు రాజేశ్, మ్యూజిక్ డైరెక్టర్ వెంకీ... ఇలా అందరం కొత్తవాళ్లమే అయినా బంగార్రాజు గారు ధైర్యంగా ఈ సినిమాను నిర్మించి, సొంతంగా రిలీజ్ ప్లాన్ చేశారు. ఇక హీరోగానే కాకుండా ఏ తరహా పాత్రలు చేయడానికైనా నేను సిద్ధంగా ఉన్నాను'' అన్నారు.

## క్రైమ్ కామెడీ



● దీక్షిత్ శెట్టి, బృందా ఆచార్య

దీక్షిత్ శెట్టి, బృందా ఆచార్య జంటగా తెలుగు, కన్నడ భాషల్లో రూపొందుతోన్న చిత్రం 'బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి'. అభిషేక్ ఎమ్. దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీదేవి ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై హెచ్‌కే ప్రకాశ్ నిర్మిస్తున్నారు. జుధాన్ శ్యాండీ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'హర ఓం...' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేసి, మ్యూజిక్ ప్రమోషన్స్‌ని ఆరంభించారు. బట్టు విజయ్ కుమార్ సాహిత్యం అందించిన ఈ పాటను మంగ్లీ పాడారు. ''క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి'. ఇప్పటికే రిలీజ్ చేసిన మా సినిమా ఫస్ట్ లుక్‌కి మంచి స్పందన వచ్చింది. అదే విధంగా ఆశ గురించి తెలియజేసే 'హర ఓం...' సాంగ్‌కి మంచి ఆదరణ దక్కుతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: అభిషేక్ జే.

## మీకోసం మీరు నిలబడాలి

– నటి- నిర్మాత సుమయ రెడ్డి



● సాయి రాజేశ్, సుమయ రెడ్డి, పృథ్వీ అంబర్

''తెలుగు అమ్మాయిలు ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలోకి ఎక్కువగా వస్తున్నారు. నేను ఓ అడుగు ముందుకు వేసి, సినిమా నిర్మించాను. మీ కోసం మీరు నిలబడకపోతే మీ కోసం ఎవరూ నిలబడరు. ఎంతో కష్టపడి ఈ సినిమాను ఇక్కడి వరకు తీసుకువచ్చాను. అందరూ 'డియర్ ఉమ' సినిమాను థియేటర్స్‌లో చూసి, నాకు సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను'' అని సుమయ రెడ్డి అన్నారు. సుమయ రెడ్డి కథ అందించి, హీరోయిన్‌గా నటించి, నిర్మించిన చిత్రం 'డియర్ ఉమ'. పృథ్వీ అంబర్ ఈ సినిమాలో హీరోగా నటించారు. సాయి రాజేశ్ మహాదేవ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో సుమయ రెడ్డి మాట్లాడుతూ- ''నగేశ్ ఈ ప్రాజెక్ట్ స్టార్టింగ్ నుంచి నాతోనే ఉన్నారు. నాకు సపోర్ట్‌గా నిలిచిన సాయి రాజేశ్‌గారికి, మధు, చక్రవర్తిలతో పాటు చిత్రయూనిట్‌కు ధన్యవాదాలు'' అని అన్నారు. ''సమాజానికి ఓ సందేశం ఇవ్వాలని సుమయ ఈ సినిమాను నిర్మించారు'' అని తెలిపారు సాయి రాజేశ్. ''నా కూతురు సుమయ పదేళ్ల నుంచి కష్టపడుతూ ఈ స్థాయికి వచ్చింది. ఆమె నాకు రోల్ మోడల్'' అన్నారు జ్యోతి రెడ్డి.

సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 26
శుక్రవారం 18-4-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



### సన్‌రైజర్స్ ఓటమి బాట
ముంబై ఇండియన్స్ చేతిలో 4 వికెట్ల తేడాతో ఓడిన హైదరాబాద్ -16లో



### నాలుగోరోజూ బుల్ రన్
విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్ల మద్దతు. 78,000 స్థాయిపైకి సెన్సెక్స్ -16లో



### సౌర వ్యవస్థకు ఆవల జీవం!
సౌర వ్యవస్థ వెలుపల ఉన్న 'కే2-18బీ' అనే గ్రహంపై జీవం ఉందనడానికి ఆధారాలు లభించాయని కేంబ్రిడ్జ్ పరిశోధకులు చెప్పారు.
వివరాలు 6లో ▸



### 'హార్వర్డ్'పై ట్రంప్ ఆంక్షల కత్తి
వర్సిటీల వల్లే అమెరికన్ యువతలో పాలస్తీనా భావజాలం వ్యాప్తి చెందుతోందంటూ హార్వర్డ్ వర్సిటీపై ట్రంప్ ఆంక్షలు విధించారు.
వివరాలు 6లో ▸




### ఇంటర్వ్యూ స్లాట్లు అదృశ్యం
అమెరికా వీసా ఇంటర్వ్యూ స్లాట్లు ఆన్‌లైన్ నుంచి అదృశ్యమైపోతుండడం భారతీయ విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది.
వివరాలు 6లో ▸




### ఆ టీచర్లు కొనసాగొచ్చు
ఎలాంటి ఆరోపణలు లేని టీచర్లు ఉద్యోగంలో కొనసాగేందుకు అనుమతిస్తున్నామని బెంగాల్ కేసులో సుప్రీంకోర్టు చెప్పింది.
వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

### రాజకీయ కక్షతోనే చార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లు



గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు వస్తున్నామని రాహుల్‌గాంధీ పార్లమెంట్ సాక్షిగా చెప్పడంతోనే.. మోదీ సర్కార్ కక్ష రాజకీయాలకు దిగిందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్ అన్నారు.
- వివరాలు 2లో▶

### త్వరలో ఎస్‌ఎల్‌బీసీ పనులు పునఃప్రారంభం



ఎస్‌ఎల్‌బీసీ సొరంగం తవ్వకాలు అవుట్‌లెట్ వైపు నుంచి త్వరలో పునఃప్రారంభం కానున్నాయి. అమెరికాకు చెందిన రాబిన్స్ కంపెనీ నుంచి బేరింగ్‌ను కొనుగోలు చేసి ప్రత్యేక నౌకలో చెన్నైకి తీసుకొచ్చారు.
- వివరాలు 7లో▶

### తెలంగాణలో ప్రతి లక్ష మందికి 233 మంది పోలీసులు




జాతీయ స్థాయిలో ప్రతి లక్ష మంది జనాభాకు మంజూరైన పోలీసుల సంఖ్య 197 కాగా, కేవలం 155 మంది మాత్రమే ఉన్నారు. తెలంగాణలో ప్రతి లక్ష మందికి 233 మంది పోలీసులు అందుబాటులో ఉన్నారు.
- వివరాలు 2లో▶

### గుండె ఆరోగ్యాన్ని తెలిపే 'లెక్క'!



ఫిట్‌నెస్ బ్యాండ్లు లేదా స్మార్ట్ వాచీలు మన హృదయ స్పందనల్లో తేడాలను గుర్తించి అప్రమత్తం చేస్తుండటం తెలిసిందే. అయితే ఓ చిన్న 'లెక్క'సాయంతో అంతకన్నా మరింత కచ్చితత్వంతో గుండె ఆరోగ్యాన్ని గుర్తించే విధానాన్ని పరిశోధకులు గుర్తించారు.
- వివరాలు 8లో▶



గురువారం టోక్యోలో మరుబెని కంపెనీ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



# ఫ్యూచర్ సిటీలో మరుబెని పార్క్

## తయారీ ప్లాంట్ల ఏర్పాటుకు అనువుగా అధునాతన పారిశ్రామిక పార్కు అభివృద్ధి

- రూ.1,000 కోట్ల ప్రారంభ పెట్టుబడికి జపాన్ సంస్థ సంసిద్ధత
- సీఎం రేవంత్ బృందం జపాన్ పర్యటనలో కీలక ఒప్పందం
- 30 వేలకు పైగా ఉద్యోగాలు లభిస్తాయన్న ముఖ్యమంత్రి
- జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీతోనూ సీఎం చర్చలు
- మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టుకు రూ.11,693 కోట్ల రుణం కోసం విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి చేయనున్న మొట్టమొదటి నెక్ట్స్ జెన్ ఇండస్ట్రియల్ పార్కులో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 30 వేలకు పైగా ఉద్యోగాలు లభిస్తాయని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. దేశంలోనే మొట్టమొదటి నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణలో వ్యాపారానికి అనువైన అవకాశాలు ఉన్నాయని, పెట్టుబడులతో రాష్ట్రానికి వచ్చే వారికి తమ ప్రభుత్వం తరఫున మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. జపాన్ పర్యటనలో ఉన్న సీఎం నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో అక్కడి వ్యాపార దిగ్గజ సంస్థ 'మరుబెని'ప్రతినిధులు గురువారం టోక్యోలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అధునాతన వసతులతో కూడిన (నెక్ట్స్ జెన్) పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేసేందుకు 'మరుబెని'సంసిద్ధత వ్యక్తం చేసింది. 600 ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్కును దశల వారీగా అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వంతో కీలక పెట్టుబడుల ఒప్పందం కుదుర్చుకుంది. పార్కు ఏర్పాటుకు సంబంధించిన 'లెటర్ ఆఫ్ ఇంటెంట్'పై సీఎం రేవంత్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, 'మరుబెని'ప్రతినిధులు సంతకాలు చేశారు. రూ.1,000 కోట్ల ప్రారంభ పెట్టుబడితో సంస్థ ఈ ప్రాజెక్టును చేపడుతుంది.

**తయారీ రంగంలో విదేశీ పెట్టుబడులకు చాన్స్**

జపాన్‌కు చెందిన కంపెనీలతో పాటు ఇతర బహుళ జాతి కంపెనీలు హైదరాబాద్‌లో తమ తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు వీలుగా అభివృద్ధి చేసే ఈ పార్కు రూ.5 వేల కోట్లకు పైగా
మిగతా 10వ పేజీలో ▶

# గ్రూప్-1 నియామకాలు నిలిపివేయండి

**టీజీపీఎస్సీకి హైకోర్టు ఆదేశం**

**సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగించేందుకు ఓకే**

- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలన్న న్యాయమూర్తి
- మెయిన్స్ మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్ విచారణ
- మధ్యంతర ఉత్తర్వులు జారీ.. తదుపరి విచారణ 28కి వాయిదా



సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 నియామకాలను నిలిపివేస్తూ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మెయిన్స్ మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్‌లో తాము తీర్పు వెలువరించే వరకు నియామక పత్రాలు జారీ చేయవద్దని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)కు స్పష్టం చేసింది. అయితే ప్రస్తుతం నడుస్తున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను కొనసాగించేందుకు వెసులుబాటు ఇచ్చింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అభ్యర్థుల డేటా నమోదు చేసే లాగ్డ్ హిస్టరీ సమర్పణతో పాటు పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కమిషన్‌ను ఆదేశించింది. తదుపరి విచారణ 28కి వాయిదా వేసింది.

**అవకతవకలపై విచారణ జరిపించండి**

గ్రూప్-1 పోస్టులు భర్తీ చేసే క్రమంలో 2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు, అసమానతలు చోటు చేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట శివనగర్‌కు చెందిన కె.పర్శరాములుతో పాటు మరో 19 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్ వేసిన వారిలో 19 మంది ప్రభుత్వ ఉద్యోగులేనని చెబుతుండటం గమనార్హం. కాగా తమ సమాధాన పత్రాలను సరిగా మూల్యాంకనం చేయలేదని, జనరల్ ర్యాంకింగ్ జాబితాను తప్పుగా ప్రచురించారని వారు పేర్కొన్నారు. అవకతవకల తీవ్రత దృష్ట్యా విచారణకు ఆదేశించి కోర్టు పర్యవేక్షించినా సరే లేదా స్వతంత్ర న్యాయ విచారణకు ఆదేశించాలని కోరారు. తమ జవాబు పత్రాలను తిరిగి మూల్యాంకనం చేసేలా లేదా తిరిగి మెయిన్స్ నిర్వహించేలా కమిషన్‌కు
మిగతా 10వ పేజీలో ▶

సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు



# పుప్పాలగూడలో ఐటీ నాలెడ్జ్ హబ్

## 450 ఎకరాల్లో ఏర్పాటుకు సత్వర చర్యలు

- గతంలో ప్రజాప్రతినిధులు, ఐఏఎస్‌లకు ఇచ్చిన 200 ఎకరాలు
- పారిశ్రామికాభివృద్ధి సంస్థకు చెందిన మరో 250 ఎకరాలు గుర్తింపు
- ఈ 450 ఎకరాల్లో మొదటి దశ నాలెడ్జి హబ్ ఏర్పాటు
- అధికారులను ఆదేశించిన భట్టి, శ్రీధర్‌బాబు, పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ శివార్లలోని పుప్పాలగూడలో 450 ఎకరాల్లో ఐటీ నాలెడ్జ్ హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మొదటి దశ కింద 450 ఎకరాల్లో ఏర్పాటుకు వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గతంలో ప్రభుత్వం ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్, రెవెన్యూ అధికారులకు, స్పెషల్ పోలీసు మ్యూచువల్ కో ఆపరేటివ్ సొసైటీకి కేటాయించిన 200 ఎకరాలతో పాటు, పారిశ్రామికాభివృద్ధి సంస్థకు చెందిన మరో 250 ఎకరాల స్థలంలో ఐటీ నాలెడ్జ్ హబ్‌ను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం సాయంత్రం
మిగతా 7వ పేజీలో ▶

# వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోం

- మే ఐదోతేదీదాకా సెంట్రల్ వక్ఫ్ బోర్డులు, మండళ్లలో నియామకాలు చేపట్టబోము
- సుప్రీంకోర్టుకు తెలియజేసిన కేంద్రం
- మధ్యంతర స్టే ఇవ్వాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తిరస్కరించిన కోర్టు
- వక్ఫ్ చట్టాన్ని పూర్తిగా నిలుపుదల చేయడం కుదరదన్న ధర్మాసనం
- పిటిషన్లపై స్పందన తెలిపేందుకు కేంద్రానికి 7 రోజుల గడువిచ్చిన కోర్టు
- వాదన వినకుండా సెక్షన్ల నిలుపుదల యోచన సబబుకాదన్న కేంద్రం



- వివరాలు 6లో

'నూతన చట్టంలోని కొన్ని సెక్షన్లు సమతుల్యతతో ఉన్నాయి. అందుకే మొత్తం చట్టాన్ని నిలుపుదల చేయడం అస్సలు కుదరదు. అలా చేయడం సహేతుకం కూడా కాదు. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున డీనోటిఫై లాంటి వాటి జోలికి పోవద్దు'
**సుప్రీంకోర్టు ధర్మాసనం**

### ప్రాజెక్టు వర్క్‌కే ప్రాధాన్యం

- ఇకపై నైపుణ్యం ఉంటేనే 'డిగ్రీ'
- కంప్యూటర్ కోర్సులైతే మరింత కఠినం
- సిలబస్, పరీక్షల విధానంలో మార్పులకు సర్కారు గ్రీన్ సిగ్నల్!

9లో




### 'గ్రూప్స్' డోస్ పెంచుదాం

పరీక్షల్లో ప్రశ్నల స్థాయి పెంచే యోచనలో టీజీపీఎస్సీ

ఉద్యోగాలకు ఉత్తమ అభ్యర్థుల ఎంపికే లక్ష్యం

- మూస పద్ధతికి స్వస్తి.. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ముందుకు..
- క్వశ్చన్ బ్యాంకు రూపకల్పన కోసం ఇక వర్సిటీల నిపుణులతో ప్యానెల్
- వర్సిటీల వీసీలు, విద్యారంగ నిపుణులతో కమిషన్ భేటీ
- త్వరలో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చే దిశగా అడుగులు



- వివరాలు 5లో

# రాష్ట్రపతిని కోర్టులు ఆదేశించలేవు

- సుప్రీంకోర్టు సూపర్ పార్లమెంట్‌గా వ్యవహరించొద్దు
- ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ స్పష్టీకరణ

6లో



రాష్ట్రపతిని ఆదేశించే అధికారం న్యాయ వ్యవస్థకు లేదని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చెప్పారు. సుప్రీంకోర్టు సూపర్ పార్లమెంట్‌గా వ్యవహరించవద్దని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై సుప్రీంకోర్టు 'అణు క్షిపణి' ప్రయోగించాలనుకోవడం సమంజసం కాదని చెప్పారు. రాష్ట్ర గవర్నర్లు పంపించిన బిల్లులకు సమ్మతి తెలియజేసే విషయంలో రాష్ట్రపతికి గడువు నిర్దేశిస్తూ ఇటీవల సుప్రీం ఆదేశాలివ్వడం పట్ల జగదీప్ ధన్‌ఖడ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టుకు ఆ అధికారం ఎక్కడిదని ఆక్షేపించారు.



# భూభారతితో అన్నదాత కష్టాలు తీరుస్తాం



**దొరగారి ధరణితో పాతాళానికి రైతులు**

**భూభారతి అవగాహన సదస్సులో పొంగులేటి**

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ధరణి కష్టాల గురించి చెప్పారు
- మేం ఏం చేసినా ప్రతిపక్షాలు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయి
- ఇప్పటికైనా మారకుంటే లోక్‌సభ ఫలితాలే పునరావృతమవుతాయి

కళ్లుండి చూడలేని ప్రతిపక్షాలు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాయి. అసెంబ్లీలో ఈ చట్టం ఆమోదం కోసం పెట్టినప్పుడు ఇంగిత జ్ఞానం కూడా లేకుండా అడ్డుకునే ప్రయత్నం చేశాయి. రైతునని చెప్పుకునే నాయకుడు తెచ్చిన చట్టం ద్వారా ప్రజలు ఎంత గోస పడ్డారో ఇంకా వారికి అర్థం కావడం లేదు.

ఖాజీపూర్ నుంచి సాక్షి ప్రతినిధి

బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి చట్టంతో రైతులు అనేక కష్టాలు అనుభవించారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. రైతుల కష్టాలు తీర్చేందుకే ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని అమలుచేస్తున్నట్లు తెలిపారు. భూభారతి చట్టం అమలులో భాగంగా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలం ఖాజీపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు పొంగులేటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నాడు దొరవారు చేసిన ధరణి చట్టం పేద ప్రజలను, రైతులను పాతాళానికి తొక్కింది. ఇప్పుడు మేం తెస్తున్న భూభారతి చట్టం రైతుకు, భూమికి మధ్య ఉండే బంధాన్ని బలోపేతం చేస్తుంది. గ్రామాలు, గూడేలు, తండాల్లో ఉండే పేదలకు భరోసా, వారి భూములకు భద్రత ఉండేలా ఈ చట్టం తీసుకొస్తున్నాం'అని వివరించారు.

**పింక్ చొక్కాల కష్టాలూ తీరుస్తాం**

పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను 15 నెలల్లోనే కాంగ్రెస్ చేసిందన్న అక్కసుతోనే ప్రతి పనికి ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని మంత్రి పొంగులేటి విమర్శించారు. 'వాళ్లు మమ్మల్ని తిట్టినా,
మిగతా 2వ పేజీలో ▶

# దిక్కుమాలిన సర్కారును పడగొట్టం

- ఆత్మాభిమానం లేని సీఎం.. విమర్శలు వచ్చినా దులుపుకుంటున్నాడు
- కంచ గచ్చిబౌలి భూములపై మోదీ స్పందించి విచారణకు ఆదేశించాలి

**ఐదేళ్ల తర్వాత ప్రజలే తన్ని తరిమేస్తారు.. రోడ్డు మీదకు వచ్చి నిలదీస్తారు: కేటీఆర్**



సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో దిక్కుమాలిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మేము పడగొట్టడం ఎందుకు.. ఐదేళ్ల తర్వాత ప్రజలే తన్ని తరిమేస్తారు. మా పార్టీ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యం. ఈ ప్రభుత్వ పనితీరు బాగా లేదంటూ ప్రజలు ఆక్రోశిస్తున్నారు. ఈ సర్కారును ఎత్తి పడేయమని మమ్మల్ని అడుగుతున్నారు. కొందరు చందాలు వేసుకొని
మిగతా 2వ పేజీలో ▶

## క్లుప్తంగా...

### కాంగ్రెస్‌ది రాజకీయ దివాలాకోరుతనం

కేంద్రమంత్రి బండి సంజయ్



సాక్షి, న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసు వ్యవహారంలో హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం వద్ద నిరసనలో కాంగ్రెస్ నేతలు చేసిన విమర్శలు అవమానకరంగా ఉన్నాయని.. ఇది పూర్తిగా కాంగ్రెస్ పార్టీ రాజకీయ దివాలాకోరుతనానికి ఒక ఉదాహరణ అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. ఈడీ కార్యాలయం వద్ద తెలంగాణ కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ స్క్రిప్ట్ ప్రకారమే నిరసన తెలిపారన్నారు. అదే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, కిషన్‌రెడ్డిలపై కాంగ్రెస్ నేతలు దుర్భాషలాడడం సిగ్గుచేటని బండి మండిపడ్డారు. ఈ మేరకు గురువారం సాయంత్రం 'ఎక్స్' వేదికగా ఆయన తెలంగాణ కాంగ్రెస్ నేతలపై ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బండి డిమాండ్ చేశారు.

### రైజింగ్ కాదు.. ఫాలింగ్

వృద్ధిరేటు పతనం ఆందోళనకరం: హరీశ్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలు, పాలనలో అవగాహన లేమితో రాష్ట్రంలో వృద్ధి గణనీయంగా తగ్గిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వృద్ధి గణనీయంగా పడిపోతుండటం ఆందోళనకరమని గురువారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన సీఏజీ నెలవారీ సూచికల ప్రకారం రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం 2023–24లో రూ.1,24,146.19 కోట్లుగా నమోదైందన్నారు. కానీ 2024–25 నాటికి రూ.1,24,054.38 కోట్లకు చేరగా రూ.91.81 కోట్ల తగ్గుదల నమోదైందని పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో తప్ప రాష్ట్రంలో ఇంతటి తగ్గుదల ఎప్పుడూ కనిపించలేదన్నారు.

### కేటీఆర్‌కు మతి భ్రమించింది

ప్రభుత్వ విప్ అయిలయ్య



సాక్షి, హైదరాబాద్: అధికారం పోయిందన్న అక్కసుతో ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఎద్దేవా చేశారు. వెకిలి చేష్టలతో కాళ్లలో కట్టెలు పెట్టినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. అవినీతి డబ్బుతో పెట్టిన పింక్ మీడియాతో.. ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వం నచ్చకనే పదిమంది ఎమ్మెల్యేలు తమ దగ్గరకు వచ్చారని గుర్తు చేశారు. 'మీ జేజమ్మ దిగొచ్చినా పదేళ్ల రాష్ట్రంలో ఉండేది కాంగ్రెస్ ప్రభుత్వమే'.. అన్నారు.

### సోనియా కుటుంబ అవినీతిపై విచారణ వేగవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: సోనియా గాంధీ కుటుంబం చేసిన అవినీతిపై ఈడీ విచారణను వేగవంతం చేసి, న్యాయస్థానాల్లో శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ కోరుతోందని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు పేర్కొన్నారు. సోనియా గాంధీ కుటుంబం బోఫోర్స్, 2జీ స్కాం, హెలికాప్టర్ల కొనుగోలు, కామన్‌వెల్త్ స్కాం లాంటి ఎన్నో అవినీతి కుంభకోణాల్లో వేల కోట్ల దేశ సంపదను లూటీ చేసిందని ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వేల కోట్ల రూపాయల నేషనల్ హెరాల్డ్ ఆస్తులను సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, వారి కుటుంబం కాజేసిందని ఆరోపించారు. ఈడీ ప్రాథమిక విచారణలోనే సోనియా, రాహుల్ గాంధీ ముద్దాయిలుగా తేలారని చెప్పారు. ఈ అంశంపై విచారణ జరగకూడదా? అవినీతిపై చర్యలు తీసుకోవడం తప్పా? అని ఆయన ప్రశ్నించారు. బెయిల్‌పై ఉన్న సోనియా, రాహుల్ గాంధీ బీజేపీని అప్రతిష్టపాలు చేయాలని ప్రయత్నించడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

### కిషన్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

డీజీపీకి బీజేపీ నేత వీరేందర్‌గౌడ్ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి బీజేపీ అధికార ప్రతినిధి టి.వీరేందర్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రులపైనే బహిరంగంగా ఇష్టం వచ్చినట్టు వ్యాఖ్యలు చేయడం, బెదిరింపులకు పాల్పడటం చూస్తుంటే.. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో స్పష్టమవుతోందని పేర్కొన్నారు. కిషన్‌రెడ్డిపై మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఒక ప్రకటనలో ఖండించారు.




## తెలంగాణలో ప్రతీ లక్ష మందికి 233 మంది పోలీసులు

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులది అత్యంత కీలకపాత్ర. నేరాలు జరగకుండా చూడడంతోపాటు నేరస్తులను చట్టం ముందు నిలబెట్టేలా దర్యాప్తు చేయడం వీరి ప్రధాన విధి. అయితే దేశవ్యాప్తంగా పోలీసుల సంఖ్యకు నానాటికీ పెరుగుతున్న జనాభాకు పొంతన లేకుండా పోతోంది. దేశవ్యాప్తంగా ప్రతి లక్ష మంది జనాభాకు కేవలం 155 మంది పోలీసులు మాత్రమే ఉన్నట్టు ఇటీవల విడుదలైన ఇండియా జస్టిస్ రిపోర్ట్ (ఐజేఆర్)–2025 నివేదిక వెల్లడించింది.


- సాక్షి, హైదరాబాద్

జాతీయ స్థాయిలో సగటున ఉండాల్సింది..197 మంది, జాతీయ సరాసరిన 155కి మించని సంఖ్య

తెలంగాణ పోలీస్‌శాఖలో మహిళా సిబ్బంది సంఖ్య 8.7 శాతం, అధికారులు 7.6 శాతం మంది

వెల్లడించిన ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025

- జాతీయ స్థాయిలో సరాసరిన చూస్తే ప్రతి లక్ష మంది జనాభాకు మంజూరైన పోలీసుల సంఖ్య 197 కాగా, కేవలం 155 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు.
- తెలంగాణ విషయానికి వస్తే ప్రతి లక్ష మంది జనాభాకు ఇక్కడ 233 మంది పోలీసులు అందుబాటులో ఉన్నారు.
- ఇక రాష్ట్రాల వారీగా చూస్తే ప్రతి లక్ష మందికి బిహార్‌లో అత్యల్పంగా కేవలం 75 మంది పోలీసులు మాత్రమే అందుబాటులో ఉన్నారు.




### మహిళా పోలీసుల సంఖ్య అంతంతే..

- పోలీస్ బలగాల్లో మహిళా అధికారులు, సిబ్బంది సంఖ్య సైతం ఆశించిన స్థాయిలో పెరగడం లేదు.
- జాతీయ స్థాయిలో పోలీస్ విభాగాల్లో మహిళా సిబ్బంది సంఖ్య 8 శాతంగా ఉండగా..మహిళా అధికారుల సంఖ్య 10 శాతానికి పరిమితమైంది.
- తెలంగాణ పోలీస్‌శాఖలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తూ మహిళల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వ చర్యలు తీసుకుంటోంది. అయితే ఐజేఆర్ 2025 నివేదిక ప్రకారం తెలంగాణ పోలీస్‌శాఖలో మహిళా సిబ్బంది 8.7 శాతంగా, మహిళా అధికారుల సంఖ్య 7.6 శాతంగా ఉన్నట్టు నివేదిక వెల్లడించింది.
- దేశవ్యాప్తంగా అత్యధికంగా తమిళనాడు పోలీస్‌శాఖలో మహిళా సిబ్బంది సంఖ్య 20.7 శాతంగా, మహిళా అధికారుల సంఖ్య 20.1 శాతంగా ఉన్నట్టు నివేదిక పేర్కొంది.

## భూభారతితో అన్నదాత కష్టాలు తీరుస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

అడిపోసుకున్నా సరే.. పింక్ చొక్కాలు వేసుకున్నవారి భూ సమస్యలను కూడా భూభారతి ద్వారా పరిష్కరిస్తాం. నేను అసెంబ్లీలో ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే నా దగ్గరకు వచ్చి ధరణి పోర్టల్ వల్ల తమ పాసు పుస్తకాల్లో తప్పులు వచ్చాయని తెలిపారు. భారతికి బదులు భరత్‌రెడ్డి అని, 9 ఎకరాలకు బదులు 9 గుంటలు అని పడిందని, వాటిని కొత్త చట్టం ద్వారా సరిచేయాలని కోరారు. దేశానికి భూభారతి చట్టం రోల్‌మోడల్ కాబోతోంది. పింక్ చొక్కాలు వేసుకున్న వారు గతంలో పేదలకు చెందిన లక్షలాది ఎకరాల భూమిని కొల్లగొట్టారు. ఆ భూములన్నింటిని తిరిగి పేదలకు పంచాలనేది మా ఉద్దేశం. అసైన్డ్ భూములపై కూడా రైతులకు హక్కులు కల్పిస్తాం. కోర్టుల్లో లేని ప్రతి భూ సమస్యకు భూభారతి ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుంది' అని తెలిపారు.

**మంచిని మంచి అని చెప్పకపోయినా..**
**చెడుగా చిత్రీకరించొద్దు..**

మా ప్రభుత్వానికి మంచి మార్కులు వస్తాయనే అక్కసుతోనే మేం ఏం చేసినా అడ్డుకునే ధోరణితో ప్రతిపక్షాలు ముందుకెళుతున్నాయని పొంగులేటి విమర్శించారు. 'కళ్లుండి చూడలేని ప్రతిపక్షాలు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాయి. అసెంబ్లీలో ఈ చట్టం ఆమోదం కోసం పెట్టినప్పుడు ఇంగిత జ్ఞానం కూడా లేకుండా అడ్డుకునే ప్రయత్నం చేశాయి. రైతునని చెప్పుకునే నాయకుడు తెచ్చిన చట్టం ద్వారా ప్రజలు ఎంత గోస పడ్డారో ఇంకా వారికి అర్థం కావడం లేదు. మంచిని మంచి అని చెప్పకపోయినా చెడుగా చిత్రీకరించే ప్రయత్నం చేయవద్దు. ఇప్పుడు కూడా బీఆర్‌ఎస్ తన విధానం మార్చుకోకపోతే పార్లమెంటు ఎన్నికల ఫలితాలే పునరావృతమవుతాయి' అని హెచ్చరించారు. సదస్సులో నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, భూ చట్టాల నిపుణుడు భూమి సునీల్‌లు భూభారతి చట్టంలోని ముఖ్యాంశాలను రైతులకు వివరించారు. అక్కడే ఏర్పాటు చేసిన కౌంటర్‌లో రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ధరణి పోర్టల్ వల్ల తాను కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు. తన భూమి పాసుపుస్తకంలో వాకిటికి బదులుగా వాకాటి అని వచ్చిందని, దానిని మార్చాలని అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేకపోయిందని చెప్పారు. తన నియోజకవర్గంలో ఇక నుంచి భూభారతి చట్టంలోని సెక్షన్ల గురించి రైతులకు వివరిస్తానని పేర్కొన్నారు. భూమి సునీల్ మాట్లాడుతూ.. భూభారతి చట్టం ద్వారా రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని 1.30 కోట్ల మంది రైతుల శ్రేయస్సే లక్ష్యంగా చట్టం మార్చామని చెప్పారు. సదస్సులో ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి, బాలల హక్కుల కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

## 75 ఏళ్లలో ఎంతమంది పేదలకు న్యాయం చేశారు?

రాహుల్, రేవంత్, ఒవైసీలకు కిషన్‌రెడ్డి ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: గత 75 ఏళ్లుగా వక్ఫ్ బోర్డుతో ఎంతమంది పేదలకు న్యాయం చేశారో కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ చెప్పాలని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. దీంతో మజ్లిస్ పార్టీ నాయకులు, మతపెద్దలు, ల్యాండ్ గ్రాబర్లు, రియల్ ఎస్టేట్ కంపెనీలు మాత్రమే ప్రయోజనం పొందాయన్నారు. వక్ఫ్ సవరణ చట్టంపై అసదుద్దీన్, రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు ముస్లింల ఓటుబ్యాంకు కోసం తప్పుడు ప్రచారం చేస్తూ, వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇది ఏ వర్గానికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. గురువారం బీజేపీ కార్యాలయంలో 'వక్ఫ్ సుధార్ జనజాగరణ అభియాన్' కన్వీనర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.జి.మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన వర్క్‌షాప్‌లో పార్టీ జాతీయ నేతలు శివప్రకాశ్, అర్వింద్ మీనన్, అభయ్ పాటిల్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, రాష్ట్రనేతలు చంద్రశేఖర్ తివారీ, ప్రేమేందర్‌రెడ్డి, డి.ప్రదీప్ కుమార్, కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో వక్ఫ్ బోర్డు పరిధిలో 77 వేల ఎకరాల భూమి, 35 వేల ప్రాపర్టీలు ఉన్నాయని, వాటి ఆదాయ వివరాలు రేవంత్‌రెడ్డి, ఒవైసీ చెప్పాలన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో జిల్లాల స్థాయిలో సమావేశాలు నిర్వహించి వక్ఫ్ సవరణ చట్టంపై ప్రజల అనుమానాలు నివృత్తి చేస్తామని పేర్కొన్నారు.

## దిక్కుమాలిన సర్కారును పడగొట్టం

▶ మొదటి పేజీ తరువాయి

సర్కారును కూలగొట్టమని అడుగుతున్నారని మాత్రమే మా ఎమ్మెల్యే చెప్పాడు. కాంగ్రెస్ పార్టీ కరోనా కంటే డేంజర్ అనే విషయం ప్రజలకు తెలియాలి. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలి. అలా అయితేనే మరో 20 ఏళ్ల వరకు ఎవరూ కాంగ్రెస్‌కు ఓటు వేయరు' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. 'రేవంత్‌రెడ్డి చేస్తున్న లుచ్ఛా పనులకు ప్రజలే బుద్ధి చెబుతారు. అవసరమైతే ప్రజలే రోడ్డు మీదకు వచ్చి ఈ ప్రభుత్వాన్ని నిలదీస్తారు. మా పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పదిమంది ఎమ్మెల్యేలు త్రిశంకు స్వర్గంలో ఉన్నారు. వాళ్ల బతుకు అధ్వానంగా ఉంది' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

**ఆత్మాభిమానం ఉంటే రాజీనామా చేయాలి**

'కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై ఆత్మాభిమానం లేని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని విమర్శలు వచ్చినా రాజీనామా చేయకుండా దులుపుకొని బతుకుతున్నాడు. ఏడాది క్రితం రాష్ట్రంలో ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపించిన ప్రధాని మోదీ ఇప్పుడు మేల్కొని హెచ్‌సీయూ భూముల్లో కాంగ్రెస్ పర్యావరణ విధ్వంసం చేసిందని ఆరోపించారు. సెంట్రల్ ఎంపవర్ కమిటీ (సీఈసీ) నివేదిక ఇచ్చినా మోదీ ప్రభుత్వం స్పందించి ఎందుకు విచారణకు ఆదేశించడం లేదు. బీజేపీకి తన చిత్తశుద్ధిని నిరూపించుకునేందుకు సుప్రీంకోర్టు జడ్జి నేతృత్వంలో పర్యావరణ విధ్వంసంపై విచారణకు ఆదేశించాలి. లేదా ఆర్‌బీఐ, సీవీసీ, సీబీఐ వంటి కేంద్ర సంస్థలకు అయినా దర్యాప్తు బాధ్యతలు ఇవ్వాలి' అని కేటీఆర్ మండిపడ్డారు.

### రాజకీయ ప్రయోజనాల కోసం అరాచకం

'సీబీఐని గతంలో కాంగ్రెస్ దుర్వినియోగం చేస్తే.. ప్రస్తుతం బీజేపీ ఈడీని విచ్చలవిడిగా వాడుతోంది. కంచ గచ్చిబౌలి భూములపై రాష్ట్ర ప్రభుత్వం, టీజీఐఐసీ ఉద్దేశాల మీద తమకు తీవ్రమైన అనుమానాలు ఉన్నాయని సెంట్రల్ ఎంపవర్ కమిటీ నివేదిక స్పష్టం చేసింది. చెరువులను కూడా తాకట్టుపెట్టిన వైనం బయట పెట్టింది. అయినా రేవంత్ ప్రభుత్వాన్ని కాపాడేందుకు మోదీ ఆరాటపడుతున్నాడు. కేంద్రం స్పందించకుంటే ఈ నెల 27 తర్వాత కేంద్ర దర్యాప్తు సంస్థలను కలిసి ఆధారాలు అందజేయడంతోపాటు బీజేపీ తీరును ఎండగడతాం' అని కేటీఆర్ చెప్పారు.

## కేటీఆర్‌వి పిచ్చి మాటలు

కిషన్‌రెడ్డిది బాధ్యతారాహిత్యం: కాంగ్రెస్ ఎంపీ చామల



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వాన్ని, అధికారులకు సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని, ఆయనకు ఆత్మాభిమానం లేదంటూ బీఆర్‌ఎస్ మాజీ మంత్రి కేటీఆర్ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రిపై తెలంగాణ ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దూరం చేయాలనే పిచ్చి ప్రయత్నాన్ని మానుకోవాలని ఆయన హితవు పలికారు. కేవలం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని దూషించడానికే కేటీఆర్ పదేపదే ప్రెస్‌మీట్లు పెడుతున్నారని విమర్శించారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కిరణ్‌కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ప్రెస్‌మీట్లు పెడుతున్నారని ఆరోపించారు. కంచ గచ్చిబౌలి భూములపై వాస్తవాలు అందజేసేందుకు సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ (సీఈసీ) సుప్రీంకోర్టును గడువు కోరిందని గుర్తుచేశారు. కేవలం బీఆర్‌ఎస్ చేసిన దుష్ప్రచారం వల్ల పౌర సమాజం, పర్యావరణవేత్తలు వేరే కోణంలో చూసే పరిస్థితి వచ్చిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలపై న్యాయనిపుణులు, అధిష్టానం పెద్దలతో చర్చిస్తామని చెప్పారు. గతంలో సుప్రీంకోర్టు కేసీఆర్ ప్రభుత్వంపై మొట్టికాయలు వేసిందని గుర్తుచేశారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వాస్తవాలు తెలుసుకోకుండా ఏఐ ఫొటోలు ఎక్స్‌లో పోస్ట్ చేసి ఆ తర్వాత తొలగించారని అన్నారు.

## పని చేతకాకపోతే.. వ్యాపారాలు చేసుకోండి

అధికారులపై ప్రభుత్వ విప్ జాటోతు ఆగ్రహం



తహసీల్దార్ మహబూబ్ అలీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

సాక్షి, మహబూబాబాద్ / మరిపెడ రూరల్: అధికారులకు పని చేతకాకపోతే.. రియల్ ఎస్టేట్ బిజినెస్ చేసుకోండి, అంతేగానీ పైఅధికారి పేరు చెప్పి కిందిస్థాయి అధికారులు పనిచేయకుండా దాటవేసే ధోరణి మానుకోవాలని ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గిరిపురం రైతు వేదికలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ హాజరయ్యారు. రాంచంద్రునాయక్ మాట్లాడుతూ అధికారుల పనితీరు అధ్వానంగా మారిందని, ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉంటానని, అందరి అధికారుల పనితీరు సెట్ చేసే పోతానన్నారు. కాగా, చిన్నగూడూరు తహసీల్దార్‌పై రాంచంద్రునాయక్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ గురువారం ప్రకటన విడుదల చేసింది.

**ఇడియట్ మాటలు మాట్లాడొద్దు..**

చిన్నగూడూరు: చిన్నగూడూరు మండలం విస్సంపల్లిలో రాంచంద్రునాయక్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు ఇళ్ల నిర్మాణం కోసం ఆకేరు వాగునుంచి ఇసుక రవాణాకు తహసీల్దార్ మహబూబ్ అలీ పర్మిషన్ ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో 'ఇడియట్ మాటలు మాట్లాడొద్దు' అంటూ తహసీల్దార్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బీఆర్‌ఎస్ హయాంలో అమ్మిన భూములపై చర్చకు సిద్ధమా?

**టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్**
- ఫేక్ వీడియోలతో హెచ్‌సీయూ అంశాన్ని వివాదాస్పదం చేశారు
- కోర్టులంటే కాంగ్రెస్ పార్టీకి గౌరవం ఉంది



మీడియాతో మట్లాడుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్. చిత్రంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

సాక్షి, హైదరాబాద్: 'కేటీఆర్‌కు ఇదే నా సవాల్. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని ఎకరాల ప్రభుత్వ భూములు అమ్మారనే విషయంపై చర్చకు సిద్ధమా? విలేకరుల సమక్షంలో చర్చకు నేను సిద్ధంగా ఉన్నా. మీరు వస్తారా? కోర్టు వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ రేవంత్‌రెడ్డిని సీఎం కుర్చీ నుంచి దిగిపొమ్మని అనడానికి కేటీఆర్‌కు సిగ్గుండాలి' అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు మాటలను వక్రీకరిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావులు అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ హయాంలో వేల ఎకరాలను కారుచౌకగా అమ్మేశారని చెప్పారు. ఆ పార్టీకి సన్నిహితంగా ఉండే వారికి ప్రభుత్వ భూములను తెగనమ్మేశారని ఆరోపించారు. కోర్టులు రాష్ట్ర ప్రభుత్వాలపై వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి అన్నట్టు కేటీఆర్, హరీశ్‌రావులు మాట్లాడుతున్నారని, బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో లెక్కలేనన్ని సార్లు కోర్టులు మొట్టి కాయలు వేశాయని గుర్తు చేశారు. కోర్టులంటే కాంగ్రెస్ పార్టీకి గౌరవం ఉంది అని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగకూడదన్న దురుద్దేశంతో బీఆర్‌ఎస్, బీజేపీలు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఫేక్‌వీడియోలు సృష్టించి హెచ్‌సీయూ భూముల అంశాన్ని వివాదాస్పదం చేశారని అన్నారు. బీఆర్‌ఎస్‌లో రౌడీలకు కొదవ లేదని, కవిత రౌడీ కాబట్టే ఢిల్లీ వెళ్లి అక్కడ లిక్కర్ దందా చేశారని మహేశ్‌గౌడ్ ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా టీపీసీసీ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కేటీఆర్, హరీశ్, కవితలను సోషల్ బాయ్‌కాట్ చేయాలి

బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, కవితలను సామాజిక బహిష్కరణ చేయాలని బీజేపీ నేత, మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు అన్నారు. గత 15 నెలల్లో వీరు ప్రజలకు ఉపయోగపడే ఒక్క పని కూడా చేయలేదన్నారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. కేసీఆర్ సర్కార్ అధికారంలోకి రాగానే హెచ్‌సీయూ భూములను వర్సిటీకి ఎందుకు బదలాయించలేదని ప్రశ్నించారు. 2012లో సీసీఎల్‌ఏకు అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రాసిన లేఖ ఆధారంగా భూములను బదలాయించాలన్నారు. గతంలో తమ అవసరాలకు అనుగుణంగా దానిని పక్కన పెట్టిన కేటీఆర్, ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హెచ్‌సీయూ భూములకు సంబంధించి తాను అనేక డాక్యుమెంట్లను సేకరించి కేంద్ర సాధికారత కమిటీకి అందజేసినట్టు ఆయన తెలిపారు. ఇవి హెచ్‌సీయూ భూములంటూ ఆనాడు ప్రభుత్వం తెలుగులో రాసిన పంచనామా కూడా ఉందని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం వివాదంలో ఉన్న భూములు హెచ్‌సీయూవి కానప్పుడు ఆనాటి ప్రభుత్వం పంచనామా ఎందుకు చేసిందని ప్రశ్నించారు.

## రాజకీయ కక్షతోనే ఈడీ చార్జిషీట్‌లో సోనియా, రాహుల్ పేర్లు

**కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచేందుకు కుట్ర పన్నిన మోదీ, అమిత్‌షా: మీనాక్షి నటరాజన్**
- ఈడీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ శ్రేణుల ధర్నా

సాక్షి, హైదరాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు వస్తున్నామని రాహుల్‌గాంధీ పార్లమెంట్ సాక్షిగా చెప్పడంతోనే.. మోదీ సర్కార్ కక్ష రాజకీయాలకు దిగిందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జిషీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ గురువారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ ప్రసంగిస్తూ నేషనల్ హెరాల్డ్ కేసు పూర్తిగా రాజకీయ కక్షతో రూపొందించిన కుట్రగా విమర్శించారు. ఈ ఛార్జిషీట్ ద్వారా కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచేందుకు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా కుట్రపన్నారని, కానీ కాంగ్రెస్ పార్టీ ఈ వేధింపులకు భయపడదని, గట్టిగా పోరాడుతుందని చెప్పారు.

**'కులగణన' భయంతోనే..: డిప్యూటీ సీఎం భట్టి**

సోనియా, రాహుల్‌పై అక్రమ కేసులుపెట్టి దేశవ్యాప్తంగా కులగణన జరగకుండా అడ్డుకోవాలని ప్రధాని మోదీ చూస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గుజరాత్‌లో జరిగిన ఏఐసీసీ ప్లీనరీలో రాహుల్, మల్లికార్జునఖర్గే నేతృత్వంలో తీసుకున్న నిర్ణయాలను చూసి, కేంద్రంలో ఉన్న బీజేపీ, ప్రధాని మోదీ భయపడుతున్నారని చెప్పారు. తెలంగాణ కులగణన విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలన్న రాహుల్‌గాంధీ పిలుపునకు మోదీ భయపడుతున్నాడని తెలిపారు.



ఈడీ కార్యాలయం వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న మీనాక్షి నటరాజన్. చిత్రంలో భట్టి, వీహెచ్, మహేశ్‌కుమార్‌గౌడ్, శ్రీధర్‌బాబు, వేం నరేందర్‌రెడ్డి, తదితరులు

**ఓర్వలేకే కుట్రలు: మహేశ్‌గౌడ్**

రాహుల్‌గాంధీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక మోదీ సర్కార్ అక్రమ కేసుల కుట్రలకు తెరలేపిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ సొంత పత్రిక నేషనల్ హెరాల్డ్‌కు రూ. 90 కోట్లు రుణం ఇస్తే మనీలాండరింగ్ జరిగినట్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. గాంధీ కుటుంబం ఏనాడూ కేసులకు భయపడలేదని చెప్పారు.

**నిలదీస్తున్నందుకే టార్గెట్: దుద్దిళ్ల**

దేశంలో ధరల పెరుగుదల, తగ్గుతున్న రూపాయి విలువ, నిరుద్యోగం తదితర సమస్యలపై నిలదీస్తున్నందుకే కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను బీజేపీ టార్గెట్ చేసిందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. ధర్నాలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, మాజీ ఎంపీ వి. హన్మంతరావు, ఏఐసీసీ కార్యదర్శి సంపత్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్, కాంగ్రెస్ నేతలు ఫిరోజ్‌ఖాన్, వినోద్‌రెడ్డి, మొగిలి సునీత, మచ్చ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కండి

రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి పిలుపు

సాక్షి, హైదరాబాద్: 2029లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని, అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో అంతర్గత సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆమె గురువారం గాంధీభవన్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల నేతలు, ఇన్‌చార్జిలతో సమావేశమయ్యారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, సీనియర్ నేత వి.హనుమంతరావు, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ తదితరులు సమావేశాల్లో పాల్గొన్నారు. ఆమె శుక్రవారం ఉదయం 11 గంటలకు చేవెళ్ల, 12.30 గంటలకు జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల సమీక్షలు నిర్వహిస్తారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

> పునరుత్థానమునకు మేము సరిగ్గా తూచే త్రాసులను ఏర్పాటు చేస్తాము.
> కావున ఏ వ్యక్తికి కూడా ఏ మాత్రం అన్యాయం జరుగదు.
> ఒకవేళ ఆవగింజంత కర్మ ఉన్నా మేము దానిని ముందుకు తెస్తాము.
>
> – ఇస్లాం ధర్మం



సాక్షి

శుక్రవారం, 18 ఏప్రిల్ 2025

# చల్లటి కబురు!

భానుడు ఉగ్రరూపం దాల్చే ఏప్రిల్ నెలలోనే ప్రాణం కుదుటపడేలా జూన్‌లో ఆగమించే నైరుతి రుతుపవనాల తీరుతెన్నులు చెప్పడం మన వాతావరణ సంస్థలకు అలవాటు. ఈసారి భారతీయ వాతావరణ విభాగం(ఐఎండీ) ప్రకటించినదాన్నిబట్టి సాధారణ వర్షపాతంకన్నా అధికంగానే వానలు పడొచ్చు. అంతేకాదు... వర్షాభావానికి దారితీసి కరువు కాటకాలకు కారణమయ్యే ఎల్ నినో బెడద కూడా ఉండకపోవచ్చని కూడా ఆ విభాగం తెలియజేసింది. అయితే వాతావరణ స్థితి గతులను అంచనా వేసే మరో సంస్థ స్కైమెట్ మాత్రం 'సాధారణ' స్థాయిలోనే రుతుపవనాలుంటాయని చెబుతోంది. ఈ నెల మొదట్లోనే ఇందుకు సంబంధించిన లెక్కలు ప్రకటించి, సాధారణం కన్నా అధికంగా వర్షాలు పడే అవకాశం 30 శాతం మాత్రమే ఉన్నదని తెలిపింది. నైరుతి రుతుపవనాలు సాధారణంగా జూన్ 1న ప్రవేశించి చకచకా విస్తరించుకుంటూపోయి సెప్టెంబర్ మధ్యకల్లా నిష్క్రమిస్తాయి. దేశ జనాభాలో 42.3 శాతం మందికి జీవనాధారమైన వ్యవసాయం పూర్తిగా రుతుపవనాలపై ఆధారపడి వుంటుంది. అది సక్రమంగా వచ్చి వెళ్తే దేశం కళకళలాడుతుంది. మందగమనంతో అడుగులేస్తే, అంతంతమాత్రంగా ముగిసిపోతే అనేక సమస్యలకు దారితీస్తుంది. మన స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో వ్యవసాయం వాటా 18.2 శాతం. అయితే 'వాన రాకడ... ప్రాణం పోకడ ఎవరికీ తెలియద'న్న నానుడి మరిచిపోకూడదు. వర్షపాతం బాగుంటుందన్నా, అది అధికంగా ఉండొచ్చని చెప్పినా దేశవ్యాప్తంగా అన్నిచోట్లా అదే మాదిరిగా ఉంటుందని ఆశించలేం. స్థానిక కాలమాన పరిస్థితులనుబట్టి కొన్నిచోట్ల అధిక వర్షపాతం, మరికొన్నిచోట్ల అవసరమైన దానికన్నా తక్కువగావుండొచ్చు. బ్రిటిష్ వ్యంగ్య రచయిత జెరోమ్ కె. జెరోమ్ ఒక సందర్భంలో చెప్పినట్టు వాతావరణం అనేది ప్రభుత్వం వంటిది. అదెప్పుడూ చెడ్డగానే ఉంటుంది!

ఎక్కడో భూమధ్య రేఖకు అనుకునివున్న పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడివున్న వర్తమాన వాతావరణ పరిస్థితులు మన రుతుపవనాలను నిర్దేశిస్తాయి. పసిఫిక్ మహాసముద్ర ఉపరితలంపై, ముఖ్యంగా దక్షిణమెరికా తీర ప్రాంతంవైపు ఉష్ణోగ్రతలు అధికంగావుంటే గాలిలో తేమ శాతం పెరిగి ఎల్ నినో ఏర్పడి రుతుపవనాలు బలహీనపడతాయి. వర్షాలు లేక కరువుకాటకాలు విజృంభిస్తాయి. ఆ ఉష్ణోగ్రతలు తక్కువుంటే లానినా ఏర్పడి కుంభవృష్టికి దారితీసి వరదల బెడదవుంటుంది. ప్రస్తుతానికి అక్కడ తటస్థ పరిస్థితులున్నాయంటున్నారు. ఒక్కోసారి మన హిందూ మహాసముద్రంపై ఆవరించివుండే మేఘాల స్థితిగతులు, ఆ వాతావరణంలోవుండే గాలి తుంపరలు, మనకుండే అటవీ సాంద్రత వంటివి ఎల్ నినోను ప్రభావితం చేస్తాయి. ఈ కారణంవల్లనే పసిఫిక్ మహాసముద్రంలో ఎల్ నినో ఏర్పడినా ఒక్కోసారి మన రుతుపవనాలు సజావుగా వచ్చివెళ్తాయి. అందుకే ఎల్ నినో గురించి పట్టించుకోవటం, రుతుపవనాలను ముందుగా అంచనా వేయటం అశాస్త్రీయం అంటారు కొందరు శాస్త్రవేత్తలు. ఎల్ నినోను నియంత్రించే ఇతరేతర పరిస్థితులు అనేకం ఉన్నప్పుడు దాని ఆధారంగా వర్షాల గురించి అంచనా వేయటం వృథా ప్రయాస అని వారి భావన.

వర్షరుతువులో ఏటా వర్షపాత సగటు(ఎల్‌పీఏ) ఎంతవుంటున్నదో లెక్కేయటం ఐఎండీ పని. ఆ సగటు దీర్ఘకాలంలో ఎంతవుందో గణించి, దానికన్నా ఎంత ఎక్కువగా లేదా ఎంత తక్కువగా వర్షాలు పడే అవకాశం వుందో తెలియజేస్తారు. ఎల్‌పీఏను 87 సెంటీమీటర్ల వర్షపాతంగా గణించి, ఈసారి వర్షాలు దీన్నిమించి 105 శాతంవరకూ ఉండొచ్చని అంచనా కట్టారు. నిరుడు మొదట్లో 106 శాతం అధిక వర్షపాతం అంచనా వేయగా, అది 108 శాతం వరకూ పోయింది. ఎల్‌పీఏ 96 శాతం కన్నా తక్కువుంటే సాధారణంకన్నా తక్కువ వర్షపాతంగా లెక్కేస్తారు. 96–104 మధ్యవుంటే సాధారణ వర్షపాతంగా, 104–110 శాతం మధ్యవుంటే అధిక వర్షపాతంగా పరిగణిస్తారు. ఐఎండీ 105 శాతంవరకూ ఉండొచ్చని అంచనా వేయగా, స్కైమెట్ మాత్రం 103 శాతానికి పరిమితమైంది. మన దేశంలో సాగుకు యోగ్యమైన భూమిలో 60 శాతంవరకూ వర్షాధారమే. కనుక వర్షాలు సమృద్ధిగా పడితేనే మన సాగురంగం బాగుంటుంది. అందరికీ పనులు దొరికి సుఖసంతోషాలతో వుంటారు. ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. వర్షపాతం అంచనాలు సక్రమంగావుంటే ఎక్కడ ఎలాంటి పంటలు వేసుకోవచ్చునో, వేటికి అననుకూలతలు ఏర్పడవచ్చునో తెలుస్తుంది. రైతులు నష్టపోకూడదంటే ఇలాంటి అంచనాలు ఎంతో అవసరం. కానీ నిర్దుష్టంగా అంచనాలు చెప్పటం అన్నివేళలా సాధ్యపడకపోవచ్చు. గతంతో పోలిస్తే వాతావరణ విభాగం అంచనాలు మెరుగ్గా ఉంటున్నాయి. ఆ రంగంలో పెరిగిన సాంకేతికతలే అందుకు కారణం.

వర్షాలు సాధారణంకన్నా ఎక్కువుంటాయని వేసిన అంచనాలు చూసి మురిసిపోలేం. ఎందుకంటే కురిసిన వర్షాన్నంతటినీ ఒడిసిపట్టి తాగునీటి, సాగునీటి అవసరాలు తీర్చుకునే మౌలిక సదుపాయాలు మనదగ్గరుండాలి. తొలకరినాటికల్లా సాగుపనుల కోసం రైతులకు డబ్బు అందుబాటులో వుండాలి. సకాలంలో నాట్లు పడకపోతే పైరు ఎదుగుదల బాగుండదు. భిన్న దశల్లో ఎరువులూ, పురుగుమందులూ దొరకాలి. అన్నిటికన్నా ముందు విత్తనాల లభ్యత సక్రమంగా వుండాలి. కల్తీ విత్తనాల బెడద నిరోధించాలి. వీటికోసం ఎలాంటి ముందస్తు చర్యలు అమలు కావాలో, రైతులకు బ్యాంకుల నుంచి రుణసదుపాయాలెలా కల్పించాలో ప్రభుత్వాలు ఆలోచించాలి. రుతుపవనాలు సక్రమంగా ఉండబోతున్నాయని ఐఎండీ ప్రకటించింది కనుక ఇప్పటినుంచే పకడ్బందీ ప్రణాళికలు రూపుదిద్దుకోవాలి.

# పెరుగుతున్న మత సమ్మోతి

అభిప్రాయం



మోహన్ గురుస్వామి

దేశంలో మతతత్వం పెరిగిపోతోంది. కొన్నేళ్లుగా ఈ ధోరణి మరీ ఎక్కువైంది. అడుగడుక్కీ గుళ్లు, మసీదులు వెలుస్తున్నాయి. నేనీ మధ్య తెలంగాణ వెళ్లాను. చిన్న పల్లెటూళ్లలో సైతం రెండు మూడు దేవాలయాలు ఉన్నాయి. హిందువులకు దేవుళ్లు చాలామంది, కాబట్టి గుళ్ళు కూడా ఎక్కువ గానే ఉంటాయి అనుకోవడం పొరపాటు. హిందూ సమాజం కులాలు, గోత్రాలు, జాతులు, వంశాలుగా చీలిపోయి ఉంది. గుళ్ల గోపురాలు అసంఖ్యాకంగా పుట్టుకురావడానికి ఈ భిన్నవర్గాల సమాజం ఒక ప్రధాన కారణం.

జనంలో పెరుగుతున్న వ్యాపార దృష్టి ఇందుకు మరొక ముఖ్య కారణం అనిపిస్తోంది. పౌర సంఘాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇవి రాజ్యాంగ విరుద్ధంగా ఆర్థిక కార్యకలాపాలను తమ చెప్పుచేతుల్లో పెట్టుకుంటున్నాయి. పట్టణ ప్రాంతాల్లో పార్కింగ్ ఏజెంట్లకు, బళ్లపై పళ్లు అమ్ముకునే వారికి, అనేకానేక చిల్లర పనులకు రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు 'లైసెన్స్'లు ఇచ్చి డబ్బు పోగేసుకోవడం మనకు తెలుసు. గ్రామాల్లో సైతం ఈ తరహా సంస్కృతి విస్తరించింది. గ్రామ కమిటీలు అంటూ తయారయ్యాయి. ఇవీ ఇదే మాదిరిగా కొత్త ఆదాయ మార్గాలు కనిపెట్టాయి. ఇసుక మైనింగు, అక్రమ మద్యం అమ్మకాల వంటి కార్యకలాపాలను ఈ కమిటీలు నియంత్రిస్తున్నాయి. ఆ డబ్బును ప్రజల రోజువారీ జీవితాలను బాగు పరచేందుకు వాడతారా అంటే అదీ లేదు. బహుశా ఇక్కడి కంటే పరలోకపు జీవితాలకు గిరాకీ ఎక్కువలా ఉంది. అందుకే, ఇలా ఆర్జించిన డబ్బును గుళ్లు కట్టడానికి వాడుతున్నారు.

### పెరుగుతున్న భక్తి

మతం ఇప్పుడు రాజకీయాల్లో కంటే ఆర్థిక రంగంలో కీలక పాత్ర పోషిస్తోంది. దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో పర్యాటక ఆదాయం వాటా 9.6 శాతం. ఇందులో దేశీయ పర్యాటకం 88 శాతం. గతేడాది ఇండియా సందర్శించిన విదేశీ పర్యాటకులు కేవలం 90 లక్షలు కాగా, స్థానిక యాత్రికుల సంఖ్య కళ్లు చెదిరేలా 14 కోట్లను దాటింది. కేంద్ర ప్రభుత్వాలు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ఢిల్లీ–ఆగ్రా–జైపూర్ 'స్వర్ణ త్రిభుజం' మీద అధిక శ్రద్ధ పెడుతుంటాయి. వాస్తవానికి తమిళనాడు సందర్శించేవారు అత్యధికంగా 20 శాతం ఉన్నారు. ఢిల్లీ పర్యాటకులు వారిలో సగం ఉంటారు. దక్షిణాది రాష్ట్రాలు దేశవిదేశాల టూరిస్టులను ఆకర్షించడంలో ముందు వరసలో నిలుస్తాయి. కారణం – మతపరంగా ప్రముఖమైన తిరుపతి, మదురై వంటి ప్రదేశాలు వీటిలో ఎక్కువగా ఉండటమే. తిరుపతి వల్ల ఆంధ్రప్రదేశ్ ఇండియాలోనే అతిపెద్ద దేశీయ పర్యాటక ప్రదేశంగా రూపొందింది. రెలిజియస్ టూరిజం ఇప్పుడు అతిపెద్ద వ్యాపారం.

గడచిన నాలుగైదు ఏళ్లలో గతంలో కంటే అధికంగా మతం మీద మమకారం పెంచుకున్న భారతీయులు 25 శాతం పైగానే ఉన్నారని 'ప్యూ' సంస్థ నిర్వహించిన 'గ్లోబల్ యాటిట్యూడ్' సర్వే తేల్చింది. ఇది ఏ ఒక్క మతానికో పరిమితం కాదు. అన్ని మతాల్లోనూ ఈ ధోరణి కనబడింది. మతం ఎంతో ముఖ్యమైందని భావిస్తున్న వారు 2007–15 మధ్య ఏకంగా 80 శాతానికి పెరిగారు. 11 శాతం పెరుగుదల! ఎన్ఎస్ఎస్ఓ (నేషనల్ శాంపుల్ సర్వే ఆఫీస్) నివేదిక ప్రకారం, మత ప్రదేశాల సందర్శనలపై చేసిన సగటు వ్యయం ఇదే కాలంలో రెట్టింపు కంటే ఎక్కువైంది. మత వ్యాపారానికి ఆకాశమే హద్దు (ఇందులో శ్లేష లేదు).



> ◆ దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో పర్యాటక రంగ ఆదాయం వాటా 9.6 శాతం. ఇందులో దేశీయ పర్యాటకం వాటా 88 శాతం.
>
> ◆ గడచిన నాలుగైదు ఏళ్లలో గతంలో కంటే అధికంగా మతం మీద మమకారం పెంచుకున్న భారతీయులు 25 శాతం పైగానే ఉన్నారని 'ప్యూ' సంస్థ నిర్వహించిన 'గ్లోబల్ యాటిట్యూడ్' సర్వే తేల్చింది.
>
> ◆ ఒక ఆధునిక సమాజంగా ఇండియా ఆవిర్భవించకుండా మూఢనమ్మకాలు, అంధభక్తి, మతపిచ్చి... అడ్డుపడే ప్రమాదం ఉంది.

ఇది ఉపాధి అవకాశాలు పెంచవచ్చు. సంతోషమే! మరి మత భావన పెరుగుతూ పోవడం వల్ల తలెత్తే ఇతర పరిణామాల మాటేమిటి? సమాజంలో మూఢనమ్మకాలు, అంధభక్తి, మతపిచ్చి పెచ్చరిల్లుతాయి. ఒక ఆధునిక సమాజంగా ఇండియా ఆవిర్భవించకుండా ఇవి అడ్డుపడే ప్రమాదం ఉంది.

### లాభదాయక వ్యాపారం

గుళ్లు లేదా మసీదులు నిర్మించడం లాభదాయక వ్యాపారం. అందుకే, ప్రార్థనా మందిరాల పేరిట నీతి లేని మనుషులు బహిరంగ ప్రదేశాలను కబ్జా చేయడం రివాజుగా మారుతోంది. ఒకసారి దేవుళ్ల విగ్రహాలు ప్రతిష్ఠిస్తే, ఇక వాటిని ఎవరూ తొలగించలేరు. నగరాల్లో ట్రాఫిక్ చిక్కులకు ఈ నిర్మాణాలే చాలావరకు కారణాలు.

సంత్ కబీర్ దాసు ఎంతో సరళంగా చెప్పిన కవితను ఈ సందర్భంగా నేను ప్రస్తావిస్తాను: 'రాతిని పూజించడం వల్ల దేవుడు లభిస్తే, నేను పర్వతాన్ని పూజిస్తాను. కానీ ఈ చక్కీ (తిరగలి రాయి) మంచిది, ఎందుకంటే ఇది ప్రపంచాన్ని పోషిస్తుంది'. చేదు నిజం ఏమిటంటే, రాతి విగ్రహం తిరగలి రాయి కంటే మంచి ప్రతిఫలం ఇస్తోంది. మతభావన, మతపిచ్చి వ్యాపారంగా మారబట్టే, ప్రభుత్వాలు సైతం 'రెలిజియస్ టూరిజం'కు పెద్దపీట వేస్తున్నాయి.

వాస్తవానికి, 'మీ విగ్రహం కంటే మా విగ్రహం మంచిది' అనే రీతిలో ఒక కనిపించని పోటీకి దారి తీస్తోంది. తిరుమల ఆలయం ఇండియాలోనే అతి పెద్ద 'మనీ స్పిన్నర్'. ఈ వైష్ణవ ఆలయాన్ని ఏటా 4 కోట్ల మంది దర్శించుకుంటారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం యాదగిరిగుట్టను పెద్ద మత పర్యాటక కేంద్రంగా ప్రమోట్ చేస్తోంది.

సీపీఎం కమ్యూనిస్టు ప్రభుత్వ హయాంలో కేరళ దేవాలయ బోర్డులు విగ్రహాల 'మహిమల' గురించి ప్రచారం చేస్తున్నాయి. దేవుడు మానవుడి ఊహాకల్పన అంటూ మనల్ని హేతుబద్ధంగా ఆలోచింప జేయాల్సిన సిద్ధాంతం ఆ ప్రభుత్వానిది. కానీ మాస్కో రెడ్ స్క్వేర్, చైనా తియనాన్మెన్‌లలో మమ్మీలుగా మారిన శవాల నుంచి స్ఫూర్తి పొందే సిద్ధాంతం నుంచి ఇంతకంటే ఏం ఆశించగలం?

### బహిరంగ సమర్థనా?

మన తొలి ప్రధాన మంత్రి, నవ భారత వ్యవస్థాపక పితామహుడు జవహర్‌లాల్ నెహ్రూ దేశం శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని తలచారు. ఇప్పుడేం జరుగుతోంది? పిడివాదం, అంధవిశ్వాసం మనల్ని నడిపిస్తున్నాయి. మతం, మూఢభక్తి దేశానికి ప్రమాదకరంగా రూపుదిద్దుకుంటున్నాయి. సమాజంలో ఘర్షణ వాతావరణం నెలకొంది.

నెహ్రూ ఎప్పుడూ ప్రార్థనా స్థలాలు సందర్శించలేదు. విశ్వాసి అయినప్పటికీ ఇందిరా గాంధీ సైతం ఆలయాలకు దూరంగానే ఉండేవారు. అయితే ఆమె మనవడు రాహుల్ గాంధీ బొట్టు పెట్టుకుని గుళ్ల చుట్టూ తిరుగుతున్నారు. జంధ్యం కూడా ధరిస్తానని ప్రకటించారు. తాను శివభక్తుడిననీ చెప్పుకొంటారు. అమిత్ షా కూడా అదే చేస్తారు. ఇద్దరికీ కావల్సింది ఓట్లు! రేపిస్టుగా రుజువైన రామ్ రహీం సింగ్‌ను నరేంద్ర మోదీ ప్రశంసించడం అతడి నుంచి రాజకీయ మద్దతు ఆశించే కదా? రాజ్యాంగ పరిరక్షకులు, ప్రముఖ వ్యక్తులు ఆర్భాటంగా మత స్థలాలు సందర్శించడం పెరిగింది. గతేడాది రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరుమల ఆల యంలో ప్రార్థనలు చేయడం మనకు తెలుసు.

అంతకు ముందు ఏడాది మోదీ కేదార్‌నాథ్, బద్రీనాథ్ పుణ్య క్షేత్రాలు దర్శించారు. మాజీ రాష్ట్రపతి కోవింద్ తిరుమల ఆలయంలో బాహాటంగా పూజలు నిర్వహించారు. పూరీ జగన్నాథాలయంలో ఆయన అవమానం పాలైనట్లు వార్తలు వచ్చాయి. ప్రధాని కేదార్‌నాథ్ లేదా అయోధ్య సందర్శించినా, మరొకరు అజ్మీర్ షరీఫ్ వెళ్లినా అది వాటిని ఆమోదించడమే అవుతుంది. అలా వెళ్లడం... షారుఖ్ ఖాన్ కోక్ బ్రాండ్‌కు ప్రచారం చేయడం కంటే భిన్నమైనమీ కాదు.

వ్యాసకర్త విధాన నిర్ణయాల విశ్లేషకుడు, రచయిత
mohanguru@gmail.com



## సోషల్ మీడియా

### ఎవరి భాష?



షా అబ్దుల్ ఖాదిర్ మొదటిసారి ఖురాన్‌ను ఉర్దూలోకి అనువదించారు. పవిత్ర గ్రంథాన్ని ఉర్దూ లాంటి ఒక అన్యమత భాషలోకి అనువదించే సాహసం చేసినందుకు ఆయన మీద ముఫ్తీలు, కాజీలు ఫత్వాలు జారీ చేశారు. చాలా ఏళ్ల తర్వాత, ఉర్దూ మాట్లాడటం కూడా రాని జిన్నా తనను కాపాడుకోవడానికి ఉర్దూను ముస్లింల భాషగా ప్రకటించారు. ఆశ్చర్యమేమంటే, జిన్నా చెప్పింది నమ్మేవాళ్లు చాలామంది ఉన్నారు.

– జావేద్ అఖ్తర్, కవి

### యుద్ధం ఆపేద్దాం!



ఇదేమంత పెద్ద సంగతి అనిపించకపోవచ్చు. చాలా ఆలస్యంగా ఇంతమాత్రమే జరుగుతున్నది అనిపించవచ్చు. ఇది ఎటు వైపు దారితీస్తుందో కూడా ఇప్పటికి అస్పష్టం. బందీల విడుదల కోసం హమాస్‌తో యుద్ధాన్ని ఆపాలని వేలాది ఇజ్రాయెలీలు అంటున్నారు. మునుపటి అత్యున్నత భద్రతా వ్యవస్థ ఈ పిలుపునకు సారథ్యం వహిస్తోంది. ఇజ్రాయెల్‌లో ఇలాంటిది ముందెప్పుడూ జరగలేదు.

– మైరవ్ జోన్స్‌జెయిన్, ఇజ్రాయెల్ అనలిస్ట్

### న్యాయమేనా?



చాలామంది లక్షాధికారులు, కోటీశ్వరుల కంటే ఒక నర్సు లేదా డాక్టర్ లేదా బస్ డ్రైవర్ చెల్లించే పన్నులు (వారి ఆదాయ శాతాన్ని బట్టి) చాలా ఎక్కువ. కూర్చుని ఆస్తులు పోగెడుతూ, మరింత ధనవంతులవుతున్న వారికంటే సమాజం కోసం పనిచేసేవారికి ఎక్కువ పన్ను విధించడం ఏ న్యాయం?

– దేవీ శ్రీధర్, యూఎస్ ప్రొఫెసర్

### మరేం చేస్తున్నట్టు?



మోసగాళ్లు మీ డబ్బులు దొంగిలిస్తారంటూ ప్రజా సేవలో ప్రభుత్వం తరఫునే మాస్ కాలర్ ట్యూన్ రావడాన్ని ఎలా సాధారణం అనుకుంటాం? అసలు దాన్ని ఇలా సాధారణీకరించడం ఎంత పిచ్చితనం!

– రితుపర్ణా ఛటర్జీ, జర్నలిస్ట్

### పూటకొకటి...



డోలో 650 మాత్రలను ఇండియా అవేదో మిఠాయి బిళ్ళల్లా తీసుకుంటోంది.

– పళనియప్పన్ మాణిక్కమ్, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్

# సర్వోదయ స్ఫూర్తిని నిలపాలి!

సందర్భం




ఎస్. రాంబాబు నాయుడు

భారత స్వాతంత్ర్య సమరం సాగినన్ని రోజులూ మహాత్మా గాంధీనీ, ఆయన అహింసావాద సిద్ధాంతాలనూ అత్యంత దగ్గరగా అనుసరించిన మొట్ట మొదటి వ్యక్తి ఆచార్య వినోబా భావే. అందుకే 1940 లోనే ఆయనను గాంధీజీ భారతదేశ 'మొదటి సత్యాగ్రహి'గా ఎంపిక చేశారు. అటువంటి వినోబా ప్రారంభించినదే 'స్వచ్ఛంద భూదాన' ఉద్యమం.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తొలి నాళ్ళలో తెలంగాణ, ఉత్తరాంధ్ర ప్రాంతాలలో అంతర్గత భూపోరాటాలు పొడసూపాయి. భూమి లేని ప్రజలు, భూస్వాములపై తిరుగుబాటును ప్రకటించి, దానిని తీవ్రతరం చేయడానికి సిద్ధపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే దేశంలోనే అంతర్యుద్ధ వాతావరణం నెలకొంటుందనీ, ఇది వర్ధమాన భారత దేశానికి ఏ మాత్రం మంచిది కాదనీ భావించి జాతీయ సర్వోదయ 3వ వార్షిక సదస్సులో భారతదేశ వ్యాప్తంగా 'స్వచ్ఛంద భూదాన్' ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించారు.

1951 ఏప్రిల్ 18న పాదయాత్ర చేస్తూ తెలంగాణలోని పోచంపల్లి గ్రామానికి చేరుకున్న వినోబా దగ్గరకు సుమారు 700 కుటుంబాలవారు వచ్చి కలిశారు. ఒక్కో కుటుంబానికి 2 ఎకరాల చొప్పున వ్యవసాయ భూమిని ఇప్పిస్తే తాము వ్యవసాయం చేసుకుంటూ సామరస్యంగా జీవిస్తామని చెప్పారు. ఆయనే స్వయంగా వెళ్ళి ఆ గ్రామంలో ఒక భూస్వామిని కలిసి మాట్లాడారు. ఈ దేశంలో ప్రజలందరూ ఒకరికొకరు పరస్పర సహాయం చేసుకుంటూ, సంయుక్త భారత దేశాన్ని నిర్మించుకోవాలన్నదే జాతిపిత మహాత్మ గాంధీ కల అని చెప్పారు. ఆ మాటలు విన్న పోచంపల్లి జమీందార్ వెదిరె రామచంద్రారెడ్డి తక్షణమే స్పందించి, పోచంపల్లి గ్రామంలో భూమి లేని నిరుపేద కుటుంబాలకు పంచడానికి 100 ఎకరాల భూమిని దానంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆ దానం వెనువెంటనే అమలులోకి వచ్చే విధంగా దాన పత్రాన్ని సిద్ధం చేసి వినోబా భావేకు అందించారు.

సుమారు ఆరున్నర సంవత్సరాల కాలం పాటు భారత దేశంలో 80 వేల కిలో మీటర్లు పాదయాత్ర చేసి దాదాపు 50 లక్షల ఎకరాల భూమిని దానంగా స్వీకరించి సామాన్యుడి సర్వోదయానికి బలమైన పునాది వేశారు. 1965లో అప్పటి భారత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఆధ్వర్యంలో 'భూదాన్–గ్రామ్‌దాన్' చట్టం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వాలు అమలు బాధ్యత తీసుకున్నాయి. వినోబా స్వీకరించిన దానపత్రాలన్నిటినీ ఆ యా రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుని గెజిట్ విడుదల చేశాయి. ఫలితంగా ఈ భూములన్నీ శాశ్వతంగా భూదాన్ భూములుగానే ఉంటాయి. 1982, నవంబరు 15న వినోబా తుదిశ్వాస విడిచే నాటికి దేశం మొత్తం మీద 50 శాతానికి పైగా భూదాన్ భూములు నిరుపేద ప్రజలకు పంచబడ్డాయి. ఆ తరువాత ఈ ప్రక్రియ సన్నగిల్లింది.



ఆచార్య వినోబా భావే

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చట్టం అమలులోకి వచ్చినప్పుడు సుమారు 2 లక్షల యాభై వేల పైచిలుకు ఎకరాలు భూదాన్ భూములు ఉన్నట్లుగా గెజిట్‌లో నమోదు అయ్యింది. వినోబా చనిపోయే నాటికి దాదాపు 40 వేల ఎకరాల భూములు మాత్రమే ఈ రాష్ట్రంలో పారదర్శకంగా భూమి లేని నిరుపేదలకు పంచబడ్డాయి. మిగిలిన భూములన్నీ ప్రభుత్వ సంరక్షణలోనే ఉన్నా... రెండు తెలుగు రాష్ట్రాలలో వేలాది ఎకరాల భూదాన్ భూములు అక్రమార్కుల కబంధ హస్తాలలో చిక్కుకుని ఉన్నాయి. వీటిని విడిపించి భూమి లేని నిరుపేదలకు పంచి సర్వోదయ స్ఫూర్తిని నిలపడానికి ప్రభుత్వాలు ప్రయత్నించాలి. అదే వినోబాకు నిజమైన నివాళి.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ అధ్యక్షులు | 89772 47578

(నేటితో భూదాన ఉద్యమానికి 75 వసంతాలు)

# నేపాల్ పరిణామాలకు బాధ్యులెవరు?

అభిప్రాయం



డా॥ పార్థసారథి చిరువోలు

మహారాజు జ్ఞానేంద్రకు మద్దతుగా నేపాల్లో ఏదో ఒక ప్రాంతంలో ఆందోళనలు సాగుతూనే ఉన్నాయి. ఇవి నేపాల్‌లో ప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మార్చ్ 28వ తేదీన ఇవి ఘర్షణ స్థాయికి చేరి ఇద్దరు వ్యక్తులు మరణించగా అనేకమంది గాయపడ్డారు. ప్రభుత్వ ఆస్తులకు భారీగా నష్టం వాటిల్లింది. ఇందుకు మహారాజు, ఆయన మద్దతుదారులు బాధ్యులని ప్రభుత్వం ఆరోపించింది. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినందుకు రాజు 8 లక్షల రూపాయల జరిమానా చెల్లించాలని కూడా ఆదేశించింది. దీన్ని ప్యాలెస్ ఖండించింది. మరోవైపు ప్రభువు మద్దతుదారులంతా నిధులు సేకరించి సొమ్ము చెల్లించటానికి సిద్ధమవుతున్నారు.

ఒకప్పుడు రాచరికాన్ని కాదనుకున్న నేపాలీ సమాజం ఇప్పుడు రాజుకు ఎందుకు మద్దతు పలుకుతోంది? ఇందుకు నేపాల్ పాలకుల తీరే కారణం. 2008లో నేపాల్‌లో రాచరికం రద్దయిన తర్వాత 17 ఏళ్ల కాలంలో 18 ప్రభుత్వాలు నేపాల్‌ను పాలించాయి. ఏ ఒక్క ప్రభుత్వం కూడా సజావుగా పాలించిన రికార్డు లేదు. అవసరార్థం సర్దుబాట్లు చేసుకుని సంకీర్ణ ప్రభుత్వాలను నడిపారు. ఇప్పటి కేపీ ఓలి, షేర్ కుమార్ దుబా, ప్రచండ... ఇలా ప్రధానులంతా తీవ్ర అవినీతి ఆరోపణలను ఎదుర్కొన్నవారే. రాజకీయ అస్థిరత ఒకవైపు, అవినీతి మరోవైపు నేపాల్‌ను దారుణంగా దెబ్బతీశాయి. ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతింది. ఉపాధి అవకాశాలు తగ్గి పోయాయి. యువత దేశాన్ని వదిలి ఉపాధి కోసం బయట దేశాలకు వెళుతున్నారు.



ఇలాంటి పరిస్థితుల్లో రాజు మళ్లీ అధికారం చేపట్టాలని కోరుకుంటున్న వాళ్ల సంఖ్య పెరుగుతోంది. రాచరికాన్ని రద్దు చేయటం వల్ల నేపాల్ సార్వభౌమాత్వానికి దెబ్బ తగిలిందనీ, తిరిగి రాజు అధికారం చేపడితే ప్రపంచ దేశాల్లో నేపాల్ గుర్తింపు సంపాదిస్తుందని భావిస్తున్న వాళ్లు కొందరు ఉన్నారు.

మరొక అంశం 'హిందూత్వ'. నేపాల్‌ను హిందూ స్టేట్‌గా మార్చాలన్న డిమాండ్ పెరుగుతోంది. ఇందుకోసం తెరవెనక ప్రయత్నాలు సాగుతున్నాయి. మహారాజు జ్ఞానేంద్ర ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో భేటీ కావటం, ఆయన ఫోటోలు నేపాల్ వీధుల్లో దర్శనం ఇవ్వటం వంటి ఇటీవల పరిణామాలు దీనికి బలాన్ని ఇస్తున్నాయి. అల్లర్ల వెనక భారత్ ఉందని నేపాల్ ప్రభుత్వం ఆరోపించటానికి ఇది కూడా ఒక కారణమని మనం భావించవచ్చు.

ఇప్పుడు చెలరేగుతున్న ఆందోళనలు రానున్న రోజుల్లో ఎటు దారితీస్తాయో తెలియదు. నేపాల్‌లో ఆందోళనలకు రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ నాయకత్వం వహిస్తున్నా, ఇందులో అసాంఘిక శక్తులతో పాటు చైనా పాత్రను కొట్టేయలేం. చాలా కాలంగా చైనా ఆధ్వర్యంలో నేపాల్‌లో భారత్ వ్యతిరేక కార్యక్రమాలు సాగుతున్నాయి. దీనికి కమ్యూనిస్టు ప్రభుత్వం మద్దతు ఇస్తోంది. సరిహద్దులో ఆగడాలను చూసీ చూడకుండా వదిలేస్తోంది. భారత్‌తో సంబంధాలు దెబ్బతిన్నప్పుడు రాజు జ్ఞానేంద్ర చైనాతో స్నేహంగా మసిలిన మాట నిజమే. అలాగని ఆయనకు ఇప్పుడు చైనా మద్దతుగా ఉంటుందని భావించలేం. నేపాల్‌లో అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని యూఎస్, యూకే, ఇండియాలు గుర్తిస్తున్నాయి.

ప్రజాపాలన నుంచి రాచరికంలోకి మారినంత మాత్రాన నేపాల్ అభివృద్ధి ఫలాలను అందుకుంటుందని చెప్పలేం. రాజు అధికారంలోకి వస్తే అన్నీ సర్దుకుంటాయన్న భావన తార్కికంగా సమంజసంగా లేదు. మార్పు మంచిదే. అదీ అభివృద్ధికి తోవ చూపించినప్పుడే కదా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ | 99088 92065

# మనిషి కొరకు దైవపుత్రుడే...



క్రీస్తును శిలువ వేసిన రోజు శుక్రవారం. అయితే ఆ శిలువ ద్వారా మానవాళికి మహత్తర సందేశం అందిన రోజుగా పవిత్ర శుక్రవారంగా అది పరిగణింపబడింది. అందుకే ఇది 'గుడ్ ఫ్రైడే'గా పేరొందింది. క్రైస్తవ సమాజంలో ఇది ప్రాముఖ్యం కల్గిన రోజు. ప్రభువు మరణంలో, ఒక మనిషి మరో మనిషిని ప్రేమించాలి అనే సందేశం ప్రతిధ్వనిస్తోంది. ఆ ప్రేమతోనే సాటి మనిషిని క్షమిస్తాడు. తోటి మనిషి పట్ల సహనం ప్రదర్శిస్తాడు. అదే ప్రేమతో సాటివానికి సాయం చేస్తాడు. ప్రభువంతటి గొప్పవాడే ఏకంగా మనిషి కోసం మరణించాడే, మరి నేనేమి చేస్తున్నాను? అని ప్రతి వ్యక్తీ ప్రశ్నించుకుంటాడు. క్రైస్తవ సమాజంలో క్రిస్మస్‌కి, గుడ్ ఫ్రైడేకి, ఈస్టర్‌కి ప్రాముఖ్యం ఉంది. వీటినే మరో రీతిగా చెప్పుకోవలసి వస్తే, జననం, మరణం, పునరుత్థానం అని వివరించు కోవాలి. జనన పునరుత్థానాల్లో దైవిక భావన కనిపిస్తోంది. కానీ మర ణంలో మాత్రం అచ్చంగా మానవీయత కనిపిస్తోంది. మానవీయ గుణగణాల కలబోత అది. మిగిలిన రెండు పండుగలకూ సమన్వయం చేకూర్చి, క్రీస్తు తత్వానికి పరిపూర్ణత్వాన్ని అందించిన రోజు ఇది.

క్రీస్తు ప్రాణత్యాగం చేసిన రోజు ఇది. ఎన్నో అద్భుతాలు చేసిన క్రీస్తుకు ఈ మరణం నుంచి తప్పించుకోవడానికీ, అసలు తనకు ఆ మరణమే ఎదురుపడకుండా చేసుకోగల శక్తిసామర్థ్యాలు ఉన్నప్పటికీ తండ్రి దేవుని మాటకు విధేయత చూపి మరణాన్ని ఆహ్వానించడంలో గొప్ప సందేశం కనిపిస్తోంది. వాస్తవానికి తప్పు చేసిన మానవుణ్ణి ఈ మరణమే మాటి మాటికీ హెచ్చరిస్తోంది.

ఎన్ని ఫ్రైడేలు లేవు? కానీ, ఇది జనహితం కలిగించిన శుభకరమైన శుక్రవారం. ఇదే క్రీస్తు పవిత్రతను చాటిన పవిత్ర శుక్రవారంగా కూడా పిలువబడుతోంది. క్రైస్తవులు తెల్లటి వస్త్రాలు ధరించి ఈ రోజంతా చర్చిల్లో ప్రార్థనలు చేస్తారు. తమ పాపాలే ఈ రకంగా క్రీస్తును శిలువ వేసి మరణానికి గురిచేశాయి అనే పశ్చాత్తాప బాధతో ఉంటారు. ఇక మీదట తప్పిదాలు, దగా – మోసాలు చేయకుండా కొత్త జీవన విధానంతో ముందుకు సాగిపోతారు. క్రీస్తు మరణం విషాద భరితం. దుఃఖ పరివేదనం. అయినా ఆత్మ ప్రక్షాళనం చేసే చావు కేక. అది మానవుణ్ణి ప్రతి క్షణం మేల్కొల్పుతుంది.

– డా॥ దేవదాసు బెర్నార్డ్ రాజు

(నేడు 'గుడ్ ఫ్రైడే')

## గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.పంచమి ప.1.13 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** మూల పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ప.1.39 నుండి 3.21 వరకు, తదుపరి తె.4.52 నుండి 6.33 వరకు (తెల్లవారితే శనివారం). **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.24 నుండి 1.14 వరకు, **అమృత ఘడియలు:** రా.11.03 నుండి 2.50 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.47, **సూర్యాస్తమయం:** 6.12.

- పరీక్షల్లో ప్రశ్నల స్థాయి పెంచే యోచనలో టీజీపీఎస్సీ
- ఉద్యోగాలకు అత్యుత్తమ అభ్యర్థుల ఎంపికే లక్ష్యం
- మూస పద్ధతికి స్వస్తి.. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ముందుకు
- క్వశ్చన్ బ్యాంకు రూపకల్పన కోసం ఇక వర్సిటీల నిపుణులతో ప్యానెల్
- వర్సిటీల వీసీలు, విద్యారంగ నిపుణులతో కమిషన్ భేటీ
- త్వరలో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చే దిశగా అడుగులు

# 'గ్రూప్స్' డోస్ పెంచుదాం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలు కఠినతరం కాబోతున్నాయి. ఏళ్లుగా మూస పద్ధతిలో ఉన్న ప్రశ్నావళిని సమూలంగా మార్చేందుకు కసరత్తు జరుగుతోంది. ఉద్యోగాల్లో ప్రస్తుత ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని అత్యుత్తమ నైపుణ్యంతో కూడిన అభ్యర్థుల ఎంపికకు వీలుగా ప్రశ్నలు ఉండాలని టీజీపీఎస్సీ భావిస్తోంది. ఈ అంశంపై కమిషన్ ఉన్నతాధికారులు, విద్యారంగ నిపుణులు, విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లతో ఇటీవల కీలక భేటీ జరిగింది. ఇందులో సిలబస్, పరీక్ష విధానం, మూల్యాంకన పద్ధతి, రాష్ట్ర చరిత్రకు సంబంధించిన అంశాలపై కూలంకషంగా చర్చించారు. పరీక్షల కోసం పెద్ద ఎత్తున క్వశ్చన్ బ్యాంకు రూపొందించాలని నిర్ణయించారు. జాతీయ స్థాయి పరీక్షలను అధ్యయనం చేయాలని, ఆ రీతిలో ప్రశ్నల స్థాయిని పెంచాలని తీర్మానించారు. ఈ మేరకు మార్పులు, చేర్పులపై వీసీల నుంచి కమిషన్ నివేదిక కోరింది. ఈ నివేదికలోని అంశాల ఆధారంగా నెల రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని భావిస్తోంది. పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే అంశంపైనా సమావేశంలో చర్చించారు. దీనిపై వీసీలు, విద్యారంగ నిపుణులు భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చారు. శాస్త్రీయతపై సందేహాలు వ్యక్తమయ్యాయి. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో ఈ విషయంలో ఆచితూచి అడుగేయాలని పలువురు సూచించారు.



### మూడు విభాగాలుగా ప్రశ్నలు

→ గ్రూప్స్ పరీక్షల కోసం ఇప్పటివరకు కొంతమంది సబ్జెక్టు నిపుణుల నుంచి మాత్రమే ప్రశ్నలు తీసుకుంటున్నారు. ఇకపై ఇందుకోసం వర్సిటీల్లోని కొంతమంది నిపుణులతో ప్యానల్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నారు. కమిషన్ పరీక్ష నిర్వహించే ముందు.. సిలబస్‌లో ఏయే అధ్యాయాలు ఉండాలనే అంశాన్ని నిర్ణయిస్తారు. సాధారణం, మధ్యస్థం, కఠినం అనే మూడు విభాగాలుగా ప్రశ్నలు రూపొందించాలని భావిస్తున్నారు.


### సాధారణ ప్రశ్నలూ భిన్న ధోరణిలో..

సాధారణ ప్రశ్నలను సైతం ఇకపై భిన్నమైన కోణంలో ఇవ్వాలని భావిస్తున్నారు. ఇచ్చే ప్రశ్న అభ్యర్థి తాత్విక ధోరణిని ప్రశ్నించేలా ఉండాలని కమిషన్ భావిస్తోంది. మధ్యస్థంగా ఉండే ప్రశ్నలు అభ్యర్థి ఆలోచన ధోరణికి అద్దం పట్టేలా ఉండాలని నిర్ణయించారు. ఉదాహరణకు భౌతిక శాస్త్రం నుంచి వెర్నియర్ క్యాలిపర్స్ గురించి ప్రశ్న వేసినప్పుడు, అందులో ప్రస్తుత కాలంలో ఉపయోగించే విధానపరమైన సూత్రాన్ని జోడిస్తారు. ఆర్ట్స్ గ్రూపుల నుంచి ప్రశ్నలు కూడా నవీన ధోరణిలో ఉండాలని భావిస్తున్నారు. ఉదాహరణకు రాష్ట్రపతి అధికారాలపై వేసే ప్రశ్న.. ఇటీవల రాష్ట్రపతి ఏయే అంశాల్లో తన అధికారాన్ని వినియోగించారో తెలియజేయాల్సిన విధంగా ఉంటుంది. ఇక కఠిన ప్రశ్నలను కీలకంగా భావిస్తున్నారు. గ్రూప్స్ ద్వారా ఎంపికయ్యే ప్రభుత్వ ఉద్యోగి ప్రజా జీవితంలో వేగంగా నిర్ణయాలు తీసుకోగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. ఈ మేరకు కఠినమైన ప్రశ్నలు రూపొందించడంతో పాటు అతి తక్కువ సమయంలో జవాబు ఇవ్వగలగడం అనే విధానంలో రూపకల్పన చేయాలని భావిస్తున్నారు.

### క్వశ్చన్ బ్యాంక్ కోసం ప్రత్యేక విభాగం..

→ క్వశ్చన్ బ్యాంకు రూపకల్పనకు అవసరమైతే ఆయా రంగాల నిపుణుల నుంచి సామాజిక పరిస్థితులు తెలుసుకునే విభాగం ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నారు. టీజీపీఎస్సీ తెలంగాణ చరిత్రను సిలబస్‌లో జోడించింది. ఈ సబ్జెక్టుకు సంబంధించి వ్యక్తుల కన్నా, తెలంగాణ సమాజ పోకడలు, సంస్కృతి గురించిన అవగాహనను తెలుసుకునేలా ప్రశ్నలు ఉండబోతున్నాయని అధికార వర్గాలు తెలిపాయి.

### ఏఐ థింకింగ్‌కూ ప్రాధాన్యం




రాబోయేది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కాలం. ప్రాథమిక విద్య స్థాయి నుంచి ఏఐ వాడకం ఉంటోంది. ఉద్యోగి కూడా ఏఐ అనుసంధానంతోనే పని చేయాల్సి ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో అభ్యర్థి పట్టు ఎంత? అనేది వెలికి తీయాలని భావిస్తున్నారు. ఇందుకోసం ఐటీ రంగ నిపుణులు, డేటా అనలిస్టుల సాంకేతిక పరమైన సలహాలతో సిలబస్ రూపొందించే యోచనలో ఉన్నారు. లాంగ్ లెర్నింగ్ లాంగ్వేజ్ మొదలుకొని, ఏఐ నేపథ్యంలో వేగంగా స్పందించే నేర్పును పరిశీలించే ఆలోచన సర్వీస్ కమిషన్ చేస్తోంది. కంప్యూటర్ కోర్సుల నేపథ్యంతో వచ్చే విద్యార్థులకు ఇప్పుడిచ్చే ప్రశ్నలు సాధారణ కోడ్ ప్రామాణికంగానే ఉంటున్నాయి. ఇక నుంచి వీటి స్థానంలో అంతర్జాతీయ ఏఐ లాంగ్వేజ్ నుంచి ప్రశ్నలు ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నారు.

## 262 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: చార్మినార్ జోన్ పరిధిలో పని చేస్తున్న 262 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ మల్టీజోన్-2 ఐజీ వి.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో హైదరాబాద్ సిటీ నుంచి 73 మంది, సైబరాబాద్‌లో 147 మంది, సంగారెడ్డిలో 18 మంది, వికారాబాద్‌లో 17 మంది, డిప్యుటేషన్‌లో ఉన్న మరో ఏడుగురున్నారు.

## కేబుల్ ఆపరేటర్లకు టీ ఫైబర్ ఆఫర్

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది చివరినాటికి రాష్ట్రంలోని 93 లక్షల గృహాలకు డిజిటల్ కనెక్టివిటీ ద్వారా ఇంటింటికీ ఇంటర్నెట్ ఇవ్వాలని అనుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఆ దిశగా మరో అడుగు వేసింది. గ్రామ, మండల, జిల్లా కేంద్రాల్లో 'టీ ఫైబర్'ద్వారా సేవలు అందించడంలో లోకల్ కేబుల్ ఆపరేటర్లను భాగస్వాములను చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు వారి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తూ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ కేబుల్ ఆపరేటర్లు గ్రామ, మండల, జిల్లా కేంద్రాలలో టీ ఫైబర్ టెలికం నెట్‌వర్క్ నిర్వహణ, భద్రత, రక్షణతోపాటు కేబుల్, ఐపీ టీవీ, బ్రాడ్ బ్యాండ్, ఇతర విలువ ఆధారిత సేవలు అందించాల్సి ఉంటుంది. టీ ఫైబర్ సేవలు అందుబాటులోకి వస్తే ఇంట్లో టీవీ ఇకపై కంప్యూటర్, సీసీ టీవీ మానిటర్‌గా మారనుంది. టీ శాట్, కేబుల్ టీవీ కనెక్షన్‌తోనూ అనుసంధానం జరుగుతుంది.

# యువ వికాసం దరఖాస్తులు 16.23 లక్షలు

### కార్పొరేషన్ల వారీగా దరఖాస్తుల క్రోడీకరణ పూర్తి

- అత్యధికంగా 8 లక్షల దరఖాస్తులతో ముందు వరుసలో బీసీ కార్పొరేషన్
- క్రిస్టియన్ కార్పొరేషన్ ద్వారా అతి తక్కువగా 4,695 దరఖాస్తులు
- 4 కేటగిరీలుగా దరఖాస్తుల విభజన
- కేటగిరీ నాలుగుకు భారీ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగ యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేందుకు తలపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి అనూహ్య స్పందన వచ్చింది. నాలుగు వారాల పాటు సాగిన దరఖాస్తు ప్రక్రియలో ఏకంగా 16.23 లక్షల మంది నిరుద్యోగులు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా బీసీ కార్పొరేషన్ నుంచి 8 లక్షల మంది దరఖాస్తులు సమర్పించడం గమనార్హం. రాష్ట్రంలోని నిరుద్యోగులు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. 2025 - 26 వార్షిక బడ్జెట్‌లో ఈ పథకం కింద రూ.6 వేల కోట్ల భారీ నిధిని కేటాయించింది. గరిష్టంగా 4 లక్షల మందికి సాయం అందించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని.. మార్చి 17వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఈనెల 14వ తేదీ రాత్రి 11.59 గంటలకు దరఖాస్తులకు గడువు విధించింది. గడువు ముగిసే సమయానికి 16,23,764 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించేందుకు అధికారులు కసరత్తు మొదలు పెట్టనున్నారు.

**కేటగిరీ-4లో 12.41 లక్షల దరఖాస్తులు..**

రాజీవ్ యువ వికాసం పథకం కింద వచ్చిన దరఖాస్తులను నాలుగు కేటగిరీలుగా విభజించారు. యూనిట్ విలువ ఆధారంగా ఈ విభజన చేశారు. రూ.50 వేలలోపు ఆర్థిక సాయంకోసం వచ్చిన వాటిని కేటగిరీ-1లో చేర్చారు. రూ.50 వేల నుంచి రూ.లక్ష మధ్య ఉన్న దరఖాస్తులను కేటగిరీ-2, రూ.1లక్ష నుంచి రూ.2లక్షల మధ్య ఉన్న దరఖాస్తులు కేటగిరీ-3, రూ.2 లక్షలు నుంచి రూ.4 లక్షల మధ్య ఉన్న దరఖాస్తులను కేటగిరీ-4లోకి చేర్చారు. తాజాగా వచ్చిన దరఖాస్తుల్లో అతి తక్కువగా కేటగిరీ-1లో 39,401 దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత కేటగిరీ-2లో 93,233 దరఖాస్తులు, కేటగిరీ-3లో 24,9434 దరఖాస్తులు రాగా.. కేటగిరీ-4లో ఏకంగా 12,41,696 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం దరఖాస్తుల్లో 75 శాతం నాలుగో కేటగిరీ కిందనే దరఖాస్తు చేయడం గమనార్హం. 21 సంవత్సరాల నుంచి మొదలుకొని 55 ఏళ్ల వయసున్న వారి వరకు కూడా దరఖాస్తు చేసుకున్నారు. కాగా, వ్యవసాయ రంగాన్ని ఎంచుకున్న రైతులు 60 సంవత్సరాల వయసు వరకు కూడా ఉన్నారు. తాజాగా వచ్చిన దరఖాస్తులను మండల స్థాయి కమిటీల ఆధ్వర్యంలో పరిశీలించనున్నారు. ఇందుకు గ్రామాల వారీగా తేదీలు ఖరారు చేసుకున్న తర్వాత ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహించి అర్హుల జాబితాలను ఖరారు చేయనున్నట్లు సమాచారం.

**కార్పొరేషన్ల వారీగా దరఖాస్తులు ఇలా..**

| కార్పొరేషన్ | దరఖాస్తులు |
|---|---|
| ఎస్సీ | 3,92,951 |
| ఎస్టీ | 1,83,494 |
| బీసీ | 8,01,008 |
| ఈబీసీ | 37,414 |
| మైనార్టీ | 2,04,202 |
| క్రిస్టియన్ | 4,695 |




సదస్సులో మాట్లాడుతున్న ప్రొ.కోదండరాం. చిత్రంలో ప్రొ.హరగోపాల్, ఆకునూరి మురళి, పీఎల్ విశ్వేశ్వరరావు తదితరులు

# జాతీయ విద్యా విధానాన్ని రుద్దొద్దు

### రాష్ట్ర విద్యా కమిషన్ సదస్సులో వక్తల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: జాతీయ విద్యా విధానం -2020ని రాష్ట్రాలపై బలవంతంగా రుద్దడాన్ని కేంద్రం మానుకోవాలని విద్యావేత్తలు, మేధావులు డిమాండ్ చేశారు. దీనిపై పార్లమెంట్‌లో విస్తృత చర్చ జరగకుండానే, కేంద్ర కేబినెట్ ఆమోదంతో అమల్లోకి తేవాలనే విధానం సరికాదని వ్యాఖ్యానించారు. ఇది పార్లమెంటరీ వ్యవస్థకు గొడ్డలి పెట్టని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విద్యా కమిషన్ నేతృత్వంలో హైదరాబాద్‌లో గురువారం జాతీయ విద్యా విధానంపై సెమినార్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, విద్యను కేంద్రీకృతం చేయడం, వ్యాపార ధోరణిలోకి తీసుకెళ్లేలా ఎన్ఈపీ ఉందన్నారు. పాఠ్యాంశాలను కేంద్రమే రూపొందించడం సరికాదన్నారు. విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మాట్లాడుతూ, విద్యా విధానాన్ని దెబ్బకొట్టేలా ఎన్ఈపీ ఉందన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లోనూ కేంద్రం మాయ చేస్తోందని తెలిపారు. సెమినార్‌లో కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్ రావు, విద్యా రంగ నిపుణులు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ శాంత సిన్హా తదితరులు పాల్గొన్నారు.

# సౌర వ్యవస్థకు ఆవల జీవం!



## 'కే2-18బీ' గ్రహంపై డీఎంఎస్, డీఎండీఎస్ వాయువులు

- జీవ సంబంధమైన ప్రక్రియల ద్వారానే ఉత్పత్తి అయ్యే అవకాశం
- ఎక్సోప్లానెట్‌పై జీవం ఉందనడానికి బలమైన సాక్ష్యాధారాలు లభించాయి
- వెల్లడించిన కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ సైంటిస్టులు

అనంతమైన విశ్వంలో మన భూగోళంపైనే కాకుండా ఇంకెక్కడైనా జీవజాలం ఉందా? జీవులు మనుగడ సాగించే వాతావరణ పరిస్థితులు ఎక్కడైనా ఉన్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానం కనిపెట్టడానికి శతాబ్దాలుగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇతర గ్రహాలపై జీవుల ఉనికి ఉండొచ్చని అంచనా వేస్తున్నప్పటికీ అందుకు కచ్చితమైన ఆధారాలైతే లభించలేదు. గ్రహాంతర జీవులు కాల్పనిక సాహిత్యానికే పరిమితమయ్యాయి. కానీ, మన సౌర వ్యవస్థ వెలుపల ఉన్న 'కే2–18బీ' అనే గ్రహంపై జీవం ఉందని చెప్పడానికి బలమైన సాక్ష్యాధారాలు లభించాయని యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లోని ప్రఖ్యాత యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్ పరిశోధకులు వెల్లడించారు. ఈ గ్రహం మన భూమి నుంచి 124 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. భూమితో పోలిస్తే 8.5 రెట్లు పెద్దది. కక్ష్యలో పరిభ్రమిస్తోంది. 'నాసా'కు చెందిన జేమ్స్‌వెబ్ స్పేస్ టెలిస్కోప్ ద్వారా ఈ గ్రహంపై డైమిథైల్ సల్ఫైడ్(డీఎంఎస్), డైమిథైల్ డైసల్ఫైడ్(డీఎండీఎస్) అనే రకాల వాయువుల కెమిల్ ఫింగర్‌ప్రింట్స్‌ను గుర్తించారు. ఈ రెండు రకాల వాయువులు భూమిపైనా ఉన్నాయి. ఇవి కేవలం జీవ సంబంధమైన ప్రక్రియల ద్వారానే ఉత్పత్తి అవుతాయి. సముద్రంలోని ఆల్గే(మెరైన్ ఫైటోప్లాంక్టన్)తోపాటు ఇతర జీవుల నుంచి ఈ వాయువుల ఉత్పత్తి అధికంగా జరుగుతుంది. దీన్నిబట్టి కే2–18బీ గ్రహంపై జీవం ఉందని తేల్చారు. అచ్చంగా భూమిపై ఉన్నట్లుగా అక్కడ జీవించి ఉన్న ప్రాణులు లేనప్పటికీ జీవసంబంధిత ప్రక్రియలు జరుగుతున్నట్లు నిర్ధారణకు వచ్చారు. అయితే, దీనిపై మరింత పరిశోధన జరగాల్సి ఉందని పేర్కొంటున్నారు.

### పరిశోధనల దిగ్గజం నిక్కు మధుసూదన్



ఇండియన్–బ్రిటిష్ ప్రొఫెసర్ నిక్కు మధుసూదన్ ఎక్సోప్లానెట్స్‌ను గుర్తించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన సమర్పించిన ఎన్నో పరిశోధన పత్రాలు అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. పలు అధ్యయనాలకు ఆయన నేతృత్వం వహిస్తున్నారు. మధుసూదన్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ–వారణాసిలో బీటెక్ పూర్తిచేశారు. అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)లో ఎంఎస్, పీహెచ్‌డీ అభ్యసించారు. 2020లో వాస్ప్–19బీ అనే గ్రహంపై టైటానియం ఆక్సైడ్‌ను గుర్తించిన బృందంలో ఆయన కూడా ఉన్నారు. కే2–18బీ గ్రహంపై పరిశోధనలు సాగిస్తున్నారు.

### మనం ఒంటరివాళ్లం కాదు: మధుసూదన్

జీవుల మనుగడ సాధ్యమయ్యే మరో గ్రహం దొరికిందని చెప్పడానికి ఇది తొలి సంకేతమని యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్‌లో ఆస్ట్రోఫిజిక్స్, ఎక్సోప్లానెటరీ సైన్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నిక్కు మధుసూదన్ వెల్లడించారు. సౌర వ్యవస్థకు బయట జీవం ఉనికిని పరిశోధించే విషయంలో ఇదొక కీలకమైన మలుపు అని తెలిపారు. ఇతర గ్రహాలపై మన సహచర జీవులు ఉన్నాయని కచ్చితంగా చెప్పే రోజు మరికొన్ని సంవత్సరాల్లో వస్తుందని మధుసూదన్ స్పష్టంచేశారు. మనం ఒంటరివాళ్లం కాదన్నారు.

### హైసియన్ ప్రపంచాలు

కే2–18బీ గ్రహం సబ్–నెప్ట్యూన్ తరగతికి చెందినది. అంటే ఇలాంటి గ్రహాల వ్యాసం భూమి వ్యాసం కంటే ఎక్కువ, నెప్ట్యూన్ వ్యాసం కంటే తక్కువ. కే2–18బీ గ్రహం ఎలా ఏర్పడిందన్నది ప్రస్తుతానికి మిస్టరీగానే ఉంది. దీనిపై మిథేన్, కార్బన్‌డయాక్సైడ్, డైమిథైల్ సల్ఫైడ్, డైమిథైల్ డైసల్ఫైడ్ వాయువులు సమృద్ధిగా ఉన్నట్లు 2023లో కనిపెట్టారు. 1990 నుంచి ఇప్పటివరకు సౌర వ్యవస్థ బయట 5,800 గ్రహాలను గుర్తించారు. వీటిని ఎక్సోప్లానెట్స్ అని పిలుస్తున్నారు. హైసియన్ ప్రపంచాలు అని కూడా అంటున్నారు. వీటిలో చాలావరకు ద్రవరూపంలోని నీటి సముద్రాలతో కప్పి ఉన్నాయని, ఎక్సోప్లానెట్స్‌పై హైడ్రోజన్‌తో కూడిన వాతావరణం ఉందని చెబుతున్నారు. ఆయా గ్రహాలపై జీవులు ఉండేందుకు వంద శాతం ఆస్కారం ఉందని, వాటిని గుర్తించడమే మిగిలి ఉందని పేర్కొంటున్నారు.

**- సాక్షి, నేషనల్ డెస్క్**

## విక్టరీ డే వేడుకలకు రండి

### ప్రధాని మోదీకి రష్యా ఆహ్వానం

మాస్కో: తమ రాజధాని మాస్కోలో మే 9వ తేదీన జరిగే 80వ ప్రతిష్టాత్మక విక్టరీ డే వేడుకల్లో పాల్గొనాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించినట్లు గురువారం రష్యా తెలిపింది. అయితే, ఆహ్వానంపై భారత ప్రభుత్వం స్పందించాల్సి ఉందని అధ్యక్ష భవనం క్రెమ్లిన్ ప్రతినిధి వివరించారు. 1945లో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా రష్యా ఏటా మే 9వ తేదీన వేడుకలను భారీ ఎత్తున నిర్వహిస్తుంటుంది. ఈ కార్యక్రమానికి ప్రపంచ దేశాల నేతలను ఆహ్వానించడం ఆనవాయితీ. ఈసారి మోదీతోపాటు చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌ను రష్యా ఆహ్వానించింది. ఆయన కూడా హాజరవుతారని భావిస్తున్నారు. కాగా, అధ్యక్షుడు పుతిన్ సైతం త్వరలో భారత్‌ను సందర్శించనున్నారని క్రెమ్లిన్ ప్రతినిధి యూరి ఉషకోవ్ మీడియాకు తెలిపారు. ఇందుకు సంబంధించి రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నట్లు ఆయన వెల్లడించారు. పుతిన్ మొట్టమొదటిసారిగా అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా 2000 అక్టోబర్‌లో భారత్‌లో పర్యటించారు. అప్పట్లో రెండు దేశాలు 'వ్యూహాత్మక భాగస్వామ్య డిక్లరేషన్'పై సంతకాలు చేశాయి. ఈ భాగస్వామ్యమే ఇప్పుడు రెండు దేశాల మధ్య 'ప్రత్యేక, విశేష భాగస్వామ్యం'స్థాయికి పరిణతి చెందింది.

## మూడో రోజూ ఈడీ విచారణకు వాద్రా

న్యూఢిల్లీ: భూ ఒప్పందానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా వరుసగా మూడో రోజు గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. అధికారులు ఆయనను ఆరు గంటలపాటు ప్రశ్నించి, స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. మొత్తం మూడు రోజుల్లో 16 గంటలపాటు వాద్రాను ప్రశ్నించడం గమనార్హం. మూడో రోజు తన భార్య ప్రియాంకతో కలిసి ఈడీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తనపై, తన కుటుంబంపై రాజకీయ క్షుద్ర వేట జరుగుతోందని ఆరోపించారు. రాబర్ట్ వాద్రాపై ఈడీ త్వరలో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది.

## వచ్చే వారం అమెరికాకు రాహుల్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ వచ్చే వారం అమెరికాకు వెళ్లనున్నారు. పర్యటన సందర్భంగా రోడ్ ఐలాండ్‌లోని బ్రౌన్ యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపక సిబ్బందితో జరిగే ముఖాముఖిలో ఆయన పాల్గొంటారు. కాంగ్రెస్ మీడియా పబ్లిసిటీ విభాగం చీఫ్ పవన్ ఖేరా గురువారం ఈ విషయం తెలిపారు. ఈ నెల 21, 22వ తేదీల్లో ఈ కార్యక్రమం జరగనుందన్నారు. అదేవిధంగా, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఆఫీసు బేరర్లు, సభ్యులతో సమావేశమవుతారు.

## ఆరోపణలు లేని ఆ టీచర్లు కొంతకాలం కొనసాగొచ్చు

### పశ్చిమబెంగాల్ టీచర్ల నియామక కుంభకోణంలో సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: అక్రమ మార్గంలో ఉద్యోగాలు పొందిన 25,753 మంది టీచర్లు, బోధనేతర సిబ్బందిని తొలగిస్తూ గతంలో కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం.. ఆ తీర్పు కారణంగా ఉద్యోగం కోల్పోయిన కొందరు టీచర్లకు మాత్రం పెద్ద ఊరట కల్పించింది. '' ఆ 25,753 మంది టీచర్లు, బోధనేతర సిబ్బందిలో కొందరు టీచర్లకు ఈ కుంభకోణంతో ఎలాంటి సంబంధం లేదని సీబీఐ స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలో 9, 10, 11, 12 తరగతులు బోధించే, ఎలాంటి ఆరోపణలు లేని టీచర్లు మాత్రం ఉద్యోగంలో కొనసాగేందుకు అనుమతి మంజూరుచేస్తున్నాం. వీళ్లు ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీదాకా మాత్రమే ఉద్యోగాలు చేసుకోవచ్చు. బోధనేతర గ్రూప్ సీ, గ్రూప్ డీ ఉద్యోగులు విధుల్లో కొనసాగడానికి వీల్లేదు'' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం స్పష్టంచేసింది.

# వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోం

**మే ఐదో తేదీదాకా సెంట్రల్ వక్ఫ్ బోర్డులు, మండళ్లలో నియామకాలు చేపట్టబోము • సుప్రీంకోర్టుకు తెలియజేసిన కేంద్రప్రభుత్వం**



న్యూఢిల్లీ: ఇప్పటికే వక్ఫ్ ఆస్తులుగా పరిగణనలో ఉన్న ఆస్తులను డీనోటిఫై చేయబోమని సర్వోన్నత న్యాయస్థానానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. మే 5వ తేదీదాకా సెంట్రల్ వక్ఫ్ బోర్డులు, మండళ్లలో నియామకాలు చేపట్టబోమని పేర్కొంది. అయితే వక్ఫ్ ఆస్తుల డీనోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా మధ్యంతర ఉత్తర్వులు ఇస్తామంటూ సుప్రీంకోర్టు చేసిన ప్రతిపాదనపై మాత్రం కేంద్రప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. వక్ఫ్(సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల త్రిసభ్య ధర్మాసనం గురువారం సైతం కొనసాగించింది. ఈ సందర్భంగా వక్ఫ్(సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై ఏడు రోజుల్లోపు స్పందన తెలియజేసేందుకు కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గురువారం కోర్టుకు తెలిపారు. చట్టంలోని సెక్షన్ 9, సెక్షన్ 14 ప్రకారం వక్ఫ్ బోర్డులు, కౌన్సిళ్లలో ఎలాంటి నియామకాలను కేసు తదుపరి విచారణ తేదీదాకా చేపట్టబోమని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికే 'వక్ఫ్ బై యూజర్' విధానం ద్వారా వక్ఫ్ ఆస్తులుగా రిజిస్టర్ అయిన, ధృవీకరించబడిన ఆస్తులకు సంబంధించిన నోటిఫికేషన్‌ను డీనోటిఫై చేసి గందరగోళం చేయబోమని ఆయన మాటిచ్చారు. '' ఎంతో విస్తృతస్థాయి చర్చలు, సంప్రదింపుల ప్రక్రియ తర్వాత ప్రభుత్వం తన నిర్ణయాన్ని చట్టంగా తీసుకొచ్చాక ప్రభుత్వ వాదన వినకుండానే ధర్మాసనం ఆ చట్టాన్ని నిలుపుదలచేయడం సహేతుకం అనిపించుకోదు. ప్రభుత్వంలో భాగమైన మేము పార్లమెంట్‌కు, ప్రజలకు జవాబు చెప్పాల్సి ఉంటుంది. న్యాయమూర్తులు 'వక్ఫ్ బై యూజర్' నిబంధనపై తీసుకునే నిర్ణయాలు ఎలాంటి ఫలితాలను ఇవ్వబోతున్నాయి?'' అని మెహతా ప్రశ్నించారు. దీనిపై సీజేఐ ఖన్నా స్పందించారు. '' 1995నాటి వక్ఫ్ చట్టం ప్రకారం గతంలో రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్న వక్ఫ్ ఆస్తులను ఈ కేసుల తదుపరి విచారణదాకా డీనోటిఫై చేయకూడదు'' అని కేంద్రాన్ని ఆదేశించారు. గతంలో వక్ఫ్ ఆస్తులుగా కోర్టులు ప్రకటించిన ఆస్తుల డీనోటిఫైకు వీలుకల్పించే నూతన చట్టంలోని సెక్షన్లను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులకు ప్రతిపాదిస్తామని బుధవారం కోర్టు వ్యాఖ్యానించడం తెల్సిందే.

### ప్రైవేట్ ఆస్తులనూ వశపర్చుకున్నారు

సెక్షన్ల నిలుపుదల ప్రతిపాదనను తుషార్ మెహతా తప్పుబట్టారు. '' చట్టంలోని సుదీర్ఘ సెక్షన్లను జడ్జీలు హడావిడిగా, యథాలాపంగా చదివి ఉండొచ్చు. చట్టబద్ధమైన సెక్షన్‌ను నిలుపుదలచేయడం నిజంగా అరుదైన విషయం. ఈ విషయంలో ఈ చట్టం పూర్వాపరాలను జడ్జీలు మరోసారి పరిశీలించాలని వేడుకుంటున్నా. అన్ని వర్గాల నుంచి వినతులను స్వీకరించాకే ప్రభుత్వం ఈ సవరణ చట్టాన్ని తెచ్చింది. వక్ఫ్ పేరిట ప్రైవేట్ ఆస్తులనూ తమ వశం చేసుకున్నారు. కొన్ని చోట్ల గ్రామాల్లోని భూములు మొత్తం వక్ఫ్ పేరిట నమోదై ఉన్నాయి. లెక్కలేనన్ని ప్లాట్లు వక్ఫ్ ఆక్రమణలో ఉన్నాయి'' అని మెహతా వాదించారు. ''ప్రభుత్వం నుంచి ప్రాథమికస్థాయి స్పందనను అనుమతించకుండానే చట్టంలోని నిబంధనలను నిలుపుదలచేయడమంటే ధర్మాసనం అత్యంత కఠిన వైఖరిని అవలంబిస్తోందని అర్థమవుతోంది'' అని మెహతా అసహనం వ్యక్తంచేశారు. '' మా వాదనలకు బలం చేకూర్చే సాక్ష్యాధారాలు, డాక్యుమెంట్లు, పాత శాసనాలను మీ ముందు ఉంచుతాం. మాకు ఒక వారం గడువు ఇవ్వండి. ఈలోపు ఏమీ జరిగిపోదుగా'' అని మెహతా వ్యాఖ్యానించారు. '' కోర్టు తాత్కాలిక ఉత్తర్వులు ఇవ్వకుండా వారం రోజులు ఆగినంత మాత్రాన ఆకాశం విరిగిపడదుగా'' అని ఒక రాష్ట్రం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది వ్యాఖ్యానించారు. దీంతో సీజేఐ స్పందించారు. '' మీరు వక్ఫ్ ఆస్తులకు సంబంధించి యతాతథ స్థితిని మార్చకుండా ఉంటే చాలు'' అని అన్నారు. వక్ఫ్ చట్టం అమలుకాకుండా తాత్కాలిక ఉత్తర్వులు ఇవ్వాలన్న పిటిషన్ల అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. అలాగే చట్టం మొత్తం పూర్తిగా నిలుపుదల చేయడం కుదరదని కోర్టు స్పష్టంచేసింది. '' నూతన చట్టంలోని కొన్ని సెక్షన్లు సమతుల్యతతో ఉన్నాయి. అందుకే మొత్తం చట్టాన్ని నిలుపుల చేయడం అస్సలు కుదరదు. అలా చేయడం సహేతుకం కూడా కాదు. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున డీనోటిఫై లాంటి వాటి జోలికి పోవద్దు'' అని ధర్మాసనం సూచించింది.

### ముగ్గురే వాదించాలి

''ఎన్నో పిటిషన్లు వచ్చినా ప్రస్తుతానికి మేం ఐదు పిటిషన్లనే స్వీకరిస్తాం. మీ అందరిలో కేవలం ముగ్గురు న్యాయవాదులనే అన్ని పిటిషన్ల తరఫున వాదించేందుకు అనుమతిస్తాం. ఏ ముగ్గురు వాదించాలో మీరే నిర్ణయించుకోండి'' అని పలు పిటిషన్ల తరఫు లాయర్లకు సీజేఐ సూచించారు. ఏడు రోజుల తర్వాత కేంద్రప్రభుత్వం స్పందన తెలిపాక ఐదురోజుల్లోపు రిజాయిండర్లను సమర్పించేందుకు పిటిషన్లకు ధర్మాసనం గడువు ఇచ్చింది. మే ఐదో తేదీన ప్రాథమిక స్థాయి అభ్యంతరాలను ఆలకించాక తాత్కాలిక ఉత్తర్వులిస్తామని బెంచ్ తెలిపింది. 1995 వక్ఫ్ చట్టాన్ని, ఆ చట్టానికి 2013లో చేసిన సవరణను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లనూ వేరుగా విచారిస్తామని కోర్టు పేర్కొంది. వైఎస్సార్‌సీపీ, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్, జమియత్ ఉలేమా–ఇ–హింద్ అధ్యక్షుడు అర్షద్ మదానీ, డీఎంకే, ఆకాఫ్ కర్ణాటక రాష్ట్ర బోర్డు మాజీ చైర్మన్ అన్వర్ బాషా, సమస్త కేరళ జమియతుల్ ఉలేమా, అంజుమ్ ఖదారీ, తయ్యబ్ ఖాన్ సల్మానీ, మొహమ్మద్ షఫీ, మొహమ్మద్ ఫజుల్‌రహీమ్, ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, కాంగ్రెస్ ఎంపీలు ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ, మొహమ్మద్ జావేద్, ఢిల్లీ ఆప్ ఎంపీ అమానతుల్లా ఖాన్, అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ తదితరులు మొత్తంగా దాదాపు 72 పిటిషన్లను వక్ఫ్ చట్టాన్ని సవాల్‌చేస్తూ దాఖలు చేయడం తెల్సిందే.

# రాష్ట్రపతిని కోర్టులు ఆదేశించలేవు

**సుప్రీంకోర్టు సూపర్ పార్లమెంట్‌గా వ్యవహరించొద్దు • ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ స్పష్టీకరణ**



న్యూఢిల్లీ: రాష్ట్రపతిని ఆదేశించే అధికారం న్యాయ వ్యవస్థకు లేదని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తేల్చిచెప్పారు. సుప్రీంకోర్టు సూపర్ పార్లమెంట్‌గా వ్యవహరించవద్దని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై సుప్రీంకోర్టు అణు క్షిపణి ప్రయోగించాలనుకోవడం సమంజసం కాదని చెప్పారు. పరిశీలన కోసం రాష్ట్ర గవర్నర్లు పంపించిన బిల్లులపై నిర్ణయం తీసుకొనే విషయంలో రాష్ట్రపతికి గడువు నిర్దేశిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలివ్వడం పట్ల జగదీప్ ధన్‌ఖడ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇది నిజంగా ఆందోళనకరమని అన్నారు. ఇలాంటి పరిణామం కోసం మనం ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకోలేదన్నారు. సుప్రీంకోర్టుకు అలాంటి ఆదేశాలిచ్చే అధికారం ఎక్కడిదని ఆక్షేపించారు. గురువారం రాజ్యసభలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థ చేయాల్సిన పనులను న్యాయ వ్యవస్థ చేయాలనుకోవడం ఏమిటని ప్రశ్నించారు. అసలు మనం ఎక్కడికి వెళ్తున్నాం? ఈ దేశంలో ఏం జరుగుతోంది? అని నిలదీశారు. ఇలాంటి రోజు ఒకటి వస్తుందని తాను ఏనాడూ ఊహించలేదన్నారు. సుప్రీంకోర్టు సూపర్ పార్లమెంట్‌గా వ్యవహరిస్తూ ఏకంగా రాష్ట్రపతికే ఆదేశాలు జారీ చేయడం సరైంది కాదన్నారు. మన ప్రజాస్వామ్య వ్యవస్థ సుప్రీంకోర్టుకు అలాంటి అధికారాలు ఇవ్వలేదని ఉద్ఘాటించారు. న్యాయ వ్యవస్థకు చట్టాలు వర్తించడం లేదని, అందుకే పారదర్శకత కనిపించడం లేదని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థ హద్దులు దాటుతోందని విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టుకు ఇచ్చిన ప్లీనరీ అధికారాలు.. నిత్యం ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రయోగించడానికి న్యూక్లియర్ మిస్సైల్‌గా మారాయని వ్యాఖ్యానించారు.

### నోట్లకట్టల ఘటనలో ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదు?

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో మార్చి 14న నోట్ల కట్టలు దొరికిన ఘటనపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని జగదీప్ ధన్‌ఖడ్ ప్రశ్నించారు. న్యాయమూర్తులు విచారణకు అతీతమా? అని ప్రశ్నించారు. వారికి అలాంటి వెసులుబాటు ఉందా? అని అడిగారు. సాధారణ పౌరుల ఇంట్లో నగదు దొరికి ఉంటే దర్యాప్తు ఎలక్ట్రానిక్ రాకెట్ వేగంతో జరిగేదని చెప్పారు. యశ్వంత్ వర్మ విషయంలో దర్యాప్తు కనీసం ఎడ్లబండి వేగంతోనూ జరగడం లేదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రత అనేది దర్యాప్తు నుంచి రక్షణ పొందడం కాకూడదని తెలిపారు.

## ఆధునిక టెక్నాలజీతో యమునా నది ప్రక్షాళన

- ఢిల్లీ అధికారులకు ప్రధాని మోదీ ఆదేశం
- ప్రజలను భాగస్వాములను చేయాలని సూచన

న్యూఢిల్లీ: కాలుష్యమయంగా మారిన యమునా నదిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిందేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ అంశంపై ఆయన గురువారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాతోపాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. నది ప్రక్షాళన కోసం చేపట్టాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్షాళన క్రతువులో ఢిల్లీ ప్రజలను తప్పనిసరిగా భాగస్వాములను చేయాలని ప్రధానమంత్రి సూచించారు. రియల్–టైమ్ డేటా, స్పేస్ టెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతికతల సాయంతో నదిని పరిశుభ్రంగా మార్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలుష్యానికి తావులేకుండా యమునా నదిలో ఛాత్ పూజలు నిర్వహించుకొనే అవకాశం కల్పించాలని అన్నారు. నది పట్ల మరింత గౌరవం పెంచేలా చూడాలన్నారు. పవిత్ర యమునతో ప్రజల అనుబంధం మరింత పెరగాలని ఆకాంక్షించారు.

# ఇంటర్వ్యూ స్లాట్లు అదృశ్యం

- మే, జూన్ నెలలకు లభించని వీసా ఇంటర్వ్యూ స్లాట్లు
- ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని చెబుతున్న విద్యార్థులు
- అమెరికా ప్రభుత్వం నుంచి స్పష్టత రాక ఆందోళన

న్యూఢిల్లీ: అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలని కలలుగంటున్న భారతీయ విద్యార్థులకు మరిన్ని షాక్‌లు తగులుతున్నాయి. అమెరికా వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ స్లాట్లు ఆన్‌లైన్ నుంచి హఠాత్తుగా అదృశ్యమైపోతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. గత 20–25 రోజుల నుంచి వీసా అపాయింట్‌మెంట్ స్లాట్లు దొరకడం గగనంగా మారిందని అంటున్నారు. ఇండియా నుంచి అమెరికా వెళ్లడానికి వేలాది మంది విద్యార్థులు ఏర్పాటు చేసుకుంటున్నారు. మరోవైపు అమెరికా విద్యా సంస్థల్లో అడ్మిషన్ల సీజన్ డెడ్‌లైన్‌కు గడువు ముంచుకొస్తోంది. నిర్దేశిత గడువులోగా వీసాలు దొరక్కపోతే అడ్మిషన్‌పై ప్రభావం పడనుంది. అమెరికా వీసా కావాలంటే ఇండియాలోని యూఎస్ ఎంబసీలు లేదా కాన్సులేట్లలో ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ ఇంటర్వ్యూల కోసం ముందుగానే ఆన్‌లైన్‌లో నగదు చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఏప్రిల్ నెలకు సంబంధించిన స్లాట్లన్నీ ఇప్పటికే బుక్ అయిపోయాయి. మే, జూన్‌కు సంబంధించిన స్లాట్లు అందుబాటులో లేవని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని చెబుతున్నారు. కారణం ఏమిటో తెలియక అయోమయానికి గురవుతున్నారు. వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్ స్లాట్ల కోసం నిత్యం వందలాది మంది ప్రయత్నిస్తున్నారు. కానీ, నిరాశే ఎదురవుతోంది. అమెరికా ఎంబసీ వీసా స్లాట్ల వ్యవస్థను అప్‌గ్రేడ్ చేస్తోందని, అందుకే ఈ సమస్య తలెత్తి ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. వీసా స్లాట్ల వ్యవస్థను ఎవరూ దుర్వినియోగం చేయకుండా, అనధికారిక వ్యక్తులు ఇందులోకి ప్రవేశించకుండా పటిష్టమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. కానీ, దీనిపై అమెరికా ప్రభుత్వం ఇంకా స్పందించకపోవడం పట్ల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికిప్పుడు వీసాలు దొరకడం కష్టం కావడంతో అమెరికా వర్సిటీల్లో అడ్మిషన్లు వాయిదా వేసుకోవాలని కొందరు విద్యార్థులు భావిస్తున్నట్లు తెలిసింది.

### భారతీయ విద్యార్థులకు సహకరిస్తాం: రణధీర్ జైశ్వాల్

అమెరికాలో భారతీయుల వీసాలు హఠాత్తుగా రద్దు చేస్తుండడం, భారతీయ పర్యాటకులను అడ్డుకోవడం, హెచ్–1బీ వీసా ఉన్నవారికి ప్రవేశం నిరాకరిస్తుండడం వంటి సమస్యలపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ గురువారం స్పందించారు. ఎఫ్–1 వీసాలను రద్దు చేస్తున్నామంటూ భారతీయ విద్యార్థులకు అమెరికా ప్రభుత్వం నుంచి సమాచారం వస్తున్నట్లు తమకు తెలిసిందని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తగిన సహకారం అందిస్తామని చెప్పారు. అమెరికాలోని భారతీయ ఎంబీసీలు, కాన్సులేట్లు మన విద్యార్థులకు సహకరించడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

## ఫొటో ఆఫ్ ది ఇయర్



హేగ్: గాజాలో ఇజ్రాయెల్ దాడిలో రెండు చేతులు పూర్తిగా కోల్పోయిన పాలస్తీనా బాలుడి ఫొటోకి ఈ ఏడాది ప్రతిష్టాత్మక వరల్డ్ ప్రెస్ ఫొటో అవార్డు దక్కింది. న్యూయార్క్ టైమ్స్‌కు చెందిన సమర్ అబూ ఎలౌఫ్ అనే పాలస్తీనా మహిళా ఫొటోగ్రాఫర్ మహ్మద్ అజ్జూర్ అనే ఈ 9 ఏళ్ల బాలుడి ఫొటో తీశారు. తనకు రెండు చేతులూ లేవన్న విషయం తెలుసుకున్న వెంటనే ఆ బాలుడు మొట్టమొదటగా 'అమ్మా, నేను నిన్నెలా కౌగిలించుకోను?'అని తనను ప్రశ్నించాడని అతడి తల్లి చెప్పడంతో తాను ఎంతో ఆవేదన చెందినట్లు సమర్ అబూ తెలిపారని వరల్డ్ ప్రెస్ ఫొటో ఆర్గనైజేషన్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. 2024 మార్చిలో ఇజ్రాయెల్ దాడి నుంచి తప్పించుకునే క్రమంలో అజ్జూర్ భుజాల దిగువ నుంచి రెండు చేతులనూ కోల్పోయాడని వివరించింది. 68వ ఎడిషన్ పోటీ కోసం మొత్తం 141 దేశాల నుంచి 3,778 మంది ఫొటోగ్రాఫర్లు పంపిన 59,320 ఎంట్రీల నుంచి ఈ ఫొటోను ఎంపిక చేశామంది. ఈ ఫొటో ఎన్నో విషయాలను చెబుతుంది. ఒక బాలుడి గురించే కాదు, తరాలపాటు ప్రభావం చూపే ఒక యుద్ధం గురించి కూడా ఈ చిత్రం చెబుతుందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జెయిన్ ఖౌరీ తెలిపారు. ఫొటో జర్నలిజం చేసిన అద్భుతం ఈ చిత్రమని జ్యూరీ చైర్ లూసీ కొంటిసెల్లో పేర్కొన్నారు.

# హార్వర్డ్ యూనివర్సిటీపై ట్రంప్ ఆంక్షలు

**విదేశీ విద్యార్థులు రాకుండా అడ్డుకుంటామని హెచ్చరిక • రాయితీ రద్దును పరిశీలిస్తామని బెదిరింపులకు దిగిన సర్కార్**

న్యూయార్క్/వాషింగ్టన్: తన మాట వినని వాళ్లను ఎలాగైనా దారికి తెచ్చుకునేందుకు తెగించే ట్రంప్ ఇప్పుడు దేశంలోని విశ్వవిద్యాలయాలనూ తన బెదిరింపులతో భయపెడుతున్నారు. అమెరికన్ యువతలో పాలస్తీనా అనుకూల భావజాలం విశ్వవిద్యాలయాల కారణంగానే వ్యాప్తిచెందుతోందని ఆరోపిస్తూ తాజాగా హార్వర్డ్ యూనివర్సిటీపై ఆంక్షల కత్తిని వేలాడదీశారు. ఇప్పటికే వర్సిటీకి రావాల్సిన 220 కోట్ల డాలర్ల నిధులను నిలిపేసిన ట్రంప్ ప్రభుత్వం తాజాగా ఈనెల చివరికల్లా వర్సిటీలోని విదేశీ విద్యార్థుల 'క్రమశిక్షణా' చర్యల రికార్డులను తమకు అందించాలని హూంకరించారు. ఈ మేరకు వర్సిటీనుద్దేశిస్తూ అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం బుధవారం ఒక ప్రకటన విడుదలచేసింది. ''ఈనెల 30వ తేదీలోపు హార్వర్డ్ వర్సిటీలోని విదేశీ విద్యార్థుల చట్టవ్యతిరేక, హింసాత్మక కార్యకలాపాలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి అందజేయాలి. అలా అందజేయలేదంటే మీ 'స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ (ఎస్ఈవీపీ)' అర్హతను మీకు మీరుగా వదులుకున్నట్లు భావిస్తాం'' అని హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ శాఖ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ పేరిట ఆ శాఖ ఒక ప్రకటన విడుదలచేసింది. విదేశీ విద్యార్థులు స్టూడెంట్ వీసా పొందేందుకు కావాల్సిన అర్హతా పత్రాల జారీకి వీలు కల్పించే సర్టిఫికేషన్ విధానాన్నే ఎస్ఈవీపీగా పేర్కొంటారు.

''ప్రైవేట్ వర్సిటీగా మీకు ఏకంగా 53.2 బిలియన్ డాలర్ల నిధులు వస్తున్నాయి. అందుకే ప్రభుత్వం నిధులు రాకున్నా మీకొచ్చే నష్టమేం లేదు. సొంతంగా నిర్వహణ ఖర్చులను సర్దుకోగలరు. అందుకే ప్రభుత్వ గ్రాంట్లకు కోత పెడుతున్నాం. ప్రభుత్వంతో చక్కటి ఆర్థిక సంబంధాలు కొనసాగించాలంటే మేం అడిగిన వివరాలు సమగ్రస్థాయిలో ఇవ్వండి. అక్రమ, హింస ఘటనల్లో పాల్గొని క్రమశిక్షణా చర్యలు ఎదుర్కొంటున్న విదేశీ విద్యార్థుల వివరాలను అందజేయండి'' అని ప్రభుత్వం ఆ ప్రకటనలో హెచ్చరించింది. 2024–25 విద్యాసంవత్సరంలో హార్వర్డ్ వర్సిటీలో 6,793 మంది విదేశీ విద్యార్థులు చేరారు. మొత్తం విద్యార్థుల్లో వీరు 27.2% మంది ఉన్నారు.

**వర్సిటీకి పన్ను మినహాయింపు హోదా రద్దు !**

వర్సిటీకి ఆర్థిక కష్టాల కడలిలోకి తోసేయాలని ట్రంప్ భావిస్తున్నారు. ఇందులోభాగంగా వర్సిటీకి ఉన్న 'పన్ను మినహాయింపు హోదా'ను రద్దుచేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగా సంబంధిత వివరాలను తమకు అందజేయాలని ఇంటర్నల్ రెవిన్యూ సర్వీస్(ఐఆర్ఎస్) విభాగాన్ని ప్రభుత్వం కోరింది. నియమాలకు అనుగుణంగా వర్సిటీ నిర్వహణ లేదని తప్పుడు కారణాలు చూపి వర్సిటీకున్న పన్ను మినహాయింపు హోదాను రద్దుచేయాలని ట్రంప్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే వర్సిటీ కోర్టును ఆశ్రయించే వీలుంది.

# పాసేజ్ పిల్లర్ ఎలా కూలింది?

• ప్రత్యేక అధికారుల బృందం పరిశీలన


పంప్‌హౌస్–3 వద్ద కాల్వ పనులను పరిశీలిస్తున్న అధికారుల బృందం

ములకలపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లిలో సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన పాసేజ్ పిల్లర్ కూలిన ఘటనపై విచారణ కోసం ప్రభుత్వం నలుగురు అధికారులతో ప్రత్యేక బృందాన్ని నియమించింది. సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) సీఈ మోహన్‌కుమార్, మైనర్ సీఈ రఘునాథరావు, క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటకృష్ణ, ఇరిగేషన్ సీఈ రమేశ్‌బాబుతో కూడిన ఈ బృందం గురువారం పిల్లర్ కూలిన ప్రదేశాన్ని పరిశీలించింది. ఆ తర్వాత పంప్‌హౌస్–2 వద్ద నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై వివరాలు సేకరించింది. ఈ సందర్భంగా కొత్త పిల్లర్ నిర్మాణంపై అధికారులు చర్చించినట్లు తెలిసింది. అనంతరం అధికారులు పంప్‌హౌస్ – 3 వద్ద కాల్వ నిర్మాణ పనులను పరిశీలించారు.

# త్వరలో ‘ఎస్‌ఎల్‌బీసీ’ పనులు పునః ప్రారంభం

• విజయవాడ టోల్‌ప్లాజాను దాటిన టీబీఎం బేరింగ్
• ఒకటిరెండు రోజుల్లో అవుట్‌లెట్ వద్దకు చేరుకునే అవకాశం
• ఈ నెలాఖరులోగా పనులు ప్రారంభించే యోచన
• ప్రమాదం నేపథ్యంలో ఇన్‌లెట్ వైపు పనులపై అనిశ్చితి


(ఫైల్)

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ(ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం తవ్వకాలు అవుట్‌లెట్ వైపు నుంచి త్వరలో పునఃప్రారంభం కానున్నాయి. అవుట్‌లెట్ వైపు నుంచి తవ్వకాలు జరుపుతున్న టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం)కు సంబంధించిన బేరింగ్, అడాప్టర్, రింగ్ బేర్ చెడిపోవడంతో 2023 జనవరి 29 నుంచి పనులు నిలిచిపోయాయి. అమెరికాకు చెందిన రాబిన్స్ కంపెనీ నుంచి బేరింగ్‌ను కొనుగోలు చేసి ప్రత్యేక నౌకలో చెన్నైకి తీసుకొచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బేరింగ్‌ను సొరంగం వద్దకు తరలిస్తున్నారు. బేరింగ్ భారీ సైజులో ఉండడంతో చెన్నై నుంచి 470 కి.మీల రోడ్డు మార్గంలో రవాణాకు చాలా సమయం పట్టింది. విజయవాడ టోల్‌ప్లాజా వద్దకు బేరింగ్ చేరుకుంది. శుక్రవారం నాటికి మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట మండలం అయ్యవారిపల్లి వద్ద ఉన్న అవుట్‌లెట్ వద్దకు చేరుకోనుందని అధికారవర్గాలు తెలిపాయి. బేరింగ్‌ను టీబీఎంకు బిగించి పరీక్షించటానికి మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది. నెలాఖరులోగా సొరంగం అవుట్‌లెట్ వైపు నుంచి తవ్వకాలను పునరుద్ధరించే అవకాశాలున్నాయి.

**ఇన్‌లెట్‌వైపు తవ్వకాలపై అనిశ్చితి**

ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టులో భాగంగా శ్రీశైలం జలాశయం నుంచి నీళ్లను 43.93 కి.మీల సొరంగ మార్గంలో తరలించి లింక్ కాల్వ ద్వారా డిండి జలాశయంలోకి పోయాల్సి ఉంది. అక్కడి నుండి నీళ్లను లింక్ కాల్వ ద్వారా 7.13 కి.మీల మరో సొరంగ మార్గంలో తరలించి మరో లింక్ కాల్వ ద్వారా పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి పోయాలి. ఇందుకోసం వరుస క్రమంలో రెండు సొరంగాలను నిర్మిస్తున్నారు. 43.93 కి.మీల తొలి సొరంగంలో ఇప్పటికే 34.71 కి.మీల మేర పనులు పూర్తికాగా, మరో 9.559 కి.మీల మేర సొరంగం తవ్వాల్సి ఉంది. ఈ సొరంగాన్ని రెండు టీబీఎంలతో రెండు వైపుల (ఇన్‌లెట్, అవుట్‌లెట్) నుంచి తవ్వుకుంటూ పోతున్నారు. శ్రీశైలం జలాశయం ఇన్‌లెట్ నుంచి 13.93 కి.మీల పనులు పూర్తి కాగా, అవతలి వైపు నుంచి మరో 20.43 కి.మీల మేర తవ్వకాలు పూర్తయ్యాయి. ఇన్‌లెట్ నుంచి 13.93 కి.మీల సొరంగంలో చివరివరకు వెళ్లిన కార్మికులపై గత ఫిబ్రవరి 22న పైకప్పు కూలడంతో 8 మంది కార్మికులు గల్లంతైన విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఇద్దరి మృతదేహాలను మాత్రమే వెలికితీయగలిగారు. ఈ ప్రమాదంలో ఇన్‌లెట్ వైపు తవ్వకాలు జరిపే టీబీఎం పూర్తిగా ధ్వంసం కావడంతో గ్యాస్ కట్టర్లతో కట్ చేసి విడిభాగాలను బయటకి తరలిస్తున్నారు. కార్మికుల భద్రత దృష్ట్యా ఇన్‌లెట్ వైపు టీబీఎంతో తవ్వకాలను కొనసాగించడం మంచిది కాదని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీనికి ప్రత్యామ్నాయంగా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ పద్ధతిలో పనులు నిర్వహించాలని భావిస్తోంది. అయితే, కేంద్ర పర్యావరణ శాఖ అనుమతిస్తేనే డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో పనులు చేపట్టేందుకు అవకాశం ఉంది.

# ఇక్రిశాట్‌లో చిక్కిన చిరుత.. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోకి


చిరుతను వదులుతున్న దృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు)/మన్ననూర్: రామచంద్రాపురం పరిధిలోని అంతర్జాతీయ మెట్ట పంటల పరిశోధన కేంద్రం (ఇక్రిశాట్)లో అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో గురువారం చిరుతపులి చిక్కింది. రామచంద్రాపురం పరిధిలోని ఇక్రిశాట్ పెద్ద చెరువు సమీపంలో పది రోజుల క్రితం చిరుత కనిపించడంతో.. సెక్యూరిటీ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ విషయాన్ని ఇక్రిశాట్ యాజమాన్యం అటవీ శాఖాధికారులకు తెలిపింది. దీంతో జిల్లా అటవీ శాఖాధికారి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో చిరుత కాలి ముద్రలను గమనించి.. బుధవారం రాత్రి రెండు బోన్లను ఏర్పాటు చేసి.. అందులో మేకలుంచారు. గురువారం తెల్లవారుజామున ఒక చిరుత బోనులో చిక్కింది. దీనిని మొదట హైదరాబాద్‌లోని జూపార్క్‌కు, అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో నల్లమల అభయారణ్యానికి తరలించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కోర్ ఏరియాలోని మన్ననూరు రేంజ్ పరిధిలో ఉన్న గుండం పరిసర ప్రాంతంలో వదిలిపెట్టారు. కాగా, ఇక్రిశాట్‌లోనే మరో చిరుత కూడా సంచరిస్తోందని పలువురు చెబుతున్నారు.

# ఆ 45 టీఎంసీలు మాకే కేటాయించాలి!

• గోదావరి జలాల మళ్లింపుతో లభ్యతలోకి వచ్చిన కృష్ణా జలాలపై తెలంగాణ వాదన
• ఏపీ తరలించే గోదావరి జలాలతో ‘కృష్ణా’ వెలుపలి ప్రాంతాల అవసరాలు కూడా తీరుతాయి
• కృష్ణా ట్రిబ్యునల్–2కు స్పష్టం చేసిన రాష్ట్రం



సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలిస్తే, అందుకు ప్రత్యామ్నాయంగా నాగార్జునసాగర్ ఎగువన ఉమ్మడి ఏపీకి లభ్యతలోకి వచ్చిన 45 టీఎంసీల కృష్ణా జలాలను తమ రాష్ట్రానికి కేటాయించాలని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2కు తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. పోలవరం ద్వారా 80 టీఎంసీలు గోదావరి జలాలు ఏపీ తరలించుకుంటే, దానికి బదులుగా కర్ణాటక, మహారాష్ట్ర 35 టీఎంసీలు, ఉమ్మడి ఏపీ 45 టీఎంసీలు కలిపి మొత్తం 80 టీఎంసీల కృష్ణా జలాలు వాడుకోవడానికి అవకాశం కల్పిస్తూ 1978 ఆగస్టు 4న గోదావరి ట్రిబ్యునల్ ఎదుట అంతర్రాష్ట్ర ఒప్పందం జరిగిన విషయాన్ని గుర్తు చేసింది. ఉమ్మడి ఏపీకి సంబంధించిన 45 టీఎంసీల కృష్ణా జలాలను తెలంగాణలోని కృష్ణా పరీవాహక ప్రాంత అవసరాలకు కేటాయించాలని కోరింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీపై విచారణ నిర్వహిస్తున్న కృష్ణా ట్రిబ్యునల్–2 ఎదుట తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ గురువారం మూడోరోజూ వాదనలు వినిపించారు. కృష్ణా బేసిన్‌కు తరలించే గోదావరి జలాల్లో ఉమ్మడి ఏపీ అవసరానికి మించి వాటాలను పొందిందని, బేసిన్ వెలుపలి ప్రాంతాలకు సైతం నీళ్లను తరలించడంతో పాటు మూడో, నాలుగో పంటలకు సైతం నీళ్లు అందిస్తోందని మహారాష్ట్ర, కర్ణాటకలు అభ్యంతరం వ్యక్తం చేసినట్టుగా.. గోదావరి ట్రిబ్యునల్ తన తీర్పులో నమోదు చేసిన అంశాన్ని తెలంగాణ ఎత్తిచూపింది. కృష్ణా పరీవాహకంలోనే నీటి కొరత ఉండగా, పరీవాహక ప్రాంతం వెలుపలి ప్రాంతాలకు ఉమ్మడి ఏపీ నీళ్లను తరలిస్తోందంటూ ఆ రాష్ట్రాలు చేసిన వాదనలను గుర్తు చేసింది. ఈ వివాదాన్ని పరిష్కరించడం కోసమే మహారాష్ట్ర, కర్ణాటకలతో ఉమ్మడి ఏపీ గోదావరి ట్రిబ్యునల్ ఎదుట ఒప్పందం చేసుకుందని స్పష్టం చేసింది. ఈ ఒప్పందం స్ఫూర్తితో తమ రాష్ట్రంలోని కృష్ణా పరీవాహక ప్రాంత అవసరాలకు ఆ 45 టీఎంసీలను కేటాయించాలని తెలంగాణ కోరింది.

**తరలింపు సామర్థ్యాన్ని 40 వేల క్యూసెక్కులకు పెంచింది**

గోదావరి నుంచి కృష్ణాకు నీటి తరలింపు సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కుల నుంచి 17,500 క్యూసెక్కులకు పెంచిన ఏపీ, ఇప్పుడు దాన్ని 40 వేల క్యూసెక్కులకు పెంచిందంటూ తెలంగాణ అభ్యంతరం తెలిపింది. పోలవరం నుంచి బనకచర్లకు నీళ్లను తరలించడానికి ఇటీవల ఏపీ ‘జలహారతి కార్పొరేషన్’ను ఏర్పాటు చేసిన విషయాన్ని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లింది. పోలవరం–బనకచర్ల అనుసంధానం, చింతలపూడి ఎత్తిపోతల నిర్మాణం, తాడిపూడి ఎత్తిపోతల విస్తరణకు ఏపీ తీసుకుంటున్న చర్యలతో ఆ రాష్ట్రంలోని కృష్ణా పరీవాహక ప్రాంత వెలుపలి అవసరాలు తీరుతాయని ట్రిబ్యునల్ దృష్టికి తెచ్చింది. కృష్ణా జలాలను పూర్తిగా కృష్ణా పరీవాహక ప్రాంత అవసరాలకే కేటాయించాలని విజ్ఞప్తి చేసింది.

# జాప్యంపై అన్నదాతల కన్నెర్ర

• ధాన్యం దిగుమతి చేసుకోలేమన్న మిల్లర్..
• తీసుకోకపోతే తగలబెడతామని రైతుల హెచ్చరిక


రైతులకు నచ్చచెబుతున్న సివిల్ సప్లయిస్ ఉద్యోగి

నేలకొండపల్లి: ఓ పక్క వర్షాలు, మరోవైపు మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోకపోవడంతో రైతులు నిరసనకు దిగారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాయగూడెం, పైనంపల్లి, బైరవునిపల్లి, నేలకొండపల్లి తదితర గ్రామాల రైతులు అమ్మిన ధాన్యాన్ని దిగుమతి చేసుకునేందుకు తిరుమలాపురంలోని రైస్ మిల్లును కేటాయించారు. దీంతో రైతులు ట్రాక్టర్లలో దాదాపు 4 వేల క్వింటాళ్ల ధాన్యంతో నాలుగు రోజుల క్రితం మిల్లు వద్దకు చేరుకోగా.. దిగుమతిలో జాప్యం జరిగింది. తీరా గురువారం.. తమ మిల్లుకు కేటాయించిన కోటా అయిపోయిందని యాజమాన్యం చెప్పడంతో.. రైతులు ధాన్యం ట్రాక్టర్లను ఖమ్మం–కోదాడ రహదారిపై అడ్డుగా పెట్టి రాస్తారోకో నిర్వహించారు. ఈమేరకు రెండువైపులా వాహనాలు నిలిచిపోగా సివిల్ సప్లయిస్ ఆర్‌ఐ నరేశ్ చేరుకుని రైతులతో చర్చించారు. మరో మిల్లు వద్దకు తీసుకెళ్లాలని సూచించగా, అక్కడ మళ్లీ నాలుగు రోజులు ఉండడం తమ వల్ల కాదని, ఒకవేళ ధాన్యం దించకపోతే ఇక్కడే తగలబెడతామని హెచ్చరించారు. దీంతో అధికారులు మిల్లు యాజమాన్యంతో చర్చించి.. తాత్కాలికంగా ధాన్యం దించేలా ఒప్పించడంతో వివాదం సద్దుమణిగింది.

# పిచ్చికుక్కల దాడి: 9 మందికి గాయాలు


చికిత్స పొందుతున్న వృద్ధురాలు

కేసముద్రం: పిచ్చికుక్కల దాడిలో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామంలో కొద్ది రోజులుగా పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. బుధ, గురు వారాల్లో గ్రామానికి చెందిన కంది పాపయ్య, కంచ కోమల, అల్లాఉద్దీన్, కుండే అనూష, కట్ల ఎల్లయ్య, మంద రవి, సారయ్య, మైబూమి, సాయిలు రోడ్డు వెంట వెళ్తుండగా.. పిచ్చి కుక్కలు వారి కాళ్లు, చేతులు, తల భాగంపై దాడి చేశాయి. ఈ దాడిలో కొందరి చెవులు తెగిపోయాయి. తీవ్రంగా గాయపడిన వారిలో కొందరు మానుకోట జనరల్ ఆస్పత్రిలో, మరికొందరు స్థానిక పీహెచ్‌సీ సెంటర్‌లో చికిత్స చేయించుకున్నారు.

# పార్ట్‌టైమ్ అధ్యాపకుల్ని క్రమబద్ధీకరించాలి

• ఎంపీ ఈటల డిమాండ్



సాక్షి, హైదరాబాద్: వివిధ యూనివర్సిటీలలో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకుల సర్వీసులను వెంటనే క్రమబద్ధీకరించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. వారికి వెంటనే ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు కొత్తగా చేపట్టే అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలలో వెయిటేజ్ కల్పించాలని ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైమ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన చలో సెక్రటేరియట్ నిరసనల్లో అరెస్టయిన పార్ట్‌టైమ్ అధ్యాపకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారి ఆందోళనలకు తమ పూర్తి మద్దతును ఈటల రాజేందర్ ప్రకటించారు.

# పుప్పాలగూడలో ఐటీ నాలెడ్జ్ హబ్

▶ మొదటి పేజీ తరువాయి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పరిశ్రమలు, రెవెన్యూ శాఖల కీలక అధికారులతో మంత్రులు సమావేశమయ్యారు. పుప్పాలగూడలో భూముల లభ్యతపై అధికారులు వివరించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్, ఐపీఎస్, రెవెన్యూ అధికారులకు కేటాయించిన భూములను సుప్రీంకోర్టు రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సొసైటీలకు కేటాయించిన భూముల పక్కనే ఇండస్ట్రియల్ కార్పొరేషన్‌కు సంబంధించిన సుమారు 250 ఎకరాల భూమి ఉందని తెలిపారు. మొత్తంగా 450 ఎకరాలు అందుబాటులో ఉందని వివరించారు. చెప్పారు. మొదటి దశలో ఏర్పాటు చేయబోతున్న ఐటీ హబ్ ద్వారా 5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని వెల్లడించారు.

**ప్రత్యామ్నాయంగానేనా..?**

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)ను అనుకుని ఉన్న 400 ఎకరాల భూమిని అభివృద్ధి చేసి 5 లక్షల మందికి ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించగా, దానిపై వివాదాలు చుట్టుముట్టిన విషయం తెలిసిందే. ఈ వివాదంపై విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు.. కంచ గచ్చిబౌలి భూముల్లో 100 ఎకరాల్లో తొలగించిన చెట్ల స్థానంలో మళ్లీ వృక్షాల పెంపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో దీనికి ప్రత్యామ్నాయంగా అత్యవసరంగా ప్రభుత్వం పుప్పాలగూడలో నాలెడ్జ్ హబ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం.

# బాండ్‌పేపర్‌పై సూసైడ్‌నోట్ రాసి..

• ఉరివేసుకుని ఎల్‌ఐసీ ఏజెంట్ ఆత్మహత్య
• సమృద్ధి జీవన్ కస్టమర్లకు అప్పులు చేసి చెల్లింపులు


వెంకన్న

జహీరాబాద్: సమృద్ధి జీవన్ సంస్థలో ఏజెంట్‌గా చేసి, డిపాజిట్లు చేసిన వారికి తిరిగి చెల్లించేందుకు అప్పులు చేసి, వాటిని తీర్చలేక ఓ ఎల్‌ఐసీ ఏజెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్.ఐ కాశీనాథ్, మృతుడి భార్య తుల్జమ్మ వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామానికి చెందిన వెంకన్న (48) గురువారం సాయంత్రం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకన్న గతంలో సమృద్ధి యోజన సంస్థలో ఏజెంట్‌గా చేశాడు. ఈ క్రమంలో ప్రజల నుంచి పెద్దమొత్తంలో బాండ్లు (డిపాజిట్లు) కట్టించాడు. సంస్థను అర్ధాంతరంగా ఎత్తివేయడంతో ప్రజల వద్ద నుంచి సేకరించిన డిపాజిట్ డబ్బులు చెల్లించేందుకు బయట అప్పులు చేశాడు. ఇందుకోసం భూమిని సైతం తాకట్టు పెట్టాడు. చేసిన అప్పుల బాధలు పెరిగిపోవడం, రుణంతీర్చే దారిలేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకన్న రాసిన సూసైడ్‌నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జహీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. కాగా, వెంకన్న పెద్ద కుమార్తె పరమేశ్వరికి వివాహం కాగా, రెండో కుమార్తె ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. కుమారుడు ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు.

**రూ.100 బాండ్ పేపర్‌పై సూసైడ్ నోట్**

ఆత్మహత్యకు పాల్పడే ముందు వెంకన్న బాండ్ పేపర్‌పై సూసైడ్ నోట్ రాశాడు. ‘టి.వెంకన్న తండ్రి అంజన్న గ్రా: అల్గోల్ అను నేను. అప్పుల బాధ భరించలేకపోతున్నాను. సమృద్ధి జీవన్ ఫౌండేషన్‌లో ఏజెంట్‌గా చేశాను. కస్టమర్లకు మొత్తం డబ్బు నేనే చెల్లించాను. దానివల్ల అప్పులు ఎక్కువై.. ఇప్పుడు ఇతరులకు అప్పుకట్టలేకపోతున్నాను. అప్పుల బాధ భరించలేక నేను సూసైడ్ చేసుకుంటున్నాను. నన్ను క్షమించండి. అప్పు ఇచ్చినవారిని క్షమాపణలు కోరకుంటున్నాను. శివుని దయతో మీకందరికి లాభం జరుగుతుంది. ఓం నమఃశివాయ’ అని రాసిపెట్టిన సూసైడ్ నోటును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# మున్నేరులో మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

• ఇటీవలే టెన్త్ పరీక్షలు రాసిన బాలురు


బెన్విత్


కిరణ్‌తేజ

ఖమ్మం అర్బన్: వారిద్దరూ ఇటీవలే ఉత్సాహంగా పదో తరగతి పరీక్షలు రాశారు. టెన్త్ వరకు వేర్వేరు పాఠశాలల్లో చదివినా.. ఇంటర్ ఒకే కళాశాలలో చదవాలని నిర్ణయించుకున్నారు. అయితే విధి వారిని బలి తీసుకుంది. ఖమ్మం జిల్లా కేంద్రంలోని మున్నేటిలో ఈతకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఖమ్మం గాంధీచౌక్‌కు చెందిన అన్నం కిరణ్‌తేజ (16), గుట్టలబజార్‌కు చెందిన కూసుపుడి బెన్విత్ (16) ఇద్దరూ వేర్వేరు పాఠశాలల్లో పదో తరగతి పూర్తిచేశారు. అయితే, క్రికెట్ మైదానంలో కలిసిన వారిద్దరూ స్నేహితులయ్యారు. రోజూలాగే గురువారం క్రికెట్ ఆడడానికి వెళ్తున్నామని చెప్పి మున్నేటిలో ఈత కొట్టడానికి వచ్చారు. అయితే, ఇద్దరికీ ఈత సరిగా రాకపోవడంతో నీటిలో మునిగిపోయినట్టు తెలిసింది. ఒడ్డున పెట్టిన సెల్‌ఫోన్ ఆధారంగా సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మొదట ఖమ్మం త్రీటౌన్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను బయటకు తీయించారని, ఆ తర్వాత ఖమ్మం అర్బన్ పోలీసుస్టేషన్ పరిధిగా తేలడంతో కేసు బదలాయించుకున్నామని సీఐ భానుప్రకాష్ తెలిపారు.

# మయన్మార్ సైబర్ ముఠాపై మరో కేసు

• టీజీసీఎస్‌బీకి ఫిర్యాదు చేసిన బాధితుడు సాయికార్తీక్
• థాయ్‌లాండ్‌లో మయన్మార్ సైబర్ ముఠాకు చిక్కిన బాధితుడు
• సొంత మిత్రుడే మోసం చేసి పంపించాడని ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: భారీ వేతనాలతో ఉద్యోగాలిస్తామని ఆశచూపి భారతీయ యువతను బలవంతంగా సైబర్ నేరాల్లోకి దింపుతున్న మయన్మార్ సైబర్ నేర ముఠాలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో మరోకేసు నమోదు చేసింది. థాయ్‌లాండ్‌లో ఓ సైబర్‌ముఠా చెర నుంచి బయటపడి ఇంటికి చేరిన వనస్థలిపురానికి చెందిన సాయికార్తీక్ ఫిర్యాదుతో టీజీసీఎస్‌బీ అధికారులు గురువారం కేసు నమోదు చేశారు.

**నమ్మించి మోసం**

రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం శారదానగర్‌కు చెందిన సాయికార్తీక్ హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసి వనస్థలిపురంలోనే ఫుడ్ ట్రక్ నిర్వహించేవాడు. అతని స్నేహితుడు ఏక్‌నాథ్ గౌడ్ థాయ్‌లాండ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్, టెలీకాలర్ జాబ్స్ ఉన్నాయని, నెలకు రూ.75 వేలు సంపాదించవచ్చని చెప్పటంతో ఉద్యోగం కోసం దరఖాస్తు చేశాడు. నాలుగు సార్లు జూమ్‌లో ఇంటర్వ్యూల తర్వాత సాయికార్తీక్ గతేడాది ఆగస్టు 9న మయన్మార్ వెళ్లాడు. అక్కడ మిలిటరీ యూనిఫామ్‌లో ఉన్న వ్యక్తులు సాయికార్తీక్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకుని, జింగ్ యువన్ కంపెనీ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ సైబర్ నేరగాళ్ల ముఠా సాయికార్తీక్‌కు క్రిప్టోకరెన్సీ మోసాలు చేసేలా శిక్షణ ఇచ్చి, ఏడాది పాటు పనిచేసేలా కాంట్రాక్ట్‌పై సంతకాలు చేయించుకున్నారు. తిరిగి ఇండియాకు వెళ్లేందుకు తన పాస్‌పోర్ట్ ఇవ్వాలని అడగ్గా, రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాయికార్తీక్‌లాగే 32 మంది జింగ్ యువన్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఈ ముఠాల అణచివేతకు గత నెలలో మయన్మార్ మిలిటరీ ఆపరేషన్ చేపట్టడంతో వీరిని ఇండియాకు పంపించేందుకు ఒప్పుకున్నారు. దీంతో ఈ నెల 11న సాయికార్తీక్ ఇండియాకు తిరిగి వచ్చాడు. తనను మోసం చేసి థాయ్‌లాండ్‌కు పంపించిన ఏక్‌నాథ్‌పై చర్యలు తీసుకోవాలని టీజీసీఎస్‌బీలో ఫిర్యాదు చేశాడు. టీజీసీఎస్‌బీ అధికారులు కేసు దర్యాప్తు చేపట్టారు.





## క్లుప్తంగా...

### కులగణనతోనే బీసీల జీవితాల్లో మార్పు

**మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్**



సాక్షి, హైదరాబాద్: కులగణనతోనే ఓబీసీల జీవితాలు మారుతాయని ఓబీసీ జాతీయ సమాఖ్య ప్రధాన సలహాదారుడు, మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కర్ణాటకలోని మైసూరులో ఓబీసీ నారాయణ గురు భవన నిర్మాణ పనులకు స్థానిక శాసనమండలి నేత బీకే హరిప్రసాద్, ఎమ్మెల్యే చిక్కమాదు అనిల్‌తో కలసి గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, 'జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగంలో ఉంది. కానీ ఎవరి జనాభా ఎంత అనేది ఇప్పటివరకు కేంద్రం బహిర్గతం చేయలేదు. తెలిస్తే ఎవరి వాటా వారు అడుగుతారని జనగణనలో కులగణన చేయటం లేదు. రాబోయే జనగణనలో అయినా కులగణన తప్పకుండా చేయాలి. అన్ని పార్టీలు కూడా దీనికి తోడ్పడాలి'అని డిమాండ్ చేశారు.

### సాయిసూర్య 'డెవలపర్స్'లో ముగిసిన ఈడీ సోదాలు

**రూ.100 కోట్ల మేర అక్రమ లావాదేవీల పత్రాలు, రూ.74 లక్షల నగదు స్వాధీనం**

సాక్షి, హైదరాబాద్: అనధికార లేఅవుట్ల ఏర్పాటుతో పాటు ఒకే ప్లాట్‌ను వేర్వేరు కస్టమర్లకు విక్రయించడం వంటి ఆరోపణలపై సురానా సంస్థకు అనుబంధంగా ఉన్న సాయిసూర్య డెవలపర్స్ కంపెనీల్లో ఈడీ అధికారులు చేపట్టిన సోదాలు ముగిశాయి. బుధవారం హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని నాలుగు ప్రాంతాల్లో సోదాలు చేపట్టినట్టు ఈడీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సోదాల్లో రూ.100 కోట్ల అక్రమ లావాదేవీలను ఈడీ గుర్తించింది. రూ.74.5 లక్షల నగదును సీజ్ చేసింది. మాదాపూర్, జూబ్లీహిల్స్, బోయిన్‌పల్లిలోని సురానా గ్రూప్ కంపెనీ చైర్మన్ నరేందర్ సురానా, ఎండీ దేవేందర్ సురానా ఇళ్లతో పాటు సాయిసూర్య డెవలపర్స్ కార్యాలయాల్లో కీలక ఆధారాలు సేకరించింది. వట్టినాగులపల్లిలో రియల్ ఎస్టేట్ వెంచర్ల పేరుతో భారీ మోసాలకు పాల్పడినట్లు గుర్తించింది. ఇన్వెస్టర్ల నుంచి వసూలు చేసిన డబ్బును షెల్ కంపెనీలకు మళ్లించినట్లు ఈడీ ఆధారాలు సేకరించింది. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్టు ఈడీ అధికారులు తెలిపారు.

### అద్దంకి దయాకర్ 'ఎమ్మెల్సీ' రద్దు చేయాలి

**మండలి చైర్మన్‌కు బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు విజ్ఞప్తి**




సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ ఎమ్మెల్సీ పదవిని రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి విజ్ఞప్తిచేశారు. కొత్తగా ఎమ్మెల్సీ అయిన అద్దంకి దయాకర్ క్రమశిక్షణ, బాధ్యతలు తెలుసుకోకుండా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ప్రధాని మోదీ, ఇతర కేంద్రమంత్రులనుద్దేశించి అసభ్య పదజాలంతో మాట్లాడిన కాంగ్రెస్ నాయకులపై పోలీసులు వెంటనే కేసులు పెట్టి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తాము చేసిన వ్యాఖ్యలకు అద్దంకి దయాకర్, అంజన్‌కుమార్ యాదవ్ క్షమాపణ చెప్పాలన్నారు. లేనిపక్షంలో బీజేపీ, బీజేవైఎం శ్రేణులు చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులకు రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వ్యక్తుల గురించి ఎలా మాట్లాడాలో తెలియకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. ప్రధాని మోదీ గురించి అనుచితంగా మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్, సోనియా గాంధీ తప్పు చేసినందున జైలుకు వెళ్లాల్సి వస్తుందనే అభద్రతతో కాంగ్రెస్ నేతలు రోడ్లెక్కి ఆందోళనలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేవైఎం శాంతియుత నిరసనలకు కనీసం రెండు నిమిషాలు కూడా అనుమతించకుండా పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు.

# గుండె ఆరోగ్యాన్ని తెలిపే 'లెక్క'!

## సరికొత్త హెల్త్ పారామీటర్‌ను తెరపైకి తెచ్చిన పరిశోధకులు

**మరింత కచ్చితత్వంతో గుండెజబ్బులను అంచనా వేయొచ్చని వెల్లడి**



**ఫిట్‌నెస్ బ్యాండ్లు లేదా స్మార్ట్ వాచీలు మన హృదయ స్పందనల్లో తేడాలను గుర్తించి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుండటం తెలిసిందే. అయితే ఓ చిన్న 'లెక్క'సాయంతో అంతకన్నా మరింత కచ్చితత్వంతో గుండె ఆరోగ్యాన్ని గుర్తించే విధానాన్ని పరిశోధకులు తాజాగా గుర్తించారు. ఇటీవల జరిగిన అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ (ఏసీసీ-2025) సమావేశంలో ఆ సరికొత్త 'పారామీటర్'ను ప్రకటించారు.**

**- సాక్షి, స్పెషల్ డెస్క్**

ఒక రోజులో ఒక వ్యక్తి వేసిన అడుగుల సంఖ్యను ఆ రోజు అతడి హృదయ స్పందనల సగటు రేటుతో భాగించడమే ఆ పారామీటర్ (చిన్న లెక్క). అలా వచ్చిన ఆ విలువను 'డైలీ హార్ట్ రేట్ పర్ స్టెప్ (డీహెచ్ఆర్‌పీఎస్)'గా పేర్కొంటున్నారు. ఒక వ్యక్తి గుండె ఆరోగ్య స్థితిని కచ్చితంగా అంచనా వేసేందుకు ఈ పారామీటర్ దోహదపడుతుందంటున్నారు పరిశోధకులు. ఒకవేళ ఈ విలువ ఎక్కువగా ఉంటే ఆ వ్యక్తిలో గుండె జబ్బులు వచ్చే ముప్పు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుందంటున్నారు. డీహెచ్ఆర్‌పీఎస్ ఉండాల్సిన దానికంటే గుండె స్పందనలు ఎక్కువగా ఉన్నా లేదా మరీ తక్కువగా ఉన్నా కూడా గుండె ఆరోగ్యం బాగోలేదనడానికి సూచిక అని చెబుతున్నారు. సుమారు 7 వేల మందికి సంబంధించిన 58 లక్షల పర్సన్–డేస్, వారు నడిచిన 5,100 కోట్ల అడుగులను విశ్లేషించి ఈ విషయాన్ని వారు చెప్పారు. అయితే ఇవి కేవలం మొదట చేసిన ఓ అధ్యయన ఫలితాలతో వెల్లడైన అంశాలేనని.. వాటిని పూర్తి రోగ నిర్ధారణగా చెప్పడానికి మరిన్ని పరిశోధనలు అవసరమని పరిశోధకులు పేర్కొంటున్నారు. అయితే వాటన్నింటిలోనూ ఇదే విషయం నిర్ధారణ అయితే భవిష్యత్తులో గుండె పరీక్షలకు దీన్నే ఓ ప్రామాణిక పారామీటర్‌గా తీసుకొనే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

### ఏమిటీ పారామీటర్?


### డీహెచ్ఆర్‌పీఎస్ ఎక్కువగా ఉంటే రాబోయే అనారోగ్య సమస్యలు ఇలా..

- టైప్–2 డయాబెటిస్ ముప్పు 2 రెట్లు ఎక్కువ
- గుండె వైఫల్యం ముప్పు 1.7 రెట్లు ఎక్కువ
- అధిక రక్తపోటు ముప్పు 1.6 రెట్లు ఎక్కువ
- కరొనరీ ఆర్టరీ డిసీజ్ ముప్పు 1.4 రెట్లు ఎక్కువ

# బంధాలపై కత్తి వేటు

### కుటుంబ సభ్యులపైనే పగ..ప్రతీకారాలు

- నిర్భయంగా.. కిరాతకంగా హత్యలు చేస్తున్న వైనం
- ఆస్తి, డ్రగ్స్, ప్రేమ, వివాహేతర సంబంధాలే కారణాలు
- పరిష్కరించుకొనే మార్గాలున్నా విపరీత ప్రవర్తన
- సొంత కుటుంబాలనే చిదిమేసుకుంటున్న వ్యక్తులు
- మూఢ నమ్మకాలతో ఏడు నెలల కూతురిని చంపిన తల్లికి ఈ నెల 11న మరణశిక్ష విధించిన సూర్యాపేట జిల్లా కోర్టు



సాక్షి, హైదరాబాద్: ఒకరిది ప్రతీకారేచ్ఛ..మరొకరిది ఆస్తుల కోసం ఆరాటం. కారణమేదైనా కొందరి విపరీత ప్రవర్తన కుటుంబ బంధాలు, అనుబంధాలను చిన్నాభిన్నం చేస్తోంది. మూఢ నమ్మకాలతో కన్నతల్లే నెలల పసికందును చంపిన ఘటన ఒకటైతే.. తోబుట్టువులే ఒకరిపై ఒకరు కత్తులు దూసుకున్న సంఘటన మరోటి.. ప్రేమపేరుతో మరికొందరు ఉన్మాదులై స్వైరవిహారం చేస్తున్నారు. వివాహేతర సంబంధాలతో ఇంకొందరు కుటుంబాలను చిదిమేసుకుంటున్నారు.

- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో 2025 మార్చి 27న జరిగిన ఒక దారుణ ఘటనలో రజిత తన ముగ్గురు పిల్లలను విషంఇచ్చి చంపినట్టు పోలీసులు తేల్చారు. ఈ హత్యల వెనుక వివాహేతర సంబంధం కారణమని విచారణలో తేలింది. జీవితం మొత్తం జైలుపాలవుతామని తెలిసినా వీసమెత్తు భయం లేకుండా నడిరోడ్లపైనే విపరీత చర్యలకు పూనుకుంటున్నారు. ఇందుకు కారణాలేంటి? ఎందుకు ఈ విపరీత ప్రవర్తన పెరుగుతోంది? సున్నితమైన ఈ అంశాలపై లోతైన చర్చ జరగాల్సిన అవసరముంది.
- మూఢ నమ్మకాల పేరుతో 2021 ఏప్రిల్‌లో మోతె మండలం మేకలపాటి తండాలో తన ఏడు నెలల కూతురిని చంపిన కేసులో తల్లి బాణోతు భారతికి సూర్యాపేట జిల్లా కోర్టు ఉరిశిక్ష విధిస్తూ ఈ నెల 11న సంచలన తీర్పు వెలువరించింది. ఈ తీర్పుతో కుటుంబ బంధాలపై కత్తివేటు వేస్తున్న ఘటనలపై మరోమారు చర్చ మొదలైంది.

#### ఆస్తుల కోసం హత్యలు

- మద్యపానం..జూదం..ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి వ్యసనాలకు బానిసలవుతున్న కొందరు యువకులు.. డబ్బు, వారసత్వ ఆస్తుల కోసం కుటుంబ సభ్యులనే హతమారుస్తున్నారు. ఆ తర్వాత జరిగే పరిణామాలను పట్టించుకోవటం లేదు.
- ఆస్తిలో వాటా ఇవ్వడం లేదని హైదరాబాద్‌లో వెలిజ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ చంద్రశేఖర జనార్దన్‌రావును ఆయన మనుమడు కిలారు కార్తి తేజ గత నెలలో 72 సార్లు కత్తితో పొడిచి చంపాడు.
- ఆస్తి కోసం సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో కన్నతల్లి రాధికను కొడుకు కార్తీక్ కత్తితో ఎనిమిదిసార్లు పొడిచి హత్య చేశాడు.

#### విపరీత ప్రవర్తనను ముందే పసిగట్టాలి

ఏ వ్యక్తి గురించైనా వారి కుటుంబ సభ్యులకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదు. పుట్టినప్పటి నుంచి వారి ప్రవర్తనను గమనించే అవకాశం తల్లిదండ్రులు, తోబుట్టువులకే ఎక్కువగా ఉంటుంది. ఎవరైనా చిన్ననాటి నుంచే విపరీత ప్రవర్తనను కలిగి ఉండడం..చెడు వ్యసనాలకు బానిసలవుతున్నట్టు గమనిస్తే..వారి వయస్సును బట్టి మందలించడం..దండించడం..ప్రతిసారి దూషిస్తూ..ఎదుటివారి ముందు తక్కువ చేసి మాట్లాడం పక్కన పెట్టి..ఎందుకు ఆ ప్రవర్తన కలిగి ఉంటున్నారు అన్నది మూలాల నుంచి గమనించే ప్రయత్నం చేయాలి. అవసరం మేరకు వారికి మానసిక వైద్యులతో చికిత్స అందించడం...లేదంటే కౌన్సెలింగ్ ఇప్పించడం వంటి మార్గాలను ఎంచుకోవాలి. కుటుంబ సభ్యుల పట్ల పగ, ద్వేషం పెరుగుతున్నట్టు గమనిస్తే వెంటనే తగినంత సమయాన్ని వారికి కేటాయించి..వారి ఇబ్బందులు ఏంటి..అందుకు కుటుంబ పరంగా ఎలాంటి సహకారం అవసరమన్నది గమనించి అందుకు తగ్గట్టుగానే చర్యలు తీసుకోవాలి.

#### ఈ తరహా ఘటనలు మరికొన్ని..

- హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో లక్ష్మి తన వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నారన్న అక్కసుతో తల్లి సుశీల, అక్క జ్ఞానేశ్వరిలను ప్రియుడితో హత్య చేయించింది.
- జనవరిలో రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురుమూర్తి భార్యను హత్యచేసి ముక్కలుగా నరికి ఉడకబెట్టిన ఘటన సంచలనంగా మారింది.
- ఫిబ్రవరిలో కాప్రా పరిధిలో మొగిలిని అతడి కుమారుడు సాయికుమార్ నడిరోడ్డుపై కత్తితో నరికి చంపాడు.

### చట్టాలపై అవగాహన పెంచాలి

చట్టాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చన్న విషయాన్ని కొందరు పట్టించుకోవటం లేదు. కారణం ఏదైనా తప్పు చేస్తే చట్టం నుంచి తప్పించుకోలేరు అన్నది మరవొద్దు. హత్యలు చేసిన నిందితులు విలువైన జీవితం కోల్పోవడంతోపాటు కుటుంబాన్ని ఇబ్బందుల పాలు చేసినట్టు అవుతుంది. నేరం చేస్తే ఎదురయ్యే పరిణామాలను ప్రజలకు తెలియజెప్పాలి.

-పెందోట శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాది

### పక్కా ప్రణాళికతో చేసే హత్యలివి



ఇలాంటి హత్యలన్నీ పక్కా ప్రణాళికతో చేసేవే. క్షణికావేశంలో చేస్తున్నవి కాదు. ఇటీవల జరిగిన ఏ ఘటనను క్షుణ్ణంగా పరిశీలించినా ఇది అర్థం అవుతుంది. ఇది ఒక రకమైన పర్సనాలిటీ డిజార్డర్. ఇలాంటి వ్యక్తుల ప్రవర్తన చిన్ననాటి నుంచే విపరీతంగా ఉంటుంది. సకాలంలో గుర్తించి సరైన వైద్యం, కౌన్సెలింగ్ చేయిస్తే ఫలితం ఉంటుంది. అలా కాకుండా వారిని మార్చేందుకు ఆంక్షలు పెట్టడం, నిందిస్తూ మాట్లాడితే చివరకు కుటుంబ సభ్యులపై కక్ష పెంచుకుంటారు. అదును కోసం ఎదురు చూసి హత మార్చేందుకు సిద్ధమవుతారు.

- డా.సి.వీరేందర్, సైకాలజిస్ట్

# ఇద్దరు కొడుకుల గొంతుకోసి చంపి.. తల్లి ఆత్మహత్య

### గాజులరామారం బాలాజీ లేఅవుట్‌లో ఘటన

- తేజస్విని మానసిక పరిస్థితి సరిగ్గా లేదంటున్న స్థానికులు
- కొడుకుల కంటి సమస్యలను తట్టుకోలేక చంపానంటూ లేఖ



హర్షిత్‌రెడ్డి



ఆశిష్‌రెడ్డి



తేజస్విని

జీడిమెట్ల: కడుపున పుట్టిన ఇద్దరు కొడుకుల గొంతుకోసి చంపింది ఓ తల్లి. ఆపై తను కూడా అపార్ట్‌మెంట్‌లోని 5వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామారంలోని బాలాజీ లేఅవుట్‌లో చోటు చేసుకుంది. బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పరిధిలోని చోడవరం గ్రామానికి చెందిన గాంధ్ర వెంకటేశ్వరరెడ్డి భార్య తేజస్విని(35), ఇద్దరు కుమారులు ఆశిష్‌రెడ్డి(7), హర్షిత్‌రెడ్డి(5)లతో కలిసి బాలాజీ లేఅవుట్‌లోని సహస్ర మహేష్ హెయిట్స్ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌నంబర్ 204లో ఉంటున్నారు. వెంకటేశ్వరరెడ్డి బొంతపల్లిలోని ఓ పరిశ్రమలో నాలుగేళ్లుగా పనిచేస్తున్నాడు. పిల్లలిద్దరూ స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో 1వ తరగతి, నర్సరీ చదువుతున్నారు. గురువారం ఉదయం వెంకటేశ్వరరెడ్డి డ్యూటీకి వెళ్లగా, ఇంట్లో తేజస్విని, పిల్లలు ఉన్నారు. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో తేజస్విని అపార్ట్‌మెంట్ పైనుంచి దూకడంతో పెద్ద శబ్దం వచ్చింది. ఇది విన్న అపార్ట్‌మెంట్ వారు వెళ్లి చూడగా, తేజస్విని అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. వెంటనే అపార్ట్‌మెంట్ వాసులు సెకండ్ ఫ్లోర్‌లోని తేజస్విని ఇంట్లోకి వెళ్లి చూడగా, కిచెన్‌లో ఆశిష్‌రెడ్డి అప్పటికే మృతి చెంది రక్తపుమడుగులో పడి ఉండగా, హర్షిత్‌రెడ్డి కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నాడు. వెంటనే అపార్ట్‌మెంట్ వారు హర్షిత్‌ను షాపూర్‌నగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. సంఘటన జరిగిన పరిసరాలను పరిశీలిస్తే...తేజస్విని తన ఇద్దరు కొడుకులను విచక్షణారహితంగా చంపినట్టు ఉందని స్థానికులు చెప్పారు. విషయం తెలుసుకొని సంఘటన స్థలానికి వచ్చిన బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్, అడిషనల్ డీసీపీ హన్మంత్‌రావు, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్‌లు వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### 8 పేజీల లేఖ స్వాధీనం

తేజస్విని ఉంటున్న ఫ్లాట్‌లో పోలీసులకు 8 పేజీల ఓ లేఖ దొరికింది. అందులో తన ఇద్దరు పిల్లలకు కంటి సమస్య ఉందని, రెండు గంటలకు ఒకసారి కంట్లో మందు వేయకుంటే పిల్లలు నొప్పితో ఏడుస్తారని...దేవుడా నా పిల్లలకు ఎందుకు ఇంత బాధను ఇచ్చావు అని రాసి ఉంది. తనను అందరూ పిచ్చిది అంటున్నారని, ఆ మాటలు భరించలేకపోతున్నానంటూ ఆ లేఖలో పేర్కొంది. కాగా తేజస్విని మానసిక పరిస్థితి సరిగ్గా లేదని, అపార్ట్‌మెంట్‌లోనూ ఎవరితో మాట్లాడదని స్థానికులు అంటున్నారు.

# పంట వ్యర్థాలతో బయో గ్యాస్

- 15 ప్లాంట్ల ఏర్పాటుకు జీపీఎస్ సంస్థ సంసిద్ధత
- మంత్రి తుమ్మలకు ప్రాజెక్ట్ వివరాల అందజేత
- 3,000 మందికి ఉద్యోగ అవకాశాలు... ఏటా 7.5 లక్షల టన్నుల వరిగడ్డి వినియోగం
- రోజూ 225 టన్నుల బయో గ్యాస్ ఉత్పత్తి
- ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వ సహకారం: మంత్రి తుమ్మల





సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయ వ్యర్థాలతో కంప్రెస్డ్ బయోగ్యాస్ (జీబీసీ) ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు జీపీఎస్ రెన్యువబుల్స్ ఆర్య అనే సంస్థ ముందుకొచ్చింది. వివిధ జిల్లాల్లో 15 ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రతిపాదనలు సమర్పించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు వెల్లడించింది. ఒక్కో ప్లాంటు 15 టన్నుల రోజువారీ ఉత్పత్తి సామర్థ్యంతో, మొత్తం 225 టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో నెలకొల్పుతామని ప్రతిపాదించింది.

#### 15 జిల్లాల్లో ప్లాంట్లు

జీబీసీ ప్లాంట్లను మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి, వనపర్తి, మహబూబ్‌నగర్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఒక్కో ప్లాంటు ఏర్పాటుకు 20 ఎకరాల భూమి అవసరం అవుతుందని.. వరిగడ్డి, నాపియర్ గడ్డిని నిల్వ చేయడానికి మరో 25 ఎకరాలు అవసరమని తేల్చారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లభిస్తే 18 నెలల్లోనే ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తిచేస్తామని కంపెనీ ప్రతినిధులు మంత్రికి తెలిపారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు, దాదాపు 3,000 మంది గ్రామీణ యువతకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు.

#### ఏటా 7.5 లక్షల మెట్రిక్ టన్నుల గడ్డి వినియోగం

ఈ ప్రాజెక్టు కోసం ఏటా సుమారు 7.5 లక్షల మెట్రిక్ టన్నుల వరిగడ్డి వినియోగించబడుతుంది. దీని ద్వారా ఏటా 82,125 మెట్రిక్ టన్నుల సీబీజీ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. ఇది సుమారు 57.84 లక్షల గృహ వినియోగ వంటగ్యాస్ సిలిండర్లకు సమానం. దీంతోపాటు మూడు లక్షల మెట్రిక్ టన్నుల సేంద్రియ ఎరువు కూడా ఉత్పత్తి అవుతుంది. దీనివల్ల సేంద్రియ వ్యవసాయానికి బలమైన తోడ్పాటు లభిస్తుంది. 17.2 లక్షల మెట్రిక్ టన్నుల గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను తగ్గించటానికి వీలవుతుంది.

### పంట వ్యర్థాలతో రైతులకు ఆదాయం

బయోగ్యాస్ ప్రాజెక్టు గురించి జీపీఎస్ సంస్థ ఇచ్చిన ప్రజెంటేషన్ చూసిన అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిలో పునరుత్పాదక ఇంధన రంగం కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఒక ఎకరా పొలంలో వరి పంట కోసిన తర్వాత 20 నుంచి 25 క్వింటాళ్ల వరి కొయ్య, గడ్డి ఉత్పత్తి అవుతుందని, ఒక ఎకరాలో పత్తి ఏరిన తర్వాత 20 క్వింటాళ్ల పత్తి కట్టె, పంట అవశేషాలు మిగిలిపోతాయని తెలిపారు. వీటిని రైతులు కాల్చివేస్తే కాలుష్యం పెరగటమే కాకుండా.. నేలలో ఉండే సూక్ష్మజీవులు, వానపాములు, మిత్రపురుగులు చనిపోయి నష్టం జరుగుతుందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో వ్యవసాయ వ్యర్థాలే రైతులకు ఆదాయ మార్గంగా మారే రోజులు రావడం శుభపరిణామం అని అన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.



బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డా.జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యులు శివాది ప్రవీణ, డా.బి.కిశోర్

# కొలువుదీరిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

- చైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యులుగా శివాది ప్రవీణ, బి.కిశోర్ బాధ్యతల స్వీకారం
- కేసులను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం
- జస్టిస్ షమీమ్ అక్తర్

సిటీ కోర్టులు: నూతనంగా నియమితులైన తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డా.జస్టిస్ షమీమ్ అక్తర్ (తెలంగాణ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి), సభ్యులు శివాది ప్రవీణ (రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తి), డా.బి.కిశోర్ (రిటైర్డ్ ఐఏఎస్) గురువారం బాధ్యతలు స్వీకరించారు. మొదటిరోజునే కమిషన్ 300 పాత కేసులను పరిశీలించింది. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడమే కాకుండా మానవ హక్కులను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధ్యతలు తీసుకున్న మొదటి రోజు నుంచే తమ సభ్యులతో కలసి కేసులపై విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులే కాకుండా ఇకముందు దాఖలు అయ్యే కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించి మానవ హక్కులను కాపాడేందుకు బాధ్యతగా పనిచేస్తామని పేర్కొన్నారు.



ఆలయ విస్తరణ పనుల మ్యాప్ పరిశీలిస్తున్న దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

# రాజన్న ఆలయ విస్తరణకు తొలి అడుగు

- పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, ప్రభుత్వ విప్
- జూన్‌లో పనులు ప్రారంభించాలని ప్రాథమిక అంచనా

వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనుల కోసం రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, వీటీడీఏ వైస్‌చైర్మన్, జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూలు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాజన్న, భీమేశ్వర ఆలయాలు, ప్రధానవీధి, ఆలయ పరిసరాలు, పార్కింగ్, భక్తుల రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, నిర్మాణాల ప్రణాళికలపై అధికారులు సమీక్షించారు. శైలజారామయ్యర్ మాట్లాడుతూ, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆగమశాస్త్రం, వాస్తు అంశాలను దృష్టిలో పెట్టుకుని ఆలయాన్ని పునర్‌నిర్మించాలని కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ రాజన్న ఆలయ విస్తరణకు ప్రభుత్వం రూ.76 కోట్లు, అన్నదాన సత్రానికి రూ.35 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని రోడ్ల విస్తరణ పనులకు రూ.47 కోట్లు మంజూరు చేసిందన్నారు. అన్నదాన సత్రం నిర్మాణ పనులకు టెండర్ పూర్తి చేసినట్లు తెలిపారు. శృంగేరి పీఠాధిపతుల అనుమతితో ఆలయ అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. జూన్‌లో ఆలయ పునర్‌నిర్మాణం పనులు ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు.

**అధికారులకు సూచనలు..:** భీమేశ్వరాలయంలో దర్శనం కల్పించే స్థలాలను అధికారుల బృందం గురువారం పరిశీలించింది. ఆలయ ఆవరణలో కల్యాణమండపం, అభిషేక మండపం, కోడె కట్టుట, క్యూలైన్, ఆర్జిత సేవల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలుసూచనలు చేశారు. స్థపతి వల్లినాయగం, ఆర్కిటెక్ సత్యనారాయణ, ఈవో వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెరగనున్న రాత్రి, పగటి ఉష్ణోగ్రతలు

- మరో మూడురోజులు అనేక జిల్లాల్లో మోస్తరు వర్షాలు
- రైతులకు వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం అధిపతి సూచనలు



సాక్షి, హైదరాబాద్: రానున్న ఐదు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలతోపాటు రాత్రి ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా పెరుగుతాయని, మూడురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ పి.లీలారాణి రాష్ట్ర రైతాంగానికి సూచించారు. శుక్రవారం నుంచి మంగళవారం వరకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలతో బులెటిన్‌ను గురువారం విడుదల చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. గడిచిన మూడు రోజుల్లో రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పగటి ఉష్ణోగ్రతలు 36 నుంచి 42 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 18 నుంచి 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం సమాచారం ప్రకారం వచ్చే ఐదు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 37 నుంచి 43 డిగ్రీల సెల్సియస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 25 నుంచి 31 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు కావొచ్చు.

- శుక్రవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు (గాలి వేగం గంటకు 30–40 కి.మీ.)తో కూడిన వర్షాలు కురిసే సూచనలున్నాయి.
- శనివారం కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు (గాలి వేగం గంటకు 30–40 కి.మీ.)తో కూడిన వర్షాలు కురిసే సూచనలున్నాయి.
- ఆదివారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు (గాలి వేగం గంటకు 30–40 కి.మీ.)తో కూడిన వర్షాలు కురిసే సూచనలున్నాయి.

రైతులకు వాతావరణ సూచనలు, సలహాలు - సాక్షి ప్లస్‌లో

## 19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల జూలై కోటా విడుదల



**తిరుమల:** తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలకు సంబంధించి సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన జూలై నెల కోటాను ఏప్రిల్ 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల లక్కీ డిప్ రిజిస్ట్రేషన్ కోసం ఏప్రిల్ 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. లక్కీ డిప్ ద్వారా ఈ టికెట్లు పొందిన భక్తులు ఏప్రిల్ 21–23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల జూలై నెల కోటాను 22న ఉదయం 10 గంటలకు, వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్ల జూలై కోటాను మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. జూలై నెల అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్ట్ టికెట్ల జూన్ నెల ఆన్‌లైన్ కోటాను ఉదయం 11 గంటలకు విడుదల చేయనుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారికి దర్శనం టోకెన్ల జూలై కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**24న ఎస్‌ఈడీ కోటా విడుదల**

జూలై నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన (ఎస్‌ఈడీ) టికెట్ల కోటాను ఈనెల 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. తిరుమల, తిరుపతిలలో జూలై నెల గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే ఆయా టికెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ కోరింది.

## ప్రేమ పెళ్లి చేసుకున్న వారికి రక్షణ తప్పనిసరి కాదు

**అలహాబాద్ హైకోర్టు**

**అలహాబాద్:** తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా ప్రేమ వివాహం చేసుకునే జంటలకు రక్షణ... హక్కు కాదని అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యానించింది. వారి ప్రాణాలను నిజంగా ముప్పు ఉంటేనే రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులకు ఉంటుందని వ్యాఖ్యానించింది. వారిద్దరూ ఒకరికొకరు అండగా నిలుస్తూ సమాజాన్ని ఎదుర్కోవడం నేర్చుకోవాలని సూచించింది. రక్షణ కోరుతూ శ్రేయా కేసర్వానీ, ఆమె భర్త దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ సౌరభ్ శ్రీవాస్తవ ఈ మేరకు తీర్పు వెలువరించారు. పిటిషనర్లకు ఎలాంటి ముప్పు లేదన్న కోర్టు.. వారి పిటిషన్‌ను కొట్టివేసింది. లతాసింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీ, మరో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో వారికి పోలీసు రక్షణ అవసరం లేదని తేల్చి చెప్పింది. కోర్టులున్నది తమ ఇష్టానుసారం పెళ్లి చేసుకుని, పారిపోయిన యువతకు రక్షణ కల్పించడానికి కాదని వ్యాఖ్యానించింది. వారి ప్రాణాలకు, స్వేచ్ఛకు ప్రమాదం పొంచి ఉందనడానికి ఎలాంటి ఆధారాలు, కారణాలు లేవని కోర్టు అభిప్రాయపడింది. పిటిషనర్ల బంధువులు వారిపై శారీరక లేదా మానసిక దాడికి పాల్పడే అవకాశం ఉందనడానికి ఒక్క ఆధారం కూడా లేదని పేర్కొంది. వారు ఇప్పటికే చిత్రకూట్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ)కి వినతిపత్రం సమర్పించారని పేర్కొన్న కోర్టు, నిజంగానే బెదిరిస్తున్నారని పోలీసులు భావిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని పేర్కొంది.

# ప్రాజెక్టు వర్క్‌కే ప్రాధాన్యం

**ఇకపై నైపుణ్యం ఉంటేనే 'డిగ్రీ'**


- కంప్యూటర్ కోర్సులైతే మరింత కఠినం
- బీకాంలోనూ ప్రాజెక్టు వర్క్..
- థియరీ ఒక్కటే పాస్ అయితే కుదరదు
- ప్రాజెక్టు వర్క్‌కు 25 మార్కులు...
- మిడ్ టర్మ్‌కు 25 మార్కులు
- వచ్చే ఏడాది నుంచి మారనున్న పరీక్షల విధానం
- ప్రముఖ కంపెనీలతో ఎంవోయూ తప్పనిసరి
- సిలబస్, పరీక్షల విధానంలో మార్పులకు సర్కారు గ్రీన్ సిగ్నల్!



**సాక్షి, హైదరాబాద్:** వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ పరీక్షల విధానం పూర్తిగా మారబోతోంది. విద్యార్థుల నైపుణ్యానికే పెద్ద పీట వేయనున్నారు. థియరీతో సమానంగా వ్యక్తిగత నైపుణ్యాన్ని ప్రతిభకు కొలమానంగా పరిగణించాలని ఉన్నత విద్యా మండలి అధికారులు నిర్ణయించారు. డిగ్రీ విద్యార్థి ఇక నుంచి గుర్తింపు పొందిన సంస్థ ద్వారా విధిగా ప్రాజెక్టు వర్క్ చేయాల్సి ఉంటుంది. అదే విధంగా మిడ్ టర్మ్ పరీక్షల్లోనూ విద్యార్థి నైపుణ్యాలు, కాలేజీకి హాజరయ్యే రోజులు, కాలేజీలో పాల్గొనే గ్రూపు డిస్కషన్ వంటి అంశాలను ప్రాతిపదికగా తీసుకుని మూల్యాంకనం నిర్వహిస్తారు. ఈ దిశగా ఉన్నత విద్యా మండలి ఇటీవల వీసీల సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాలను ప్రభుత్వ ఆమోదం కోసం పంపింది. తాజాగా ప్రభుత్వం కూడా ఈ మార్పులకు అనుమతి తెలిపినట్టు అధికార వర్గాలు చెప్పాయి. త్వరలో ఈ మార్పులపై మండలి నేతృత్వంలో తుది నిర్ణయానికి రానున్నారని తెలుస్తోంది.

**సీరియస్‌గా ఉంటేనే సక్సెస్..**

ఇప్పటి వరకూ డిగ్రీ సబ్జెక్టుల్లో థియరీకి 80 మార్కులున్నాయి. అంతర్గత మార్కులు 20 ఇస్తున్నారు. ఇంటర్నల్స్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ గరిష్టంగా వేస్తారు. దీనికి పెద్దగా ప్రామాణికం లేదు. ఇంకో 15 మార్కుల కోసం ఒక్క ప్రశ్నకు సమాధానం రాసినా విద్యార్థి పాసయ్యే పరిస్థితి ఉంది. దీనివల్ల డిగ్రీ కోర్సుల్లో పెద్దగా నాణ్యత ఉండటం లేదని విమర్శలు ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థికి చదివే దశలోనే నైపుణ్యం అలవడే విధానాన్ని తీసుకొస్తున్నారు. దీని ప్రకారం డిగ్రీలో ప్రతీ సంవత్సరం విద్యార్థి విధిగా ప్రాజెక్టు వర్క్ చేయాలి. అదీ కూడా ఆయా యూనివర్సిటీలు సూచించిన సంస్థల నుంచే చేయాలి. ప్రాజెక్టు వర్క్ 25 మార్కులకు ఉంటుంది. అదే విధంగా విద్యార్థికి సంబంధించి నిరంతర మూల్యాంకన విధానం చేపడతారు. మిడ్ టర్మ్‌లో ఈ మార్కులు గరిష్టంగా 25 వరకూ కలుస్తాయి. విద్యార్థి హాజరు, సెమినార్లు, కమ్యూనికేషన్‌స్కిల్స్, ఇతరత్రా ప్రతిభ అంశాల ఆధారంగా ఈ మార్కులు వేస్తారు. వీటిల్లో విద్యార్థి 35 శాతం మార్కులు తెచ్చుకోవాలి. అంటే, విద్యార్థి డిగ్రీలో ఏదో ఒక నైపుణ్యం పొందకపోతే పట్టా రావడం కష్టమే. ఇక థియరీ పరీక్ష 50 మార్కులకు నిర్వహిస్తారు.




**ఏ కోర్సు అయినా..**

డిగ్రీలో ఇప్పుడు అనేక కొత్త కోర్సులు వచ్చాయి. ఆర్ట్స్ నేపథ్యం ఉన్న విద్యార్థులు కూడా కంప్యూటర్ కోర్సులు చేసే అవకాశం ఉంది. బీకాంలో కంప్యూటర్ కోర్సులను అనుసంధానం చేశారు. ఏ కోర్సు చదివే విద్యార్థులయినా ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు నేర్చుకునేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. 2025–26 విద్యా సంవత్సరం నుంచి ప్రతీ కోర్సులో 20 శాతం సిలబస్ మారబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను కూడా ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా కోర్సుల్లో పలు రకాల ప్రాజెక్టు వర్క్‌లను రూపొందించాలని అధికారులు నిర్ణయించారు. ఉదాహరణకు డేటాసైన్స్, ఏఐఎంఎల్, సైబర్ సెక్యూరిటీతో డిగ్రీ చేసే కంప్యూటర్ కోర్సుల విద్యార్థులు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ప్రాజెక్టు వర్క్ చేయాలి. అక్కడ కోడింగ్ నేర్చుకోవాలి. దీనికి ఆయా సంస్థలతో డిగ్రీ కాలేజీలు అవగాహన ఒప్పందం చేసుకోవాలి. అలాంటి వాటికే యూనివర్సిటీలు అనుబంధ గుర్తింపును ఇస్తాయి. అదే విధంగా బీకాం చేసే విద్యార్థులు డేటా అనాలసిస్, ఆడిట్ కంపెనీల భాగస్వామ్యంతో ప్రాజెక్టు వర్క్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది. సాధారణ సంప్రదాయ బీకాం కోర్సుల విద్యార్థులకు కూడా సామాజిక సంస్థలతో కలసి ప్రాజెక్టు వర్క్ చేసే విధానాన్ని తీసుకురాబోతున్నారు.

## తొడగొట్టి.. తోక ముడిచారు!

# సవాల్ విసిరి పరార్

**గోశాలకు రావాలంటూ సవాల్ చేసి పోలీసులతో అడ్డుకున్న కూటమి నేతలు**

**గోశాలకు వెళ్లకుండా ఆంక్షలు: భూమనపై కేసు**

**సాక్షి ప్రతినిధి, తిరుపతి:** గోవుల మరణాలను నిరూపించాలంటూ సవాల్ విసిరిన టీడీపీ సత్తా లేక తోక ముడిచింది. సవాల్‌ను స్వీకరించే ధైర్యం లేక వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసుల ద్వారా అడుగడుగునా అడ్డుకుని గృహ నిర్బంధంలోకి తీసుకుంది. ఒకపక్క వారిని పోలీసులతో అడ్డుకుంటూ మరోపక్క గోశాల వద్దకు రావడం లేదంటూ కూటమి నేతలు పథకం ప్రకారం అనుకూల మీడియాలో దుష్ప్రచారం చేయించారు. రోజంతా పోలీసుల ద్వారా హైడ్రామా నడిపించారు. గురువారం తిరుపతిలో టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి నివాసం వద్ద భారీ ఎత్తున పోలీసులను మోహరించి బయటకు రాకుండా అడ్డుకున్నారు. గోశాల వద్దకు వెళ్లిన తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, తిరుపతి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త భూమన అభినయరెడ్డిని పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. వైఎస్సార్ సీపీపై బురద చల్లాలని యత్నించిన కూటమి పార్టీల నేతలు అబాసుపాలయ్యారని తిరుపతిలో వారం రోజులుగా జరుగుతున్న వ్యవహారాలను ప్రత్యక్షంగా గమనిస్తున్న స్థానికులు చర్చించుకుంటున్నారు.

**కునుకు లేని కూటమి నేతలు..**

టీటీడీ గోశాలలో గోవుల మరణాలపై టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి భూమన కరుణాకరరెడ్డి బయటపెట్టిన సంచలన నిజాలు కూటమి నేతలకు కునుకు లేకుండా చేస్తున్నాయి. గోవుల మృతి ఘటనను కప్పిపుచ్చుకునేందుకు వారం రోజులుగా చేస్తున్న ప్రయత్నాలన్నీ బెడిసికొట్టాయి. దమ్ముంటే గోశాలకు వచ్చి నిరూపించాలంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ట్విట్టర్ వేదికగా సవాల్ విసరడంతో వెంటనే స్పందించిన భూమన గురువారం ఉదయం 10 గంటలకు వస్తానని ప్రతి సవాల్ విసిరారు. దీంతో ఉలిక్కిపడ్డ కూటమి నేతలు రాత్రికి రాత్రే పోలీసులను ఉసిగొల్పారు. వైఎస్సార్‌సీపీ నేతలెవరూ గోశాల వద్దకు రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సవాల్ విసిరిన పల్లా శ్రీనివాసరావు పత్తా లేకుండా పోవడం గమనార్హం. మీడియా ఎదుటే భూమన కరుణాకరరెడ్డి ఆయనకు ఐదుసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడం గమనార్హం.


భూమన కరుణాకరరెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

**అర్ధరాత్రి పోలీస్ దిగ్బంధం..**

కూటమి నేతల ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు బుధవారం అర్ధరాత్రి దాటాక 1.10 గంటల సమయంలో తిరుపతి, తుమ్మలగుంటలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల నివాసాల వద్దకు చేరుకున్నారు. భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, నగర పార్టీ అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్‌బ్యాంక్ అధ్యక్షుడు రామారావుతో పాటు సుమారు 18 మంది వైఎస్సార్‌సీపీ నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల వరకు బయటకు రానివ్వకుండా అడ్డుకున్నారు. గురువారం తెల్లవారు జాము నుంచి భూమన నివాసానికి చేరుకునే మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో భూమన నివాసంలోకి వెళ్లిన పోలీసులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వచ్చి వెళ్లే వరకు గోశాలకు వెళ్లడానికి వీల్లేదని తెలిపారు. అయితే సవాల్ విసిరాక తాను వెళ్లక తప్పదని భూమన వారికి చెప్పారు. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో భూమన క్యాంపు కార్యాలయం నుంచి తిరుపతి ఎంపీ గురుమూర్తి, డిప్యూటీ మాజీ సీఎం నారాయణస్వామి, చంద్రగిరి నియోజక వర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు టీటీడీ గోశాలకు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. సుమారు మూడు గంటల పాటు ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల తీరుకు నిరసనగా భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, నారాయణస్వామి రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మాజీ మంత్రి ఆర్‌కే రోజా, సత్యవేడు సమన్వయకర్త రాజేష్ తదితరులు భూమన క్యాంపు కార్యాలయానికి చేరుకుని నిరసనకు దిగారు. సుమారు గంటపాటు రోడ్డుపై పడుకుని నిరసన తెలిపినా పోలీసులు వారిని అనుమతించలేదు.

**గోశాలలోకి కూటమి నేతలకు అనుమతి**

భూమన క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి కొనసాగుతుండగా.. మరోవైపు కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు పెద్ద ఎత్తున టీటీడీ గోశాలలోకి ప్రవేశించారు. పోలీసులు వారిని గుంపులు గుంపులుగా లోపలకు పంపారు. తాము సవాల్ స్వీకరించామని, భూమన రాలేదంటూ కూటమి నేతలు గోశాలలో కూర్చొని అనుకూల మీడియా ద్వారా విష ప్రచారం సాగించారు. దీన్ని రక్తి కట్టించేందుకు చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి గోశాల నుంచి భూమనకు ఫోన్ చేశారు. తాము రావడానికి సిద్ధంగా ఉన్నా పోలీసులు ముందుకు కదలనివ్వడం లేదని, ఎస్కార్ట్ పంపితే వస్తానని భూమన వారితో పేర్కొన్నారు. అయితే ఎస్కార్ట్ పంపకుండా పోలీసులతో పాటు స్పెషల్ ఫోర్స్‌ని రంగంలోకి దింపి వైఎస్సార్‌సీపీ నేతలను అడ్డుకున్నారు.

**ఎంపీ గురుమూర్తి ప్రశ్నలకు జవాబు చెప్పలేక**

పోలీసుల నుంచి తప్పించుకుని గోశాల వద్దకు చేరుకున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి, భూమన అభినయరెడ్డిని మరోసారి అడ్డుకోగా ఎంపీ గురుమూర్తి మరో గేటు ద్వారా లోపలకు వెళ్లారు. అయితే ఎంపీ గురుమూర్తి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకపోగా కూటమి నేతలంతా కలసి ఎదురుదాడికి దిగారు. అయితే ఎంపీ వెనక్కి తగ్గకుండా వారిపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఎంపీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోవడంతో పరిస్థితి గమనించిన ఏఎస్పీ రవి మనోహరాచారి ఆయన్ను బలవంతంగా నెట్టుకుంటూ వచ్చి కారులో ఎక్కించారు. భూమన అభినయరెడ్డి మీడియాతో మాట్లాడుతుండగా పోలీసులు బలవంతంగా ఎత్తుకెళ్లి వాహనంలోకి ఎక్కించారు. కాగా, కూటమి ప్రభుత్వం ఆధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఎవరినీ హౌస్ అరెస్ట్ చేయలేదని హోం మంత్రి అనిత చెప్పారు. విశాఖలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో ఎవరిని నిర్బంధించలేదని స్పష్టం చేశారు.

## సరైన కారణం లేకుండా 'సిజేరియన్' చేస్తే కఠినచర్యలు

**మంత్రి దామోదర రాజనర్సింహ**



**సాక్షి, హైదరాబాద్:** సరైన కారణం లేకుండా సిజేరియన్ డెలివరీలు చేసే ప్రైవేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవా లని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం సి-సెక్షన్ ఆడిట్‌ను మరింత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. గురువారం మంత్రి సచివాలయంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజనర్సింహ మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరుగుతున్న ప్రసవాలపై తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రభుత్వ దవాఖానాల్లో సాధారణ డెలివరీలు అవుతున్నప్పుడు..ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోంలలో సిజేరియన్లు చేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలన్నారు. దీనికోసం నర్సులకు మిడ్ వైఫరీ ట్రైనింగ్ ఇప్పించాలని సూచించారు.

**ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీపై మంత్రి ఆరా**

రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీపై మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను అడిగారు. గత ఏడాది 8 వేలకు పైగా పోస్టులను భర్తీ చేశామని, మరో 6,200లకు పైగా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు చెప్పారు. ఇందులో డాక్టర్, ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ తదితర పోస్టులు ఉన్నట్టు తెలిపారు. ఈ పోస్టులన్నింటికీ రాత పరీక్షలు పూర్తి కాగా, వెంటనే ఫలితాలు విడుదల చేసి, నెల రోజుల్లో భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

## అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడికి కాలేయ మార్పిడి

- ఉస్మానియా ఆసుపత్రిలో తొలిసారిగా ఈ తరహా శస్త్రచికిత్స
- విలేకరుల సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్ వెల్లడి



**అఫ్జల్‌గంజ్:** తీవ్రమైన రెండు వేర్వేరు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఓ 14 ఏళ్ల బాలుడికి ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. అతనికి విజయవంతంగా కాలేయ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్, గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ మధుసూదన్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ తరహా శస్త్రచికిత్స తమ ఆసుపత్రిలో జరగడం ఇదే తొలిసారి అని చెప్పారు.

**పూర్తిగా దెబ్బతిన్న కాలేయం.. ఆపై జన్యు వ్యాధి**

ఏపీలోని మచిలీపట్నం పరిధిలో ఉన్న రెడ్లపాలెం గ్రామానికి చెందిన మన్మథ్‌రెడ్డి, స్వాతి దంపతులకు ఇద్దరు సంతానం. వారిలో 9వ తరగతి చదువుతున్న జి.నిఖిల్‌రెడ్డి (14) కొంతకాలంగా కాలేయ వ్యాధితోపాటు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ ఐదు నెలల క్రితం ఉస్మానియాలోని గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో చేరాడు. బాలుడికి వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యులు అతను హెపాటోపల్మనరీ సిండ్రోమ్ (హెచ్‌పీఎస్) అనే అరుదైన కాలేయ వ్యాధితోపాటు మార్ఫాన్ సిండ్రోమ్ అనే జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. రోగి కాలేయం పూర్తిగా దెబ్బతిన్నదని.. దీని కారణంగా ఊపిరితిత్తుల్లోని రక్తనాళాలు వ్యాకోచించడం వల్ల బాలుడి శరీరానికి తక్కువ ఆక్సిజన్ అందుతోందని.. అతను 60 శాతం మాత్రమే ఊపిరి తీసుకోగలుగుతున్నాడని తేల్చారు. అలాగే మార్ఫాన్ సిండ్రోమ్ వల్ల గుండె సహా అనేక అవయవాలు ప్రభావితం అయ్యాయని గుర్తించారు. దీనికి కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయక తప్పదని నిర్ధారించారు. బాలుడి తల్లి కాలేయ దానానికి ముందుకు రావడంతో సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, నెఫ్రాలజీ, అనస్థీషియా, కార్డియాలజీ విభాగాల సిబ్బంది సమన్వయంతో సుమారు 15 గంటలపాటు శ్రమించి బాలుడికి కాలేయ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. తల్లి, కుమారుడు కోలుకోవడంతో వారిని డిశ్చార్జి చేస్తున్నట్లు డాక్టర్ రాకేశ్ సహాయ్ తెలిపారు.

## చారిత్రక కట్టడాల జోలికి వెళ్లం

- తదుపరి విచారణ వరకు కట్టుబడి ఉంటామన్న సర్కార్
- 'మెట్రో' విస్తరణపై కౌంటర్ దాఖలు చేస్తామని వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** మహాత్మాగాంధీ బస్ స్టేషన్ నుంచి శంషాబాద్ వరకు చేపడుతున్న మెట్రో రైలు విస్తరణ పనుల్లో భాగంగా తదుపరి విచారణ వరకు చారిత్రక కట్టడాల జోలికి వెళ్లమని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఏప్రిల్ 22లోగా పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ నివేదించారు. అనంతరం న్యాయస్థానం విచారణను వాయిదా వేసింది. ఎంజీబీఎస్ నుంచి శంషాబాద్ వరకు మెట్రో రైలు విస్తరణ పనులను ఆపేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మహమ్మద్ రహీంఖాన్ పిల్ దాఖలు చేశారు. మెట్రో విస్తరణతో పరిసర ప్రాంతాల్లోని చారిత్రక కట్టడాలపై ప్రభావం పడుతోందని, చార్మినార్, ఫలక్‌నుమా, దారుల్‌షిఫా లాంటి కట్టడాలకు ప్రమాదం వాటిల్లనుందని పిల్‌లో పేర్కొన్నారు. దీనిపై పురావస్తు శాఖ, పర్యావరణ, ఇతర నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసిన అధ్యయనం చేయించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని ఏఏజీ కోరడంతో ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

# 'ప్రైవేటు' జన్యు నిధి ప్రమాదకరం

- ప్రభుత్వ విత్తన పరిశోధన సంస్థలతోనే విత్తన సార్వభౌమత్వం
- ఏఐ యుగంలో హోలిస్టిక్ సీడ్ సైన్స్ ఆవశ్యకతను గుర్తించాలి
- జాతీయ స్థాయి చర్చాగోష్టిలో ప్రముఖుల స్పష్టీకరణ
- పటిష్ట విత్తన చట్టం లేకనే కంపెనీల పెత్తనం: డా. దొంతి నరసింహారెడ్డి
- దేశంలో రోజుకు 2 వేలకుపైగా రైతుల సంఖ్య తగ్గిపోతోంది: డా. పాలగుమ్మి సాయినాథ్
- భవిష్యత్తులో రైతులు గత కాలపు అవశేషాలుగా మిగిలే పరిస్థితి నెలకొందని ఆందోళన



చర్చాగోష్టిలో మాట్లాడుతున్న ప్రముఖ పాత్రికేయుడు డాక్టర్ పాలగుమ్మి సాయినాథ్. చిత్రంలో డాక్టర్ సుమన్ సహాయ్, ఇక్రిశాట్‌లోని జీఆర్‌డీ విభాగాధిపతి కుల్‌దీప్‌సింగ్ తదితరులు

**సాక్షి, హైదరాబాద్:** ప్రైవేటు భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన రెండో జాతీయ జన్యు నిధి (నేషనల్ జీన్ బ్యాంక్) విధివిధానాలను రైతుల విత్తన హక్కులకు భంగం కలగని రీతిలో, దేశ విత్తన సార్వభౌమత్వాన్ని పరిరక్షించే విధంగా రూపొందించాలని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. గురువారం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని అగ్రి బయోటెక్ ఫౌండేషన్‌లో జాతీయ స్థాయి చర్చాగోష్టి జరిగింది. జాతీయ మొక్కల జన్యువనరుల బ్యూరో (ఐసీఏఆర్-ఎన్‌బీపీజీఆర్) హైదరాబాద్ విభాగం పూర్వ సంచాలకులు డాక్టర్ బి. శరత్‌బాబు అధ్యక్షతన జరిగిన చర్చాగోష్టిలో వివిధ రంగాలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ డాక్టర్ డి. నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు భాగస్వామ్యంతో కేంద్రం రెండో జాతీయ జన్యు నిధిని ఏర్పాటు చేయాలనుకోవడం ప్రమాదకరమన్నారు. అత్యంత అప్రమత్తతతో నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ సీడ్ బ్యాంక్‌లకు పూర్తిస్థాయి ప్రోత్సాహం ఇచ్చే విధంగా ఆ వ్యవస్థ ఉండాలని సూచించారు. కిసాన్ మజ్దూర్ కమిషన్‌కు చెందిన డాక్టర్ దినేశ్ అబ్రోల్ మాట్లాడుతూ భౌగోళిక గుర్తింపు (జీఐ), 'రైతు వంగడం'గా నమోదు వంటి ప్రత్యేక విత్తన హక్కులు కల్పించడం వల్ల విదేశీ విత్తన కంపెనీలే ఎక్కువ లబ్ధి పొందుతున్నాయన్నారు. 2,038 రైతు వంగడాలను రిజిస్టర్ చేసిన ప్రభుత్వం వాటిని దేశవ్యాప్తంగా రైతులకు అందించేందుకు చేస్తున్నదేమీ లేదని విమర్శించారు. దేశీయ విత్తనాలను లాభాపేక్ష లేకుండా రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక వ్యవస్థను నెలకొల్పాలన్నారు.

**ప్రైవేటు భాగస్వామ్యంతో ఉపయోగం లేదు..**

రైతు సంఘాల నెట్‌వర్క్ 'ఆషా' కన్వీనర్ కురుగంటి కవిత ప్రసంగిస్తూ సుసంపన్న వారసత్వ సంపద పరిరక్షణకు సామాజిక విత్తన నిధులు దోహదం చేస్తున్నాయన్నారు. సంప్రదాయ వంగడాలను గ్రామస్థాయిలో రైతులకు అందిస్తూ ఏటా సాగుకు వీలుకల్పిస్తున్న సామాజిక విత్తన నిధులను బలోపేతం చేయడం, ప్రభుత్వ విత్తన పరిశోధన సంస్థలకు నిధులివ్వడం ద్వారా 'విత్తన సార్వభౌమత్వం' చేకూరుతుందని చెప్పారు. తద్వారా రైతులు, ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. ఏఐ యుగంలో హోలిస్టిక్ సీడ్ సైన్స్ ఆవశ్యకతను ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. విత్తన కంపెనీలకు దోచిపెట్టే ప్రైవేటు భాగస్వామ్య జన్యు నిధుల వల్ల ఉపయోగం ఉండబోదన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వ జన్యునిధిపై కేంద్రం శ్వేతపత్రం ప్రకటించాలని కోరారు. రైతు సంఘం నేత సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ 1995 తర్వాత ప్రభుత్వరంగ విత్తన పరిశోధనలు నిలిచిపోవడంతో 80% విత్తన రంగం కార్పొరేట్ శక్తుల అధీనంలోకి వెళ్లిందన్నారు. అత్యధిక జనాభా గల మన దేశం స్వయం పోషకత్వాన్ని కోల్పోతే మనుగడ కష్టమని పాలకులు గుర్తించాలన్నారు. ఇక్రిశాట్‌లో జన్యునిధి వల్ల కార్పొరేట్ సంస్థలకే తప్ప రైతులకేమీ ఉపయోగం లేదన్నారు. ప్రముఖ పాత్రికేయుడు డా. పాలగుమ్మి సాయినాథ్ మాట్లాడుతూ దేశంలో రోజుకు 2 వేలకుపైగా రైతుల సంఖ్య తగ్గిపోతోందని, రైతుల వ్యవసాయక ఆదాయం దారుణంగా పడిపోతోందన్నారు. భవిష్యత్తులో రైతులు గత కాలపు అవశేషాలుగా మిగిలే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**ఏ విత్తనాలు సాగవుతున్నాయో ఎవరికీ తెలియదు..**

దేశంలో పటిష్టమైన విత్తన చట్టం లేని కారణంగా విత్తనాల వ్యవస్థపై పూర్తిగా కంపెనీల పెత్తనమే నడుస్తోందని ప్రముఖ విధాన విశ్లేషకులు డాక్టర్ దొంతి నరసింహారెడ్డి చెప్పారు. ఏ విత్తనాలు సాగవుతున్నాయో కూడా ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొందన్నారు. విత్తన కంపెనీల ఒత్తిడి వల్లే 2004 నాటి విత్తన బిల్లు పార్లమెంటులో ఇప్పటికీ పెండింగ్‌లో ఉందన్నారు. ఆ కంపెనీల భాగస్వామ్యంతో పెట్టబోయే జన్యునిధి వల్ల రైతులకేమీ మేలు జరగదన్నారు. వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంటులో పెండింగ్‌లో ఉన్న విత్తన బిల్లును ఆమోదించకపోతే రైతులు నష్టపోతూనే ఉంటారన్నారు. ఇక్రిశాట్‌లోని జీఆర్‌డీ విభాగాధిపతి డాక్టర్ కులదీప్ సింగ్ మాట్లాడుతూ దేశీ వంగడాల పరిరక్షణ కోసమే కేంద్రం ప్రైవేటు కంపెనీల భాగస్వామ్యంతో రెండో జాతీయ జన్యు నిధిని ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. జీవీ రామాంజనేయులు, డా. సుమన్ సహాయ్, ప్రొ. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.




# పాస్‌వర్డ్ పరేషాన్..

**తేలికైన పాస్‌వర్డ్‌లను టార్గెట్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు**

| వీక్ పాస్‌వర్డ్‌లతోనే 49% డేటా చౌర్యం ఘటనలు | నార్డ్‌పాస్ సర్వేలో వెల్లడి.. | క్లిష్టమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలని నిపుణుల సూచన |
|---|---|---|

సాక్షి, హైదరాబాద్: నిత్యజీవితంలో మొబైల్ ఫోన్ స్క్రీన్‌లాక్ పాస్‌వర్డ్ మొదలు, బ్యాంకు ఖాతాలకు, సోషల్ మీడియా ఖాతాలకు, వ్యక్తిగత, కార్యాలయ కంప్యూటర్లకు.. ఇలా ప్రతిచోటా పాస్‌వర్డ్ అన్నది అత్యంత కీలకంగా మారింది. ప్రతి వ్యక్తి కనీసం నాలుగు నుంచి ఐదు పాస్‌వర్డ్‌లను గుర్తుంచుకోక తప్పని పరిస్థితి. ఎక్కడ మరిచిపోతామోనన్న భయంతో కొందరు.. చికాకు ఎందుకులే అని మరికొందరు సులువుగా గుర్తుండే పాస్‌వర్డ్‌లు పెట్టుకుంటున్నారు. 123456 అని వరుసగా అంకెలను, లేదంటే password అనే ఆంగ్ల అక్షరాలనే పాస్‌వర్డ్‌గా సెట్ చేసుకుంటున్నారు. చాలామంది తమ పేరు, పుట్టిన తేదీ, ఫోన్ నంబర్ వంటివి పాస్‌వర్డ్‌గా ఉపయోగిస్తారు. ఇలా తేలికైన పాస్‌వర్డ్‌లతో ముప్పు తప్పదని పోలీసులతోపాటు సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు. సులువుగా ఉండే పాస్‌వర్డ్‌ల వల్ల ప్రపంచవ్యాప్తంగా 49 శాతం డేటాబ్రీచ్ (సమాచార చౌర్యం) ఘటనలు జరిగినట్టు నార్డ్‌పాస్ సర్వే వెల్లడించింది. సైబర్ నేరగాళ్ల ముప్పు తప్పాలంటే క్లిష్టంగా ఉండే పాస్‌వర్డ్‌లను వాడాలని నిపుణులు సూచిస్తున్నారు.

### ఈజీ పాస్‌వర్డ్‌లతో ఇవీ ప్రమాదాలు..

- సులభమైన పాస్‌వర్డ్‌లను హ్యాకర్లు సులువుగా ఊహించడమే కాకుండా బ్రూట్ ఫోర్స్ అటాక్ అనే సాంకేతికతను వాడిసులువుగా కనుగొనే ప్రమాదం ఉంది.
- బ్యాంక్ ఖాతాలు, ఈ మెయిల్స్, సోషల్ మీడియా ఖాతాల నుంచి సమాచారం చోరీచేసే చాన్స్ ఉంది.
- మీ పాస్‌వర్డ్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళితే మీ పేరిట మోసాలకు పాల్పడే ప్రమాదం ఉంది.
- ఒకే పాస్‌వర్డ్‌ను చాలా ఖాతాలకు వినియోగిస్తుంటారు. ఇది కూడా ప్రమాదకరమే. ఒక్క బ్యాంక్ ఖాతా, మెయిల్ పాస్‌వర్డ్ హ్యాక్ అయితే మిగిలినవి కూడా ప్రమాదంలో పడతాయి.

### పాస్‌వర్డ్‌లు తెలుసుకునేందుకు సైబర్ మోసగాళ్లు వేసే ఎత్తులు..

- సోషల్ ఇంజనీరింగ్: హ్యాకర్లు మీ వ్యక్తిగత సమాచారం (పుట్టిన తేదీ, పెంపుడు జంతువు పేరు) ఆధారంగా సులభమైన పాస్‌వర్డ్‌లను ఊహించవచ్చు.
- డిక్షనరీ అటాక్స్: హ్యాకర్లు సాధారణ పదాలు లేదా సంఖ్యల కలయికలను ఉపయోగించి పాస్‌వర్డ్‌లను పరీక్షిస్తారు. ఇది ఈజీ పాస్‌వర్డ్‌లకు సులభంగా పనిచేస్తుంది.
- ఫిషింగ్ అటాక్స్: హ్యాకర్లు నకిలీ వెబ్‌సైట్‌లు లేదా ఈ మెయిల్ ద్వారా మీ ఈజీ పాస్‌వర్డ్‌ను సేకరించగలరు. బ్యాంక్ నుంచి వచ్చినట్లు కనిపించే ఈ మెయిల్ ద్వారా మీ లాగిన్ వివరాలను అడగవచ్చు.
- కీలాగర్స్: మీరు టైప్ చేసే పాస్‌వర్డ్‌లను రికార్డ్ చేసే మాల్వేర్ ద్వారా సులభమైన పాస్‌వర్డ్‌లు త్వరగా దొంగిలించబడతాయి.
- రాన్సమ్‌వేర్: ఒకసారి ఖాతా హ్యాక్ అయిన తర్వాత, హ్యాకర్లు మీ డేటాను లాక్ చేసి, దాన్ని తిరిగి ఇవ్వడానికి డబ్బు డిమాండ్ చేయవచ్చు.

### ఈ జాగ్రత్తలు మరవొద్దు..

- టు ఫ్యాక్టర్ అథెంటికేషన్: ఈజీ పాస్‌వర్డ్‌లు ఉన్నా.. ఓటీపీ, బయోమెట్రిక్ వెరిఫికేషన్ వంటి టు ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఆన్ చేయడం వల్ల అదనపు భద్రత లభిస్తుంది.
- పాస్‌వర్డ్‌లు బలంగా ఉండాలంటే కనీసం 12 అక్షరాలు ఉండేలా చూసుకోవాలి. వాటిలో పెద్ద అక్షరాలు, చిన్న అక్షరాలు, సంఖ్యలు, చిహ్నాల కలయికను ఉపయోగించాలి.
- పాస్‌వర్డ్‌లను తరచూ మార్చండి. ప్రతి 3-6 నెలలకు మీ పాస్‌వర్డ్‌లను అప్‌డేట్ చేయండి.
- వేర్వేరు ఖాతాలకు వేర్వేరు పాస్‌వర్డ్‌లు పెట్టుకోండి.

## ఎన్‌టీఏ తీరుపై విద్యార్థుల అసంతృప్తి

**ప్రకటించిన విధంగా జేఈఈ మెయిన్స్ ఫలితాలు వెల్లడించని సంస్థ**

**ఫైనల్ 'కీ' వెబ్‌సైట్‌లో పెట్టి తొలగించిన వైనం.. నేడు 'కీ', ఫలితాలు ప్రకటించే అవకాశం**

సాక్షి, హైదరాబాద్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తీరుపై విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జేఈఈ మెయిన్స్ రెండో విడత ఫలితాలు గురువారం వెల్లడిస్తామని ఎన్‌టీఏ రెండురోజులుగా చెబుతూ వచ్చింది. దీంతో విద్యార్థులు అర్ధరాత్రి వరకూ ఫలితాల కోసం నిరీక్షించారు. కానీ ఎన్‌టీఏ ఫలితాలు విడుదల చేయలేదు. అయితే సాయంత్రం 6 గంటలకే ఫైనల్ 'కీ'ని వెబ్‌సైట్‌లో ఉంచింది. సాధారణంగా ఫైనల్ 'కీ'ని అందుబాటులో ఉంచిన గంటలోపు ఫలితాలు వెల్లడిస్తుంది. అయితే ఫలితాలు విడుదల చేయకపోగా కొన్ని గంటల తర్వాత ఫైనల్ 'కీ'ని కూడా వెబ్‌సైట్ నుంచి తొలగించింది. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతుండగా, ఫైనల్ 'కీ'లో తప్పులున్నాయనే విషయం అనేకమంది ఎన్‌టీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లారని, ఈ కారణంగానే 'కీ' తీసేసి ఉంటారని విద్యార్థులు భావిస్తున్నారు. ఫలితాల వెల్లడిలో ఎన్‌టీఏ ప్రతిసారీ ఇదే తీరు అనుసరిస్తోందని, చెప్పిన సమయానికి ఫలితాలు ప్రకటించకుండా నిరుత్సాహ పరుస్తోందని విద్యార్థులు విమర్శిస్తున్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. కాగా జేఈఈ ఫైనల్ కీ, ఫలితాలు శుక్రవారం వెల్లడించే వీలుందని ఎన్‌టీఏ వర్గాలు ఢిల్లీలో మీడియాకు తెలిపాయి.

# ఫ్యూచర్ సిటీలో 'మరుబెని' పార్కు

▶ మొదటి పేజీ తరువాయి

పెట్టుబడులను ఆకర్షిస్తుందని అంచనా వేస్తున్నారు. ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలపై ఈ పార్కు దృష్టి పెడుతుంది. అధునాతన తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నైపుణ్యంతో కూడిన ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుంది. తెలంగాణ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి దూరదృష్టితో వ్యవహరిస్తున్నారని 'మరుబెని' బిజినెస్ ఎగ్జిక్యూటివ్ అధికారి దై సకాకురా అభినందించారు.

**65 దేశాల్లో 'మరుబెని' కార్యకలాపాలు**

మరుబెని కంపెనీ 65 దేశాల్లో 410 కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులు, లోహాలు, గనులు, ఇంధనం, విద్యుత్తు, కెమికల్స్, మౌలిక సదుపాయాలు, ఫైనాన్స్ లీజింగ్, రియల్ ఎస్టేట్, ఏరోస్పేస్, మొబిలిటీ రంగాలలో ఈ కంపెనీ అగ్రగామిగా ఉంది. ఈ సంస్థకు ప్రపంచ వ్యాప్తంగా 50 వేలకు పైగా ఉద్యోగులున్నారు.

**సోనీ కార్యాలయాన్ని సందర్శించిన సీఎం**

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం గురువారం ఎలక్ట్రానిక్ దిగ్గజ సంస్థ 'సోనీ' ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. సోనీ కార్పొరేషన్ తయారు చేస్తున్న కొత్త ఉత్పత్తులు, చేపడుతున్న కొత్త కార్యక్రమాల గురించి వీరికి కంపెనీ ప్రతినిధులు వివరించారు. సోనీ కంపెనీ యానిమేషన్ అనుబంధ సంస్థ 'క్రంచైరోల్'పై ప్రతినిధులతో జరిగిన చర్చల్లో.. యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గేమింగ్ రంగాలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలు, అనుకూలతలను తెలంగాణ ప్రతినిధి బృందం వివరించింది. ఎండ్ టు ఎండ్ ప్రొడక్షన్ సామర్థ్యాన్ని కలిగి ఉండే అత్యాధునిక ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేయాలనే తన ఆలోచనలను 'క్రంచైరోల్' ప్రతినిధులతో ముఖ్యమంత్రి పంచుకున్నారు.


జైకా సీనియర్ ప్రెసిడెంట్ షోహెయ్ హరాతో సీఎం రేవంత్

**మెట్రో సహా అభివృద్ధి పనులకు నిధులపై 'జైకా'తో చర్చలు**

జపాన్ ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ ఏజెన్సీ (జైకా) ఉన్నత స్థాయి యాజమాన్య బృందంతో కూడా ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు నిధుల సమీకరణపై చర్చించారు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.24,269 కోట్ల అంచనాలతో చేపట్టనున్న మెట్రో రైలు రెండో దశ ప్రతిపాదనలు ఇప్పటికే కేంద్రం తుది పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే వ్యయంలో 48 శాతం అనగా రూ.11,693 కోట్లు రుణంగా ఇవ్వాలని కోరారు. ప్రపంచ పెట్టుబడుల గమ్య స్థానంగా, అత్యంత ఆకర్షణీయమైన నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించి ప్రస్తావించారు. ప్రపంచ స్థాయి నగరాలైన న్యూయార్క్, టోక్యోతో సమానంగా నగరాన్ని అభివృద్ధి చేసే యోచనలో తమ ప్రభుత్వం ఉందని చెప్పారు. మెట్రో రైలు రెండో దశతో పాటు మూసీ పునరుజ్జీవనం, రీజనల్ రింగ్ రోడ్డు నుంచి అవుటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానించే రేడియల్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కూడా ఆర్థిక సాయం అందించాలని కోరారు. కాగా జైకా, తెలంగాణ నడుమ అనేక ఏళ్లుగా సంబంధాలు ఉన్నాయని జైకా సీనియర్ ప్రెసిడెంట్ షోహెయ్ హరా వ్యాఖ్యానించారు. ప్రాజెక్టులకు జైకా నుంచి ఆర్థిక సాయం పొందేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మన సంస్కృతిని చాటేలా అందాల పోటీలు

**ప్రపంచ సుందరి పోటీల నిర్వహణపై మంత్రి జూపల్లి సమీక్ష**



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, చారిత్రక వైభవం చాటిచెప్పేలా మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. గురువారం టూరిజం ప్లాజాలో ప్రపంచ సుందరి పోటీల నిర్వహణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తెలంగాణ వైభవం ఒక్క హైదరాబాద్ నగరంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ప్రాంతాల్లో నిక్షిప్తమై ఉందని, ఆయా ప్రాంతాలకు ప్రపంచ దేశాల సుందరీమణులను తీసుకెళ్లి వాటి ఔన్నత్యాన్ని వివరించాలని అన్నారు. తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, చారిత్రక కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా అందాల పోటీలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించడం ద్వారా పర్యాటకరంగ అభివృద్ధి.. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 20కి పైగా వేదికల్లో వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికార యంత్రాంగం సమష్టిగా పని చేయాలని మంత్రి సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలను ఇందులో భాగస్వాములను చేయాలని కోరారు. ఈ సమీక్షలో పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ జెండాగే హనుమంత్ కొండిబా, క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ సోని బాలదేవి, యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**టూరిజం స్టేక్‌హోల్డర్స్ వర్క్‌షాప్ ప్రారంభం**

ప్రపంచంలో అతిథ్య, పర్యాటక రంగాలు విపరీతంగా అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)లో యూరోపియన్ యూనియన్ సహకారంతో నడుస్తున్న ఎస్ఐపీఏఎస్ ప్రాజెక్టుకు సంబంధించిన టూరిజం స్టేక్‌హోల్డర్స్ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం www.sipas.in వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. యూరోపియన్ ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి చొరవ తీసుకున్నందుకు నిథమ్ డైరెక్టర్ జెండాగే హనుమంత్ కొండిబాను మంత్రి అభినందించారు.

# గ్రూప్-1 నియామకాలు నిలిపివేయండి

▶ మొదటి పేజీ తరువాయి

ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు గురువారం విచారణ చేపట్టారు.

**రీకౌంటింగ్‌తో 60 మార్కులు తగ్గాయి..**

పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'హైదరాబాద్‌లోని రెండు సెంటర్ల నుంచి 71 మంది ఎంపిక కావడం సందేహాస్పదం. మొత్తం 563 పోస్టుల్లో ఇది దాదాపు 12 శాతం. మెయిన్స్‌కు తొలుత 21,075 మంది హాజరయ్యారని ప్రకటించి, తర్వాత 21,085 మంది అని పేర్కొన్నారు. ఈ 10 మంది ఎలా పెరిగారో వెల్లడించలేదు. ఉర్దూలో 9 మంది రాస్తే.. 10 మంది అని చెప్పారు. జనరల్ ర్యాంకింగ్ ప్రకటన సమయంలో కంప్యూటర్‌లో మార్పులు చేశారు. లాగ్ హిస్టరీ పరిశీలిస్తే నిజం తెలుస్తుంది. అయితే దీనిపై ప్రశ్నిస్తే ఆ వివరాలు మీకెందుకంటూ బెదిరిస్తున్నారు. 482 మార్కులు వచ్చిన ఓ అభ్యర్థికి రీకౌంటింగ్‌లో 60 మార్కులు తగ్గడం మరీ విచిత్రం. పరీక్షా కేంద్రాల పెంపు, ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు హాల్‌టికెట్ల నంబర్ మార్పుపై స్పష్టత లేదు..' అని చెప్పారు.

**అలాగైతే అందరూ ఎంపిక కావాలి కదా..**

టీజీపీఎస్సీ తరపు న్యాయవాది పీఎస్ రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. 'ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు వేర్వేరు హాల్ టికెట్ నంబర్లు ఇచ్చాం. అయితే ప్రిలిమ్స్ హాల్‌టికెట్ నంబర్‌ను కూడా మెయిన్ హాల్‌టికెట్‌లో పొందుపరిచాం. అక్టోబర్ 27న మెయిన్స్ చివరి పరీక్ష జరిగింది. పరీక్షా కేంద్రాల నుంచి అందిన సమాచారం మేరకు హాజరైన అభ్యర్థులు 21,075 మందిగా కమిషన్ ప్రకటించింది. ఈ సంఖ్యలో స్వల్ప మార్పు ఉండొచ్చని కూడా చెప్పింది. ఆ తర్వాత ఈ సంఖ్య 21,085 అని పేర్కొంది..' అని చెప్పారు. దీంతో రిపోర్టు చేసిన తర్వాతే అభ్యర్థులు హాల్లోకి ప్రవేశిస్తారు కదా.. అదే రోజు సరైన సంఖ్య వచ్చే అవకాశం లేదా? అని న్యాయమూర్తి ప్రశ్నించారు. లేదని న్యాయవాది బదులిచ్చారు. 'రెండు సెంటర్ల నుంచి ఎక్కువ మంది ఎంపికయ్యారన్నది మరో ఆరోపణ. ఓ సెంటర్‌లో 792 మంది పరీక్షకు హాజరుకాగా 39 మంది (4.92%), మరో సెంటర్ నుంచి 864 మంది హాజరుకాగా 32 మంది (3.7%) ఎంపికయ్యారు. ఎంపికైన శాతం స్వల్పం. ఒకవేళ అవకతవకలు జరిగి ఉంటే ఆ సెంటర్లలోని అందరూ ఎంపిక య్యేవారు. అలా జరగలేదంటే ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా సాగిందని తెలుస్తోంది..' అని అన్నారు.

**పోర్జరీ చేసి మార్కులు మార్చారు**

'ఓ సెంటర్ పెంచడంపై పిటిషనర్ మరో ఆరోపణ చేశారు. మెయిన్స్‌కు 45 సెంటర్లు ప్రకటించినా తర్వాత ఓ సెంటర్ పెంచాం. ఒకచోట దివ్యాంగులు పరీక్ష రాసేందుకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండటంతో మరో కేంద్రాన్ని పెంచాం. పిటిషనర్లు చెబుతున్నట్టుగా.. పదవీ విరమణ పొందిన వారిని మూల్యాంకనానికి తీసుకోవద్దని చట్టంలో లేదు. ఇక పిటిషనర్లంతా ప్రభుత్వ ఉద్యోగులు. ఎక్కడ పని చేస్తున్నారో దాచి పిటిషన్ వేశారు. రీ కౌంటింగ్‌లో ఒకరికి మార్కులు తక్కువ వచ్చాయన్నది కూడా నిజం కాదు. తొలుత, ఆ తర్వాత కూడా ఆ అభ్యర్థికి 422.5 మార్కులే వచ్చాయి. అయితే ఫోర్జరీ చేసి మార్కులు మార్చారు. దీనిపై షోకాజ్ నోటీసు జారీ చేశాం. విచారణ జరుపుతాం..' అని నివేదించారు.

**పిటిషనర్ల వివరాలు సమర్పించాలి: న్యాయమూర్తి**

వాదనలు విన్న న్యాయమూర్తి.. నియామకాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పిటిషనర్లు ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నారో పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. పిటిషనర్లు తప్పుడు వివరాలను దాఖలు చేసినట్లు నిరూపితమైనా, టీజీపీఎస్సీలో అవకతవకలు జరిగాయని తేలినా తీవ్ర చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇలావుండగా.. ఇంప్లీడ్ కాకుండా వాదనలు వినిపించడం సరికాదంటూ.. రీ కౌంటింగ్‌లో తక్కువ మార్కులు వచ్చాయని చెప్పిన ఓ అభ్యర్థిని హైకోర్టు తప్పుబట్టింది. పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించింది.

### క్లుప్తంగా...

## క్రీస్తు సందేశం మానవాళికి స్ఫూర్తిదాయకం: రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: క్రీస్తు త్యాగాల జ్ఞాపకమైన గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఏసు ప్రభువు కృపాకటాక్షాలు ఎప్పుడూ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. శాంతి, కరుణ సందేశాలతో పాటు క్రీస్తు నేర్పిన సేవ, దయ, సోదరభావం ఇప్పటికీ.. ఎప్పటికీ మానవాళికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

## జీసస్ మహాత్యాగమే గుడ్ ఫ్రైడే సందేశం

**వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్**



సాక్షి, అమరావతి: మానవాళి కోసం జీసస్ చేసిన మహాత్యాగమే గుడ్ ఫ్రైడే సందేశమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. కరుణామయుడైన ఏసు ప్రభువును శిలువ వేసిన గుడ్ ఫ్రైడే రోజు.. ఆ తర్వాత ఆయన పునరుజ్జీవించిన ఈస్టర్ సండే రోజు.. ఈ రెండూ మానవాళి చరిత్రను మలుపు తిప్పిన ఘట్టాలని వివరించారు. మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం.. ఇది జీసస్ జీవితం మానవాళికి ఇచ్చిన సందేశమని వైఎస్ జగన్ గురువారం పేర్కొన్నారు.

## 'జేఎన్‌యూ' ఎన్నికల్లో తెలంగాణ విద్యార్థి

- ఉపాధ్యక్ష పదవికి నిట్టు గౌతమ్
- నామినేట్ చేసిన ఏబీవీపీ

సాక్షి, న్యూఢిల్లీ: జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం విద్యార్థి సంఘం (జేఎన్ యూఎస్‌యూ) ఎన్నికలకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) అభ్యర్థులను ప్రకటించింది. శిఖా స్వరాజ్ (అధ్యక్షురాలు), నిట్టు గౌతమ్ (ఉపాధ్యక్షుడు), కునాల్ రాయ్ (ప్రధాన కార్యదర్శి) వైభవ్ మీనా (సంయుక్త కార్య దర్శి) పదవులకు నామినేట్ చేసింది. మహిళా ప్రతినిధులకు ప్రాధాన్యమిస్తూ 16 పాఠశాలలు, ప్రత్యేక కేంద్రాల్లో 42 కౌన్సిలర్ పదవులకు అభ్యర్థులను గురువారం ప్రకటించింది. ఉపాధ్యక్షునిగా బరిలోకి దిగుతున్న నిట్టు గౌతమ్.. తెలంగాణలోని కామారెడ్డి జిల్లాకు చెందిన విద్యార్థి. ఫరీదాబాద్‌లోని లింగయ్య విశ్వవిద్యాలయం నుంచి కంప్యూటర్, సిస్టమ్స్‌లో బీటెక్ పూర్తి చేశాడు. జేఎన్‌యూలో సీఎస్‌లో ఎంటెక్ పట్టా తీసుకున్నాడు. ప్రస్తుతం ఇక్కడే పీహెచ్‌డీ చేస్తున్నాడు. వామపక్ష ఆధిపత్యాన్ని ఏబీవీపీ సవాల్ చేస్తుందని, మెరుగైన, సురక్షితమైన, స్టూడెంట్స్ ఫ్రెండ్లీ క్యాంపస్‌గా జేఎన్‌యూను తీర్చిదిద్దుతామని ఏబీవీపీ కేంద్ర ఎన్నికల సమన్వయకర్త అర్జున్ ఆనంద్ పేర్కొన్నారు.

## అంజన్‌పై బీజేపీ ఫిర్యాదు

హైదరాబాద్: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై పరుషపదజాలం ప్రయోగించిన కాంగ్రెస్ నేత అంజన్ కుమార్ యాదవ్‌పై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు బీజేపీ తెలంగాణ సోషల్ మీడియా కన్వీనర్ సుమిరాన్ కొమ్రరాజు గురువారం సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో అంజన్ కుమార్ యాదవ్‌పై ఫిర్యాదు చేశారు. తక్షణమే కాంగ్రెస్ నేతపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్, సోనియా గాంధీ పేర్లను ఈడీ చార్జిషీట్‌లో చేర్చడంపై నిరసన వ్యక్తం చేస్తూ.. టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఈడీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నేతలు ధర్నాకు దిగారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై పరుష పదజాలం వినియోగించడంపై తెలంగాణ బీజేపీ 'ఎక్స్' వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

## విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా ఎకోటూరిజం ప్రాజెక్టులు

**అధికారులకు అటవీశాఖ మంత్రి సురేఖ ఆదేశాలు**



సాక్షి, హైదరాబాద్ : విదేశీ పర్యాటకులను ఆకర్షించే విధంగా ఎకో టూరిజం ప్రాజెక్టులపై ప్రణాళికలు రూపొందించాలని అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఎకో టూరిజం ప్రణాళికల రూపకల్పనకు అటవీ, టూరిజం, పరిశ్రమల శాఖలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించే దిశగా కచ్చితమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం సచివాలయంలో 'తెలంగాణ హరిత నిధి' రాష్ట్ర స్థాయి సమావేశంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ ఆర్ఎం డొబ్రియాల్, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఏలూ సింగ్ మేరు, డాక్టర్ సువర్ణ (కాంపా), సీసీఎఫ్ జి.రామలింగం (సోషల్ ఫారెస్టు), భీమానాయక్, ప్రభాకర్ (సీసీఎఫ్), పలు జిల్లాల డీఎఫ్ఓలు, ఆర్థిక, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ నర్సరీల ఏర్పాటు, మొక్కలు నాటడం, నీళ్లు పోయడం, సంరక్షణ, మొక్కల లెక్కలు తేల్చడం వంటి అంశాలను ప్రస్తావించారు.

**వానరాల పరిరక్షణకు చర్యలు:** రాష్ట్రంలో వానరాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి కొండా సురేఖ సూచించారు. వనాలను వీడిన వానరాలు.. మళ్లీ అడవిబాట పట్టవని, అందువల్ల వాటి కోసం కొన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. హరితనిధిలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీలలో ఇచ్చే మొక్కల్లో ఎక్కువగా వానరాలు తినే మొక్కలు అందజేయాలని చెప్పారు.

**సతీశ్ నివాసం వద్ద ఈడీ అధికారులు. ఇన్‌సెట్‌లో ఉల్ఫ్ డాగ్‌తో సతీశ్**



## రూ.50 కోట్ల కుక్క.. అంతా ఫేక్

**ఈడీ దాడులతో తేలిన నిజం**

బనశంకరి: ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన శునకం తన దగ్గర ఉందంటూ బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి చెప్పిందంతా బడాయేనని తేలింది. రూ.50 కోట్లకు ఆ కుక్కను కొనుగోలు చేసినట్లు ఎస్.సతీశ్ కొన్ని రోజులుగా చెప్పుకుంటూ వస్తున్నాడు. తోడేలు–కకేషియన్ షెపర్డ్ జాతి ఉల్ఫ్ డాగ్ తన వద్ద ఉందని, ప్రపంచంలో ఇలాంటిది మరెక్కడా లేదని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడు. పలు కార్యక్రమాలకు కుక్కతో సహా హాజరై దాని గురించి గొప్పలు చెబుతున్నాడు. ఈ వ్యవహారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారుల దాకా వెళ్లింది. గురువారం వారు అతడి ఇంటిపై దాడి చేశారు. రూ.50 కోట్ల డబ్బు ఎలా వచ్చింది, విదేశాలతో జరిగిన లావాదేవీల వివరాలపై ఆరా తీశారు. కేవలం ప్రచారం కోసమే అతడు గొప్పలు చెప్పుకుంటున్నట్లు తేలింది. ఆ శునకానికి అంత సీను లేదని కూడా వెల్లడైంది. దీంతో ఈడీ అధికారులు అవాక్కయ్యారు.

## నా చిలుక ఎక్కడ?

| |
|---|
| జ్యోతిష్యం చెప్తుండగా టైర్ పేలి తుర్రుమన్న చిలుక |
| రూ.500 ఇచ్చినా వదిలిపెట్టని జ్యోతిష్యుడు |
| పోలీస్ స్టేషన్‌కు చేరిన చిలుక పంచాయితీ |


మెకానిక్ దాస్

పరకాల: అత్యాశ కొంపకు చేటు అన్నట్లు.. ఓ రామచిలుక జ్యోతిష్యుడు చేసిన పని అతడి ఉపాధికి ఎసరు తెచ్చింది. చినికి చినికి చిలుక పంచాయితీ పోలీసు స్టేషన్‌కు చేరింది. వారం రోజులుగా జరుగుతున్న ఈ చిలుక పంచాయితీ వివరాల్లోకి వెళ్తే.. హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని అంబేడ్కర్ క్రాస్ సమీపంలో దాస్ అనే ఓ బైక్ మెకానిక్ దుకాణం వద్దకు వారం క్రితం రామస్వామి అనే జ్యోతిష్యుడు చిలుక జోస్యం చెబుతానని వచ్చాడు. దాస్ జోస్యం చెప్పించుకునేందుకు ఒప్పుకోవటంతో, చిలుక తీసిన బొమ్మను చూసి జ్యోతిష్యుడు రూ.1,650 ఇస్తే తాయత్తు కడతానని చెప్పాడు. అయితే పొద్దున్నే గిరాకీ కాలేదని, తర్వాత రమ్మని దాస్ చెప్పి జ్యోతిష్యుడిని పంపించేశాడు. ఆ జ్యోతిష్యుడు ఊరంతా తిరిగి సాయంత్రానికి మళ్లీ దాస్ వద్దకు వచ్చాడు. చిలుక మళ్లీ అదే బొమ్మను తీస్తే తాయత్తు కట్టించుకుంటానని దాస్ చెప్పాడు. దీంతో ఆ జ్యోతిష్యుడు మరోసారి పంజరంలో ఉన్న చిలుకను బయటకు పిలుస్తూనే నిద్రలోకి జారుకున్నాడు. చిలుక బయటకు వచ్చిన సమయంలో పక్కనే ఓ బైక్ టైరు పేలటంతో, ఆ శబ్దానికి భయపడి అది తుర్రుమని ఎగిరి సెల్‌టవర్‌పై వాలింది. చిలుక పారిపోయిందని జ్యోతిష్యుడిని దాస్ నిద్ర లేపడంతో, అతడు ఒక్కసారిగా లేచి సెల్ టవర్ వద్దకు పరుగెత్తాడు. కానీ, మూడు గంటలు వేచి చూసినా అది తిరిగి రాలేదు. జ్యోతిష్యుడి బాధ చూడలేక దాస్ అతడిని ఓ వైన్స్ వద్దకు తీసుకెళ్లి రూ.500తో మద్యం కొనిచ్చాడు. అయితే, తన చిలుకను దాస్ మాయం చేశాడని అతడి ఇంటికి వెళ్లి జ్యోతిష్యుడు గొడవ చేశాడు. మూడు రోజుల క్రితం దాస్‌పై పరకాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దాస్‌ను పిలిచి జ్యోతిష్యుడి రామచిలుక ఏమైందని ప్రశ్నించారు. దాదాపు 3 గంటల పాటు చిలుక పంచాయితీ జరిగినా, ఎటూ తెగకపోవడంతో 'నీ చిలుక నీ దగ్గరకు రావాలని కోరుకుంటున్నాం' అని జ్యోతిష్యుడికి నచ్చజెప్పి పంపించేశారు.

# ఆచితూచి ఖర్చులు..

| గ్రామీణ భారతంలో ఆర్థికభయాలు | జీవన వ్యయం భారమవటమే కారణం |
|---|---|
| భారీ ఖర్చులకు వెనుకాడుతున్న జనం | డిజిటల్ మాధ్యమాలపై గ్రామీణుల అమితాసక్తి |
| | సంప్రదాయ ప్రింట్, టీవీ మీడియాకూ తగ్గని ఆదరణ |
| | రూరల్ బారోమీటర్ రిపోర్ట్-2025లో వెల్లడి |



సాక్షి, హైదరాబాద్: పెరుగుతున్న ధరలు, ఏమాత్రం పెరగని ఆదాయాలు, ఊడిపోతున్న ఉద్యోగాలు, మారిపోతున్న పరిస్థితులు.. వీటన్నింటి మధ్య గ్రామీణ భారతం ఆర్థికంగా ఆచితూచి అడుగులు వేస్తూనే.. వేగంగా డిజిటల్ యుగంలోకి పరుగులు పెడుతోంది. 2022 నుంచి కుటుంబ నిర్వహణ భారం పెరుగుతుండటంతో గ్రామీణ వినియోగదారులు కొనుగోళ్ల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారని గ్రూప్ ఎం ఇండియా –కాంతార్ సంయుక్తంగా నిర్వహించిన 'రూరల్ బారోమీటర్ రిపోర్ట్ – 2025'లో వెల్లడైంది.

**నివేదికలోని ముఖ్యాంశాలు**

- గ్రామీణ ప్రాంతాల్లో 75% మంది తమ ఆర్థిక స్థిరత్వంపై ఆందోళనలో ఉన్నారు. జీవన వ్యయం పెరగటంతో టీవీలు, వాహనాలు వంటి ఖరీదైన వాటిపై ఖర్చును తగ్గిస్తున్నారు. అదే సమయంలో వ్యక్తిగత రుణాలకు డిమాండ్ పెరుగుతోంది. ఇది వారి ఆర్థిక ప్రాధాన్యతల్లో మార్పును సూచిస్తోంది.
- గ్రామాల్లో ఆర్థికంగా స్థిరమైన వర్గాలు అత్యవసరం కాని ఖర్చులను తగ్గిస్తున్నాయి. వృద్ధులు, ఆర్థికంగా బలహీన వర్గాల వినియోగ ధోరణుల్లో పెద్దగా మార్పు లేదు. ఉచిత రేషన్ పంపిణీ వంటి పథకాలు వీరికి మద్దతుగా నిలుస్తున్నాయి.
- గ్రామీణ భారతం డిజిటల్ రంగంలో అసాధారణ పురోగతి సాధించింది. 2022లో 42 శాతం గ్రామీణులు డిజిటల్ మాధ్యమాలను ఉపయోగించగా, ప్రస్తుతం అది 70 శాతానికి చేరింది. 28% పెరుగుదల నమోదైంది.
- సోషల్ మీడియా, ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్‌లు, వీడియో కంటెంట్, ఓటీటీలు, డిజిటల్ చెల్లింపులు, ఇ-కామర్స్ గ్రామీణుల్లో విస్తృత ఆదరణ పొందుతున్నాయి. టైర్-2 నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఓటీటీ వీక్షణ గణనీయంగా పెరిగింది.
- అదే సమయంలో టీవీ, ప్రింట్, స్థానిక భాషా వార్తాపత్రికలపై ఆయా వర్గాల్లో ఆదరణ స్థిరంగా కొనసాగుతోంది. ముఖ్యంగా మధ్య వయస్కుల్లో ఈ మీడియాపై నమ్మకం సడలలేదు. జనరేషన్ జెడ్, న్యూ కన్స్యూమర్ క్లాసిఫికేషన్ సిస్టమ్ వర్గాలు డిజిటల్ వేదికలపై ఆసక్తి చూపుతున్నాయి.

**ద్వంద్వ చానల్ వ్యూహం అవసరం**

రూరల్ బారోమీటర్ రిపోర్ట్ గ్రామీణ భారతంలో మారుతున్న మీడియా అలవాట్లను, డిజిటల్ వినియోగ లోతును అర్థం చేసుకోవడానికి బ్రాండ్‌లకు వ్యూహాత్మక దిక్సూచిగా పనిచేస్తుంది. సంప్రదాయ మీడియా పరిధిని, డిజిటల్ మీడియా కచ్చితత్వంతో సమ్మేళనం చేసే ద్వంద్వ చానల్ వ్యూహం అవసరం. ఇది బ్రాండ్‌లకు క్షేత్ర స్థాయిలో లోతైన సంబంధాలను నిర్మించే అవకాశాన్ని అందిస్తుంది.

– అజయ్ మెహతా, గ్రూప్ ఎం ఇండియా ఓఓహెచ్ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్.




# సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025




**'ట్రాఫిక్ పే'లో వివక్ష!**
ట్రాఫిక్ విభాగంలో ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు ఇస్తున్న 30 శాతం పొల్యూషన్ పే.. తమకూ అమలు చేయాలని ఉన్నతాధికారులు కోరుతున్నారు. -12లో



**న'గరం'... జాగ్రత్త సుమా..!**
నగరవాసులారా.. జర జాగ్రత్త! ఉష్ణోగ్రతలు పెరిగే ప్రమాదం పొంచి ఉంది. నగర జీవన శైలిలో వేడికి అనుగుణంగా మార్పులు చేసుకోవడం ఎంతో ముఖ్యం. - సిటీప్లస్‌లో

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం
38.0/25.0
నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 38, కనిష్టంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

## నేడు గోల్కొండ కోటలోకి ప్రవేశం ఉచితం



**గోల్కొండ:** వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా శుక్రవారం నగరంలోని గోల్కొండ కోటలోకి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని గురువారం గోల్కొండ కోట సీనియర్ పరిరక్షణ అధికారి మల్లేశం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని అన్ని చారిత్రక కట్టడాలకు నేడు ఉచిత ప్రవేశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## నేటి ప్రజావాణి 22కు వాయిదా



**లక్డీకాపూల్:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించనున్న ప్రజావాణి గుడ్ ఫ్రైడే సందర్భంగా ఈ నెల 22వ తేదీకి వాయిదా వేశారు. దరఖాస్తుదారులు ఈ మార్పును గమనించి 22న రావాల్సిందిగా ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య గురువారం ఒక ప్రకటనలో సూచించారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి



పవన్ (ఫైల్)

**అత్తాపూర్:** ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసగా మారిన బీటెక్ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల్ జిల్లాకు చెందిన పవన్ (30) తన స్నేహితులు గౌతమ్, రోహితులతో కలిసి అత్తాపూర్‌లో ఉంటున్నారు. కొంత కాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడిన పవన్.. తన స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యుల వద్ద అప్పులు చేశాడు. బీటెక్ చదివిన కుమారుడు ప్రయోజకుడు కావాలని పవన్ తండ్రి పెద్ద నర్సింహులు వ్యవసాయాధారిత పంటలపై వచ్చిన డబ్బులను కూడా ఇస్తుండేవాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు సంపాదించుకోవచ్చని భావించిన పవన్ తన బుల్లెట్ వాహనాన్ని, ఐఫోన్‌ను సైతం విక్రయించి మరీ బెట్టింగ్‌లకు పాల్పడేవాడు. స్నేహితులు, బంధువుల వద్ద తీసుకున్న డబ్బులు కూడా పోగొట్టుకోవడంతో మానసికంగా కుంగిపోయిన పవన్ నిరాశతో గదిలో స్నేహితులు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్నేహితుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




**55 వేల మందికి పైగా ఫీజు చెల్లింపు**
- నెల దాటినా ప్రొసీడింగ్స్ అందకపోవడంపై ఆందోళన
- హెచ్‌ఎండీఏ పరిధిలో సుమారు 3.44 లక్షల దరఖాస్తులు

# ఎల్‌ఆర్‌ఎస్.. ప్రొసీడింగ్స్ నో

## అనుమతుల కోసం ఎదురుచూపులు

- రంగారెడ్డి జిల్లా యాచారం మండల కేంద్రానికి చెందిన పర్వతాలు తన 248 చదరపు గజాల స్థలానికి ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. 14 శాతం ఓపెన్‌స్పేస్ ఫీజుతో పాటు రెగ్యులరైజేషన్ చార్జీలతో కలిపి (25 శాతం తగ్గింపుతో) రూ.24,462 చెల్లించారు. ప్రస్తుతం నెల రోజులు దాటింది. కానీ.. ఇప్పటి వరకు హెచ్‌ఎండీఏ నుంచి ప్రొసీడింగ్స్ లభించలేదు. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించినట్లు నిర్ధారణ పత్రం ఉన్నప్పటికీ నెలరోజులు దాటినా అనుమతి పత్రాలు లభించకపోవడంతో ఆయన ఆందోళనకు గురవుతున్నారు.
- శామీర్‌పేట్ ప్రాంతానికి చెందిన ఒక లేఅవుట్‌లో 40 మంది స్థల యజమానులు తమ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం సుమారు రూ.40 లక్షలు ఫీజులు చెల్లించారు. నెలరోజులు దాటినా ప్రొసీడింగ్స్ లభించకపోవడంతో హెచ్‌ఎండీఏ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.
- మహేశ్వరం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తన 500 చదరపు గజాల స్థలం కోసం నిబంధనల మేరకు ఫీజులు చెల్లించారు. ప్రొసీడింగ్స్ రాకపోవడంతో హెచ్‌ఎండీఏకు పరుగెత్తుకొచ్చారు. రెవెన్యూ అధికారుల నుంచి ఎన్‌ఓసీ తెచ్చుకోవాలంటూ సెలవిచ్చారు. తన స్థలం చెరువులు, కుంటలకు దూరంగా ఉందని, అలాంటప్పుడు తాను ఎందుకు రెవెన్యూ ఎన్‌ఓసీ సమర్పించాలని ఆయన ప్రశ్నించారు. ఇలా ఒక్కరో ఇద్దరో కాదు నిత్యం పదుల సంఖ్యలో ఎల్‌ఆర్‌ఎస్ బాధితులు హెచ్‌ఎండీఏ అధికారులను సంప్రదిస్తున్నారు. **- సాక్షి, సిటీబ్యూరో**

ఎల్‌ఆర్‌ఎస్- 2020 పథకంలో భాగంగా హెచ్‌ఎండీఏ పరిధిలో సుమారు 3.44 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు 55వేల మందికి పైగా ఫీజులు చెల్లించారు. మొత్తం దరఖాస్తుదారులు ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకుంటే హెచ్‌ఎండీఏకు ఫీజుల రూపంలో సుమారు రూ.1500 కోట్ల వరకు లభించే అవకాశం ఉన్నట్లు అంచనా. కానీ.. ఇప్పటి వరకు చెల్లించిన ఫీజులపై సుమారు రూ.155 కోట్ల వరకు మాత్రమే ఆదాయం లభించింది. రకరకాల సమస్యల కారణంగా లక్షల కొద్దీ దరఖాస్తులు పెండింగ్ జాబితాలో పడిపోయాయి. ప్రభుత్వం 25 శాతం ఫీజు తగ్గింపు సదుపాయంతో ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించినప్పటికీ సాంకేతిక సమస్యల దృష్ట్యా దరఖాస్తుదారులు ఫీజు చెల్లించేందుకు వెనకడుగు వేస్తున్నారు. మరోవైపు నిబంధనల మేరకు ఫీజులు చెల్లించినవారికి మాత్రం సకాలంలో ప్రొసీడింగ్స్ అందడం లేదు. కేవలం 10 రోజుల్లోనే ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నట్లు అప్పట్లో అధికారులు ప్రకటించారు. కాగా.. నెల రోజులు దాటినా లభించకపోవడం గమనార్హం. ఇలా ప్రొసీడింగ్స్ పెండింగ్‌లో పడిన వాళ్లంతా హెచ్‌ఎండీఏలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ సహాయ కేంద్రానికి వచ్చి మరోసారి తమ వివరాలను అందజేయాల్సివస్తోంది. 'నలభై ప్లాట్‌లకు ఒకేసారి ఫీజులు చెల్లించాం. నెలరోజులు దాటినా ఎలాంటి స్పందన లేదు. సమాధానం చెప్పే అధికారులు కూడా అందుబాటులో లేకుండా పోయారు' అని శామీర్‌పేట్‌కు చెందిన బాధితుడు ఒకరు ఆవేదన వ్యక్తంచేశారు.

**దిద్దు'పాట్లు'..**
మరోవైపు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు ప్రక్రియలో తలెత్తే లోపాలను సరిదిద్దడం కూడా సవాల్‌గా మారింది. ఒకేప్రాంతానికి చెందిన స్థలాలపై రకరకాల ఫీజులు నమోదవుతున్నాయి. 250 చదరపు గజాలు ఉన్న స్థలానికి కొందరికి రూ.18 వేల వరకు ఫీజు నోటీసులు అందితే.. మరికొందరికి రూ.1.14 లక్షల వరకు నోటీసులు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సర్వే నంబర్లు, ప్లాట్ నంబర్లు తప్పుగా నమోదవుతున్నాయి. ఇలాంటి తప్పులను సరిదిద్దేందుకు సైతం దరఖాస్తుదారులు అధికారుల చుట్టూ తిరగాల్సివస్తోంది. కొన్ని మున్సిపల్ కార్యాలయాల్లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ప్రత్యేకంగా నియమించిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కరెక్షన్స్ పేరిట డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు దళారులు సైతం యథావిధిగా తమ దందాను కొనసాగిస్తుండటం గమనార్హం.

# రోడ్ల మరమ్మతులు ఎన్నడో?

- గడువు ముగిసిన సీఆర్‌ఎంపీ కాంట్రాక్ట్
- కొత్తగా టెండర్ల ఆమోదంలో జాప్యం
- సచివాలయ నిర్ణయం కోసం ఎదురుచూపులు

## 'మెయింటెనెన్స్' పనుల కోసం నిరీక్షణ

**సాక్షి, సిటీబ్యూరో:** జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రధాన రహదారులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. కొత్త రోడ్లూ వేయడం లేదు. వేసవిలోనే అడపాదడపా వానలు పడుతున్నాయి. వర్షాలు ఇంకా కొనసాగితే రోడ్లు దారుణంగా దెబ్బతింటాయి. ఈ నేపథ్యంలో అత్యవసరంగా రోడ్ల మర్మతులు చేపట్టాల్సి ఉంది.

**ఏటా మారని పరిస్థితి**
గ్రేటర్ నగరంలో రోడ్ల మరమ్మతుల కోసం ఏటా వందల కోట్లు ఖర్చవుతున్నా పరిస్థితులు అధ్వాన్నంగానే ఉండటంతో ఐదేళ్ల క్రితం ప్రధాన రహదారుల మార్గాల్లోని రోడ్ల నిర్వహణ బాధ్యతల్ని మొత్తం సీఆర్‌ఎంపీ (సమగ్ర రోడ్డు నిర్వహణ పథకం) కింద పెద్దపెద్ద ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. వాటి గడువు ముగిసిపోయి రెండు నెలలు దాటింది. ఈసారి నిర్వహణ, మరమ్మతులు ఎలా చేయనున్నారో ఇంకా స్పష్టత రాలేదు. రోడ్ల నిర్వహణను జీహెచ్‌ఎంసీయే చేస్తుందని ఓసారి, గతంలో మాదిరిగానే సీఆర్‌ఎంపీ కింద ప్రైవేటుకిస్తామని మరోసారి అధికారులు పేర్కొన్నారు. మరోవైపు సీఆర్‌ఎంపీ కింద టెండర్లు పిలిచేందుకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. అందులో రెండు రకాల ప్రతిపాదనలున్నాయి. అనుమతి కోసం సంబంధిత ఫైలు సచివాలయానికి పంపారు. ముఖ్యమంత్రి అనుమతిస్తే టెండర్లు పిలుస్తామని, నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

**రెండు ప్రతిపాదనలు ఇలా..**
ప్రభుత్వానికి రెండు రకాల ప్రతిపాదనలు పంపించారు. ఒక ప్రతిపాదన మేరకు గతంలో ఉన్న మార్గాల్లోనే అంతే దూరం పనులుండగా, మరో ప్రతిపాదనలో అదనంగా కొన్ని రోడ్లను చేర్చారు. అంతేకాదు.. గతంలో బాగా దెబ్బతిన్న రోడ్ల రీకార్పెటింగ్‌తో పాటు ఫుట్‌పాత్‌లు, స్వీపింగ్, గ్రీనరీ వంటి పనులుండగా, ఈసారి మాత్రం నాలాల్లోని డీసిల్టింగ్ కూడా చేర్చారు. కేవలం డీసిల్టింగ్‌కు మాత్రమే టెండర్లు పిలిచినా పనులు పూర్తి కావడం లేవు. సీఆర్‌ఎంపీలోనే వాటిని కూడా చేర్చితే పనులు జరుగుతాయని సంబంధిత అధికారులు భావించినట్లుంది.

**అ'ధనం'గా..**
పాత రోడ్లకే అయితే 744 కి.మీ. నిర్వహణకు అంచనా వ్యయం రూ.2491 కోట్లు కాగా, కొత్త రోడ్లు కూడా కలిపి 1142 కి.మీ. నిర్వహణకు రూ.అంచనా వ్యయం రూ.3825 కోట్లు. గతం కంటే 398 కి.మీ. మేర పనులు, రూ.1334 వ్యయం అదనం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో సీఆర్‌ఎంపీ పనులు సవ్యంగా పూర్తయిందీ లేనిదీ తెలుసుకోవాలని, సదరు నివేదికను కూడా తనకు పంపించాల్సిందిగా అధికారులను ఆదేశించడం తెలిసిందే.




# మామిడి తోటలో మృత్యువు కాటేసింది

**విద్యుదాఘాతంతో భార్య కళ్లెదుటే భర్త దుర్మరణం**
- శంషాబాద్‌లో యువ సాఫ్ట్‌వేర్ విషాదాంతం



భర్త చేతన్‌రెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న బిందు



చేతన్‌రెడ్డి (ఫైల్)

**శంషాబాద్:** బైక్‌పై వెళ్తున్న దంపతులకు రహదారి పక్కనే ఉన్న ఓ తోటలో కనిపించిన మామిడి కాయలు ఆకర్షించాయి. వాటిని తెంపి తీసుకొస్తున్న క్రమంలో భర్త విద్యుదాఘాతంతో అక్కడికక్కడే అసువులు బాసిన విషాదకర ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో నివాసముంటున్న తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలానికి చెందిన కె.చేతన్‌రెడ్డి (26) నగరంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగి. ఆయన భార్య బిందు. మొయినాబాద్‌లోని భాస్కర లా కళాశాలలో గురువారం ఆమెతో పరీక్షలు రాయించి తిరిగి ఇబ్రహీంపట్నానికి బైక్‌పై బయలుదేరారు. పెద్దషాపూర్ రైల్వేట్రాక్‌కు సమీపంలో రహదారి పక్కనే ఉన్న ఓ తోటలో విరగగాసిన మామిడి కాయలను చూసిన చేతన్‌రెడ్డి వాహనాన్ని నిలిపివేశాడు. తోటలోని మామిడికాయలు కోసుకు వస్తుండగా.. చెట్టు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలడంతో చేతన్‌రెడ్డి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. భర్త అచేతనగా పడి ఉండటాన్ని చూసిన బిందు అరవడంతో స్థానికులు వచ్చి అతడిని పక్కకు జరిపారు. సీపీఆర్ చేసినా ఫలితం లేకుండాపోయింది. అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. అక్కడికి వచ్చిన శంషాబాద్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళకు అరుదైన శస్త్ర చికిత్స

- 9 గంటల పాటు శ్రమించిన 'ప్రీతి' ఆస్పత్రి వైద్యులు
- దేశంలోనే ఇలాంటి ఆపరేషన్ తొలిసారి అని వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ప్రీతి ఆస్పత్రి ఎండీ చంద్రమోహన్, చిత్రంలో వైద్య సిబ్బంది

**బంజారాహిల్స్:** నగరానికి చెందిన ఓ మహిళకు ప్రీతి ఆస్పత్రి యూరాలజీ వైద్యులు 9 గంటల పాటు సుదీర్ఘంగా కీహోల్ శస్త్రచికిత్స చేసి, రెండు వైపులా మూత్ర నాళాలను మార్చారు. ఈ మేరకు బంజారాహిల్స్ తాజ్‌డెక్కన్ హోటల్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆస్పత్రి ఎండీ, కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ చంద్రమోహన్ మాట్లాడారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. 'మహిళలకు వివిధ కారణాలతో గర్భసంచి తొలగించడం మామూలే. అయితే.. నగరానికి చెందిన 52 ఏళ్ల మహిళకు మూడు సంవత్సరాల క్రితం గర్భసంచి తొలగించినప్పుడు ఇన్‌ఫెక్షన్ కారణంగానో, లేక ఇతర కారణాలతోనో రెండు మూత్రనాళాలు పైనుంచి కింది వరకు మొత్తం పాడయ్యాయి. కేవలం పైన కిడ్నీ తొడిమ మాత్రమే మిగిలింది. ఆమెకు క్రియాటినైన్ స్థాయి కూడా పెరిగిపోయి, కిడ్నీల పనితీరు కూడా దెబ్బతింది. ఇలా జరగడం అత్యంత అరుదు. ప్రపంచం మొత్తమ్మీద తొమ్మిది కేసులకు మాత్రమే ఇప్పటికీ ఈ చికిత్స చేశారు. సాధారణంగా లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సల్లో మూడు చిన్న రంధ్రాలే చేస్తారు. కానీ సదరు మహిళకు 13 రంధ్రాలు చేసి శస్త్ర చికిత్స చేశాం. మూత్రనాళాలు పూర్తిగా పాడైపోయి సన్నగా కావడంతో చిన్న పేగుల్లోంచి 35 సెంటీమీటర్లను రెండు భాగాలుగా తీసుకుని వాటిని కిడ్నీ తొడిమ నుంచి బ్లాడర్‌కు రెండువైపులా అమర్చి కుట్లు వేశాం. శస్త్ర చికిత్సకు మొత్తం 9 గంటల సమయం పట్టింది. శస్త్ర చికిత్స పూర్తయిన తర్వాత రోగి లేచి నడవగలుగుతున్నారు. ఆమె క్రియాటినైన్ సాధారణ స్థాయికి చేరుకున్నారు. ఇలాంటి శస్త్ర చికిత్స దేశంలోనే తొలిసారి' అని డాక్టర్ చంద్రమోహన్ వివరించారు.

# తార్నాక జంక్షన్.. రీ ఓపెన్!

## దాదాపు పదేళ్లుగా చౌరస్తా మూసివేత

- 2015 జూలై నుంచి 'యూ టర్న్' అమలు
- తెరవాలని ట్రాఫిక్ అధికారులకు విజ్ఞప్తులు
- ప్రయోగాత్మకంగా నేటి నుంచి రాకపోకలు
- ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్న ట్రాఫిక్ విభాగం



**సాక్షి, సిటీబ్యూరో:** దాదాపు దశాబ్ద కాలంగా మూతపడిన తార్నాక జంక్షన్‌ను నగర ట్రాఫిక్ విభాగం అధికారులు ఎట్టకేలకు ప్రయోగాత్మకంగా తెరవనున్నారు. శుక్రవారం నుంచి మే 2 తేదీ వరకు ఈ చౌరస్తాను ఓపెన్ చేయనున్నారు. ఈ మధ్యకాలంలో అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి.. ఆపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు గురువారం సిటీ ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్ ప్రకటించారు. ఉస్మానియా యూనివర్సిటీ- లాలాపేట వైపుల నుంచి రాకపోకలు సాగించడానికి గతంలో ఈ జంక్షన్‌ను వినియోగించే వాళ్లు.

తార్నాక ఫ్లైఓవర్ నిర్మాణానికి ముందు హబ్సిగూడ-మెట్టుగూడ వైపుల నుంచి రాకపోకలు సాగించడానికీ ఈ జంక్షన్ ఉపకరించింది. 1990 నుంచి తార్నాక ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చింది. అయితే.. తార్నాక చౌరస్తాను మాత్రం 2015 జూలై వరకు తెరిచే ఉంచారు. ఆపై మూసివేయడంతో పాటు లాలాపేట నుంచి ఉస్మానియా యూనివర్సిటీ వైపు వెళ్లే వాహనాలు హెచ్‌ఎండీఏ కార్యాలయం వరకు వెళ్లి యూ టర్న్ చేసుకుని వచ్చేలా.. అలాగే యూనివర్సిటీ నుంచి లాలాపేట వైపు వెళ్లే వాహనాలు రైల్వే డిగ్రీ కళాశాల వద్ద యూ-టర్న్ తీసుకుని వచ్చేలా మార్పుచేర్పులు చేశారు. మెట్రో రైలు ప్రాజెక్ట్ నిర్మాణానికి ముందు ఈ సిగ్నల్ వద్దే ఒకే పోలీసు అధికారి విధులు నిర్వర్తించేవారు.

అనంతర పరిస్థితుల నేపథ్యంలో ఈ సంఖ్య ఎనిమిదికి పెంచాల్సి వచ్చింది. దీంతో పాటు ఇతర పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నతాధికారులు 2015లో ఈ జంక్షన్‌ను మూసేశారు.

**అనేక విజ్ఞప్తుల నేపథ్యంలో నిర్ణయం...**
ఈ చౌరస్తాను మళ్లీ తెరవాలంటూ కొన్నేళ్లుగా అనేక మంది ట్రాఫిక్ విభాగానికి విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో మాదిరిగా ఇప్పుడు పరిస్థితులు లేవని, ట్రాఫిక్ జామ్స్ కావని చెబుతున్నారు. ఈ చౌరస్తా మూసేయడంతో 'యూ-టర్న్' కోసం దాదాపు కిలోమీటరు ముందుకు వెళ్లి, తిరిగి రావాల్సి వస్తోందని విజ్ఞప్తి చేస్తున్నారు. యూ టర్న్‌ల కేంద్రంగా ట్రాఫిక్ జామ్స్ జరుగుతుండటాన్నీ ట్రాఫిక్ అధికారులు గుర్తించారు. దీంతో శుక్రవారం నుంచి ఈ జంక్షన్‌ను ప్రయోగాత్మకంగా రీ-ఓపెన్ చేయాలని నిర్ణయించారు. గతానికి భిన్నంగా రూట్ ఇస్తున్న నేపథ్యంలో దీనికి సంబంధించి ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్ కొన్ని కీలక సూచనలు చేశారు.
- ఓయూ వైపు నుంచి వచ్చే వాహనాలు నేరుగా లాలాపేట వైపు, కుడివైపు తిరిగి హబ్సిగూడ వైపు వెళ్లే అవకాశం ఉంది.
- లాలాపేట వైపు నుంచి వచ్చే వాహనాలు నేరుగా ఓయూ వైపు వెళ్లడానికి, కుడి వైపు తిరిగి మెట్టుగూడ వైపు రావడానికి అవకాశం ఉంది.
- మెట్టుగూడ వైపు నుంచి వచ్చే వాహనాలు మాత్రం ఈ చౌరస్తా వద్ద కుడివైపు తిరిగి ఓయూ వైపు వెళ్లే అవకాశం లేదు. నేరుగా హెచ్‌ఎండీఏ కార్యాలయం వరకు వెళ్లి, యూ టర్న్ తీసుకుని వచ్చి, చౌరస్తా వద్ద ఎడమ వైపు తిరిగి ఓయూ రూట్‌లోకి వెళ్లాలి.
- హబ్సిగూడ వైపు నుంచి వచ్చే వాహనాలు కూడా తార్నాక జంక్షన్ వద్ద కుడి వైపు తిరిగి లాలాపేట వైపు వెళ్లే అవకాశం లేదు. ఈ వాహనాలు ఎడమ వైపు తిరిగి, రైల్వే డిగ్రీ కాలేజీ వరకు వెళ్లి యూ టర్న్ తీసుకోవాలి. ఆపై చౌరస్తా వరకు వచ్చి ఎడమ వైపు తిరిగి లాలాపేట వైపు వెళ్లాలి.

# రంగంలోకి జలమండలి విజిలెన్స్

- నల్లాలకు మోటార్ల బిగింపుపై సీరియస్
- కొనసాగుతున్న మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్ డ్రైవ్

**సాక్షి, సిటీబ్యూరో:** తాగునీటి సరఫరాలో లో ప్రెషర్ సమస్యను కట్టడి చేసేందుకు కొనసాగుతున్న మోటార్ ఫ్రీ ట్యాప్ వాటర్ స్పెషల్ డ్రైవ్‌లో జలమండలి విజిలెన్స్ రంగంలోకి దిగింది. ప్రధానంగా బహుళ అంతస్తుల భవనాలపై దృష్టి సారించి నీటి సరఫరా సమయంలో నల్లా మోటార్ల కోసం జల్లెడ పడుతోంది. మరోవైపు లో ప్రెషర్ సమస్యపై మెట్రో కస్టమర్ కేర్, వాట్సాప్‌లకు వస్తున్న ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించింది. జలమండలి విజిలెన్స్ డీఎస్పీ జ్ఞానేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రామిశెట్టి సురేష్ ఆధ్వర్యంలో సుమారు 50కిపైగా ప్రత్యేక బృందాలు తనిఖీలు ముమ్మరం చేశాయి. మూడు రోజులుగా నీటి సరఫరా సమయంలో దాడులు నిర్వహిస్తూ నల్లాలకు బిగించిన మీటర్లను సీజ్ చేయడంతో పాటు జరిమానాలు విధిస్తున్నాయి. కొన్ని సంఘటనల్లో కేసులు కూడా నమోదు చేసేందుకు సిఫార్సు చేస్తున్నాయి.

**అపార్ట్‌మెంట్‌లో ఆరు మోటార్లు**
తాజాగా గురువారం నారాయణగూడ పరిధిలోని పర్దా గేట్ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్ నల్లాకు మోటార్లు బిగిస్తున్నారనే వాటప్స్ సమాచారం అందటంతో నీటి సరఫరా సమయంలో విజిలెన్స్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఏకంగా నల్లా పైపులైనుకు అక్రమంగా బిగించిన ఆరు మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. అపార్ట్‌మెంట్‌లోని 6 ఫ్లోర్‌లకు 6 మోటార్లు బిగించి నీటిని తోడుతున్నట్లు గుర్తించారు. తాగునీటి నల్లాలకు అక్రమంగా మోటార్ బిగిస్తే కేసులు నమోదు చేస్తామని జలమండలి విజిలెన్స్ డీఎస్పీ జ్ఞానేందర్ రెడ్డి హెచ్చరించారు.



సీజ్ చేసిన మోటార్లతో జలమండలి విజిలెన్స్ అధికారులు (ఫైల్)

## పరువునష్టం కేసు విచారణకు సీఎం గైర్హాజరు

**విచారణను ఈనెల 24కు వాయిదా వేసిన నాంపల్లి కోర్టు**

సిటీ కోర్టులు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీజేపీ దాఖలు చేసిన పరువునష్టం కేసుపై గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో విచారణ జరిగింది. ఈ కేసు విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు కావడంతో న్యాయస్థానం విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది. ఈ కేసు విచారణకు ఫిర్యాదుదారుడు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు కూడా గైర్హాజరయ్యారు. ప్రతివాది అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ కార్యకలాపాల నేపథ్యంలో కోర్టుకు రాలేక పోయారని ఆయన తరుపు న్యాయవాదులు విశ్వేశ్వ ర్‌రావు కోర్టుకు సూచిస్తూ పిటిషన్ దాఖలు చేశారు.





## రాజ్‌తరుణ్‌పై న్యాయపోరాటం చేస్తా

- నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో మరోసారి ఫిర్యాదు
- నాపై 15 మంది దాడి చేశారు ప్రాణహాని ఉంది
- రాజ్‌తరుణ్ మాజీ ప్రియురాలు లావణ్య



మీడియాతో మాట్లాడుతున్న లావణ్య

మణికొండ: తాను ఉంటున్న ఇంటిని లాక్కునేందుకు సినీహీరో రాజ్‌తరుణ్ అతని తల్లితండ్రులను పంపి డ్రామాలు చేస్తున్నాడని, అతని అనుచరులతో తనపై దాడి చేయించాడని, అతడిపై న్యాయ పోరాటం చేస్తానని అతని మాజీ ప్రియురాలు లావణ్య అన్నారు. కోకాపేటలోని రాజ్‌తరుణ్ విల్లాకు బుధవారం అతని తల్లితండ్రులు రాజేశ్వరి, బసవరాజు తాము ఇక్కడే ఉంటామని రాగా, వారిని ఇంట్లోకి రానివ్వకుండా లావణ్య అడ్డుకున్న విషయం తెలిసిందే. వారు అర్ధరాత్రి వరకు విల్లా ముందే కూర్చోవటంతో నార్సింగి పోలీసులు జోక్యం చేసుకుని వారిని ఇంట్లోకి పంపించారు. దీంతో గురువారం ఆమె రాజ్‌తరుణ్ తరఫు వ్యక్తులు 15 మంది తనపై దాడి చేశారని, వారి వెనక అతనే ఉన్నాడా.. మస్తాన్ సాయి ఉన్నాడా అనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తనకు రాజ్‌తరుణ్‌తో ప్రాణహాని ఉందని, ఇప్పటి వరకు కలిసి పోదామని మిన్నకున్నానని, బుధవారం జరిగిన దాడితో అతనిపై న్యాయపోరాటం చేస్తానన్నారు. బెయిల్‌పై ఉన్న వ్యక్తి తనపై దాడులు చేయిస్తున్నారని ఆమె ఆరోపించింది. మస్తాన్‌సాయిని పంపినట్లు రాజ్‌తరుణ్‌ను కూడా జైలుకు పంపుతానన్నారు. కాగా రాజ్‌తరుణ్ తల్లి తండ్రులు విల్లాలోని రెండవ అంతస్తులో ఉండగా లావణ్య మొదటి అంతస్తులో ఉంటున్నట్లు తెలిపారు.

## ప్రియుడు పెళ్లికి నిరాకరించాడని..

**భవనం పైనుంచి దూకి ప్రియురాలి ఆత్మహత్య**



సుల్తానా బేగం (ఫైల్)

గచ్చిబౌలి: ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి లోనైన ఓ యువతి ప్రియుడి ఇంటిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని బంజారానగర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ రాములు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అస్సాం రాష్ట్రం, బస్కంది గ్రామానికి చెందిన సుల్తానా బేగం(26) సిద్ధిఖీనగర్‌లో ఉంటూ గచ్చిబౌలిలోని అంతేరా హోటల్‌లో సర్వర్‌గా పని చేస్తోంది. వెస్ట్ బెంగాల్‌కు చెందిన సైదుల్లా షేక్ గచ్చిబౌలిలోని నావాబ్ హోటల్‌లో మేనేజర్‌గా పని చేస్తూనే పెస్ట్ కంట్రోల్ పని చేసేవాడు. సుల్తానా, సైదుల్లా షేక్ మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. సుల్తానా తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి చేసేందుకు సంబంధాలు చూస్తుండటంతో తనను పెళ్లి చేసుకోవాలని సుల్తానా సైదుల్లాపై ఒత్తిడి పెంచింది. బుధవారం సాయంత్రం పెళ్లి విషయమై గొడవ జరిగింది. దీంతో పెళ్లికి నిరాకరించిన అతను ఆమె ఫోన్‌ను బ్లాక్‌లో పెట్టాడు. దీంతో సుల్తానా మరో యువతికి ఫోన్ చేసి సైదుల్లా ఉంటున్న ఇంటిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పింది. దీంతో ఆమె ఈ విషయాన్ని సైదుల్లాకు చెప్పినా అతను పట్టించుకోలేదు. దీంతో మనస్తాపానికి లోనైన సుల్తానా గురువారం ఉదయం సైదుల్లా నివాసం ఉండే భవనంపైకి ఎక్కి 6వ అంతస్తు నుంచి దూకడంతో కింద పార్క్ చేసి ఉన్న కారుపై పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించగా ఉదయం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ‘ట్రాఫిక్ పే’లో వివక్ష!

- ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకే పొల్యూషన్ పే
- 2016 నుంచి 30 శాతం ఇస్తున్న సర్కారు
- మరికొన్ని విభాగాల్లోనూ ప్రోత్సాహకాలు
- అక్కడ మాత్రం అన్ని ర్యాంకులకు వర్తింపు
- తమకూ ఇవ్వాలంటున్న ఉన్నతాధికారులు



సాక్షి, సిటీబ్యూరో: ట్రాఫిక్ నిర్వహణ కోసం ఓ జంక్షన్‌లో హోంగార్డు, ఇన్‌స్పెక్టర్, ఏసీపీ, అదనపు డీసీపీ నిల్చున్నారు. దాదాపు మూడు గంటల పాటు ఎవరి డ్యూటీలు వారు చేశారు. ఈ నలుగురిలో హోంగార్డు, ఇన్‌స్పెక్టర్‌పై వాయు కాలుష్య ప్రభావం ఉండగా... ఏసీపీ, అదనపు డీసీపీపై మాత్రం లేదన్నది ప్రభుత్వ ఉద్దేశం. అందేంటని అనుకుంటున్నారా..? ఈ కారణంగానే ట్రాఫిక్ వింగ్‌లో పని చేసే వారికి చెల్లిస్తున్న 30 శాతం పొల్యూషన్ పే ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకే అమలు చేయడం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయి విధులు నిర్వర్తించాల్సిందేనని, తమకూ పొల్యూషన్ పే అమలు చేయాలని ఉన్నతాధికారులు కోరుతున్నారు.

### రాజధానిలోనే ఎక్కువ ప్రభావం...

రాజధానిలో కాలుష్య ప్రమాణాలు నానాటికీ ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతున్నాయి. ఇది వాహనాలు ప్రయాణించే రోడ్లు, సిగ్నల్స్ నేపథ్యంలో ఆగుతున్న జంక్షన్ల వద్ద ఎక్కువగా ఉంటోంది. నగరంలో మొత్తం 585 ట్రాఫిక్ జంక్షన్లు ఉన్నాయి. వీటిలో దాదాపు 400 ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు విధి నిర్వహణ (పాయింట్ డ్యూటీ)లో ఉంటున్నారు. అన్నిచోట్లా కాలుష్యం స్థాయి ఒకేలా ఉండట్లేదు. వాహన శ్రేణి, రాకపోకల సంఖ్య ఆధారంగా లెక్కిస్తే 125 జంక్షన్లలో అత్యంత తీవ్రంగా... మరో 200 జంక్షన్లలో తీవ్రంగా ఉంటోంది. కాలుష్య నియంత్రణ మండలి నివేదికల ఆధారంగా ట్రాఫిక్ పోలీసుల గతంలో ఈ గణాంకాలను రూపొందించారు. ఈ వాయు కాలుష్యానికి తోడు ప్రమాణాలు పాటించని/ మోడ్రన్ హారన్లు, శక్తిమంతమైన లైట్లు శబ్ద, కాంతి కాలుష్యాలకూ కారకాలవుతున్నాయి. వీటికి చెక్ చెప్పేందుకు అవసరమైన యంత్రాలు, యంత్రాంగం లేకపోవడంతో ఇబ్బందులు నానాటికీ పెరుగుతున్నాయి.

### ప్రమాదపుటంచుల్లో ట్రాఫిక్ సిబ్బంది....

ఈ పరిస్థితుల్లో పని చేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది అనేక ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. 2012లో ట్రాఫిక్ సిబ్బందికి నిర్వహించిన సామూహిక వైద్య పరీక్షల ఫలితాలను విశ్లేషించిన నాటి ట్రాఫిక్ చీఫ్ సీవీ ఆనంద్ ఆందోళనకర అంశాలను గుర్తించారు. నగర ట్రాఫిక్ విభాగంలో పని చేస్తున్న వారిలో అనేక మంది ఊపిరితిత్తులు, కళ్లు, చెవులకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నారని తేలింది. సరాసరిన 32 శాతం మందికి ఊపిరితిత్తుల, 25 శాతం మందికి కంటి, ఏడు శాతం మందికి చెవి సంబంధ రుగ్మతలు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి జీతానికి అదనంగా పొల్యూషన్ పే ఇప్పించాలని నిర్ణయించారు. ఈ మేరకు 30 శాతం ఇప్పించాలంటూ సీవీ ఆనంద్ అప్పట్లో పార్లమెంట్ స్థాయీ సంఘాన్ని కోరారు. వారు ఆమోదముద్ర వేయడంతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. వీటిని పరిగణలోకి తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం అనేక మార్పుచేర్పులతో 2016 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

### అక్కడ అలా... ఇక్కడ ఇలా...

పోలీసు విభాగంలో లూప్‌లైన్లుగా భావించే అవినీతి నిరోధక శాఖ, పోలీసు అకాడమీల్లో పని చేస్తున్న సిబ్బందికి జీతంపై అదనంగా 30 శాతం చెల్లించే విధానం అమలులో ఉంది. కీలక బాధ్యతలు నిర్వర్తించే సీఐ సెల్, ఆక్టోపస్, సీఐడీ, సీఎస్ డబ్ల్యూల్లోనూ అదనపు చెల్లింపు విధానం అమలవుతోంది. అయితే అక్కడ అన్ని స్థాయిల అధికారులకు ఇది వర్తిస్తుంది. ట్రాఫిక్ విభాగం దగ్గరకు వచ్చేసరికి తొలుత కానిస్టేబుల్ నుంచి ఇన్‌స్పెక్టర్ వరకు ఇచ్చారు. ఆపై హోంగార్డుల్నీ ఈ జాబితాలో చేర్చారు. గతంలో మాదిరిగా కాకుండా ప్రస్తుతం ఉన్నతాధికారులు సైతం పాయింట్ డ్యూటీలు చేయాల్సి వస్తోంది. దీంతో ఏసీపీలు, అదనపు డీసీపీలు, డీసీపీలు, ట్రాఫిక్ చీఫ్‌కు ఇది వర్తించాలని పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే ఇప్పటికీ సర్కారు దీనిపై దృష్టి పెట్టట్లేదని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ట్రాఫిక్ విభాగంలోనే పని చేస్తున్న తమకూ ఆ పొల్యూషన్ పే అమలు చేయాలని కోరుతున్నారు. ఈ దిశలో డీజీపీ కార్యాలయం సైతం కృషి చేయాలని వేడుకుంటున్నారు.

## లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: ఇంటర్ విద్యార్థినిని ప్రేమ, పెళ్లి పేరుతో నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.30వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి పద్మావతి గురువారం తీర్పు చెప్పారు. ఏపీపీ సునీత, రఘు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పటేల్‌గూడా గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థినికి నరేందర్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. దీనిని అసరాగా తీసుకున్న అతను సదరు విద్యార్థినిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి 2018 ఏప్రిల్ 19న యాదగిరిగుట్టకు తీసుకెళ్లి తప్పుడు ధృవపత్రాలతో వివాహం చేసుకుని 24న వరకు అక్కడే ఉన్నాడు. తమ కుమార్తె కనిపించడం లేదని బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు యాదగిరిగుట్టలో వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి అతడిపై కిడ్నాప్, లైంగిక దాడి, పోక్సో చట్టాల కింద కేసులు నమోదు చేశారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం గురువారం నిందితుడికి పైవిధంగా శిక్ష ఖరారు చేస్తూ తీర్పు ఇచ్చింది. బాధితురాలికి రూ.4లక్షలు నష్టపరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

# ఫోన్ చోరీ... ఖాతా ఖాళీ!

- తొలుత సెల్‌ఫోన్లు చేజిక్కించుకుంటున్న నేరగాళ్లు
- యూపీఐ యాప్స్ వినియోగించి డబ్బు స్వాహా
- బస్సుల్లో సంచరిస్తున్న వ్యవస్థీకృత ముఠాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసు అధికారులు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సంచరించే సిటీ బస్సుల్లో తిరుగుతూ... ప్రయాణికుల సెల్‌ఫోన్లు తస్కరించే ముఠాలు ఎన్నో ఉన్నాయి. అయితే ఈ సెల్‌ఫోన్లను వినియోగించి వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసే గ్యాంగ్స్ ఇటీవల పుట్టుకొచ్చాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ వ్యక్తి రూ.2.98 లక్షలు నష్టపోగా... తాజాగా ఓ మహిళ రూ.1.04 లక్షలు పోగొట్టుకున్నారు. ఇలాంటి ముఠాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఫోన్ పోయిన వెంటనే కొన్ని కీలక జాగ్రత్తలు తీసుకోవాలని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. నగరానికి చెందిన ఓ మహిళా ఉద్యోగి (45) ఇటీవల తార్నాక నుంచి కాచిగూడకు వెళుతుండగా ఆమె ఫోన్ తస్కరణకు గురైంది. ఆ తర్వాత రెండు రోజులకు ఆమె కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ లోపే నేరగాళ్లు ఆమె బ్యాంకు ఖాతా నుంచి అక్రమ లావాదేవీలు చేసి రూ.1,04,901 కాజేశారు. ఆ ఫోన్‌లో ఉన్న సిమ్‌కార్డు నెంబరే బ్యాంకు ఖాతాతో లింకై ఉండటంతో పాటు యూపీఐ యాప్స్ అందులోనే ఉన్నాయి. ఫోన్ అన్‌లాక్ చేయడానికి, యూపీఐ లావాదేవీలకు పటిష్టమైన పాస్‌వర్డ్ లేకపోవడంతో తేలిగ్గా తెరిచిన నేరగాళ్లు అక్రమ లావాదేవీలు చేయగలిగారు. ఈ లావాదేవీలపై బ్యాంకు నుంచి ఎస్సెమ్మెస్‌లు వచ్చినప్పటికీ... ఫోన్ సైతం నేరగాళ్ల వద్దే ఉండటంతో బాధితురాలికి విషయం తెలియలేదు. బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకున్న తర్వాతే తాను నష్టపోయిన విషయం గుర్తించిన బాధితురాలు గురువారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఇటీవల చోటు చేసుకుంటున్న ఈ నేరాలను గమనించిన సైబర్ క్రైమ్ పోలీసులు ఇలాంటి వ్యవస్థీకృత ముఠాలు బస్సుల్లో సంచరిస్తున్నట్లు అనుమానిస్తున్నారు.

### పాస్‌వర్డ్ పటిష్టంగా ఉండాలి..

ఈ నేపథ్యంలో నగరవాసులకు కొన్ని కీలక హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఆండ్రాయిడ్, ఐఫోన్లలో కచ్చితంగా ఫైండ్ మై డివైజ్‌ను యాక్టివేట్ చేసుకోవాలని కోరుతున్నారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సిమ్‌కార్డు బ్లాక్ చేయించుకోవాలని, పోలీసులతో పాటు బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరుతున్నారు. తన నెట్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలను నిలిపివేయాల్సిందిగా బ్యాంకును కోరాలని సూచిస్తున్నారు. అన్‌లాక్, యూపీఐ చెల్లింపుల పాస్‌వర్డ్స్ పటిష్టంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేస్తున్నారు.

## న్యాయమూర్తుల బదిలీ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.స్వాతిరెడ్డి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న పి.చందన బదిలీ అయ్యారు. స్వాతిరెడ్డిని సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు, చందనను 6వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌గా హైదరాబాద్‌కు బదిలీ చేశారు. హైదరాబాద్ 6వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్. సంతోష్‌కుమార్‌ను చందన స్థానంలో సిద్దిపేట అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

## ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో అకౌంట్ హోల్డర్ అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ వ్యక్తికి ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో ఎర వేసి, రూ.1.44 కోట్లు కాజేసిన కేసులో నిందితుడిగా ఉన్న అకౌంట్ హోల్డర్‌ను సిటీ సైబర్ క్రైమ్ పోలీసుల నోయిడాలో అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి (36) డి12-స్టాక్ మార్కెట్ ప్రాఫిట్ గైడ్ గ్రూప్ పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూప్ ద్వారా కొందరు పరిచయమయ్యారు. సంజయ్ పేరుతో పరిచయం చేసుకున్న నేరగాడు ఇన్వెస్ట్‌మెంట్స్‌లో మెళకువలు సూచిస్తానని చెప్పాడు. ఆపై ఓ యాప్‌ను లింకు ద్వారా డౌన్‌లోడ్ చేయించాడు. దాని ద్వారా పెట్టుబడులు పెట్టిస్తూ తొలినాళ్లలో లాభాలు ఇచ్చాడు. అలా ఉచ్చులోకి దింపి మొత్తం రూ.1.47 కోట్లు డిపాజిట్ చేయించుకుని స్వాహా చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు బాధితుడి డబ్బులో కొంత నోయిడాలో నివసిస్తున్న మధ్యప్రదేశ్ వాసి ఆకాశ్ వర్మ ఖాతాలోకి వెళ్లినట్లు గుర్తించారు. అతడిని పట్టుకుని ఆరా తీయగా... 10 శాతం కమీషన్‌కు ఆశపడి సైబర్ నేరగాళ్లకు తన ఖాతా వివరాలు ఇచ్చినట్లు అంగీకరించాడు. వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్ అయిన ఆకాష్‌పై తెలంగాణలో నాలుగు, దేశ వ్యాప్తంగా 30 కేసులు ఉన్నట్లు తెలిపారు.

## పెంపుడు కుక్కను చెడగొడుతున్నాయని..

- వీధి కుక్కలను చంపిన యజమాని
- జంతు ప్రేమికుల ఫిర్యాదు
- కేసు నమోదు



చనిపోయిన కుక్క పిల్లలు

అల్వాల్: తన పెంపుడు కుక్కను వీధి కుక్కలు చెడగొడుతున్నాయని ఆగ్రహానికి లోనైన ఓ వ్యక్తి వీధి కుక్కలను గోడకేసి కొట్టి కాలితో తొక్కి చంపేసిన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇంటీరియర్ డెకరేటర్‌గా పనిచేసే ఆశీష్ కుటుంబంతో కలిసి బొల్లారంలోని వీబీసిటి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. పూర్తిగా శాఖాహారి అయిన ఆశీష్ రెండు కుక్కలను పెంచుకుంటూ వాటికి శాఖాహారమే అలవాటు చేశాడు. ఈ క్రమంలో అపార్టుమెంట్ పరిసరాల్లో వీధికుక్కలు మాంసాహారం తింటూ తరుచూ తన పెంపుడు కుక్కల వద్దకు రావడం, వాటిపై దాడి చేస్తుండటంతో అతను విసుగెత్తిపోయాడు. ఈ నెల 14న సాయంత్రం అతను కుక్కను తీసుకొని అపార్టుమెంట్ సెల్లార్‌లోకి వెళ్లగా వీధి కుక్క పిల్లలతో సహా అక్కడికి వచ్చింది. దీంతో ఒక్కసారిగా విచక్షణ కోల్పోయిన ఆశీష్ నాలుగు కుక్కపిల్లలను గోడకేసి కొట్టి కాలితో తొక్కి చంపేశాడు. జంతు ప్రేమికులు బుధవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాస్కెట్‌బాల్‌ పోటీల్లో విద్యార్థుల సత్తా

బంజారాహిల్స్‌: పుదుచ్చేరిలో జరిగిన 40వ జాతీయ స్థాయి బాస్కెట్‌ బాల్‌ పోటీల్లో తెలంగాణ అండర్‌–16 బాస్కెట్‌ బాల్‌ జట్టు సత్తా చాటింది. దేశంలోని 29 రాష్ట్రాల నుంచి వచ్చిన జట్లతో తెలంగాణ జట్టు ధీటుగా తలబడి టాప్‌–4లో నిలిచారని జట్టు కోచ్‌లు సంతోష్‌, పంకజ్‌, అమృత్‌ తెలిపారు. బాస్కెట్‌ బాల్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో అగ్రశేణి జట్లుగా ఉన్న ఢిల్లీ, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్‌ జట్లను ఓడించిన తెలంగాణ జట్టు అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచిందని కోచ్‌లు తెలిపారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ తెలంగాణ బాస్కెట్‌ బాల్‌ జట్టులో ఉన్నారని వారు తెలిపారు.

## ఇంటి ముందు ఆడుకోవద్దన్నందుకు దాడి

బంజారాహిల్స్‌: ఓ మహిళ తన పొరుగింటి పిల్లలను ఇంటి ముందు ఆడుకోవద్దన్నందుకు ముగ్గురు వ్యక్తులు ఆమె కుమారుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటన బంజారాహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–12లోని సయ్యద్‌నగర్‌లో నివసించే షేక్‌ సలావుద్దీన్‌ విజయనగర్‌కాలనీ నాషీనా డయాగ్నొస్టిక్‌ హాస్పటల్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. అతని తల్లి ఈ నెల 5న తన ఇంటి ముందు ఆడుకుంటున్న పొరుగు వారి పిల్లలను ఇక్కడ ఆడుకోవద్దని వారించింది. దీంతో ఈ విషయం తెలుసుకున్న పక్కనే ఉన్న జైన్‌ ఆమెను దూషిస్తూ వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత షేక్‌ సలావుద్దీన్‌ ఇంటికి రాగానే తన స్నేహితులు సోహెల్‌, రిజ్వాన్‌తో కలిసి జైన్‌ ఆ ఇంటిపై దాడి చేశారు. ఈ ఘటనలో సలావుద్దీన్‌ గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ నిర్మాణం సీజ్‌

ఫిలింనగర్‌: గౌతమ్‌నగర్‌లో జీ ప్లస్‌ 5 అక్రమ నిర్మాణ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ఈ స్థలంలో గతంలో నిరుపేదల కోసం పక్కా ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని, వీటిల్లో రెండు ప్లాట్లను లబ్ధిదారుల నుంచి ఓ మహిళ కొనుగోలు చేసినట్లు గుర్తించారు. 105 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమిలో ఒక భాగాన్ని సదరు మహిళ తన పేరిట జీఓ 58, 59ల కింద క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారని, ప్రస్తుతం ఆ ప్రక్రియ ప్రాసెస్‌లో ఉందని గుర్తించారు. ఇదిలా ఉండగా దీనికి ఆనుకుని ఉన్న మరో 59 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న మరో ప్లాట్‌ను 59 కింద అదే మహిళ తమను అనుకూలంగా ఇప్పటికే క్రమబద్ధీకరించినట్లు విచారణలో తేలింది. ఈ మేరకు భవనం అక్రమంగా నిర్మించినట్లుగా రెవెన్యూ అధికారులు తేల్చి సీజ్‌ చేశారు.

# అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

**జాగ్రత్తలు సూచిస్తున్న ఫైర్‌ సిబ్బంది ● రోజుకొక చోట అవగాహన కార్యక్రమాలు**



రోడ్డు నెంబర్‌-2లోని రెయిన్‌బో పిల్లల ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాలపై సిబ్బందికి అవగాహన కలిగిస్తున్న జూబ్లీహిల్స్‌ ఫైర్‌ స్టేషన్‌ అధికారులు



మంటలు చెలరేగినప్పుడు ఎలా ఆర్పాలో సిబ్బందికి ప్రయోగాత్మకంగా చూపిస్తున్న అధికారులు

బంజారాహిల్స్‌: వేసవికాలం వచ్చిందంటేనే అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటుంటాయి. ఎక్కడైనా మంటలు చెలరేగినప్పుడు, పొగలు కమ్ముకున్నప్పుడు అందులో నుంచి ఎలా బయటపడాలో, ఆ మంటలను ఎలా ఆర్పాలో చాలా మందికి అవగాహన ఉండడం లేదు. మంటలను ఆర్పే విధానాలు తెలిస్తే చాలా వరకు ఆస్తి నష్టాన్ని అరికట్టవచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు సూచిస్తున్నారు. మంటలు వస్తున్నప్పుడు వాటిని ఆర్పే పద్ధతులు తెలియజేస్తూ అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగించేందుకు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు తెలంగాణ ఫైర్‌ డిజాస్టర్‌ రెస్పాన్స్‌ ఎమర్జెన్సీ, సివిల్‌ డిఫెన్స్‌ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్‌ ఫైర్‌ స్టేషన్‌ అధికారి సాయిరెడ్డి ఆధ్వర్యంలో ప్రతిరోజూ హోటళ్లు, ఆస్పత్రులు, భారీ వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, పాఠశాలలు, సూపర్‌ మార్కెట్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంటలను ఎలా ఆర్పాలి, అందులో నుంచి ఎలా బయటపడాలి అనే దానిపైనే ఫోకస్‌ పెట్టారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటే వెంటనే 101కు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

### ఆస్పత్రుల్లో పాటించాల్సిన అగ్ని నివారణ చర్యలు

- కంపార్ట్‌మెంటేషన్‌ను విడిగా ఏర్పాటు చేసుకోవాలి. అగ్ని ప్రమాదాల తీవ్రతను అరికట్టాలి.
- రెఫ్యూజ్‌ ఏరియాస్‌ను పార్ట్‌–4 నేషనల్‌ బిల్డింగ్‌ కోడ్‌ 2016 ప్రకారం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.
- పెద్ద ఆస్పత్రుల్లో ఫైర్‌ ఆఫీసర్‌ను విధిగా నియమించాలి.
- మూడు నెలలకోసారి ఫైర్‌ డ్రిల్‌ నిర్వహించాలి.
- రోగులను సురక్షిత ప్రదేశాలకు తరలించడానికి అధిక ప్రాధాన్యతనివ్వాలి.
- ఏసీ, ఇతర విద్యుత్‌ ఉపకరణాల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా సర్వీసింగ్‌ చేయించాలి.
- ఆస్పత్రుల్లోని అగ్నిమాపక పరికరాలను సరిచూసుకోవడానికి, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు రోగులను, తరలించడానికి ప్రతి అంతస్తులో ఫైర్‌ వార్డెన్‌ను నియమించాలి.
- ఆస్పత్రిలోని బేస్‌మెంట్లలో మంచాలు, పరుపులు, ఇతర ఫర్నిచర్‌ నిల్వ చేయవద్దు.
- బేస్‌మెంట్లలో మందుల దుకాణం నిషేధం. ఇతర మండే పదార్థాలను నిల్వ చేయవద్దు.
- వంట గది, క్యాంటీన్లు ఆస్పత్రి భవనంలో కాకుండా వేరే భవనంలో ఏర్పాటు చేయాలి.
- సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా ఎదుర్కోవాలో, రోగులను సురక్షితంగా ఎలా తరలించాలో శిక్షణ ఇవ్వాలి.
- ప్రతి మూడు నెలలకోసారి సమీపంలోని అగ్నిమాపక కేంద్రం సహకారంతో ఎవాక్యుయేషన్‌ డ్రిల్‌ నిర్వహించాలి.
- అగ్ని ప్రమాదాలు సంభవించినట్లు పొగ వస్తే కిటికీలు తెరిచి పొగను బయటకు వదలాలి.



మంటలను ఆర్పే పద్ధతులను తెలియజేస్తున్న ఫైర్‌ సిబ్బంది

### ఇళ్లల్లో ప్రమాదాలు జరిగితే..

- వంటింటి కింది, పైభాగాల్లో గాలి, వెలుతురు ఉండేటట్లు చూసుకోవాలి.
- ఇంటి నుంచి ఎక్కువ రోజులు సెలవులకు వెళ్లినప్పుడు ఎలక్ట్రికల్‌ మెయిన్‌ ఆఫ్‌ చేయాలి.
- ఎల్పీజీ వాడకం పూర్తయిన వెంటనే రెగ్యులేటర్‌ వాల్వ్‌ను ఆఫ్‌ చేయాలి.
- గ్యాస్‌ లీకవుతున్నట్లు అనుమానాలు వస్తే వెంటనే రెగ్యులేటర్‌ వాల్వ్‌ ఆపేయాలి. ఆ సమయంలో ఎలక్ట్రికల్‌ స్విచ్‌లు ఆన్‌, ఆఫ్‌ చేయవద్దు.
- దుస్తులకు నిప్పంటుకున్నట్లయితే పరిగెత్తవద్దు.
- కాలిన శరీర భాగం మీద చల్లని నీరు పోయాలి.
- స్కూళ్లు, షాపింగ్‌మాల్స్‌, ఆస్పత్రుల్లో ఆర్‌సీసీ, కాంక్రీట్‌ స్లాబ్‌లను మాత్రమే పైకప్పుగా వాడాలి.
- సెల్లార్లలో ఆటోమేటిక స్ప్రింకర్స్‌ ఉపయోగించాలి.

## కరెంటు స్తంభం కబ్జా!



కరెంటు స్తంభాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీ

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–3లోని దేవరకొండ బస్తీకి వెళ్లే రోడ్డులో ఓ ఇంటి యజమాని సెట్‌బ్యాక్‌ లేకుండా ప్రహరీ నిర్మించడమే కాకుండా కరెంటు స్తంభాన్ని కూడా తన ఇంట్లోకే మార్చుకుని గోడ నిర్మించాడు. ఈ అక్రమ నిర్మాణాలపై, కరెంటు స్తంభం కబ్జాపై స్థానికులు జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–18 టౌన్‌ప్లానింగ్‌ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. ఇంతవరకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన కరెంటు స్తంభాన్ని తన ఇంటి గోడ లోపలికి మార్చిన ఇంటి యజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు. టీజీఎస్‌పీడీసీఎల్‌ అధికారులు స్పందించి కరెంటు స్తంభానికి విముక్తి కలిగించాలని, ఇంటి యజమానిపై కేసు నమోదు చేయించాలని కోరుతున్నారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు





ఫిలింనగర్‌: ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సాంస్కృతిక, సహజ వారసత్వాన్ని కాపాడుకోవడం గురించి విద్యార్థుల్లో అవగాహన కలిగించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగింది. వారసత్వ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ వివిధ తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సభలో భారతదేశ వారసత్వాన్ని కీర్తిస్తూ అనేక కార్యక్రమాలు జరిగాయి. చిన్న పిల్లలు రంగురంగుల సాంప్రదాయ వస్త్రాధారణతో ర్యాంప్‌ వాక్‌ చేసి అందరినీ అలరించారు. విద్యార్థులు చేసిన నృత్యం, నాటికలు మన వారసత్వ ప్రదేశాలను గౌరవించాలని సందేశం అందిస్తూ, సంస్కృతిని చిత్రీకరించే విధంగా ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ కాంచనవల్లి మాట్లాడుతూ..మన సాంస్కృతిక వారసత్వం, ప్రాంతీయ వైవిధ్యం, యునెస్కో వారసత ప్రదేశాలను గౌరవించాలన్నారు.

## వృక్ష శాస్త్రంలో పరిశోధనలు పెరగాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్‌ విజయ్‌ కుమార్‌

హిమాయత్‌నగర్‌: వృక్ష శాస్త్రంలో మరింత పరిశోధనలు పెరగాల్సిన అవసరం ఉందని టీజేఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎం.విజయ్‌ కుమార్‌ అన్నారు. గురువారం నారాయణగూడలోని బాబు జగ్జీవన్‌రామ్‌ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వృక్ష శాస్త్ర విభాగాధిపతి, అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ఇ.ఎం.సునీత రచించిన టిష్యుకల్చర్‌ అండ్‌ బయో టెక్నాలజీ అనే పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృక్ష శాస్త్రంలోని పలు అంశాలు విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఈ పుస్తకంలో ఉన్నాయని తెలిపారు. ఇటీవల కాలేజీలో జరిగిన అంతర్జాతీయ సెమినార్‌లో దేశ, విదేశాల నుంచి వృక్ష శాస్త్ర నిపుణులు హాజరై పలు అంశాలను చర్చించడంతో విద్యార్థులకు అవగాహన పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రాపోలు శ్రీనివాస్‌, అధ్యాపకులు బాలస్వామి, డాక్టర్‌ నరసింహులు, డాక్టర్‌ హెచ్‌.శ్రీనివాస్‌ రావు, సి.రాజేశ్వర్‌, రవిచంద్ర, గిరిధర్‌, డాక్టర్‌ గంగాధర్‌, మల్లప్ప, బొమ్మసాని రవి తదితరులు పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ విజయం ఖాయం

శ్రీనగర్‌కాలనీ: రానున్న జీహెచ్‌ఎంసీ, అన్ని ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ అన్నారు. గురువారం బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌తో ఎమ్మెల్యే మాగంటితో పాటు కార్పొరేటర్లు, జూబ్లీహిల్స్‌ నియోజకవర్గ ముఖ్యనేతలు సమావేశమయ్యారు. ఈనెల 27న బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో జరుగనున్న సభకు సంబంధించి 50 అడుగుల కేసీఆర్‌ కటౌట్‌ మాగంటి గోపీనాథ్‌ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు దేదీప్య, రాజ్‌కుమార్‌ పటేల్‌, అప్పుఖాన్‌, అభిగౌడ్‌, మారుతి, మోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

## అద్దె చెల్లించని రెండు మడిగెల సీజ్‌

శ్రీనగర్‌కాలనీ: ఆలయాలకు సంబంధించిన మడిగెలను సక్రమంగా వినియోగించి ఆలయాల అభివృద్ధికి చేయూతగా ఉండేవిధంగా చేస్తున్నామని దేవాదాయశాఖ అధికారులు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిగూడ శ్రీ విజయదర్గాదేవి ఆలయానికి సంబంధించిన రెండు మడిగెలకు సరిగా అద్దె చెల్లించకపోవడంలో వాటిని సీజ్‌ చేసి నోటీసులను అందజేశారు. వచ్చేవారంలో నోటిఫికేషన్‌ పెట్టి బహిరంగ వేలాన్ని నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ అధికారులు అంబుజ, విఠల్‌శర్మ, నరేందర్‌రెడ్డి, నాయుడు, అన్నారావు, ప్రేమ్‌, వెంటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్‌ మధు తెలిపారు. ఆలయాలకు చెందిన మడిగెల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయాల నిర్వహణకు వెచ్చించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి గొంటి సాయినాథ్‌యాదవ్‌ తెలియజేశారు.

## క్రికెట్‌ బెట్టింగ్‌ నిర్వాహకుడి అరెస్టు

వెంగళరావునగర్‌: క్రికెట్‌ బెట్టింగ్‌ నిర్వహిస్తున్న యువకుడిని మధురానగర్‌ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం..మధురానగర్‌ పీఎస్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇటీవల బెట్టింగ్‌ జోరుగా సాగుతుందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో వివిధ ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఎస్‌ఐ సాయికుమార్‌ మధురానగర్‌ ప్రధాన రహదారిలో పెట్రోలింగ్‌ చేస్తున్నాడు. ఇదే సమయంలో మధురానగర్‌కు చెందిన ప్రైవేట్‌ ఉద్యోగి పి.మల్లేశ్వర తరుణ్‌ అనే యువకుడు అనుమానాస్పదంగా కనిపించగా అతని వద్దకు పోలీసులు వెళ్లారు. తరుణ్‌ తప్పించుకోవడానికి ప్రయత్నించగా చాకచక్యంగా అతనిని పట్టుకుని విచారించారు. దీంతో తాను క్రికెట్‌ బెట్టింగ్‌ చేస్తున్నట్టు అంగీకరించాడు. అతనిని అరెస్టు చేసి అతని వద్ద ఉన్న ఫోన్‌, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





## మహిళ అదృశ్యం

వెంగళరావునగర్‌: మహిళ అదృశ్యమైన ఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యూపీకి చెందిన రవికేష్‌ గుప్తా, వీణాదేవి దంపతులు కొంత కాలంగా కార్మికనగర్‌లో నివాసం ఉంటున్నారు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఫోన్‌, రూ.20 వేలు నగదు తీసుకుని వీణాదేవి బయటకు వెళ్లింది. రాత్రి వరకు తిరిగి రాలేదు. ప్రాంతాల్లో గుప్తా వెతికినా జాడ లేకపోవడంతో మధురానగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బస్టాప్‌లో నిద్రిస్తున్న వ్యక్తిపై కత్తితో దాడి

పంజగుట్ట: బస్టాప్‌లో పడుకున్న ఓ యువకుడిని బెదిరించి సెల్‌ఫోన్‌ లాక్కునే క్రమంలో కత్తితో గాయాలైన ఘటన పంజగుట్ట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..అల్వాల్‌కు చెందిన నియో వినయ్‌ తల్లిదండ్రులు చనిపోవడంతో హాస్టల్‌లో ఉండేవాడు. డబ్బులు చెల్లించపోవడంతో నిర్వాహకులు పంపించారు. రాత్రుల్లో రోడ్లపైనే పడుకుని ఉదయం పనులు చేసుకునేవాడు. బుధవారం రాత్రి ప్రజాభవన్‌ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ, గ్రీన్‌ల్యాండ్స్‌ బస్టాప్‌లో పడుకోగా అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వినయ్‌ ప్యాంటు జేబులు చెక్‌ చేస్తున్నట్లు అనిపించడంతో నిద్రలేచి గట్టిగా అరిచాడు. నిందితుడు కత్తి చూపించి నీవద్ద ఉన్న డబ్బులు, వస్తువులు ఇవ్వాలని బెదిరించాడు. కత్తిని వినయ్‌ గొంతు వద్ద పెట్టేక్రమంలో వినయ్‌ చేతికి గాయమైంది. దుండగుడిని నెట్టి దూరంగా పరిగెత్తాడు. అప్పటికే రోడ్డుపై మరోవ్యక్తి ద్విచక్రవాహనంపై సిద్ధంగా ఉండడంతో దుండగుడు పారిపోయాడు. పెట్రోలింగ్‌లో ఉన్న ఓ పోలీస్‌ కానిస్టేబుల్‌ వచ్చి చికిత్స చేయించారు. వినయ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ధర్నాకు తరలిన కాంగ్రెస్‌ నేతలు




బంజారాహిల్స్‌: నేషనల్‌ హెరాయిల్డ్‌ కేసులో ఏఐసీసీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను చార్జిషీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్‌ చేపట్టిన ధర్నాకు జూబ్లీహిల్స్‌ డివిజన్‌ నుంచి కాంగ్రెస్‌ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌ డివిజన్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు కాటూరి రమేష్‌ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఈడీ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేయడమే కాకుండా ప్లకార్డులు ప్రదర్శించి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్‌ నేతలు, కార్యకర్తలు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

శ్రీనగర్‌కాలనీ: ఆలయాల సంరక్షణతో పాటు అభివృద్ధికి కృషి చేస్తానని కన్స్యూమర్‌ రైట్స్‌ ప్రొటెక్షన్‌ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్‌ పీవీ రవిశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం సిద్ధిగణపతి రుద్రారం దేవస్థానంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అక్రమ పార్కింగ్‌లపై స్పెషల్‌ డ్రైవ్‌

**నలుగురు వ్యాపారులపై కేసు**

బంజారాహిల్స్‌: ఫుట్‌పాత్‌లను ఆక్రమించి పాదచారులకు అసౌకర్యం కలిగించడంతో పాటు ట్రాఫిక్‌కు కారణమవుతున్న నలుగురి వ్యాపారులపై బంజారాహిల్స్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 16న మధ్యాహ్నం 1.15 గంటల సమయంలో బంజారాహిల్స్‌ ట్రాఫిక్‌ ఎస్‌ఐ గోవర్ధన్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–3లోని లా అండ్‌ ఆర్డర్‌ పోలీస్‌స్టేషన్‌ సమీపంలో అక్రమ పార్కింగ్‌లపై స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో అక్కడ కొంతమంది వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి పాదచారులను ఇబ్బందులకు గురిచేయడంతో పాటు ఆయా వ్యాపార కేంద్రాల వద్దకు వచ్చే వాహనాలను రోడ్డు మీదనే పార్క్‌ చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నట్లు గోవర్ధన్‌రెడ్డి గుర్తించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న అఫ్సర్‌ టిఫిన్స్‌ యజమాని అఫ్సర్‌ (49), భీం చాయ్‌ యజమాని షేక్‌ అహ్మద్‌ (54), అల్లం కీ చాయ్‌ యజమాని ఎండీ.ఆలం (30), శ్రీలక్ష్మీ కర్రీ పాయింట్‌ యజమాని దీపువిశ్వాస్‌ (27)లు కస్టమర్ల వాహనాలను ప్రధాన రహదారిపై పార్కింగ్‌ చేయించి ట్రాఫిక్‌కు కారణమవుతండడంతో పాటు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి పాదచారులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తుండడాన్ని గుర్తించారు. దీంతో వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ట్రాఫిక్‌ ఎస్‌ఐ గోవర్ధన్‌రెడ్డి బంజారాహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నలుగురు వ్యాపారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి




వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర

హిమాయత్‌నగర్‌: ఏపీలోని తిరుపతిలో మే 15 నుంచి 18 వరకు జరగనున్న ఏఐవైఎఫ్‌ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్‌) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిలు వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన ఏఐవైఎఫ్‌ రాష్ట్ర సమితి సమావేశంలో మహాసభల వాల్‌పోస్టర్‌ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహాసభలలో ప్రధానంగా నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, పాలకుల విధానాలు, తదితర అంశాలపై బోధనలు, చర్చలు, తీర్మానాల ద్వారా నిర్ణయాలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో నెర్లకంటి శ్రీకాంత్‌, వెంకటేశ్వర్లు, లింగం రవి, బిజ్జ శ్రీనివాసులు, యుగంధర్‌, పేరబోయిన మహేందర్‌, ఆర్‌.బాలకృష్ణ, సల్మాన్‌ బేగ్‌, షేక్‌ మహమూద్‌, శివ కుమార్‌, మధు, బోనగిరి మహేందర్‌, మస్కు సుధీర్‌, మహేష్‌, మాజీద్‌ అలీ ఖాన్‌ పాల్గొన్నారు.

## 23, 24 తేదీల్లో వైస్ చాన్స్‌లర్ల సమావేశం

సుభాష్‌నగర్: దేశంలోని 150 పైగా ప్రముఖ విశ్వ విద్యాలయాల వైస్ ఛాన్సలర్లు ఈ నెల 23, 24 తేదీలలో బహదూర్‌పల్లిలోని మహీంద్రా విశ్వవిద్యాలయంలో సమావేశం కానున్నట్లు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ప్రైవేట్ యూనివర్సిటీస్ (సీఐపీయూ) సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్ చైర్‌పర్సన్, మహీంద్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యాజులు మేడురి ఓ ప్రకటనలో తెలిపారు. భారత్ హయ్యర్ ఎడ్యుకేషన్ సమ్మిట్ 2025 (బీహెచ్‌ఈఎస్)గా పిలిచే ఈ సదస్సును కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ప్రైవేట్ యూనివర్సిటీస్ (సీఐపీయూ), మహీంద్రా యూనివర్సిటీకి చెందిన ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్‌తో కలిసి నిర్వహిస్తుందన్నారు.

## 25 నుంచి బాలభవన్‌లో వేసవి శిక్షణ శిబిరం

నాంపల్లి: పబ్లిక్‌గార్డెన్స్‌లోని జవహర్ బాలభవన్‌లో ఈనెల 25 నుండి జూన్ 5వ తేదీ వరకు వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బాలభవన్ సంచాలకురాలు ఎస్.విజయలక్ష్మీబాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక వేసవి శిక్షణా శిబిరంలో చిత్రలేఖనం, గ్రంథాలయం, భరతనాట్యం, కూచిపూడి, సైన్స్, స్టెమ్, రోబోటిక్స్ ల్యాబ్, మ్యూజిక్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

## కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

సాక్షి, సిటీబ్యూరో: కుల ధృవీకరణ పత్రాల జారీపై ఫిర్యాదులు రావడంతో జిల్లా స్థాయి పరిశీలన కమిటీ విచారణ అనంతరం చేసిన సిఫార్సుల మేరకు ఒక కమ్యూనిటీ సర్టిఫికేట్ రద్దు, మరొకటి పునరుద్ధరిస్తూ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నోటిఫికేషన్ జారీ చేశారు. ఖైరతాబాద్ తహసీల్దారు 2022లో జారీ చేసి ఒక ఎస్టీ కుల ధృవీకరణ పత్రం రద్దు చేస్తూ, ముషీరాబాద్ తహసీల్దారు 2023లో జారీ చేసిన ఒక ఎస్సీకుల ధృవీకరణ పత్రాన్ని పునరుద్ధరిస్తూ అదేశాలు జారీ చేశారు.

## నేటి నుంచి పీహెచ్‌డీ ఎంట్రన్స్ హాల్‌టికెట్ల జారీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్–2025 హాల్‌టికెట్లను శుక్రవారం నుంచి జారీ చేయనున్నట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగా రెడ్డి గురువారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాటు పూర్తిచేసినట్లు తెలిపారు.

## బదిలీలతో పాటు సమస్యలను పరిష్కరించండి

సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ శాఖలో ఉద్యోగుల బదిలీలతో పాటు సమస్యలను కూడా పరిష్కరించాలని కోరుతూ టీజీఓ సెంట్రల్ అసోసియేషన్ నాయకులు గురువారం ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్, ఇంచార్జ్ అడిషనల్ కమిషనర్ ఎస్‌వై ఖురేషీలను కలిసి వినతిపత్రాన్ని అంజేశారు. ఎనిమిదేళ్లుగా కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్ల బదిలీలు జరగడం లేదని తెలిపారు.దీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న పదోన్నతులు, సర్వీస్ రూల్స్ సవరణలు, విధి నిర్వహణలో ప్రమాదానికి గురైన వారికి స్టేట్ బ్యాంకుతో ఒప్పందం చేసుకొని ప్రమాద బీమా కల్పించాలనే డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా వారు తమ పరిధిలోని సమస్యలన్నింటినీ పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.


## హోటళ్లలో కుళ్లిన నాటు కోడి మాంసం

**రెండు హోటళ్లకు జరిమానా విధించిన అధికారులు**



హోటల్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపాలిటీ అధికారులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని హోటళ్లను గురువారం మున్సిపాలిటీ హెల్త్ ఇన్స్పెక్టర్ లక్ష్మయ్య బృందం పరిశీలించింది. నెల్లూరి వారి వెంగమాంబ మెస్‌తో పాటు కినారా గ్రాండ్ హోటల్లో అపరిశుభ్రమైన వాతావరణంలో వంటకాల తయారీతో పాటు ఫ్రిజ్‌లో నాలుగు రోజుల కిందటి నాటు కోడి మాంసం నిల్వ ఉంచడం గుర్తించారు. పూర్తిగా పాడైన దశలో ఉన్న నాటు కోడి మాంసంతో అపరిశుభ్రమైన పరిసరాల్లో ఉన్న ఆహారాలను పరిశీలించి వాటిని అక్కడి నుంచి తొలగించారు. నెల్లూరి వారి వెంగమాంబ మెస్‌కు రూ. 20 జరిమానా విధించగా కినరాగ్రాండ్ హోటల్‌కు రూ. 10 వేల జరిమానా విధించారు. కుళ్లిన పదార్థాలు, అపరిశుభ్రమైన పరిసరాలుంటే ఇకపై హోటల్‌ను సీజ్ చేయనున్నట్లు అధికారులు హెచ్చరించారు.



# కలుషిత నీటికి చెక్..!

భూగర్భ జల మార్గాలలో 'కాలుష్య లీకేజీ 'లను త్వరితగతిన గుర్తించేందుకు సరికొత్త ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియోగించి సత్వరమే సమస్యను పరిష్కరించేందుకు జలమండలి సిద్ధమైంది. లీకేజీలను త్వరగా గుర్తించి సరిచేసేందుకు ట్రెంచ్‌లెస్ టెక్నాలజీ కెమెరాతో కూడిన అధునాతన సాంకేతికతను వినియోగిస్తోంది. తాజాగా రెడ్ హిల్స్ పరిధిలోని పుత్లిబౌలిలో కలుపిత నీటి సరఫరాను అధికారులు అడ్డుకట్టవేశారు. . పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ మెషిన్ సాయంతో లీకేజీని గుర్తించి మరమ్మత్తు పనులు నిర్వహించి కలుపిత నీరు సరఫరా కాకుండా చెక్ పెట్టారు.

–సాక్షి,సిటీబ్యూరో

**పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ మెషిన్‌తో గుర్తింపు**

- ట్రెంచ్‌లెస్ టెక్నాలజీ వినియోగం
- తక్షణమే మరమ్మతు పనులు
- అభినందించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి



శిథిలమైన తాగునీటి ట్రంక్ మెయిన్ పైప్



పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ మెషిన్‌తో గుర్తిస్తున్న దృశ్యం

పుత్లిబౌలి చౌరస్తా వద్ద నాలాలోంచి నిర్మించిన 350 ఎంఎం డయా సిఐ ట్రంక్ మెయిన్ పైప్ శిథిలం కావడంతో లీకేజీలు ఏర్పడ్డాయి. ఆ ప్రాంతం నుంచి కలుషిత నీరు సరఫరా అవుతోందని పెద్ద ఎత్తు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఎక్కడ లీకేజీ అవుతోందో గుర్తించడం అధికారులకు కష్టమైంది. చివరికి పొల్యూషన్ ఐడెంటిఫికేషన్ మెషిన్ సాయంతో ట్రంక్ మెయిన్‌లోకి పంపిన కెమెరా సహాయంతో దెబ్బతిన్న ప్రాంతాన్ని గుర్తించ గలిగారు. లీకేజీ గుర్తించిన ప్రదేశం ప్రధాన రహదారిపై ఉండడం, చాలా రద్దీగా ఉండే ప్రధాన రోడ్డులో మధ్య భాగంలో కావడం సమస్యగా తయారైంది. జలమండలి ఎండీ అశోక్ ప్రత్యేక అదేశాలతో అధికారులు ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పోలీస్ అధికారులతో సమన్వయంతో గత మూడు రోజులుగా పనులు చేపట్టి కలుషిత నీటి సరఫరా సమస్య పరిష్కరించారు. వాస్తవంగా నీటి కాలుష్యం ఫిర్యాదులను పరిష్కరించేటప్పుడు నీటి మార్గాలలో కాలుష్య మూలాన్ని గుర్తించడం జలమండలికి ప్రధాన సవాలుగా తయారైంది. వివిధ చర్యలు తీసుకుంటున్నప్పటికీ నీటి కాలుష్య ఫిర్యాదుల వెల్లువ మాత్రం ఆగడం లేదు. కస్టమర్ కేర్‌కు సగటున 150 నుంచి200 ఫిర్యాదులు అందుతుంటాయి. నీటి కాలుష్య మూలాలు గుర్తించే ప్రక్రియలో రోడ్లను కిలోమీటర్ల పొడవుపా కోత,జరిగే జాప్యంతో పరిస్థితి సైతం చేయిదాటి పోతోంది.తాజాగా ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది.

### కెమెరాతో పరిశీలన

ఆధునాత సాంకేతిక పరిజ్ఞానంతో కాలుష్య మూలాలు, లీకేజీలు త్వరగా గుర్తించడం సులభతరమవుతోంది. ఇక రోడ్లను కిలోమీటర్ల పొడవు తవ్వవలసి అవసరం లేదు. క్విక్ ఇన్‌స్పెక్షన్ వాటర్ పొల్యూషన్ సిస్టం ద్వారాపైప్‌లైన్‌లో అంతర్గత స్థితి, విస్తరించిన కాలుష్యం వాటర్ లైన్ బ్లాక్‌లు,



ట్రెంచ్‌లెస్ టెక్నాలజీ కెమెరా

పైప్‌లైన్ పగుళ్లు, నీటిలో మునిగిన వాల్వ్‌ల దృశ్యాలు ద్వారా గుర్తించవచ్చు. బ్యాటరీతో నడిచే ఈ యంత్రానికి 120 మీటర్ల పొడవైన పైపు ఉంటుంది. దానికి లైట్‌తో కూడిన ఒక కెమెరా ఉంటుంది. పైన మానిటర్ ఉంటుంది. ఈ యంత్రం పైపునకు ఉన్న కెమెరాను సంబంధిత వాటర్ పైపులైన్ హోల్‌లోకి పంపిస్తారు. ఈ యంత్రాన్ని ఆపరేట్ చేసే సిబ్బంది పైన మానిటర్ ద్వారా పర్యవేక్షిస్తారు. వీడియో సైతం రికార్డు అవుతోంది. ఎక్కడైనా సమస్యను గుర్తిస్తే తక్షణమే సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది.

### అభినందించిన ఎండీ

ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియోగించి లీకేజీను గుర్తించి ప్రధాన రహదారిపై ఉన్న పనులు చేపట్టి కలుషిత నీటి సరఫరా సమస్య పరిష్కరించిన అధికారులు, సిబ్బందిని ఎండీ అశోక్ రెడ్డి అభినందించారు. భవిష్యత్తులోనూ కష్టపడి పనిచేయాలని సూచించారు. సీజీఎం, జీఎంతో సహా మొత్తం బృందం చేసిన పని నిజంగా అభినందనీయమైనది. ఈ పని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, నిబద్ధతతో పనిచేస్తే ఎన్నో సమస్యలు శాశ్వతంగా పరిష్కరించవచ్చని అన్నారు.

## పార్ట్ టైం లెక్చరర్ల సెక్రటేరియట్ ముట్టడి

**అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలింపు**



సెక్రటేరియట్ వద్ద ఆందోళన చేస్తున్న పార్ట్ టైం లెక్చరర్లు

సాక్షి, సిటీబ్యూరో: చాలీచాలనీ జీతాలతో యూనివర్సిటీల్లో పనిచేస్తున్న పార్ట్ టైం లెక్చరర్లకు యూజీసీ పేస్కేల్ వర్తింపజేయాలని, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కోసం రూపొందించిన జీవో నంబర్ 21ను సవరించాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ పార్ట్ టైం లెక్చరర్లు సెక్రటేరియట్‌ను గురువారం ముట్టడించారు. ఒక్కసారిగా సౌత్ గేట్ వైపు నుంచి రావడంతో పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. విడతల వారీగా వస్తుండడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. పోలీసులకు, పార్ట్‌టైం లెక్చరర్లకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. మహేష్ అనే పార్ట్ టైం లెక్చరర్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు. సుమారు 600 మంది పార్ట్ టైం లెక్చరర్లను సెక్రటేరియట్ తోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో అరెస్టు చేసి చిక్కడపల్లి, ముషీరాబాద్ తదితర పోలీస్ స్టేషన్లకు తరలించారు.

### కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

గన్‌ఫౌండ్రీ: రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 1200 మంది కాంట్రాక్ట్ అధ్యాపకుల న్యాయమైన కోరికను తక్షణమే పరిష్కరించాలని కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం డిమాండ్‌చేసింది. విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ గాంధీభవన్ వద్ద మౌనదీక్ష చేసేందుకు బయల్దేరిన కాంట్రాక్ట్ అధ్యాపకులను గురువారం పోలీసులు గాంధీభవన్ వద్ద అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్ట్ అధ్యాపకులు మాట్లాడుతూ.. గత 18 నెలల నుంచి తమ సమస్యను పరిష్కరించాలని వివిధ రకాలుగా తమ సమస్యను విన్నవించుకున్నప్పటికి సమస్య పరిష్కారం కాకపోవడంతో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌లను కలిసి తమ సమస్యను చెప్పుకుందామని వస్తే పోలీసులు అరెస్టు చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. రెగ్యులరైజ్ చేయకపోతే ఈ నెల 19 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అంతకు ముందు నిజాం కళాశాల, సైఫాబాద్ పీజీ కళాశాల, కోఠి ఉమెన్స్ కళాశాలల వద్ద కాంట్రాక్ట్ అధ్యాపకులను అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం ప్రతినిధులు డాక్టర్ విజయేందర్‌రెడ్డి, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ సురేష్ నాయక్, నారాయణ గుప్తా, సరిత, రేష్మారెడ్డి, డాక్టర్ వినితా పాండే తదితరులు పాల్గొన్నారు.



గాంధీభవన్ ముట్టడికి వెళుతూ...

## ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ మృతి



డాక్టర్ వెంకట్ రామ్ నర్సయ్య (ఫైల్)



దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ఆర్, దిగ్విజయ్‌సింగ్‌తో... (ఫైల్)

ముషీరాబాద్: దేశంలోనే ప్రసిద్ధి గాంచిన వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ డాక్టర్ వెంకట్ రామ్ నర్సయ్య (82) మృతి చెందారు. ఆయన కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. గురువారం చిక్కడపల్లిలో నివాసంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. వృత్తి డాక్టర్ అయినప్పటికీ ప్రవృత్తి మాత్రం ఫ్యాషన్, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ. ఫొటోగ్రఫీలో మధ్యప్రదేశ్ సీఎం దిగ్విజయ్ సింగ్‌కు ఈయన గురువు కావడం గమనార్హం. ఉమ్మడి ఏపీలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దిగ్విజయసింగ్, డాక్టర్ వెంకట్ కలిసి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పులుల మీద తీసిన ఫొటోలు ఆయనకు ఎంతో పేరు తెచ్చాయి. భారతదేశంలోని టాప్ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ గా పేరు తెచ్చిపెట్టాయి. అంతేకాకుండా పులుల మీద ఆయన ఓ పుస్తకాన్ని కూడా రాశారు. అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 12 గంటలకు అంబర్‌పేట శ్మశాన వాటికలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

## టీజీజీడీఏ గాంధీ జీసీ సభ్యులుగా ప్రొఫెసర్ సుబోధ్, రాజేష్



విజేతలను అభినందిస్తున్న టీజీజీడీఏ గాంధీ యూనిట్ ప్రతినిధులు

గాంధీఆస్పత్రి : తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) గాంధీయూనిట్ జనరల్ కౌన్సిల్ సభ్యులుగా ప్రొఫెసర్ సుబోధ్‌కుమార్, డాక్టర్ రాజేష్ ఎన్నికయ్యారు. టీజీజీడీఏ గాంధీ యూనిట్‌లో ఇటీవల ఖాళీ అయిన రెండు జనరల్ కౌన్సిల్ మెంబర్ పోస్టులకు అధ్యక్షుడు ప్రొఫెసర్ భూపేందర్ సింగ్‌రాథోడ్, రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ ఆవుల మురళీధర్‌ల నేతృత్వంలో గురువారం ఎన్నికలు నిర్వహించారు. ప్రొఫెసర్ క్యాడర్‌లో ప్రొఫెసర్ సుబోధ్‌కుమార్, కృపాల్‌సింగ్‌లు పోటీ పడగా, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌ఓడీ సుబోధ్‌కు మార్ విజయం సాధించారు. అసోసియేట్, అసిస్టెంట్ క్యాడర్ పోస్టుకు డాక్టర్ రాజేష్, కళ్యాణచక్రవర్తి, కృపానాయక్, లక్ష్మీకాంత రెడ్డిలు పోటీ పడగా, జనరల్ సర్జరీ వైద్యుడు రాజేష్ విజేతగా నిలిచినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ ఆవుల మురళీధర్ ప్రకటించారు.

## జూలో చిరుతకు వైద్య పరీక్షలు



చార్మినార్: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు లోని ఇక్రిసాట్ క్యాంపస్ నుండి మొదటి గంటల్లో 5–6 సంవత్సరాల వయస్సు గల చిరుతను రక్షించి వైద్య పరీక్షల నిమిత్తం నెహ్రూ జూలాజికల్ పార్క్ కు తరలించారు. నెహ్రూ జూ పార్క్ డిప్యూటీ డైరెక్టర్ (వెట్) డాక్టర్ ఎం.ఎ. హకీం నేతృత్వంలోని వెటర్నరీ డాక్టర్ల బృందం పర్యవేక్షణలో వైద్య పరీక్షలు జరిగాయి. పరిశీలన కోసం క్వారంటైన్ బ్లాక్‌లో ఉంచామని వైద్యుల ప్రాథమిక నివేదిక ప్రకారం చిరుతపులి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని డాక్టర్ ఎం ఏ హకీం తెలిపారు. తిరిగి అడవిలోకి వదలడానికి అనుకూలంగా ఉందన్నారు.

## రూ.4వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలి

**రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య**



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కలిసి వినతి పత్రం అందజేస్తున్న రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: రాష్ట్రంలోని 20 లక్షల మంది విద్యార్థుల మొత్తం ఫీజుల బకాయిలు రూ.4వేల కోట్లను వెంటనే చెల్లించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ నేతలు నీల వెంకటేష్, అంజి, గొరిగె మల్లేష్, సతీష్, రాజేందర్, అనంతయ్య, ఉమేష్‌లతో కూడిన ప్రతినిధి బృందం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి విద్యార్థుల ఫీజు బకాయిలపై చర్చించారు. అనంతరం విద్యార్థుల డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ సీఎంకు అందజేశారు. బీసీ డిమాండ్లు న్యాయమైనవని, వాటిని త్వరగా పరిష్కరించే విధంగా చూస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చినట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు.

## డాక్టర్ నవాబ్ మీర్ నసీర్‌కు ఎక్సలెన్స్ అవార్డు




సాక్షి, సిటీబ్యూరో: భారత్, కజకిస్తాన్ దేశాల మధ్య వాణిజ్యం, పర్యాటకం, సాంస్కృతిక సంబంధాలను మెరుగుపరచడంలో డాక్టర్ నవాబ్ మీర్ నసీర్ అలీఖాన్ చేసిన కృషికి గుర్తింపుగా ప్రతిష్టాత్మక 2024 – 25 ఏషియావన్ డిప్లొమాటిక్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. ఆయన హైదరాబాద్‌లోని కజకిస్తాన్ రిపబ్లిక్ గౌరవ కాన్సుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ అవార్డును సౌదీ అరేబియా, ఇండియా, థాయ్‌లాండ్ 20 సమ్మిట్ (ఎస్ఐటీ20) సందర్భంగా న్యూఢిల్లీలో నిర్వహించిన 25వ ఏషియన్ బిజినెస్ అండ్ సోషల్ ఫోరమ్‌లో అందజేశారు. ఈ అవార్డును డాక్టర్ అలీఖాన్ తరపున ఢిల్లీలోని కజకిస్తాన్ రాయబార కార్యాలయం రెండో కార్యదర్శి, సీనియర్ దౌత్యవేత్త యెర్మెక్ ఐట్మాగంబెటోవ్ స్వీకరించారు.

## బీజేవైఎం నేతల నిరసన



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేవైఎం కార్యకర్తలు

కవాడిగూడ: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు అవినీతికి పాల్పడి ఇప్పుడు విచారణకు రావాలని ఈడీ పిలిస్తే ప్రజలను మభ్యపెట్టి నిరసన కార్యక్రమాలు చేపట్టడం సిగ్గుచేటని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవేళ్ల మహేందర్ అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసు పై గాంధీ కుటుంబానికి వ్యతిరేకంగా గురువారం బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు ఖైదీ దుస్తులు ధరించి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, రాబర్ట్ వాద్రా ప్రియాంకల ఫోటోలో మెడలో వేసుకొని నిరసన వ్యక్తం చేయడానికి వచ్చారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేయడానికి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేసి నగరంలోని వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా కొందరు తప్పించుకొని అంబేడ్కర్ విగ్రహం వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు ఎంతకీ అనుమతి ఇవ్వకపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## ఎలివేటెడ్ టన్నెల్‌ను బోయిన్‌పల్లి వరకూ విస్తరించండి



సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న బోర్డు మాజీ సభ్యులు మహేశ్వర్ రెడ్డి, పాండుయాదవ్

కంటోన్మెంట్: ప్యారడైజ్– సుచిత్ర మార్గంలో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో కొద్దిపాటి మార్పులు చేపట్టి, ప్రజల ఆస్తులను కాపాడాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్‌తో పాటు బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టనున్న ప్రతిపాదనలో తాడ్‌బండ్, బోయిన్‌పల్లిలో రెండు ప్రధాన ముస్లిం గ్రేవీయార్డులు, దేవాలయాలు, బస్తీలు తీవ్రంగా నష్టపోనున్నట్లు పేర్కొన్నారు. దీన్ని నివారించేందుకు గానూ బాలంరాయి చౌరస్తా నుంచి తాడ్‌బంద్ వరకు చేపట్టనున్న టన్నెల్‌ను బోయిన్‌పల్లి వరకు విస్తరించాలన్నారు.దీంతో వందలాది పేదల ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ఉంటుదన్నారు. నష్టపరిహారం తగ్గి ప్రభుత్వానికి సైతం నిధులు మిగులుతాయన్నారు. రోడ్డు విస్తరణను సైతం 200 అడుగులకు బదులుగా, 150 అడుగులకు కుదించాలన్నారు.

## క్రీడలతో దేహదారుఢ్యం

**'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు**



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: విద్యార్థులు నిత్య జీవితంలో చురుగ్గా ఉండాలంటే క్రీడలు ఎంతో అవసరమని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ప్రాంగణంలో స్కూల్ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేట్ స్టడీస్ విద్యార్థుల క్రీడా కౌశలంను ఆయన గురువారం ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంచుతాయని, మనిషిలో క్రమశిక్షణతో పాటుగా మానసిక ఉత్తేజం, తేజస్సు వృద్ధి చెందుతాయన్నారు. కళాశాల సమయం తర్వాత ఎస్కీ మైదానంలోని విశాలమైన స్థలాన్ని వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్,చ కబడ్డీ లాంటి ఔట్‌డోర్ గేమ్స్‌కు వాడుకోవాలన్నారు. 'ఎస్కీ'స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ ప్రిన్సిపల్ కె అశోక్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించబోయే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా తెలంగాణలో అద్భుతమైన క్రీడాకారులకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాలేజీ ఫ్యాకల్టీలు డాక్టర్ వెంకట్‌రెడ్డి, అలిగరాజు, డాక్టర్ సింధు, ఛాయాపద్మకుమారి పాల్గొన్నారు.

## నగర వ్యాప్తంగా రేపు రన్ ఫర్ జీసెస్

సాక్షి, సిటీబ్యూరో: గుడ్ ఫ్రైడే, ఈస్టర్ లను పురస్కరించుకుని యేసు పునరాగమన సందేశాన్ని వ్యాప్తి చేస్తూ రన్ ఫర్ జీసెస్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. క్యాథలిక్, ప్రొటెస్టెంట్ చర్చిలను ఏకం చేస్తూ, ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చెస్, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఈ పీస్ ర్యాలీని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6గంటల నుంచి నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ రన్ ప్రారంభం అవుతుందని, పలువురు క్రైస్తవ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని వివరించారు. నగరంలోని అన్ని చర్చిలకు చెందిన వారూ భారీ సంఖ్యలో ఈ రన్‌కు హాజరవుతున్నారన్నారు. ప్రముఖ పాస్టర్లు ఈస్టర్ సందేశాన్ని అందిస్తారని, స్థానిక సువార్త గాయకులు నిర్వహించే ఆరాధనతో కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు.

## వినోబా భావేకు ఘన నివాళి



మాట్లాడుతున్న చందన్ పాల్

పంజగుట్ట: సామాన్యుని సర్వోదయానికి పునాది వేసిన ఆచార్య వినోబా భావే భూదాన్ ఉద్యమానికి 75 సంవత్సరాలు నిండిన నేపథ్యంలో సర్వ సేవా సంఘ్ ఆధ్వర్యంలో భూదాన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. అఖిల భారత సర్వోదయ మండల్ జాతీయ అధ్యక్షులు చందన్‌పాల్, మేనేజింగ్ ట్రస్టీ షేక్ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పలువురు ప్రముఖులు ఆచార్య వినోబా భావే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎంపీ అజీజ్ పాషా, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, సీనియర్ జర్నలిస్టు జ్వాలా నర్సింహారావు, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

**రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి**



సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగనున్న హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమర్థంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, తదితరులకు రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లకు మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలకు సంబంధించిన నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదేశించారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసేంత వరకు చేయాల్సిన ప్రక్రియను వివరించారు. ముఖ్యంగా బ్యాలెట్ పత్రాల లెక్క, బ్యాలెట్ బాక్స్ ఓపెన్, సీల్ వంటి అంశాలపై పూర్తి సుశిక్షితులై ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఎలాంటి తప్పిదాలు లేకుండా కౌంటింగ్ సిబ్బంది పని చేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి డా.సునంద రాణి, మాస్టర్ ట్రైనర్లు విజయలక్ష్మి, మమత పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
15
హైదరాబాద్, శుక్రవారం, 18, ఏప్రిల్, 2025

- నగరంలో 2017 నాటి పరిస్థితులు పునరావృతం కావొచ్చు
- నగర వాసులకు ఐఎండీ జాగ్రత్తలు
- వ్యక్తిగత సంరక్షణకు ప్రత్యేక నియమాలు
- ఆహారం, పానీయాలపై శ్రద్ధ చూపాలంటున్న ఆరోగ్య నిపుణులు



# నగరం జాగ్రత్త సుమా..!

నగరవాసులారా.. మీకో 'సన్'గతి చెప్పాలా.. భానుడు భగభగ మండుతున్నాడు. రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయి. న'గరం'గరంగా మారుతోంది.. జర జాగ్రత్త! టెంపరేచర్ గ్రేడ్ పెరిగి 47 సెంటీగ్రేడ్‌ను టచ్ చేసే ప్రమాదం పొంచి ఉంది. నగర జీవనశైలిలో వేడికి అనుగుణంగా మార్పులు చేసుకోవడం ఎంత ముఖ్యమో, ఈ ఏడాది వేసవి గత ఏడాదితో పోల్చితే ఎంత భిన్నంగా ఉందో తెలుసుకోవడం కూడా అంతే అవసరం. వాతావరణ పరిశోధన నిపుణుల సూచనలను బట్టి చూస్తే ఈ వేసవి మరింతగా ఎండలు ఉండే అవకాశముంది. 2017లో నమోదైన 47 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలకు సమీపంగా ఈ ఏడాది వేసవి తాపం ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరిస్తోంది.
- సాక్షి, సిటీబ్యూరో



## ఈ వేసవిలో 44 నుంచి 46 సెంటీగ్రేడ్ వరకు ఎండలు!

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నివేదికల ప్రకారం హైదరాబాద్‌లో ఈ వేసవిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 నుంచి 46 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు చేరే అవకాశం ఉంది. అంతేకాకుండా అదనంగా రాత్రి ఉష్ణోగ్రతలు కూడా సాధారణ స్థాయికి మించి ఉండే అవకాశం ఉంది. ఇది నగర వాసులకు మరింత అసౌకర్యాన్ని కలిగించవచ్చు. ఈ వేసవిలో ఎల్ నినో ప్రభావం కారణంగా వడదెబ్బ ఎక్కువగా ఉండే ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా మే నెల వరకు వడదెబ్బ ఎక్కువగా ఉండే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాలు నగరవాసుల నిద్ర, ఆరోగ్యంపై ప్రభావం చూపించవచ్చు.





### వేసవి తాపానికి ముఖ్యమైన జాగ్రత్తలు..

- వేడి తీవ్రత పెరిగే సమయంలో మన శరీరం నుంచి ఎక్కువగా చెమట రూపంలో నీరు పోయి డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తవచ్చు. అందువల్ల నీటిని రోజుకు కనీసం 3-4 లీటర్ల వరకు తాగడం, కొబ్బరి నీరు, నిమ్మ కాయ రసం, బటర్ మిల్క్ లాంటి సహజ పానీయాలను ఎక్కువగా తీసుకోవడం అవసరం.
- ఇళ్ల నుంచి బయటకి వెళ్లే సమయాన్ని ఎంచుకోవడం చాలా ముఖ్యం. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్లకూడదు. వెళ్లాల్సి వచ్చినప్పుడు శరీరాన్ని కప్పి ఉంచేవిధంగా లైట్ కలర్ నూలు దుస్తులు, కూలింగ్ గాగుల్స్, స్కార్ఫ్ లాంటి రక్షణ దుస్తులు ధరించాలి. సన్‌స్క్రీన్ తప్పనిసరిగా వాడాలి.
- ఆహారం విషయంలో వేడికాలం అంటే జీర్ణశక్తి తక్కువగా ఉండే సమయం. తేలికపాటి ఆహారం, తాజా కూరగాయలు, పండ్లు, తేమ కలిగిన ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. ఇంటిని చల్లగా ఉంచడానికి మొక్కలు, గాలి చక్కగా వచ్చేటట్లుగా విండోస్ ఏర్పాటు చేయడం మంచిది.
- కొన్ని తాత్కాలిక వర్షాలు నమోదు కావచ్చన్న అంచనాలున్నా, అవి వేసవి తీవ్రతను తగ్గించేంతగా ప్రభావం చూపించవు. అంతేకాదు.. వర్షాల తర్వాత తేమ పెరగడం వల్ల ఉక్కిరిబిక్కిరి చేయగల వాతావరణం ఏర్పడే ప్రమాదమూ ఉంది. ఈ సమయంలో చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండటం అవసరం.



## హెరిటేజ్ వాక్.. ఎక్స్‌పర్ట్స్ టాక్

- రాష్ట్రపతి నిలయంలో ప్రపంచ వారసత్వ దినోత్సవం
- పాల్గొన్న 1,628 మంది విద్యార్థులు

బొల్లారం: సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో సందడి నెలకొంది. విద్యార్థుల కోలాహలంతో ఉత్సాహపూరిత వాతావరణం ఏర్పడింది.. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్కడ గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలల నుంచి 1,628 మంది విద్యార్థులు తరలివచ్చారు. ఈ సందర్భంగా దేశంలోని మూడు రాష్ట్రపతి నిలయాల చరిత్ర, ప్రాముఖ్యతను వివరించే వీడియోను వీక్షించారు. అనంతరం విద్యార్థులు హెరిటేజ్ వాక్‌లో భాగంగా రాష్ట్రపతి నిలయంలోని పురాతన భవనాలను సందర్శించి వాటి చారిత్రక ప్రాముఖ్యత గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వారసత్వ పరిరక్షణకు సంబంధించిన నిపుణులు విద్యార్థులతో ఇంటరాక్టివ్ సెషన్లను నిర్వహించారు. ఈ సెషన్లలో ఇంజినీర్ వేదకుమార్ మణికొండ (డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్), మధు వొటెరి (సీనియర్ ఫెలో - కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, తెలంగాణ టూరిజం వాక్ కోఆర్డినేటర్), కల్పనా రమేష్ (కావా డిజైన్ స్టూడియో - ది రైన్ వాటర్ ప్రాజెక్ట్ వ్యవస్థాపకురాలు) పాల్గొన్నారు.

## నిహోక్.. టెక్ జనరేషన్ క్యాంప్

మే 2 నుంచి 31 వ తేదీ వరకు..




సాక్షి, సిటీబ్యూరో: లెర్నోరమా టెక్నాలజీస్ ఆధ్వర్యంలో 4 నుంచి 15 సంవత్సరాల వయసు విద్యార్థులకు సాంకేతికత, సృజనాత్మకత, సాహస క్రియల్లో శిక్షణ నిమిత్తం 'టెక్ జనరేషన్ సమ్మర్ క్యాంప్-2025'ను నిర్వహించనున్నారు. ప్రారంభ కార్యక్రమాన్ని గురువారం పీర్జాదిగూడలోని నిహోక్ ది ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ సెక్రటరీ సంపత్‌రెడ్డి తిగుళ్ల, నిహోక్ ప్రిన్సిపాల్ నిషా పర్యాణి, లెర్నోరమా టెక్నాలజీస్ బిజినెస్ హెడ్ డాక్టర్ పడాల కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ శిబిరాల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కోడింగ్, మెషీన్ లెర్నింగ్, గుర్రపు స్వారీ, ఫొటోగ్రఫీ, డీజే మిక్సింగ్, డ్యాన్స్, పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్, చెస్, లైఫ్ స్కిల్ సెషన్లు, సాహస ఆధారిత శిక్షణలు ఉన్నాయి. ఈ శిబిరాలు నగరంలోని నిహోక్ ది ఇంటర్నేషనల్ స్కూల్(పీర్జాదిగూడ) వేదికగా మే 2 నుంచి 31 వ తేదీ వరకు, సుప్రభాత్ మోడల్ హైస్కూల్(నాచారం) ఏప్రిల్ 30 నుంచి మే 30 వరకు, వాక్సన్ ఇంటర్నేషనల్ స్కూల్ (బాలానగర్) మే 1 నుంచి 31 వరకు నిర్వహించనున్నారు.

## మిస్ గ్రాండ్ ఇండియా తెలంగాణ ఆడిషన్స్

గన్‌ఫౌండ్రీ: ఇలాహే మోడలింగ్ స్కూల్, భారతీభేరి ఆధ్వర్యంలో మిస్ గ్రాండ్ ఇండియా తెలంగాణ-2025 ఆడిషన్స్ నిర్వహించారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఆర్‌కే క్రియేషన్స్ కో పార్ట్‌నర్ అనిల్‌రాజ్ గౌడ్ మాట్లాడుతూ వీఈ ఎలక్ట్రానిక్స్ స్పాన్సర్‌గా వ్యవహరించిన ఈ పోటీలను కంట్రీ క్లబ్‌లో నిర్వహించినట్లు తెలిపారు. 100 మందికిపైగా పాల్గొన్న ఈ పోటీలకు ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ భారతి చెర్రి ఊర్మిళ చౌహాన్ న్యాయనిర్ణేతగా హాజరై ఐదుగురు ప్రతినిధులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ ఐదుగురు త్వరలో న్యూఢిల్లీలో జరగబోయే ఫైనల్ ఆడిషన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.



## శిల్పారామంలో.. సమ్మర్ ఆర్ట్ క్యాంపు

- మే 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు కొనసాగింపు
- ఆరు నుంచి 60 సంవత్సరాల వారు ఎవరైనా శిక్షణ పొందవచ్చు
- 9 అంశాలలో శిక్షణ
- ఆసక్తి గలవారు ఫోన్ 88866 52030, 88866 52004 లలో సంప్రదించాలి
- మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మంచి అవకాశం

పరీక్షలు అయిపోయాయి.. వేసవి సెలవులు వచ్చాయి.. మరి సెలవులను వృథా చేసుకోకుండా విద్యార్థులు ఏం చేయాలి? వారికి నచ్చిన రంగాల్లో, ఆసక్తి ఉన్న అంశాల్లో శిక్షణ ఇప్పిస్తే సరి.. నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ.. నేర్చుకున్నవారికి నేర్చుకున్నంత.. మాదాపూర్‌లోని శిల్పారామం ప్రతి ఏడాది సమ్మర్ ఆర్ట్ క్యాంప్ చేపడుతోంది. ఈ ఏడాది కూడా మే 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఈ ఆర్ట్ క్యాంపు నిర్వహిస్తోంది. దీనిలో మట్టికుండల తయారీ విధానం, పెన్సిల్ స్కెచ్, మధుబని పెయింటింగ్, ట్రైబల్ పెయింటింగ్, మండల పెయింటింగ్, ఆక్రిలిక్ పెయింటింగ్, సీసెల్ క్రాఫ్ట్, భగవద్గీత శ్లోకాల పఠనం, సంస్కృతంలో మాట్లాడటం వంటి అంశాల్లో శిక్షణ తరగతులను నిర్వహించనున్నారు. - మాదాపూర్

శిక్షణ తరగతుల ద్వారా విద్యార్థులకు ఏఏ రంగాలపై ఆసక్తి ఉందో తెలుస్తుంది. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించేందుకు అధ్యాపకులు శిక్షణ ఇస్తారు.

- కేవలం విద్యార్థులే కాకుండా గృహిణులు, ఉద్యోగినులు సైతం వివిధ రంగాల్లో శిక్షణ తీసుకుని ఆర్థికంగా ఎదుగుతున్నారు.
- గత ఏడాది శిక్షణ పొందిన మహిళలు వివిధ రకాల బట్టలపై పెయింటింగ్‌లు వేసి ఆర్థికంగా సంపాదిస్తున్నారు.
- కొంత మంది మహిళలు సొంతంగా వ్యాపారం చేస్తున్నారు.
- 6 సంవత్సరాలకుపై బడినవారు ఎవరైనా సమ్మర్ ఆర్ట్ క్యాంపులో పాల్గనవచ్చు.
- చిన్నారులకు భగవద్గీత, సంస్కృత భాషలను నేర్పడం వల్ల వారు ప్రయోజకులు కావడంతోపాటు సంస్కృతి, సంప్రదాయాలు, పురాణాలు, ఇతిహాసాల ప్రత్యేకతను తెలుసుకుంటారని అధ్యాపకులు తెలుపుతున్నారు.
- కేవలం సరదాగా నేర్చుకోవడమే కాకుండా వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకునేందుకు శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.
- వివిధ అంశాలలో శిక్షణ పొందేందుకు నామమాత్రపు రుసుముతో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.
- ఆసక్తి గలవారు 8886652030, 8886652004లలో సంప్రదించగలరు.
- ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తరగతులను నిర్వహించనున్నట్టు తెలిపారు.


(ఫైల్)



### సంస్కృతంలో అనర్గళంగా మాట్లాడవచ్చు..

సంస్కృత భాషకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. అలాంటి భాషను నేర్పించడం అరుదు. శిల్పారామం విద్యార్థులకు, ఆసక్తిగల వారికి సమ్మర్ క్యాంపు ద్వారా ఈ అవకాశాన్ని కల్పిస్తోంది. సులభ పద్ధతిలో సంస్కృత భాషను నేర్చుకోవచ్చు. సంస్కృత భాషను పూర్తి స్థాయిలో నేర్చుకోవడం వల్ల అనేక గ్రంథాలను, పుస్తకాలను చదువుకొని అర్థం చేసుకోవచ్చు.
- సంతోష్, అధ్యాపకుడు, సంస్కృత భాష

### మధుబని పెయింటింగ్‌లో శిక్షణ

మధుబని పెయింటింగ్‌ను ఆసక్తితో నేర్చుకోవాలి. ప్రత్యేకత ఉన్న మధుబని పెయింట్‌లను చాలా మంది కొనుగోలు చేస్తున్నారు. గృహిణులు ఇంట్లో సరదాగా వేసి అమ్ముకోవచ్చు. ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పూర్తిస్థాయిలో నేర్చుకున్న వారు మరి కొంతమందికి శిక్షణ ఇవ్వవచ్చు.
- రాజేశ్, మధుబని పెయింటింగ్ అధ్యాపకుడు




(ఫైల్)

## వినూత్న ఆలోచనలు.. సరికొత్త ఆవిష్కరణలు

- జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో టెక్నికల్ ఫెస్ట్

వెయ్యిమందికిపైగా విద్యార్థుల సందర్శన



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో టెక్నికల్ ఫెస్ట్ ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగింది. విజ్ఞానదాయకంగా, వినోదాత్మకంగా అలరించింది. రెండు రోజులపాటు నిర్వహించిన సాంకేతికోత్సవం (టెక్నికల్ ఫెస్ట్) గురువారం సందడిగా సాగింది. వివిధ విభాగాల విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించేందుకు సాంకేతికోత్సవ వేదికను సద్వినియోగం చేసుకున్నారు. జేఎన్‌టీయూహెచ్ రెక్టర్ ప్రొఫెసర్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ జి.వెంకట నర్సింహారెడ్డిలతోపాటు పలు విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లు సాంకేతికోత్సవాన్ని సందర్శించి విద్యార్థుల నైపుణ్య ప్రదర్శనను తిలకించారు. మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కెమికల్, బయోటెక్నాలజీ, జియో ఇన్ఫర్మాటిక్స్, కంప్యూటర్ సైన్స్, మెటలర్జికల్ తదితర విభాగాల్లో పేపర్ ప్రజంటేషన్, నూతన ఆలోచనలు, సృజనాత్మక ఆవిష్కరణలతో విద్యార్థులు ప్రతిభను చాటారు. జేఎన్‌టీయూ పరిధిలోని పలు ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల నుంచి సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సందర్శించారు.

### విద్యార్థుల ఆవిష్కరణలు...

జేఎన్‌టీయూహెచ్ మెకానికల్ డిపార్టుమెంట్‌కు చెందిన రష్మిక్, దేవేందర్, తిరుమలేష్, సూర్య, ప్రణీత్, నవీన్, అభిషేక్‌లు హోండా జీఎక్స్ 160 ఇంజిన్‌తో నడిచే గో-కార్టును రూపొందించి ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టు రెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్ రెడ్డి మార్గదర్శనంలో పూర్తయింది. తక్కువ బరువు, మెరుగైన పనితీరు, మన్నికతో కూడిన ఈ గో-కార్ట్ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. సివిల్ ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు కాసాని క్రాంతి కుమార్, ఎనుముల వేంకట సాయి సందీప్, లక్ష్మీ ఎరంటి, నికితా మానేపల్లి కలిసి కైలాష్ దేవాలయ నమూనాను రూపొందించారు.

### ముగిసిన వేడుకలు...

సాంకేతికోత్సవాల ముగింపు కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులను అలరించింది. మెటలర్జికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. విద్యార్థులు ఆడి, పాడి, సాంస్కృతిక రంగంలోనూ నేర్పును ప్రదర్శించారు.

## హెచ్‌సీఎల్ జిగ్సా పోటీ షురూ..

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సాంకేతిక ఉత్పత్తుల సంస్థ హెచ్‌సీఎల్... పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేక పోటీలను నిర్వహిస్తోంది. ఈ మేరకు ఆ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. విద్యార్థుల్లో పరిశోధన, విమర్శనాత్మక ఆలోచనలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంచేందుకు హెచ్‌సీఎల్ జిగ్సా (హెచ్‌సీఎల్ జేఐజీఎస్ఏడబ్ల్యూ) పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలో 6 నుంచి 9వ తరగతి వరకూ చదివేవారు పాల్గొనవచ్చని, ఫైనలిస్టులకు రూ.12 లక్షలకుపైగా విలువైన బహుమతులు అందుతాయని వివరించింది. ఆసక్తి కలిగిన విద్యార్థులు/పాఠశాలలు జూలై 31వ తేదీలోగా www. hcljigsaw. com లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరింది. గత ఐదేళ్లుగా నిర్వహిస్తున్న ఈ పోటీలో 2 లక్షలకుపైగా విద్యార్థులు పాల్గొన్నారని వెల్లడించింది.



## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|
| 1,509 | 414 |
| 78,553 | 23,852 |

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| సూచీ | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 16,320 | ▲ 12 |
| డోజోన్స్ | 39,309 | ▼ 360 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,276 | ▲ 1 |
| డాక్స్ | 21,206 | ▼ 105 |
| షాంఘై | 3,280 | ▲ 4 |
| నికాయ్ | 34,378 | ▼ 457 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## బులియన్ (రూ.లలో)

ముంబై

| | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 94,910 ▲ | 331 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 94,500 ▲ | 330 |
| వెండి (కిలో) | 95,15▲ | 1,424 |

## ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 85.10 | 86.12 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 116.01 | 111.10 |
| € | యూరో | ఒకటి | 96.01 | 98.72 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటి | 59.30 | 60.86 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 52.07 | 56.93 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 62.78 | 67.47 |
| SAR | సౌదీ రియాల్ | పదింటికి | 21.87 | 23.37 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | పదింటికి | 22.35 | 24.13 |
| ¥ | చైనా యువాన్ | పదింటికి | 10.82 | 12.64 |

# ఫార్మా జీసీసీలకు భారత్ హబ్!



- రాజకీయ స్థిరత్వం, దేశీ వినియోగం దన్ను
- త్వరలో 100 బిలియన్ డాలర్లకు మొత్తం జీసీసీ మార్కెట్
- 2,500 కేంద్రాలకు విస్తరణ
- పరిశ్రమ వర్గాల అంచనా

అంతర్జాతీయ ఫార్మా దిగ్గజాలు భారత్‌లో తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను (జీసీసీ) ఏర్పాటు చేయడంపై మరింతగా దృష్టి పెడుతున్నాయి. చాలా మటుకు ఎకానమీలు నెమ్మదిస్తున్న తరుణంలో దేశీయంగా రాజకీయ స్థిరత్వం, వినియోగం పటిష్టంగా ఉండటం తదితర అంశాలు ఇందుకు కారణంగా నిలుస్తున్నాయి. ఇటీవలి ఎర్న్‌స్ట్ అండ్ యంగ్ నివేదిక ప్రకారం 2,500 పైచిలుకు సెంటర్లు, 45 లక్షలకు పైగా నిపుణులతో భారత్‌లో జీసీసీ మార్కెట్ పరిమాణం త్వరలో 100 బిలియన్ డాలర్ల మార్కును అధిగమించనుంది. ఇక లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ (ఎల్‌ఎస్‌హెచ్‌సీ) సెగ్మెంట్లో 2024లో 100 సెంటర్లు ఉండగా 2030 నాటికి వీటి సంఖ్య 160కి చేరనుంది. వీటిలో ఉద్యోగుల సంఖ్య 4,20,000కి చేరనుంది. భారత్‌లో టెక్నాలజీ నిపుణుల లభ్యత గ్లోబల్ కంపెనీలకు ఆకర్షణీయంగా ఉంటుండగా, ఇక్కడి వర్ధమాన స్టార్టప్ వ్యవస్థ కూడా జీసీసీల ఏర్పాటుకు మరో సానుకూలాంశంగా ఉంటోందని పరిశ్రమ వర్గాలు వివరించాయి.

**నియామకాల జోరు..**

డిమాండ్, వ్యూహాత్మక ప్రాధాన్యం పెరుగుతుండటం వంటి అంశాల కారణంగా ఫార్మా దిగ్గజాలు భారత్‌లోని తమ హబ్‌లలో జోరుగా నియామకాలు చేపడుతున్నాయి. ఈ ఏడాది ఆఖరు నాటికి సనోఫీ తమ సిబ్బంది సంఖ్యను 1,700 నుంచి 2,600కి పెంచుకునే యోచనలో ఉంది. అలాగే నోవో నార్డిస్క్ కూడా తమ ఉద్యోగుల సంఖ్యను వార్షికంగా సుమారు 20 శాతం పెంచుకోవాలనే ప్రణాళికల్లో ఉంది. మరోవైపు, టకెడా సంస్థ.. ఆసియాలోనే తమ తొలి ఇన్నోవేషన్ కేపబిలిటీ సెంటర్‌ను (ఐసీసీ) బెంగళూరులో ఏర్పాటు చేసింది. తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించే యోచనలో ఉంది. ఈ ఏడాది ఆఖరు నాటికి ఉద్యోగుల సంఖ్యను 770కి పెంచుకోవాలని భావిస్తోంది. ప్రస్తుతం సిబ్బంది సంఖ్య 340గా ఉంది. కొన్నాళ్లుగా భారత్‌లోని జీసీసీలు కేవలం ఖర్చులను ఆదా చేసే కేంద్రాలుగా మాత్రమే కాకుండా అదనపు విలువను కూడా జోడించగలిగే సామర్థ్యాలున్న సెంటర్లుగా ఎదుగుతున్నాయి. కొత్త ఆవిష్కరణలు, డిజిటల్ పరివర్తన, అంతర్జాతీయ వ్యూహాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నాయి. నిర్వహణపరమైన మద్దతుతో పాటు ఆర్‌అండ్‌డీ, డేటా సైన్స్ వంటి అంశాల్లో అత్యుత్తమ హబ్‌లుగా మారుతున్నాయి. పలు గ్లోబల్ ఫార్మా కంపెనీలు భారత్ వైపు చూస్తున్నప్పటికీ, నిపుణులైన సిబ్బందిని అట్టే పెట్టుకోవడం సవాలుగా ఉంటోందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

- సాక్షి, బిజినెస్ డెస్క్

**పెద్ద సంఖ్యలో ఉద్యోగులు..**

దిగ్గజ కంపెనీల జీసీసీల్లో నియామకాలు కూడా భారీగానే ఉంటున్నాయి. బెంగళూరులోని నోవో నార్డిస్క్ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ (జీబీఎస్) సెంటర్లో 4,500 మంది ఉద్యోగులు ఉన్నారు. 100 పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న గ్లోబల్ టీమ్‌కి ఇది తోడ్పాటు అందిస్తోంది. ఇక సనోఫీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న నాలుగు కీలక జీసీసీల్లో హైదరాబాద్ సెంటర్ కూడా ఒకటిగా నిలుస్తోంది. తయారీ నుంచి ఏఐ, డేటా అనలిటిక్స్, కొత్త టెక్నాలజీస్ వరకు వివిధ కార్యకలాపాలకు సహాయ సహకారాలు అందిస్తోంది. ఇక ఎలై లిల్లీ సంస్థకు హైదరాబాద్‌తో పాటు బెంగళూరులో కూడా జీసీసీలు ఉన్నాయి. ఈ రెండు సెంటర్లలో కలిపి 1,500 మంది ఉద్యోగులు ఉన్నారు. అమెరికా తర్వాత కంపెనీకి భారత్ అతి పెద్ద కేంద్రంగా ఉంటోంది.

# నాలుగో రోజూ బుల్ రన్

- అమెరికా–జపాన్ వాణిజ్య చర్చల పురోగతిపై ఆశలు
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్ల మద్దతు
- 78,000 స్థాయిపైకి సెన్సెక్స్
- నిఫ్టీ లాభం 414 పాయింట్లు



**ముంబై:** పరస్పర ప్రతీకార సుంకాల విషయంలో అమెరికా–జపాన్ మధ్య వాణిజ్య చర్చలు పురోగతి సాధిస్తాయనే ఆశావహ అంచనాలతో ఇన్వెస్టర్లు భారీ కొనుగోళ్లకు తెరతీశారు. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 1,509 పాయింట్లు పెరిగి 78వేల స్థాయిపైన 78,553 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 414 పాయింట్లు బలపడి 23,852 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది వరుసగా నాలుగో రోజు లాభాల ముగింపు. విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లు సెంటిమెంట్‌ను బలపరిచాయి. ద్రవ్యోల్బణ భయాలను తగ్గిస్తూ బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 66 డాలర్ల వద్ద ట్రేడవుతుండటం, డాలర్ ఇండెక్స్ బలహీనపడడం వంటి అంశాలూ కలిసొచ్చాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ నాలుగో రోజూ బలపడింది. డాలర్ మారకంలో 26 పైసలు పెరిగి 85.38 స్థాయి వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్ షేర్లకు భారీగా డిమాండ్ నెలకొంది. క్యూ4 ఆర్థిక ఫలితాల ప్రకటనకు ముందు(ఏప్రిల్ 19న) హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 1.50%, ఐసీఐసీఐ బ్యాంకు 4% ర్యాలీ చేశాయి. యాక్సిస్ బ్యాంక్ 2.50%, ఎస్‌బీఐ 3%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 3% పెరిగాయి. భారత ఈక్విటీలపై విశ్వాసం కనబరుస్తూ విదేశీ ఇన్వెస్టర్లు గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో ఎఫ్ఐఐలు రూ.14,770 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి క్వార్టర్‌లో ఆదాయం తగ్గొచ్చనే విప్రో అంచనాలతో బీఎస్‌ఈలో కంపెనీ షేరు 4% నష్టపోయి రూ.237 వద్ద స్థిరపడింది.

గుడ్‌ఫ్రైడే సందర్భంగా నేడు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సెలవు. ఫారెక్స్, బులియన్ మార్కెట్లు కూడా పనిచేయవు.

# ఇన్ఫోసిస్ డీలా

- క్యూ4 లాభం నేలచూపు
- 2025–26 గైడెన్స్ అంతంతే
- 20,000 మంది ఫ్రెషర్స్‌కు ఉపాధి

**న్యూఢిల్లీ:** గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ పనితీరు నిరాశ పరచింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 7,033 కోట్లకు పరిమితమైంది. 2023–24 ఇదే కాలంలో రూ. 7,969 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 8 శాతం ఎగసి రూ. 40,925 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 37,923 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే త్రైమాసికవారీగా(క్యూ3) చూస్తే నికర లాభం 3.3 శాతం పుంజుకోగా.. ఆదాయం 2 శాతం నీరసించింది. కాగా.. పూర్తి ఏడాదికి నికర లాభం 2 శాతం వృద్ధితో రూ. 26,713 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 6 శాతం పెరిగి రూ. 1,62,990 కోట్లకు చేరింది. వెరసి గత ఆదాయ గైడెన్స్ 4.5–5 శాతాన్ని అధిగమించింది. అతిపెద్ద కాంట్రాక్ట్‌తో కలిపి గతేడాది 11.6 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు సాధించింది. వీటిలో 56 శాతం కొత్త ఆర్డర్లే!

**అంచనాలు వీక్**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26)లో ఆదాయం 0–3 శాతం మధ్య బలపడే వీలున్నట్లు ఇన్ఫోసిస్ తాజాగా అంచనా వేసింది. నిలకడైన కరెన్సీ ప్రాతిపదికన గైడెన్స్ ప్రకటించింది. కాగా.. గతేడాది కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా 4.1 బిలియన్ డాలర్ల క్యాష్ ఫ్లో సాధించినట్లు ఇన్ఫోసిస్ సీఎఫ్‌వో జయేష్ ఎస్. వెల్లడించారు. వాటాదారులకు షేరుకి రూ. 22 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది.

**ఇతర విశేషాలు...**

- 2025 మార్చికల్లా మొత్తం సిబ్బంది సంఖ్య 6,000 మంది పెరిగి 3,23,578కు చేరింది.
- గతంలోప్రకటించినట్లు ఈ ఏడాది 20,000 మంది ఫ్రెషర్స్‌కు ఉపాధి
- ఉద్యోగ వలసల రేటు 14 శాతంగా నమోదైంది.

మార్కెట్లు ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి. బీఎస్‌ఈలో ఇన్ఫోసిస్ షేరు 0.5% లాభంతో రూ. 1,420 వద్ద ముగిసింది.




**పటిష్ట ఫలితాలు సాధించాం**

మార్కెట్‌కు అనుగుణంగా, క్లయింట్ కేంద్రంగా ప్రత్యేక దృష్టిపెట్టడం ద్వారా నిలకడైన సంస్థను నిర్మించాం. ఆదాయం, నిర్వహణ మార్జిన్లు, చరిత్రాత్మక స్థాయిలో ఫ్రీ క్యాష్ సాధనరీత్యా పటిష్ట ఫలితాలు సాధించాం. క్లౌడ్, డిజిటల్, ఏఐలో లోతైన నైపుణ్యం, వ్యయ నియంత్రణ, ఆటోమేషన్.. క్లయింట్ల అవసరాలలో కంపెనీకి పటిష్ట స్థానాన్ని కల్పిస్తున్నాయి.

- సలీల్ పరేఖ్, సీఈవో, ఎండీ, ఇన్ఫోసిస్

**కొనుగోళ్ల బాటలో...**

**మిస్సింగ్ లింక్:** ఆస్ట్రేలియన్ సైబర్ సెక్యూరిటీ సంస్థ మిస్సింగ్ లింక్‌ను తాజాగా ఇన్ఫోసిస్ సొంతం చేసుకోనుంది. ఇందుకు సొంత అనుబంధ సంస్థ ఇన్ఫోసిస్ సింగపూర్ పీటీఈ ద్వారా తప్పనిసరి ఒప్పందం కుదుర్చుకుంది. నగదు రూపేణా 9.8 కోట్ల ఆస్ట్రేలియన్ డాలర్లు (సుమారు రూ. 532 కోట్లు) చెల్లించనుంది.

**ఎంఆర్‌ఈ:** సొంత అనుబంధ సంస్థ ఇన్ఫోసిస్ నోవా హోల్డింగ్స్ ఎల్‌ఎల్‌సీ ద్వారా టెక్నాలజీ, బిజినెస్ కన్సల్టింగ్ సంస్థ ఎంఆర్‌ఈ కన్సల్టింగ్ (టెక్సాస్)ను కొనుగోలు చేయనుంది. పూర్తి నగదు రూపేణా కుదుర్చుకున్న డీల్‌లో భాగంగా 3.6 కోట్ల డాలర్లు(రూ. 307 కోట్లు) వెచ్చించనుంది.

**మిత్సుబిషీ హెవీ:** ఇన్ఫోసిస్ జేవీ సంస్థ హైపస్‌లో మిత్సుబిషీ హెవీ ఇండస్ట్రీస్ 2 శాతం వాటా కొనుగోలు చేయనుంది. ఇందుకు 15 కోట్ల జపనీస్ యెన్‌లు(రూ.9 కోట్లు) ఇన్వెస్ట్ చేయనుంది.

# ఇకపై ప్రతి నెలా 28న ఐఐపీ డేటా

**ఈ నెల నుంచే అమల్లోకి..**

**న్యూఢిల్లీ:** పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) గణాంకాలను వెల్లడించే వ్యవధిని రెండు వారాల పాటు తగ్గిస్తూ కేంద్ర స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ (ఎంవోఎస్‌పీఐ) గురువారం నిర్ణయం తీసుకుంది. ఇకపై 42 రోజుల తర్వాత కాకుండా ప్రతి నెలా 28న ఈ డేటాను ప్రకటించనున్నట్లు తెలిపింది. ఒకవేళ 28వ తారీఖు గానీ సెలవు రోజు అయితే, మరుసటి పనిదినం నాడు డేటాను ప్రకటిస్తారు. ఇది ఈ నెల (ఏప్రిల్) నుంచే అమల్లోకి వస్తుంది. ప్రస్తుతం ఎంవోఎస్‌పీఐ ఐఐపీ డేటాను రిఫరెన్స్ నెల ముగిసిన ఆరు వారాల తర్వాత ప్రతి నెలా 12న విడుదల చేస్తోంది. సాధారణంగా ఐక్యరాజ్య సమితికి చెందిన ఇంటర్నేషనల్ రికమండేషన్స్ ఫర్ ఐఐపీ (ఐఆర్‌ఐఐపీ)–2010 ప్రకారం పారిశ్రామికోత్పత్తి తీరుతెన్నులను తెలియజేసే నెలవారీ ఐఐపీ గణాంకాలను రిఫరెన్స్ నెల ముగిసిన 45 రోజుల్లోగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి ప్రకారం ఆరు వారాల్లోగా ప్రకటించాల్సి ఉంటుంది. వాటికి అనుగుణంగానే ఎంవోఎస్‌పీఐ 42 రోజుల్లోగా వెల్లడిస్తోంది.



**'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..**

| | |
|---|---|
| భారత్ వృద్ధి రేటు 6.4 శాతమే: ఫిచ్ | వాణిజ్య విధానాల్లో మార్పులు ఆందోళనకరం |

## సాక్షి స్పోర్ట్స్



**బోపన్న జోడీ పరాజయం**

బీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ–500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–బెన్ షెల్టన్ (అమెరికా) జోడీ పోరాటం ముగిసింది. జర్మనీలోని మ్యూనిక్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో బోపన్న–షెల్టన్ ద్వయం క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న–షెల్టన్ జోడీ 4–6, 5–7తో సాండర్ జిలె (బెల్జియం)–యాన్ జిలెన్‌స్కీ (పోలాండ్) జంట చేతిలో పరాజయం చవిచూసింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో–అమెరికన్ జోడీ మూడు ఏస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేసింది. క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగిన బోపన్న–షెల్టన్‌లకు 20,700 యూరోల (రూ. 20 లక్షల 10 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ప్రపంచ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో 39వ స్థానంలో ఉన్న బోపన్న ఈ ఏడాది ఎనిమిది టోర్నీలు ఆడినా ఏ టోర్నీలోనూ క్వార్టర్ ఫైనల్ దాటి ముందుకెళ్లలేకపోయాడు.

# అభిషేక్ నాయర్‌పై వేటు

**అసిస్టెంట్ కోచ్‌ను తప్పించిన బీసీసీఐ • ఫీల్డింగ్ కోచ్ దిలీప్ కూడా తొలగింపు**


అభిషేక్ నాయర్


దిలీప్

**ముంబై:** భారత క్రికెట్ జట్టు సహాయక సిబ్బందికి సంబంధించి బీసీసీఐ అనూహ్య నిర్ణయం తీసుకుంది. టీమ్ అసిస్టెంట్ కోచ్‌గా ఉన్న అభిషేక్ నాయర్‌పై వేటు వేసింది. ఎనిమిది నెలల క్రితమే బాధ్యతలు తీసుకున్న నాయర్‌ను బాధ్యతల నుంచి తప్పించేందుకు బోర్డు సిద్ధం కావడం చర్చనీయాంశంగా మారింది. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో టెస్టు సిరీస్‌లో 0–3తో ఓటమి, ఆపై ఆస్ట్రేలియా గడ్డపై 1–3తో సిరీస్ కోల్పోయిన తర్వాత జనవరిలో బీసీసీఐ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించింది. ఇందులో జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌తో పాటు బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా పాల్గొన్నారు. ఈ సమావేశం తర్వాతే కోచింగ్ బృందంలో ఎవరి పైనైనా చర్యలు ఉండవచ్చని అర్థమైంది. ఇప్పుడు దాదాపు మూడు నెలల తర్వాత అభిషేక్ నాయర్‌ను బోర్డు తప్పించింది. హెడ్ కోచ్‌గా గంభీర్ కాంట్రాక్ట్‌ను 2027 వన్డే వరల్డ్ కప్ వరకు ఖాయం చేసిన బీసీసీఐ... నాయర్‌ను నియమించినప్పుడు అతని పదవీ కాలం విషయంలో మాత్రం ఎలాంటి స్పష్టతనివ్వలేదు.

**కొటక్ ఎంపికతోనే...**

2024 ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు కోసం గంభీర్, అభిషేక్ నాయర్ కలిసి పని చేశారు. జట్టు టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించారు. గంభీర్ హెడ్ కోచ్‌గా ఎంపికయ్యాక ఎలాంటి దరఖాస్తులు, ఇంటర్వ్యూలు లేకుండా తనకు నచ్చిన వారిని ఎంచుకునేందుకు బోర్డు అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో నాయర్‌ను అతను అసిస్టెంట్ కోచ్‌గా తీసుకున్నాడు. రోహిత్ శర్మకు మంచి స్నేహితుడైన నాయర్... అటు కెప్టెన్, ఇటు కోచ్‌గా మధ్య మంచి సంధానకర్తగా కూడా పని చేయగలడని భావించడం కూడా అతని ఎంపికకు మరో కారణం. భారత్ తరఫున 3 వన్డేలు ఆడిన ముంబై ఆల్‌రౌండర్ నాయర్‌కు దేశవాళీ క్రికెట్‌లో మంచి రికార్డుంది. అధికారికంగా ఏ జట్టుకు కోచ్‌గా పని చేయకపోయినా కూడా వ్యక్తిగతంగా ఎంతో మంది బ్యాటర్ల ఆటను మెరుగుపర్చడంలో అతని పాత్ర చాలా ఉంది. శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, వెంకటేశ్ అయ్యర్, దినేశ్ కార్తీక్, రఘువంశీ ఇదే మాట చెప్పారు. నిజానికి చాంపియన్స్ ట్రోఫీకి అప్పటికే ఉన్న సహాయక సిబ్బందితో పాటు అదనంగా మరో అసిస్టెంట్ కోచ్ సితాన్షు కొటక్‌ను పంపడంతోనే నాయర్ భవిష్యత్తుపై సందేహాలు వచ్చాయి. ఇప్పుడు అదే నిజమైంది. మరోవైపు ఫీల్డింగ్ కోచ్, హైదరాబాద్‌కు చెందిన టి.దిలీప్, స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్ సోహమ్ దేశాయ్‌లను కూడా తప్పిస్తున్నట్లు బీసీసీఐ వెల్లడించింది. పని తీరు గురించి కాకుండా వీరి పదవీకాలం మూడేళ్లు ముగియడమే కారణమని తెలుస్తోంది. బోర్డు కొత్త నిబంధనల (ఎస్‌ఓపీ) ప్రకారం సహాయక సిబ్బంది పదవీకాలం గరిష్టంగా మూడేళ్లే ఉండాలి.

# రైజర్స్ ఓటమి బాట

**4 వికెట్లతో ముంబై ఇండియన్స్ విజయం • విల్ జాక్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శన**

ఐదు రోజుల క్రితం అద్భుత ఆటతో 245 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇప్పుడు సమష్టి వైఫల్యంతో మరో పరాజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. నాలుగు వరుస ఓటముల తర్వాత గత మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఖాతాలో మళ్లీ ఓటమి చేరింది. బ్యాటింగ్‌లో మెరుపులు కనిపించక టీమ్ సాధారణ స్కోరుకే పరిమితమైంది. ఆ తర్వాత ఛేదనలో ముంబై ఇండియన్స్ కొంత తడబడినా... మరో 11 బంతులు మిగిలి ఉండగా లక్ష్యాన్ని అందుకోవడంలో సఫలమైంది.



**ముంబై:** ఐపీఎల్‌లో ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ కీలక విజయాన్ని అందుకుంది. గురువారం జరిగిన పోరులో ముంబై 4 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (28 బంతుల్లో 40; 7 ఫోర్లు), హెన్రిచ్ క్లాసెన్ (28 బంతుల్లో 37; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం ముంబై 18.1 ఓవర్లలో 6 వికెట్లకు 166 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్‌ద మ్యాచ్' విల్ జాక్స్ (26 బంతుల్లో 36; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ర్యాన్ రికెల్టన్ (23 బంతుల్లో 31; 5 ఫోర్లు) కీలక పరుగులు సాధించారు.

**కనిపించని దూకుడు...**

ఇన్నింగ్స్ తొలి బంతికే అభిషేక్‌కు అదృష్టం కలిసొచ్చింది. దీపక్ చహర్ వేసిన బంతి అభిషేక్ బ్యాట్ ఎడ్జ్‌ను తీసుకొని స్లిప్ వైపు దూసుకెళ్లగా విల్ జాక్స్ దానిని అందుకోలేకపోయాడు. అనంతరం అతను కొన్ని చక్కటి షాట్లతో పరుగులు రాబట్టారు. మరో వైపు ట్రవిస్ హెడ్ (29 బంతుల్లో 28; 3 ఫోర్లు) బ్యాటింగ్‌లో సహజమైన ధాటి కనిపించలేదు. చహర్ ఓవర్లో అభిషేక్ వరుసగా మూడు ఫోర్లు కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 46 పరుగులకు చేరింది. ఆ తర్వాత ఒక్కసారిగా ముంబై బౌలర్ల ఆధిపత్యం మొదలైంది. కట్టుదిట్టమైన బంతులతో వారు రైజర్స్‌ను నిలువరించారు. తొలి వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యం (45 బంతుల్లో) తర్వాత అభిషేక్‌ను పాండ్యా వెనక్కి పంపాడు. 24 పరుగుల వద్ద క్యాచ్ ఇచ్చినా... నోబాల్‌తో బతికిపోయిన హెడ్ దానిని వాడుకోలేకపోయాడు. ఇషాన్ కిషన్ (2) మళ్లీ విఫలం కాగా, నితీశ్ కుమార్ రెడ్డి (21 బంతుల్లో 19; 1 ఫోర్) మరోసారి ప్రభావం చూపలేకపోయాడు. పవర్‌ప్లే ముగిసిన తర్వాత 7–17 ఓవర్ల మధ్యలో రైజర్స్ 5 ఫోర్లు మాత్రమే కొట్టగా... ఇన్నింగ్స్‌లో 17వ ఓవర్ వరకు ఒక్క సిక్స్ కూడా రాలేదు. చివర్లో 2 ఓవర్ల కారణంగా (మొత్తం 43 పరుగులు) రైజర్స్ స్కోరు 160 దాటింది. చహర్ వేసిన 18వ ఓవర్లో క్లాసెన్ వరుసగా 6, 4, 4, 6 బాదగా... పాండ్యా వేసిన ఆఖరి ఓవర్లో అనికేత్ 2 సిక్స్‌లు, కమిన్స్ ఒక సిక్స్ కొట్టారు.

**కీలక భాగస్వామ్యం..**

ఎప్పటిలాగే ఫటాఫట్ షాట్లతో ఛేదనను మొదలుపెట్టిన రోహిత్ శర్మ (16 బంతుల్లో 26; 3 సిక్స్‌లు) మరోసారి తక్కువ స్కోరుకే పరిమితమయ్యాడు. ఐదు బంతుల వ్యవధిలో అతను మూడు సిక్సర్లు బాదాడు. మలింగ ఓవర్లో రికెల్టన్ మూడు ఫోర్లు కొట్టగా, 4 పరుగుల వద్ద జాక్స్ ఇచ్చిన క్యాచ్‌ను హెడ్ వదిలేశాడు. రికెల్టన్ అవుటైన తర్వాత జాక్స్, సూర్యకుమార్ (15 బంతుల్లో 26; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మూడో వికెట్‌కు 29 బంతుల్లో 52 పరుగులు జోడించి జట్టు విజయానికి బాటలు వేశారు. వీరిద్దరు ఏడు పరుగుల తేడాతో వెనుదిరిగినా... కెప్టెన్ హార్దిక్ పాండ్యా (9 బంతుల్లో 21; 3 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ వర్మ (17 బంతుల్లో 21 నాటౌట్; 2 ఫోర్లు) కలిసి గెలుపు దిశగా నడిపించారు.

**స్కోరు వివరాలు**

**సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్:** అభిషేక్ శర్మ (సి) (సబ్) బావా (బి) పాండ్యా 40; హెడ్ (సి) సాంట్నర్ (బి) జాక్స్ 28; ఇషాన్ కిషన్ (స్టంప్డ్) రికెల్టన్ (బి) జాక్స్ 2; నితీశ్ కుమార్ రెడ్డి (సి) తిలక్ వర్మ (బి) బౌల్ట్ 19; క్లాసెన్ (బి) బుమ్రా 37; అనికేత్ వర్మ (నాటౌట్) 18; కమిన్స్ (నాటౌట్) 18; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 162. వికెట్ల పతనం:** 1–59, 2–68, 3–82, 4–113, 5–136. **బౌలింగ్:** దీపక్ చహర్ 4–0–47–0, బౌల్ట్ 4–0–29–1, బుమ్రా 4–0–21–1, విల్ జాక్స్ 3–0–14–2, హార్దిక్ పాండ్యా 4–0–42–1, సాంట్నర్ 1–0–8–0.

**ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్:** రికెల్టన్ (సి) హెడ్ (బి) హర్షల్ పటేల్ 31; రోహిత్ (సి) హెడ్ (బి) కమిన్స్ 26; విల్ జాక్స్ (సి) అన్సారీ (బి) కమిన్స్ 36; సూర్యకుమార్ (సి) అన్సారీ (బి) కమిన్స్ 26; తిలక్ వర్మ (నాటౌట్) 21; పాండ్యా (సి) ఇషాన్ కిషన్ (బి) మలింగ 21; నమన్ (ఎల్బీ) (బి) మలింగ 0; సాంట్నర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (18.1 ఓవర్లలో 6 వికెట్లకు) 166. వికెట్ల పతనం:** 1–32, 2–69, 3–121, 4–128, 5–162, 6–162. **బౌలింగ్:** షమీ 3–0–28–0, కమిన్స్ 4–0–26–3, ఇషాన్ మలింగ 4–0–36–2, అన్సారీ 3.1–0–35–0, హర్షల్ 3–0–31–1, రాహుల్ చహర్ 1–0–9–0.

**అనూహ్య 'నోబాల్'**



క్యాచ్‌ను అందుకునే లేదా స్టంపింగ్ ప్రయత్నంలో వికెట్ కీపర్ గ్లవ్స్ స్టంప్స్ ముందుకు రాకూడదు. ఇది అందరికీ తెలిసిన, చాలా కాలంగా అమల్లో ఉన్న నిబంధనే. కానీ గురువారం అనూహ్య ఘటన చోటు చేసుకుంది. అన్సారీ వేసిన బంతిని రికెల్టన్ ఆడి కమిన్స్‌కు క్యాచ్ ఇచ్చాడు. అయితే దీనిని 'నోబాల్'గా ప్రకటిస్తూ అంపైర్లు నాటౌట్‌గా ప్రకటించారు. జరిగిందేమిటంటే రికెల్టన్ షాట్ ఆడక ముందే క్లాసెన్ గ్లవ్స్ ముందుకు వచ్చాయి. ఇది ఐసీసీ రూల్స్ 27.3.1కు విరుద్ధం. అందుకే నోబాల్ ఇచ్చారు. క్లాసెన్ కూడా తాను చేసిన తప్పును వెంటనే అంగీకరిస్తూ సైగ చేయడం గమనార్హం.

**ఐపీఎల్–2025 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా | నె.ర.రే |
|---|---|---|---|---|---|
| ఢిల్లీ | 6 | 5 | 1 | 10 | 0.744 |
| గుజరాత్ | 6 | 4 | 2 | 8 | 1.081 |
| బెంగళూరు | 6 | 4 | 2 | 8 | 0.672 |
| పంజాబ్ | 6 | 4 | 2 | 8 | 0.172 |
| లక్నో | 7 | 4 | 3 | 8 | 0.086 |
| కోల్‌కతా | 7 | 3 | 4 | 6 | 0.547 |
| ముంబై | 7 | 3 | 4 | 6 | 0.239 |
| రాజస్తాన్ | 7 | 2 | 5 | 4 | -0.714 |
| హైదరాబాద్ | 7 | 2 | 5 | 4 | -1.217 |
| చెన్నై | 7 | 2 | 5 | 4 | -1.276 |

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్

**ఐపీఎల్‌లో నేడు**

బెంగళూరు × పంజాబ్
వేదిక: బెంగళూరు

రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో




గుడ్ ఫ్రైడే స్పెషల్

# ఆ రక్తతర్పణం సర్వ మానవాళికి నిత్యజీవం

**గోధుమ గింజ భూమిలో పడి చని పోతేనేగాని ఎలా విస్తారమైన పంట నివ్వలేదో క్రీస్తు కూడా యుక్త కాలమున చనిపోవటం ద్వారా మనందరికీ మరణం తర్వాత తిరిగి శాశ్వత జీవం అనే ఆశీర్వాద భాగ్యం లభించింది. సర్వమానవుల కోసం ఒక్కడే ధైర్యంగా సిలువను మోశాడు... నిరపరాధ రక్తం చిందించబడింది... బలిగా తన పరిశుద్ధ రక్తం పానార్పణం గావించాడు... పరలోక భాగ్యాన్ని తృణప్రాయంగా త్యజించాడు... నిత్యజీవానికి బాట వేశాడు... యేసు మరణం మానవాళికి శుభదినం... ఒక్కడే ఒక్కడు... సజీవుడైన క్రీస్తు... నిన్న నేడు నిరంతరం ఉన్నవాడు.**

చరిత్ర పుటల్లోకి ఒక సారి వెళితే రెండు వేల సంవత్సరాల క్రితం యేసుక్రీస్తు మరణం అత్యంత హేయమైనది అమానుషమైనదిగా పేర్కొనబడినది. ఆయన ప్రేమించిన శిష్యులే చివరి గడియల్లో ఆయనను విడిచి పారిపోయారు. శిష్యుడైన యూదా ముప్పై వెండి నాణాలకు ఆశపడి దైవకుమారుడినే మతపెద్దలకు అమ్మివేశాడు. ఏ ప్రజలైతే తన సొంతవారిగా భావించి వారే తనకు ప్రధానం అనుకున్నాడో వారి మధ్య అనేక అద్భుతాలు చేశాడో విలువైన బోధలు చేశాడో వారే ఏకమై యేసును అతి క్రూరంగా చంపడానికి సిద్ధపడ్డారు. కేవలం తమ పదవులకు ఎక్కడ అడ్డువస్తాడో అని ఈ ఘాతుకానికి ఒడిగట్టారు యూదా పెద్దలు నాయకులు. వారితో తనకు ఆపద సంభవించనుందని తెలిసి పస్కా పండుగ సమయంలో అందరికోసం బలి పశువుగా మారేందుకు యెరూషలేము చేరుకున్నాడు యేసు. తాను అప్పగింపబడే రాత్రి గెత్సేమనె తోటలో ఒంటరియై తండ్రిని ప్రార్థించాడు. మానవాళి విమోచన కోసం చేసే బలియాగం ఎంతో వేదనకరం. యేసు విలపించుచు ప్రార్థించుండగా అతని చెమట రక్త బిందువులుగా మారిపోయింది. అంతకంటే ఆయనను అప్పగించుటకు వచ్చిన వారిలో తన శిష్యుడైన యూదా ముందుండి బోధకుడా నీకు శుభమని చెప్పి ముద్దుపెట్టుకొని మరీ యేసును వారికి అప్పగించాడు. యేసు మాత్రం 'చెలికాడా! నీ పని కానివ్వు' అంటూ సంబోధించడం అతనిలో ద్వేషానికి ఏమాత్రం తావులేదనడానికి రుజువుగా నిలిచింది.

యేసు ఏ నేరం చేయలేదని తెలిసినా, యూదా మత పెద్దలు కేవలం అసూయ చేత క్రీస్తును సిలువ వేయడానికి సిద్ధమయ్యారని తెలిసినా ఇతనిలో నాకు ఏ నేరం కనబడుటలేదని చెప్పినా, జనసమూహం సిలువ వేయమన్న కేకలే గెలిచాయి. యేసు గలలియ వాడని తెలుసుకొని హేరోదు వద్దకు పంపినా అక్కడా తృణీకారమే ఎదురైంది. తిరిగి పిలాతు వద్దకు పంపబడ్డాడు. పొంతి పిలాతు ఎన్ని సార్లు యేసును విడుదల చేద్దామని ప్రయత్నించినా చివరకు నరహత్య చేసే గజదొంగ బరబ్బాను వదిలివేయండి, కానీ యేసును మాత్రం సిలువ వేయాలని మొండిపట్టు పట్టారు యూదా మతపెద్దలు.

## క్రీస్తు శ్రమలు

సిలువ మరణం కనికరం లేని మరణం. దోషులను అతి క్రూరంగా శిక్షించేందుకు సిలువ మరణం ఏర్పాటు చేసేది అప్పటి రోమా ప్రభుత్వపు పెద్దలు. సిలువ మీద మరణించినవాడు శాపగ్రస్తుడుగా యూదుల ధర్మశాస్త్రంలో రాయబడి వుంది. ఏ పాపమెరుగని యేసు మనుష్యజాతి రక్షణ కొరకు పాపంగా చేయబడ్డాడు. సిలువలో రోమా సైనికుల క్రౌర్యం హేళన దూషణతో వారి కర్కశమైన దండన ఎంతో భయోత్పాతం, భీతిని కలిగించేది. ఒక నిలువు చెక్క కమ్మి మీద అడ్డకమ్మని అమర్చి దానిపై నేరం చేసిన దోషిని పడుకోబెట్టి రెండు అరచేతులు చాపి వాటిలో రెండు పొడవైన మేకులతో గుచ్చి కింద రెండు పాదాలు కలిపి అతి పొడవైన మేకుతో బలంగా చెక్కకు దిగగొట్టేవారు. ఇలా సిలువపై వేలాడబడిన మనిషి ఊపిరి పీల్చుకోవడం ఎంతో దుర్భరంగా ఉండేది. ఊపిరి పీల్చుకోడానికి ప్రయత్నించిన ప్రతిసారి నరకాన్ని ప్రత్యక్షంగా అనుభవిస్తారు. చివరకు ఊపిరితిత్తులు పగిలి చనిపోతారు. ఒక వేళ సాయంత్రంలోగా చనిపోకపోతే రెండు కాళ్ళు తెగనరికి రోమా సైనికులు అక్కడి నుంచి వెళ్లిపోతారు.

ఈ శ్రమలకు అదనంగా రోమా సైనికులతో పాటు యూదా మత పెద్దలు, పరిసయ్యులు, ప్రజలు చేరి హేళన, వస్త్రహీనత, కొరడా దెబ్బలు, తలపై ముళ్ల కిరీటం... యూదుల రాజంటూ హేళన చేస్తూ ముఖంపై పిడిగుద్దులతో దైవ కుమారుడి సుందర సుకుమార దేహం అందవిహీనంగా కురూపిగా మారిపోయింది. పదివేలలో అతిప్రియుడు పరిహాసమొందాడు. అన్యాయపు తీర్పు తర్వాత యేసు మోయలేని సిలువను వీపుమీదపెట్టి కొరడాలతో కొట్టుకుంటూ యెరూషలేము వీధుల్లో తిప్పుతూ కల్వరి కొండకు తీసుకు వస్తారు. యేసుకు ఇరువైపులా ఇద్దరు గజదొంగలను సిలువ వేశారు. అపహాస్యం చేయడానికి 'యూదుల రాజైన నజరేయుడైన యేసు' అంటూ రాయించి సిలువకు ఒక ఫలకం తగిలించారు. అతని వస్త్రాన్ని చింపి సైనికులు పంచుకున్నారు. ఒళ్ళంతా రక్తసిక్తమైన యేసుని చూసి ఏమాత్రం కనికరం లేక యూదుల రాజువైతే దిగిరా అంటూ హేళన చేశారు. అంత బాధలోనూ యేసు ఏమాత్రం నోరు తెరువలేదు. మౌనంగా సిలువ బాధను భరించాడు.

యేసుక్రీస్తు మరణం ఈ లోకానికి నిత్య జీవం అనే ఆశీర్వాదం తీసుకువచ్చింది. మరణానికి బందీగా మారిన మానవుడు భయం లేకుండా నిర్భయంగా జీవించే ధైర్యాన్ని ఇచ్చింది. మానవునిలో పిరికి ఆత్మను తీసివేసి ధైర్యంగా జీవించమని దీవించే దైవాత్మను అనుగ్రహించింది యేసు మరణం. యేసులో వున్న వారికి ఆయన మరణం ద్వారా నిత్యజీవ మార్గం సుగమమైంది. అందుకే ఇది శుభ శుక్రవారం అయింది.

- బందెల స్టెల్లి రాజన్

### ఏడు విలువైన మాటలు... ఆచరణీయ పాఠాలు

యేసుక్రీస్తు సిలువ పైన మాట్లాడిన ఏడు మాటలు శుభ శుక్రవారం నాడు ప్రపంచంలోని క్రైస్తవ విశ్వాసులందరూ ధ్యానించడం పరిపాటి. అంతేకాదు ఏసు పలికిన ఈ పలుకులు ఈ లోకంలో మానవుడు లోకకల్యాణం కోసం ఎలా జీవించాలో గొప్ప పాఠాలను నేర్పుతాయి. మానవ జాతికి ఎప్పటికీ ఆదర్శంగా ఆచరణీయంగా నిలుస్తాయి.

శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో యేసు ప్రాణం విడువ గా అనేక అద్భుతాలు జరిగినట్లుగా లేఖనాలు పేర్కొన్నాయి. ఆ దేశమంతా చీకటి కమ్మింది. సూర్యుడు కాసేపు అదృశ్యం అయ్యాడు. భూమి వణికింది. బండలు బద్దలయ్యాయి. సమాధులు తెరువబడ్డాయి. యెరూషలేము దేవాలయపు తెర పైనుండి కిందికి రెండుగా చినిగిందని లేఖనాలు చెబుతున్నాయి.

పాప పంకిలమైన మానవుడ్ని రక్షించడానికి ఆ దేవాదిదేవుని గొప్ప సంకల్పమే సిలువ. ఈ లోకాన్ని ఎంతో ప్రేమించిన దేవుడు మానవులను తమ పాపాల నుంచి రక్షించి మరణానంతరం నిత్యజీవం ఇవ్వడానికి ఎన్నుకున్న ఏకైక మార్గమే సిలువ. సిలువలో నిర్దోషి, నిష్కళంకుడు తన ప్రియ కుమారుడైన యేసు రక్తం ద్వారా గొప్ప విమోచన కార్యం దేవుడు సిద్ధం చేశాడు. యేసు తనకు తానుగా సిలువకు సమర్పించుకున్నాడు.

"పురుషోత్తం- హి, ది విక్టిమ్ ఆఫ్ స్పైడర్స్ అండ్ ప్రెజర్ కుకర్స్' నాటకం తెలియని నాటక ప్రియులు ఉండరేమో! ఒక నేరస్థుడు ఏమాత్రం అపరాధ భావన, పశ్చాత్తాపం లేకుండా తను చేసిన నేరం గురించి చెప్పేదే ఆ నాటకం. ఇది న్యూజర్సీ, రట్గర్స్ యూనివర్సిటీలో బీఎఫ్ఏ, ఎమ్ఎఫ్ఏ ప్రోగ్రామ్‌లో భాగమైంది. దీనికోసం అయిదు ఖండాల నుంచి ఒక్కో నాటకాన్ని తీసుకున్నారు. ఆసియా నుంచి ఆ గౌరవం ఈ నాటకానికి దక్కింది. రచయిత.. అంజలి పార్వతి కోడా! ఆమె తన పద్దెనిమిదో ఏట ఆ నాటకాన్ని రాశారు. సాధారణంగా మనది సినిమాలే ప్రధానమైన సమాజం కాబట్టి నాటకాల గురించి, నాటక రచయితల గురించి అంతగా తెలియదు. అందుకే ప్లే రైట్, స్టాండప్ కమెడియన్, రైటర్, డైరెక్టర్, 'సమాహార' థియేటర్ కోఫౌండర్ అంజలి పార్వతి కోడాను పరిచయం చేస్తున్నాం.

సందర్భం.. ఏప్రిల్ 16 తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సమాహార' థియేటర్ గ్రూప్ నాటినుంచి నేటి వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్, రవీంద్రభారతిలో నాటకాలను ప్రదర్శించనుంది.


అంజలి పార్వతి కోడా

# నాటక సమాహార

**అం**జలి పుట్టి, పెరిగింది హైదరాబాద్‌లోనే! సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్‌లో మాస్ కమ్యూనికేషన్ చదివారు. వాళ్ల నాన్న మోహన్ కోడా (ఇప్పుడు లేరు) యాడ్ అండ్ ఫిల్మ్ మేకర్. ఆమె మీద తండ్రి ప్రభావం చాలా ఉంది. అంజలి చిన్నప్పుడు వాళ్ల కుటుంబం.. తమ కోసమే ఒక మ్యాగజీన్ నడిపేది. అందులో ఆమె కామిక్ స్ట్రిప్స్ రాసేవారు. తండ్రి పుస్తక పఠనాన్ని ప్రోత్సహించేవారు. అందులో రోజుకో బుక్‌తో అంజలిది ట్రాక్ రికార్డ్. ఇంటర్ నుంచే ఆమె సీరియల్స్, టెలీఫిల్మ్స్‌కు పనిచేయడం మొదలుపెట్టారు. డిగ్రీకి వచ్చేసరికి ఒక వెబ్‌సైట్‌లో ఉద్యోగంలో చేరారు. సినిమా రివ్యూలు, ఇంటర్వ్యూలు చేసేవారు. దాంతో ఆమెకు సినిమా మీద ఆసక్తి ఏర్పడింది.

**సమాహార...** అంజలి ఒకసారి వాళ్ల నాన్నను 'యాక్టర్స్‌ని ఎలా డైరెక్ట్ చేయాలో నేర్పించండి' అని అడిగారు. 'అది తెలుసుకోవాలంటే ముందు నువ్వు రంగస్థలం మీద పనిచేయాలి' అని చెప్పారాయన.

అప్పుడే రత్న శేఖర్ రెడ్డి (అంజలి భర్త, సమాహార కోఫౌండర్) న్యూయార్క్‌లో థియేటర్, ఫిల్మ్ స్టడీస్ చేసి వచ్చారు. అతను, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు కొంత మంది కలిసి నాటకాలు వేస్తున్నారు. అందులో అంజలి కూడా జాయిన్ అయ్యారు. అప్పుడే అంజలి ఒక సోలో ప్లే రాసి రత్న శేఖర్‌కు ఇచ్చారు. దాంతోనే 'సమాహార' స్టార్ట్ అయ్యి.. కొనసాగుతోంది.

**స్టాండప్ కామెడీ.. సినిమా...** అంజలి అమెరికన్ స్టాండప్ కామెడీ షోస్‌ను బాగా ఫాలో అయ్యేవారు. హాస్య నాటకాలు ఎక్కువగా రాసేవారు. 2013 ప్రాంతంలో 'సమాహార కామెడీ నైట్స్'ని స్టార్ట్ చేశారు. అందులో నాలుగైదు నాటికలు ప్రదర్శించేవారు. నాటకానికి నాటకానికి మధ్య అంజలి కామెడీగా ఒక స్టోరీ చెబుతూ ఆ నాటకాలను పరిచయం చేసేవారు. అలా ఆమె స్టాండప్ కమేడియన్‌గానూ మారారు. సినిమా డైరెక్షన్ అంటే అంజలికి చాలా ఇష్టం. నాటక రంగానికి వచ్చిందే సినిమా డైరెక్షన్ కోసం. అందుకే సినిమా వైపు అడుగులు వేశారు.

### ఎక్స్‌పరిమెంట్స్ జరగాలి..

'ఎన్నో నాటకాలు, నలభై యాభై యాడ్స్, కార్పొరేట్ ఫిల్మ్స్ చేసుంటాను. కార్పొరేట్ నాటకాలు కూడా రాస్తుంటాను. ఈ మొత్తంలో నాకు అర్థమైంది మన లిటరేచర్ అప్‌డేట్ కావాలని. జెన్ జీకి సరిపోయే కంటెంట్ రావాలి. థియేటర్‌లో అయితే ఇప్పటికీ 60, 70ల్లో రాసిన నాటకాలనే వేస్తున్నాం. సినిమా విషయానికి వస్తే తమిళంలోనో.. మలయాళంలోనో వస్తే దాన్ని అప్రిషియేట్ చేసి, ఆ రైట్స్ కొనుక్కుని ఇక్కడ రిలీజ్ చేసుకుంటాం. కానీ తెలుగులో ఆలా రాస్తే మాత్రం ఇష్టపడరు. సినిమా రంగంలో మహిళల అవకాశాల గురించి మాట్లాడాల్సి వస్తే.. మగవాళ్ల కన్నా రెండింతలు కష్టపడితే కానీ గుర్తింపు రాదు. అదీగాక ఇది అనార్గనైజ్డ్ సెక్టార్. సేఫ్టీ, ఇమేజ్ ఇష్యూస్ ఉంటాయి. వీటన్నిటినీ ఓవర్‌కమ్ చేయడానికి నేనొక అబ్బాయిలా బిహేవ్ చేశాను. వర్కవుట్ అవలేదు. ఒకటి మాత్రం గ్రహించాను.. సబ్జెక్ట్, మేకింగ్ మీద క్లారిటీ ఉంటే అమ్మాయైనా.. అబ్బాయైనా రెస్పెక్ట్ ఇస్తారు. సో నాకు ఆ క్లారిటీ ఉంది. కాబట్టి నా ఐడెంటిటీతోనే చాన్సెస్ తెచ్చుకోవాలని డిసైడ్ అయ్యాను. ఇప్పుడు ప్రత్యామ్నాయ ప్లాట్‌ఫామ్స్ చాలా ఉన్నాయి. టాలెంట్‌కు బోలెడంత స్కోప్ ఉంది. యంగ్‌స్టర్స్ రావాలి. ఎక్స్‌పరిమెంట్స్ జరగాలి. ఏ క్రియేటివ్ మీడియమ్‌లోకైనా అన్ని క్రాఫ్ట్స్‌లో అమ్మాయిల ప్రవాహం ఉండాలి. యు కాంట్ ఆలో మెన్ టు రైట్ ఫర్ విమెన్.. అబౌట్ విమెన్.. హౌ విమెన్ షుడ్ బీ!'

- అంజలి పార్వతి కోడా

ఫ్యాషన్

# లైట్.. బ్రైట్

వేసవిలో వివాహ వేడుకలకు ఓ ప్రత్యేకత ఉంటుంది. కాలానికి తగినట్లు డ్రెస్సింగ్ ఉండాలి. అలాగని లుక్‌లో రిచ్‌నెస్ ఏ మాత్రం తగ్గకూడదు. ఎంపిక పెద్ద టాస్క్. సీజన్‌కి తగినట్లు సౌకర్యంగా ఉండేలా, అందరిలో ప్రత్యేకంగా కనిపించేలా ఉండాలంటే మనదైన స్టైల్ స్టేట్‌మెంట్‌ను చూపించాలి.





**వే**సవిలో ఉక్కపోతలో డ్రెస్సింగ్ స్టైల్స్ ఆహ్లాదంగా... ఆకట్టుకునేలా ఉండాలి. మిగతా సీజన్‌లో ఎంత బ్రైట్ కలర్స్‌ని ఎంపిక చేసుకున్నా... సమ్మర్‌లో మాత్రం పేస్టల్ కలర్స్‌కి మంచి డిమాండ్ ఉంటుంది. వీటికే కాంట్రాస్ట్ బ్లౌజ్‌లు, లైట్‌షేడ్స్ ఉన్నవి, అవి కూడా హెవీ వర్క్‌తో కాకుండా ఉన్నవి ఎంపిక చేసుకోవాలి.

**ఫ్లోరల్స్...** ఎంగేజ్‌మెంట్, రిసెప్షన్ వంటి వేడుకలకు లెహంగా అయినా, వివాహ వేడుకకు శారీ అయినా ఫ్లోరల్ ప్రింట్స్ ఉన్నవి ఎంపిక చేసుకోవడం వల్ల అకేషన్ కాస్తా ఆహ్లాదంగా మారిపోతుంది. పేస్టల్, గోల్డ్, సిల్వర్ కలర్స్‌లో ఉన్నా ఫ్లోరల్స్‌తో ఉన్న లైట్ వెయిట్ పట్టు చీరలకు, మరో డిజైనర్ పల్లూని జత చేసి వధువు, ఆమె తరఫు స్నేహితులు.. మహారాణీ స్టైల్‌ని ఎంపిక చేసుకోవచ్చు.

**ఇండో వెస్ట్రన్...** మన హ్యాండ్లూమ్ పట్టు చీరల్లోనూ లైట్ వెయిట్‌వి ఎంపిక చేసుకోవాలి. వాటికి పూర్తి కాంట్రాస్ట్ బెలూన్ స్లీవ్స్, స్లీవ్‌లెస్, యునిక్‌గా ఉండే బ్లౌజ్ డిజైన్స్ సరైన ఎంపిక అవుతుంది. శారీ గ్రాండ్‌నెస్ అంతా బ్లౌజ్ డిజైన్‌లో చూపించవచ్చు హెవీ ఎంబ్రాయిడరీ అవసరం లేకుండానే.

**లినెన్ అండ్ కాటన్ స్టైల్...** వొవెన్ బార్డర్ ఉన్నవి, లినెన్స్, కాటన్స్‌ని ఉపయోగించి కూడా తమదైన స్టైల్ స్టేట్‌మెంట్‌తో ఈ సీజన్ వేడుకలో పాల్గొనవచ్చు. కాంట్రాస్ట్ స్టైలిష్ బ్లౌజులు, మనవైన సంప్రదాయ ఎంబ్రాయిడరీ డిజైన్లు ఉన్న ప్లెయిన్ శారీస్‌ను కూడా ఈ వేడుకలకు ఎంచుకోవచ్చు. వీటితో పాటు చందేరీ స్టైల్స్‌తోనూ గ్రాండ్‌లుక్‌ను తీసుకు రావచ్చు.

**ఆభరణాల ఎంపిక...** ముత్యాలు, పచ్చలు, ఇతర బీడ్స్‌తో చేసిన లేయర్డ్ జ్యువెలరీ ఈ వేసవికి సరైన ఎంపిక అవుతుంది. వీటి వల్ల చెమటతో పెద్ద ఇబ్బంది ఉండదు. పైగా, ధరించిన డ్రెస్‌కు హైలైట్‌గా నిలుస్తాయి.




## చేను.. చీర కట్టింది!

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల శివారులో మంజీర తీర ప్రాంతంలో రైతు నగేశ్ ఇసుక నేలలో టమాటాను సాగు చేస్తున్నాడు. ఇసుక నేల, వేడి వాతావరణం వల్ల టమాటా పంట ఎండిపోతోందని గమనించిన రైతు.. పంటకు ఎండ తగలకుండా వెదురు బొంగులతో పందిరి వేసి చీరలతో నీడ కల్పించాడు. రెండెకరాల్లోని పంటకు 1,200 చీరలను వినియోగించాడు. రూ. 2.5 లక్షల వ్యయంతో డ్రిప్ విధానంలో పంటకు నీరందిస్తున్నాడు. మరో 20 రోజుల్లో పంట చేతికి వస్తుందని రైతు తెలిపాడు. పై నుంచి నీడ, కింద డ్రిప్ ద్వారా నీరుంటే పంట బాగా కాస్తుందని స్పష్టం చేశాడు.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

# 2 నెలల్లో 25 వేల టికెట్లు..




**పెరుగుతున్న 'మీ టికెట్' వినియోగం**

**కొత్త యాప్‌లో రూ.65 లక్షల విలువైన డిజిటల్ టికెట్ల బుకింగ్**

**మే నుంచి ఆర్టీసీలోనూ 'మీ టికెట్' సేవలు**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం జనవరిలో ప్రారంభించిన 'మీ టికెట్' యాప్‌నకు వినియోగదారుల నుంచి స్పందన లభిస్తోంది. 'తెలంగాణ మీ టికెట్' మొబైల్ యాప్ ద్వారా ఇప్పటివరకు రూ.65 లక్షల విలువ చేసే 25 వేలకుపైగా డిజిటల్ టికెట్ల బుకింగ్ జరిగింది. ఈ ఏడాది జనవరి 29న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఈ యాప్‌ను ప్రారంభించారు. మెట్రో రైలు, పార్కులు, దేవాలయాలు, పర్యాటక ప్రదేశాల టికెట్లను ఈ యాప్ ద్వారా కొనుగోలు చేసేలా రూపొందించారు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లపై ఇప్పటి వరకు 21 వేలకు పైగా డౌన్‌లోడ్‌లు జరగ్గా, 4 స్టార్ రేటింగ్‌ను ఈ యాప్ స్థిరంగా సాధిస్తూ వస్తోంది. వినియోగానికి అనుకూలంగా ఉండేలా డిజైన్ చేయడంతో పాటు సురక్షితమైన చెల్లింపుల విధానం, విభిన్న సేవలను ఒకేచోట సులభంగా పొందే వీలుండటంతో యాప్ వినియోగానికి ఆదరణ పెరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సేవల విభాగం చెపుతోంది. ఇప్పటివరకు హైదరాబాద్ మెట్రో రైలుకు సంబంధించి వినియోగదారులు రూ.25 లక్షల విలువ చేసే 6,500 టికెట్లు బుక్ చేసుకున్నారు. జూపార్క్, కేబీఆర్ పార్కు, బొటానికల్ గార్డెన్‌కు సంబంధించి రూ.26 లక్షల విలువ చేసే 6,100 టికెట్లు అమ్ముడుపోయాయి. వసంత పంచమి సందర్భంగా రూ.2.50 లక్షల విలువ చేసే 400 బాసర అమ్మవారి పూజ టికెట్లు బుక్ చేసుకున్నారు. ప్రస్తుతం ఈ యాప్‌ను హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌లలో మాత్రమే వినియోగించే వీలుండగా, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. బస్ టికెట్లు, పాస్‌లను కూడా 'మీ టికెట్' యాప్ ద్వారా డిజిటల్ రూపంలో పొందడానికి వీలుగా మే నెల నుంచి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చర్యలు తీసుకుంటోంది.



# సర్కారు బడికి పోస్టర్ ప్రచారం

**అశ్వారావుపేట రూరల్:** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల తరహాలో కరపత్రాలతో విస్తృత ప్రచారం చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఇప్పటి నుంచే సమీప గ్రామాల్లో ముమ్మరంగా పర్యటిస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, సర్కారు అందిస్తున్న వివిధ పథకాలతోపాటు కార్పొరేట్ తరహాలో బోధన అందిస్తున్నామంటూ సమగ్ర వివరాలతో కరపత్రాలు ముద్రించారు. పాఠశాల హెచ్‌ఎం హరిత సహచర ఉపాధ్యాయులతో కలిసి చేస్తున్న ఈ సర్కారు బడి ప్రచారం ఆకట్టుకుంటోంది.





Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
శుక్రవారం। 18-4-2025

'ఎర్రజెండా ఎర్రజెండా ఎన్నియలో..
ఎర్రెర్రనీదీ జెండా ఎన్నియలో..
తూరుపు దిక్కున ఎన్నియలో..
సూర్యుడు పొడిచిండు ఎన్నియలో..
పడమటి దిక్కున ఎన్నియలో..
అన్నలు నిలిచారు ఎన్నియలో..'

ఇది గతంలో సిరిసిల్ల ప్రాంతంలోని పల్లెల్లో మారుమోగిన ఎర్ర జెండా పాట. అ ప్పటి పరిస్థితుల్లో పల్లెప్రజలు మనో నిబ్బరం కోసం నిత్యం సాయంత్రం వేళ హోటళ్లు, ఇళ్లలోని టేపురికార్డర్లలో ఈ పాటలు వేసు కుని వినేవారు.

'హరే రామ హరే రామ..
రామ రామ హరే హరే
హరే కృష్ణ హరే కృష్ణ..
కృష్ణ కృష్ణ హరే హరే'

'శరణు శరణు శరణు విఘ్నేశ్వరా దేవ
శరణు చేసేదమయ్యా
శివుని ముద్దుల తనయా..
కరుణించి కాపాడుమా విఘ్నేశ్వరా..'

అవే ఉద్యమాల పల్లెల్లో ప్రస్తుతం ఈ పాటలు మారుమోగుతున్నాయి. మారిన పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. ఒకప్పుడు విప్లవభావాలు వెదజల్లిన పల్లెల్లో.. ప్రస్తుతం ఆధ్యాత్మిక చింతన వర్ధిల్లుతోంది. భక్తిపాటలతో మానేరు నది తీర ప్రాంతంలోని పల్లెల్లో మారుమోగుతున్నాయి.

# నాడు విప్లవ బాట.. నేడు భక్తి పాట

**ఉద్యమాల గడ్డపై ఆధ్యాత్మిక పరిమళాలు**
**భక్త సంఘం స్ఫూర్తితో భక్తిమార్గం**
**మానేరు తీరంలో సంకీర్తనల హోరు**
**అప్పుడు విప్లవ గీతాల మోత.. నేడు భక్తిపాటల బాట**


నారాయణపూర్‌లో రాములోరి గరుడసేవలో భక్తమండలి సభ్యులు


గోవిందరాజులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల):

ఒకప్పటి కల్లోల పల్లెలు ప్రస్తుతం భక్తి మార్గంలో పయనిస్తున్నాయి. మూడు దశాబ్దాల క్రితం విప్లవగీతాలతో మారుమోగిన సిరిసిల్ల మానేరు తీరం.. భజన సంకీర్తనలతో హోరెత్తుతోంది. ఆనాటి ఉద్యమస్ఫూర్తి పల్లెల్లో నేటికీ కనిపిస్తోంది. గ్రామాల్లోని ఆలయాల్లో నిత్యం భజనలు చేస్తూ ఐకమత్యంగా ముందుకు కదులుతున్నారు. ఒకప్పుడు అడవిబాట పట్టిన ఉద్యమకారులు సైతం.. నేడు భజనమండళ్లలో ముఖ్యభూమిక పోషిస్తున్నారు. జనశక్తి, పీపుల్స్‌వార్, పోలీసుల తుపాకీ మోతలతో అట్టుడికిన పల్లెల్లో నేడు భక్తి సుమాలు వికసిస్తున్నాయి.

**భక్త సంఘాలు.. భజన మండళ్లు**

జిల్లాలోని పల్లెల్లో ప్రతీ శని, మంగళవారాల్లో సాయంత్రం భజన మండళ్ల సభ్యులు ఆలయాల్లో కలుసుకొని.. రాత్రి పొద్దుపోయే వరకు భజనలు చేస్తుంటారు. ఇలాంటి భజన మండళ్లు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదనం (భక్త సంఘం), నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి, అల్మాస్‌పూర్, కోనరావుపేట మండలం రామన్నపల్లి, కనగర్తి, మామిడిపల్లి, వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు రంగంపేట, అడవిపదిర, ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు పోతుగల్, గంభీరావుపేట మండల కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలోని భక్త మండలి, ఇల్లంతకుంట మండలం రేపాక, గాలిపల్లి గ్రామాల్లో భక్త సంఘాలు ఉన్నాయి. బోయినపల్లి మండలంలోని శాంతానంద యోగాశ్రమం, సత్సంగంలో భజనలు చేస్తుంటారు.

**ఐకమత్యంతో ముందుకు..**

వారంలో రెండు రోజులు భజన చేసేందుకు ఒకే చోట చేరుతున్న ఆయా మండళ్ల సభ్యుల్లో ఐకమత్యం పెంపొందుతోంది. భజన చేసేందుకే కాకుండా.. నిత్యం సాయంత్రం గ్రామాల్లోని కూడళ్ల వద్ద కలుసుకొని కష్టసుఖాలు పంచుకుంటున్నారు. ఒకరికొకరు మనోధైర్యం కల్పించుకుంటున్నారు. వృద్ధాప్యంలో ఒంటరివారమనే భావన దరిచేరనీయడం లేదు.

## భక్తితో మానసిక ప్రశాంతత



భక్తి మార్గం అందరికీ అనుసరణీయం. ఆధ్యాత్మిక మార్గంలో వెళ్లిన వారు మానసిక ప్రశాంతతతో జీవనం గడుపుతారు. గ్రామాల్లో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని.. భక్తి ప్రవచనాలు వినిపించడం ద్వారా.. వారిని సైతం ఈ మార్గంలో పయనించేలా సత్సంగ సదనం తరఫున కృషి చేస్తున్నాం. ఎల్లారెడ్డిపేటలోని సత్సంగ సదనం కార్యాలయం కేంద్రంగా.. దేశవ్యాప్తంగా పలు ఆధ్యాత్మిక నగరాల్లో మా కార్యాలయాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాలకు దర్శనాలకు వెళ్లే భక్తులకు అక్కడి కార్యాలయాల్లో సేవలందిస్తున్నాం.

– బ్రహ్మచారి లక్ష్మారెడ్డి, అధ్యక్షుడు, సత్సంగ సదనం, ఎల్లారెడ్డిపేట

## పరిస్థితులు మారాయి



ఆ కాలంలో ఉద్యమంలో భాగంగా గ్రామాల్లో తిరిగేవాళ్లం. ప్రజలను చైతన్యపరిచేందుకు జననాట్యమండలి విప్లవ గేయాలు ఆలపిస్తూ ప్రజలను సమీకరించాం. ప్రస్తుత జీవనశైలి, సామాజిక పరిస్థితులు మారిపోయాయి. సమాజంలో భక్తిని పెంపొందించడం, ప్రజలను శాంతియుత జీవనం వైపు మళ్లించడంలో నా వంతు పాత్ర పోషిస్తున్నాను.

– గోగుల రమేశ్, మాజీ నక్సలైట్, కంచర్ల

## ఇరవై ఏళ్లుగా భక్తి మార్గంలో..



ఇరవయ్యేళ్లుగా గ్రామంలో నిత్యం సాయంత్రం వేళ ఆలయంలో భక్తులతో కలిసి భజనలు చేస్తుంటాను. భక్తి పాటలు పాడడం నాకు సంతృప్తినిస్తుంది. మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. నేను ఆలపించే భక్తిగీతాలు.. మరికొందరిపై ప్రభావం చూపడంతో.. చాలా మంది ఈ మార్గంలోకి వస్తున్నారు.

– రవి, బోయినపల్లి


ముస్తాబాద్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయం


ఎల్లారెడ్డిపేటలోని భక్తసంఘంలోని రామకోటి స్థూపం


ఇల్లంతకుంట మండలం గాలిపల్లిలో భజన చేస్తున్న భక్తులు

# ఇంద్రవెల్లి అమరులకు ప్రణమిల్లి..

**అధికారికంగా ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ దినోత్సవం**
- నివాళులర్పించేందుకు సర్కారు సమాయత్తం
- ఏప్రిల్ 20న నిర్వహణకు ఏర్పాట్లు
- హాజరుకానున్న మంత్రి సీతక్క
- తుది దశకు స్మృతివనం నిర్మాణం


ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం చుట్టుపక్కల అభివృద్ధి పనులు


స్తూపం ఉన్న స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీ

సాక్షి, ఆదిలాబాద్:

**1981 ఏప్రిల్ 20..**

భూమి, భుక్తి, హక్కుల కోసం ఉద్యమించిన అడవి బిడ్డల పై పోలీసులు తుపాకీ ఎక్కు పెట్టారు. తూటాల వర్షం కురిపించారు. ఎంతో మంది ఆదివాసీ గిరిజనులు అమరులయ్యారు. వారి రక్తపుటేరులతో తడిసిన వనసీమ ఎర్రబారింది. అప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉంది కాంగ్రెస్ పార్టీయే..

**2025 ఏప్రిల్ 20..**

ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద ప్రభుత్వం అధికారికంగా నివాళులర్పించాలని నిర్ణయించింది. ఆ రోజు అక్కడ నిర్వహించే కార్యక్రమాల కోసం ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు మొదలు పెట్టింది. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉంది కూడా కాంగ్రెస్ పార్టీయే..

**44 ఏళ్ల తర్వాత..**

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సంఘటన జరిగిన 44 ఏళ్ల తర్వాత తొలిసారిగా ప్రభుత్వమే దీన్ని అధికారికంగా నిర్వహిస్తుండడంతో.. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిపై ఇప్పుడు అందరి దృష్టి మళ్లింది. ఉమ్మడి రాష్ట్రంలో నివాళులర్పించేందుకు నిర్బంధాలు కొనసాగాయి. ఆ తర్వాత తెలంగాణ వచ్చిన తర్వాత ఆంక్షల మధ్య నివాళులర్పించేవారు. ఇప్పుడు స్వేచ్ఛగా నివాళులర్పించేందుకు ఆదివాసీలు సిద్ధమయ్యారు.

**పెద్ద ఎత్తున తరలిరండి**



రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించనుంది. ఆ రోజు రాష్ట్రం నలుమూలల నుంచి ఆదివాసీలు, మేధావులు, కార్మికులు, కర్షకులు ప్రతిఒక్కరూ పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలి. ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పాల్గొంటారు.

– వెడ్మ బొజ్జు, ఎమ్మెల్యే, ఖానాపూర్

**సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి..**

సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లిపై మొదటి నుంచే ప్రత్యేక దృష్టి వ్యవహరిస్తూ వస్తున్నారు. గతంలో టీపీసీసీ అధ్యక్షునిగా నియమితులయ్యాక.. రాష్ట్రంలో తొలి భారీ బహిరంగ సభను ఇంద్రవెల్లి నుంచే ఆయన ప్రారంభించారు. గిరిజన, దళిత దండోరా సభ పేరిట ఇంద్రవెల్లిలో నిర్వహించిన సభ విజయవంతం కావడంతో.. అప్పటినుంచే ఆయన రాజకీయంగా వెనుదిరిగి చూడలేదన్న అభిప్రాయం ఉంది. అప్పట్లో ఆయన తన ప్రసంగంలో.. నాడు కాంగ్రెస్ హయాంలో జరిగిన ఈ సంఘటనపై క్షమాపణలు చెప్పారు. ఇంద్రవెల్లి స్తూపం వద్ద నివాళులర్పించారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడం, ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ఇంద్రవెల్లికి వచ్చారు. ఇంద్రవెల్లి స్తూపం వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలని అప్పట్లో ఆయన నిర్ణయించారు. స్మృతి వనం ఏర్పాటుకు రూ.కోటి మంజూరు చేశారు. 2024 జూలై 1న మంత్రి సీతక్క ఈ పనుల కోసం భూమిపూజ నిర్వహించారు. స్తూపం ఉన్న ఎకరం స్థలంలో చుట్టూ ప్రహరీ నిర్మించారు. స్తూపం చుట్టూ వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ స్థలంలో ఒక కమ్యూనిటీ హాల్, మరుగుదొడ్లు నిర్మించారు. ఇక ఈ వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. స్తూపం ఉన్న స్థలం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి.


మరుగుదొడ్లు

# రైతులకు వాతావరణ సూచనలు, సలహాలు




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే సూచనలున్నందున చెట్ల కింద నిలబడకూడదు. పశువులు, గొర్రెలు, మేకలను చెట్ల కింద ఉంచకూడదు.

- ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచనలున్నందున రైతులు విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, చెరువులు, నీటి కుంటలకు దూరంగా ఉండాలి.
- తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నందున కోసిన పంటల (వరి, మొక్కజొన్న, శనగ, పెసర, మినుము, జొన్న, పొద్దుతిరుగుడు, నువ్వులు)ను ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతానికి తరలించాలి. మార్కెట్‌కు తరలించిన ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లతో కప్పి ఉంచాలి.
- వర్ష సూచనలున్నందున తాత్కాలికంగా పురుగు మందుల పిచికారీ చేయడం వాయిదా వేసుకోవాలి.
- నీటివసతిగల ప్రాంతాల్లో పచ్చిమేత కోసం జొన్న, మొక్కజొన్న పంటలను వేసుకోవచ్చు. తక్కువ నీటివసతి గల ప్రాంతాల్లో పశుగ్రాస పంటలుగా సజ్జ, బొబ్బర్ల పంటలు వేసుకోవచ్చు.

**వడగండ్ల వాన, అధిక వర్షాలు కురిసిన ప్రాంతపు రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు**

- అధిక వర్షాలు కురిసిన ప్రాంతాల్లో పొలం నుంచి నీటిని తీసివేసిన తర్వాత పంట త్వరగా కోలుకోవటానికి 2శాతం యూరి యా లేదా 1శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పంటపై పిచికారీ చేయాలి.
- శాకీయ దశలో ఉన్న కూరగాయ పంటలలో అధిక వర్షాల వల్ల నష్టం ఎక్కువగా జరిగితే తిరిగి మొక్కలను నాటుకోవాలి.
- పడిపోయిన మొక్కజొన్న పచ్చికంకి దశలో ఉన్నట్టయితే కంకులను కోసి పచ్చి కంకులుగా అమ్ముకోవాలి.
- అధిక వర్షాలు కురిసిన ప్రాంతాల్లో వరి పంటలో అగ్గి తెగులు, గింజమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. తెగుళ్ల ఉధృతి గమనించినట్టయితే 1 మి.లీ. ప్రోపికోనజోల్ లేదా 0.4 గ్రా. టేబుకొ నజోల్ + ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ లేదా 2.5 గ్రా. ట్రైసైక్లాజోల్ + మాంకోజేబ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మామిడి తోటలో పడిపోయిన కాయలను సేకరించి, బాగున్న కాయలను మార్కెట్‌కు తరలించాలి. పగిలిన కాయలను అలాగే తోటలో వదిలేసినట్టయితే తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది.
- మామిడిలో కాయమచ్చ తెగులు గమనించినట్టయితే 1 గ్రా. కార్బండజిమ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



## ఓ బంగరు రంగుల చిలుక..

వరంగల్ హంటర్‌రోడ్డు సహకారనగర్‌లో రంగుల రామచిలుక ఓ ఇంటికి వచ్చింది. దాన్ని చూసి పలకరిస్తూ ఆట పట్టిస్తున్న పిల్లలతో కూత కలిపింది. దీంతో చిన్నారులు ఆనందంతో కేరింతలు కొట్టారు. ఈ చిలుకను ఫొటో ప్రేమికుడు నిరంజన్ తన కెమెరాలో బంధించారు.

– హన్మకొండ అర్బన్





## సర్వేపల్లికి నివాళి

భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా టీపీసీసీ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు తదితరులు గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

## వరి సిరి



రైతు కష్టానికి ఫలితం కనిపిస్తోంది. పచ్చని వరిపైరు పనలతో కళకళలాడుతోంది. వరుణుడు కరుణిస్తే రబీలో మంచి దిగుబడి వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. ఏలూరు రూరల్ ప్రాంతంలో బంగారు వర్ణంలో మెరిసిపోతున్న వరి పంటను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు

## ప్రయాణం.. ప్రమాదం



ఒకవైపు రోడ్డు ప్రయాణికులతో రద్దీగా ఉంటే మరోవైపు భారీ యంత్రాలతో రహదారిని తవ్వుతున్నారు. దీంతో పైకెగసిన దుమ్ము ప్రయాణికుల కంట్లోపడి ప్రమాదాలు జరిగే పరిస్థితి.. నెల్లూరులోని బట్వాడిపాలెం జంక్షన్‌లో ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

## నయనానందకరం



అమెరికా, భారత్ సంయుక్తంగా నిర్వహించిన టైగర్ ట్రయాంఫ్ -2025 విన్యాసాలు ముగిశాయి. భారత యుద్ధనౌకలు తీరానికి చేరువలో పహారా కాస్తున్నాయి. విశాఖ ఆర్కే బీచ్ అందాలకుతోడు సముద్రంలో యుద్ధనౌకలు కనువిందు చేస్తుండటంతో పర్యాటకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

### ఐటీ ప్రచారానికి జిల్లాకు నలుగురు అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పాలసీ, రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ , జీసీసీ, డేటా సెంటర్స్, వర్క్ ఫ్రమ్ హోమ్ వంటి కార్యక్రమాలను ప్రోత్సహించడానికి ప్రతీ జిల్లాకు నలుగురు సభ్యులతో ప్రత్యేక బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.జిల్లా పరిపాలన అధికారితో పాటు ముగ్గురు అసిస్టెంట్ మేనేజర్లను ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ నియమించుకోవడానికి అనుమతిస్తూ ఐటీ కార్యదర్శి భాస్కర్ కాటమనేని గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

### ఉల్లి రైతుల్ని ఆదుకోవాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉల్లి ధరలు ఆకస్మాత్తుగా పడిపోతున్న దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే ఉల్లి రైతుల్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కె.వి.వి.ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. క్వింటా రూ.1,800 - రూ.2,300 ఉన్న ఉల్లి ధర ప్రస్తుతం రూ.600 - రూ.1,300కు పడిపోవటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కిలో రూ.15 చొప్పున ఉల్లికి మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

### సంగం బ్యారేజీలో అదనపు పనులకు రూ.22.88 కోట్లు

సాక్షి, అమరావతి: నెల్లూరు జిల్లాలో పెన్నా నదిపై సంగం బ్యారేజీ నిర్మాణంలో అదనపు పనులకు రూ.22.88 కోట్లను అదనంగా చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సంగం బ్యారేజ్ కమ్ బ్రిడ్జిని 846 మీటర్ల పొడవుతో నిర్మించాలని తొలుత నిర్ణయించారు. కానీ.. డిజైన్ మారడంతో 1195 మీటర్ల పొడవుతో నిర్మించాల్సి వచ్చింది. ఇందుకు అదనంగా రూ.22.88 కోట్లను కాంట్రాక్టర్‌కు చెల్లించాలని రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ 2022, సెప్టెంబరు 15న నివేదిక ఇచ్చింది. దీనిపై తెలుగుగంగ ప్రాజెక్టు సీఈ 2022, నవంబర్ 29న ప్రతిపాదన పంపగా దానిని ఆమోదిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

# గోమయం.. దివ్యమైన హోమం

ఆవుపేడ కదా అందులో ఏముంది అనుకునే వారికి దాని విలువ తెలియకపోవచ్చు.. ముందు తరాలవారు దాని విశిష్టతను గుర్తించారు. వారికి దాని ఉపయోగాలు తెలుసు..అందుకే ఆవు పేడ నీటితో కళ్లాపి చల్లేవారు.. పేడ అలికిన ఇల్లు శుభదాయకమని చెప్పేవారు. మట్టి గోడలకు పేడను అలికేవారు.. ఇలా క్రిమికీటకాలను ఆవుపేడ నశింపజేస్తుందని వారు ముందే పసిగట్టారు. పేడ విలువను గుర్తించిన నేటితరం ఆవుపేడతో చెయ్యలేనిది ఏమీ లేదని నిరూపిస్తున్నారు. ఇప్పటికే ఆవు పేడతో సేంద్రియ ఎరువులు, బయోగ్యాస్ , పిడకలు, విభూతి, పళ్లపొడి, రాఖీలు, ప్రమిదలు, బొమ్మలు, దేవుళ్ల ప్రతిమలు, కుండీలు, జపమాలలు, అగరొత్తులు అంటూ ఎన్నో రకాలుగా ఆవు పేడను వినియోగిస్తున్నారు. ఇలా ఆవు పేడలో మూలికలు కలిపి అగ్నిహోత్ర పిడకలు తయారు చేసి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు రాజులకండ్రిగ రైతు సుబ్బరాజు.

- అగ్నిహోత్ర పిడకలు.. ఆరోగ్యధాతువులు
- నగరి మండలం రాజులకండ్రిగలో తయారీ
- ఒక్కో పిడక తయారీకి రూ.25 ఖర్చు
- ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్న వైనం
- ఆరోగ్యాన్ని పంచడమే లక్ష్యమంటున్న రైతు సుబ్బరాజు



ఎండబెట్టి ఉంచిన అగ్నిహోత్ర పిడకలు



నిల్వ చేసిన ఆవు పిడకలు

నగరి : పీల్చే గాలి కూడా ఆరోగ్యాన్ని ఇవ్వాలనే సదుద్దేశంతో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా చిత్తూరు జిల్లా నగరి మండలం రాజులకండ్రిగకు చెందిన రైతు సుబ్బరాజు అగ్నిహోత్ర పిడకలు తయారు చేస్తున్నారు. రైతుగా సేంద్రియ పద్ధతిలో నూతన పంటలు సాగు చేసి అందరి మెప్పు పొందిన ఆయన పాడి రైతుగాను ఆరోగ్యమిచ్చే అంశాలపైనే దృష్టిసారించారు. హోమ పూజలు, ఇళ్లలో దూపం వేసే సమయంలోనూ వచ్చే పొగ ఆరోగ్యాన్ని ఇవ్వాలనుకునే ఆయన పర్యావరణ రక్షణకు సంబంధిత ఆయుర్వేద గ్రంథాలు చదవడం, సంబంధిత శాఖలోని వారిని కలిసి వారి వద్ద సలహాలు, సూచనలు పొంది అగ్నిహోత్ర పిడకల తయారీకి పూనుకున్నారు. కష్టంతో కూడుకున్న పనే అయినా పర్యావరణ రక్షణపై ఉన్న వ్యామోహంతో ఇంటి వద్దే ఒక పాక వేసుకొని అగ్నిహోత్ర పిడకల తయారీ చేస్తున్నారు.

### ఒక్కో పిడక రూ.30

10 కిలోల ఆవు పేడతో పిడకలు తయారు చేయాలంటే 3 కిలోల నెయ్యి , పాలు, పెరుగు, పంచితం అవసరం. వీటితో పాటు వేసే మూలికలు స్థానికంగా లభించవు. కొన్ని వస్తువులు చెన్నైలోని ఆయుర్వేద షాపునకు వెళ్లి తీసుకొస్తున్నారు. ఇలా తయారు చేయాలంటే ఒక్కో పిడకకు రూ.25 ఖర్చు అవుతోందని చెబుతున్నారు. వీటిని రూ.30కి విక్రయిస్తున్నారు. లాభాల కన్నా ఆరోగ్యం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నట్లు రైతు సుబ్బరాజు తెలిపారు.

### ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు

చుట్టు పక్కల ఉన్న ఆలయాలలో జరిగే హోమ పూజలు, ఇళ్లలో జరిగే పూజలకు వాడటంతో పాటుతో తమిళనాడు, కర్ణాటకలలో జరిగే హోమ పూజలకు అగ్నిహోత్ర పిడకలు నగరి నుంచి తీసుకొని వెళతారు. ఒక్కసారి ఈ పిడకలు వాడి వాటి ప్రయోజనాలు తెలుసుకున్నవారు వాటిని వదలరు.

### తయారీ ఇలా....





పిడకల తయారీకి సిద్ధం చేసిన మిశ్రమం, కషాయాన్ని తయారు చేస్తున్న రైతు సుబ్బరాజు

దేశీవాళీ గిర్ ఆవుల పేడలో నెయ్యి, పాలు, పెరుగు, పంచితం, హోమ ద్రవ్యాలైన రావి, మోదుగ, జమ్మి, అర్క, గరిక, దర్బ, మేడి, చంద్ర, సరస్వతీ, తామర మొదలగు సమిధలతో పాటు సాంబ్రాణి, సర్జారసం, తెల్ల గుగ్గిలు, వస, జటామాన్సి, ఆవాలు, కస్తూరి పసుపు, అపరాజిత, వేప, సుగంధి పాల, గ్రంధి తగర, చెంగాల్వ కోస్తు, పచ్చ కర్పూరం మొదలగు సుగంధ భరిత ద్రవ్యాలను కలిపి ముద్దలు చేసి కావాల్సిన ఆకారంలో చేసి ఎండబెడతారు. ఇలా శాస్త్రోక్తంగా పవిత్రంగా ఈ పిడకలు తయారవుతాయి. కావాల్సిన సామగ్రి సమకూర్చడానికి మాత్రమే ఎక్కువ సమయం పడుతుంది. అన్ని వస్తువులు ఉంటే రోజుకు ఒక మనిషి 300 పిడకలు చేసి ఎండబెట్టవచ్చు.

### వినియోగించడం ఎలా..

ఇంట్లో హోమ ద్రవ్యంగాను , అగ్నిహోత్రంగా, ధూపంగా వేసినట్టైతే మూలికలతో తయారైన ఈ పిడకల నుంచి వచ్చే పొగ రోగ కారక క్రిములను అంతరింపజేసి, వాతావరణ కాలుష్యం నివారించి ప్రాణవాయువు అయిన ఆక్సిజన్ విరివిగా లభిస్తుంది. ఆరోగ్యంతో పాటు సుగంధ భరితమైన సువాసనలతో ఇంటి వాతావరణం ఆధ్యాత్మికతను సంతరించుకుంటుంది.



రామాలయం వద్ద అగ్నిహోత్ర పిడకలతో హోమ పూజలు

### ఆరోగ్యం కోసమే చేస్తున్నా

ఆరోగ్యకరమైన పంటల కోసం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. అలాగే గాలి కూడా వీలైనంత మేర ఆరోగ్యకరంగా ఇవ్వాలనే ఆలోచనే ఈ పిడకల తయారీకి దారి తీసింది. పూర్వీకులు ఉదయాన్నే సూర్యుడి నుంచి వెలువడే అతినీల లోహిత కిరణాల నుంచి వెలువడే రేడియేషన్‌ను నిర్మూలించేందుకు ఆవుపేడను నీళ్లలో కలిపి కళ్లాపి చల్లేవారని ఈ మధ్య కాలంలో జరిపిన ప్రయోగాల్లో కనుగొన్నారు. ఒక పిడక మీద సెల్‌ఫోన్ ఉంచినప్పుడు అది వెలువరించే రేడియేషన్ పరిమాణం తగ్గినట్లు గుర్తించామని శాస్త్రవేత్తలు తెలిపినట్లు పత్రికల్లో చదివాను. ఆయుర్వేద గ్రంథాలలో వాయు కాలుష్య నివారణకు సూచించిన మార్గాలను తెలుసుకొని ఆయుర్వేదానికి సంబంధించి కొందరి సలహాలతో అగ్నిహోత్ర పిడకలను తయారు చేస్తున్నా. లాభాల కన్నా ఆరోగ్యం ఇవ్వాలనే ఉద్దేశంతోనే వీటిని తయారు చేస్తున్నా.

– సుబ్బరాజు, పాడి రైతు, రాజులకండ్రిగ

# ఉలవపాడు మామిడికి గడ్డుకాలం

ప్రతి సీజన్‌లో ఉలవపాడు మామిడి కోసం జనం ఎంతగానో ఎదురు చూస్తుంటారు. ప్రధానంగా ఇక్కడి బంగినపల్లి రకాన్ని రుచి చూడాలని పరితపిస్తుంటారు. అయితే ఈ ఏడాది దిగుబడి గణనీయంగా తగ్గనుంది. వాతావరణ పరిస్థితులు, చీడపీడల వల్ల మామిడి రైతులు విలవిల్లాడుతున్నారు. పూత నిలబడలేదు. పిందెలు రాలిపోతున్నాయి. పెద్దకాయలకు బొక్కలు పడి రాలుతున్న పరిస్థితులు ఉలవపాడు ఉద్యాన శాఖ పరిధిలోని తోటల్లో నెలకొంది.



రాలిపడిపోయిన పిందెలు

### కొంపముంచిన చీడపీడలు

- భారీగా తగ్గనున్న దిగుబడి
- లబోదిబోమంటున్న కౌలు రైతులు
- కాపాడుకునేందుకు కవర్లు కడుతున్న పరిస్థితి



మామిడి తోటలు

ఉలవపాడు: నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలంలో ఏడు వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఇక ఉలవపాడు ఉద్యాన శాఖ పరిధిలో చూస్తే 10 వేల ఎకరాల్లో తోటలు విస్తరించి ఉన్నాయి. డిసెంబర్‌లో వచ్చిన కొద్దిపాటి పూత మాత్రం పిందెలు, కాయలుగా మారాయి. ఫిబ్రవరి, మార్చిలో వచ్చిన పూత మొత్తం పిందెలు కాకుండానే రాలిపోయింది. ఈ పూత కాయలుగా మారి దిగుబడి బాగుటుందని ఆశించిన రైతులకు నిరాశ ఎదురైంది. చీడపీడల తాకిడి ఉందని వాటిని కాపాడుకోవాలని ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. రైతులు మందులు కూడా పిచికారీ చేశారు. కానీ ఎలాంటి మార్పులు జరగలేదు.

### భారీగా తగ్గనున్న దిగుబడి

అధికారుల అంచనా ప్రకారం ఈ ఏడాది దిగుబడి భారీగా తగ్గనుంది. దాదాపు 30 శాతం కాపు మాత్రమే మిగిలింది. సాధారణంగా ఎకరాకు 6 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. కానీ ఈ ఏడాది కేవలం 2 టన్నులు మాత్రమే వచ్చే అవకాశం ఉంది. కొన్ని తోటల్లో అయితే పూర్తిగా పూత, పిందెలు రాలిపోయాయి. దీంతో 20 వేల టన్నుల్లోపే వ్యాపారం జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

### ఫ్రూట్ కవర్లకు డిమాండ్

ప్రస్తుతం ఉన్న మామిడి కాయలను కాపాడుకోవడానికి రైతులు ఫ్రూట్ కవర్లు వినియోగిస్తున్నారు. ఈ కవర్లకు ప్రస్తుతం బాగా డిమాండ్ ఉంది. ఒక్కో దానికి సుమారు రూ.2.50 పడుతుంది. ఈ కవర్ కడితే కాయలను కాపాడుకోవచ్చని రైతులు అంటున్నారు. ప్రస్తుతం మామిడి తోటల్లో కవర్లు కడుతున్న పరిస్థితులు మండలంలో నెలకొన్నాయి. ఏది ఏమైనా ఈ ఏడాది మామిడి దిగుబడి భారీ స్థాయిలో తగ్గి నష్టాలు వస్తున్నట్లు రైతులు తెలిపారు.

### రైతుల విలవిల

ఈ ఏడాది తేనెమంచు, నల్లతామర పురుగుల వల్ల మామిడి రైతులు భారీగా దెబ్బతినే పరిస్థితి వచ్చింది. కొన్నిచోట్ల పిందెలు కాయలుగా మారాయి. వాటిలో కూడా కొన్ని కాయలకు పురుగు పట్టి బొక్కలు పడటం, నల్లగా మారి రాలిపోతున్నాయి. చాలామంది కౌలు రైతులు మామిడి తోటలు కొన్నారు. తర్వాత మందులు పిచికారీ కూడా చేయించారు. కానీ నేడు నెలకొన్న పరిస్థితులతో వారు దెబ్బతినే పరిస్థితి ఉంది. ఎకరాను రూ.20 వేల నుంచి రూ.70 వేల వరకు కొనుగోలు చేశారు. కానీ ఇప్పుడు పెట్టుబడి కూడా వచ్చే పరి స్థితి కనిపించడం లేదని ఆవేదన చెందుతున్నారు.

### కౌలు రైతుకు నష్టాలే..



ఈ ఏడాది 8 ఎకరాల్లో మామిడి తోటల్ని మిత్రుడితో కలిసి కొన్నా. రూ.3.20 లక్షలకు తోటలు తీసుకున్నాం. ప్రస్తుతం రూ.లక్ష కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. పరిస్థితులు అనుకూలించక కాపు రాలేదు.

– సంకూరి మాచెర్ల, కౌలు రైతు, ఉలవపాడు

### దిగుబడి తగ్గనుంది



ఈ ఏడాది మామిడిలో దిగుబడి తగ్గనుంది. వాతావరణ పరిస్థితులు, చీడపీడల తాకిడి వల్ల ఇబ్బందికర పరిస్థితి వచ్చింది. ఉన్న కాయలు నాణ్యంగా ఉండటానికి మా సంస్థ ద్వారా రైతుల కోసం ఫ్రూట్ కవర్లు తెప్పిస్తున్నాం.

– యరజొన్న బాలచందర్, రైతు స్ఫూర్తి సంస్థ, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈఓ, ఉలవపాడు




కవర్లు కట్టారిలా..

# జ్వాలాపురంలో ‘ఆది’ ఆనవాళ్లు

- గ్రామంలో ఆదిమానవుల నివాసాలు
- 40 ఏళ్ల క్రితం కనుమరుగు
- బూడిద రూపంలో లభిస్తున్న సుద్ద
- పరిశోధనలు చేయాలంటున్న మేధావులు



జ్వాలాపురంలో తెల్లరంగులో ఉన్న బూడిద



రాతిపై ఆదిమానవులు గీచిన బొమ్మలు

బనగానపల్లె రూరల్: ఆది మానవుడు నడయాడిన అద్భుత ప్రదేశంగా నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని జ్వాలాపురం గ్రామం నిలిచింది. అయితే పురావస్తుశాఖ అధికారులు, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో చరిత్ర ఆనవాళ్ల క్రమంగా కనుమరుగవుతున్నాయి. బనగానపల్లె మండలంలోని జుర్రేరు ప్రాజెక్టు సమీపంలో ఆది మానవులు జీవనం సాగించిన అనవాళ్లు ఉన్నాయి. వీటిని పురావస్తుశాఖ అధికారులు గతంలో సేకరించారు. అయితే జ్వాలాపురం గ్రామంలో ఆదిమానవులు సంచరించి, జీవించిన అనవాళ్లులేకుండా బూడిద రూపంలో ఉన్న సుద్దను వెలికితీసి విక్రయించుకుంటున్నారు. దీంతో ఆదిమానవులు తిరిగిన ప్రాంతం, వారు వాడిన పనిముట్లు కనిపించకకుండా పొయ్యాయి. గ్రామంలో ఆదిమానవులు నివసించిన ఇళ్లు ఉండేవని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. అయితే అవి 40 ఏళ్ల క్రితం కనుమరుగయ్యాయని తెలిపారు. మైనింగ్‌తో సుద్దాను వెలికి తీయడం, వ్యవసాయానికి పొలాలను తయారు చేయడంతో ఆదిమానవుల నివాసాలు, వారు వాడిన పనిముట్లు కనుమరుగయ్యాయని వివరించారు.

### బూడిద ఎలా వచ్చిందంటే..

సుమారు 74 వేల సంవత్సరాల క్రితం ఇండోనేషియాలోని సుమత్ర దీవుల్లో టోబా అనే అగ్నిపర్వతం లావా పేలింది. ఆ పేలుడు ప్రభావంతో జల్లిన లావా భూమండలం అంతా వ్యాపించింది. దంతో భూమిపై సూర్యకాంతి పడలేదు. ఎండలేక ఒక రకమైన మంచుయుగం లాంటి పరిస్థితి ఏర్పడింది. ఆ ప్రభావంతో మానవజాతి అంతరించే ప్రమాదంలో పడింది. కేవలం అతి కొద్దిశాతం మనుషులు మాత్రమే ఆ ఉపద్రవం నుంచి బయటపడ్డారు. ఆ లావా బుడిద భారతదేశంలో కూడా కొన్ని ప్రాంతాల్లో పడింది. జ్వాలాపురంలో కూడా పెద్ద ఎత్తున్న ఆ లావా బుడిద దొరికింది. ఆ లావా బుడిదను గమనించిన రవికొరిసెట్టార్ అనే శాస్త్రవేత్త జ్వాలాపురంలో సుమారు 30 ఏళ్ల క్రితం తవ్వకాలు చేశారు. ఆ బుడిద పొర పైన కింద ఆదిమావులు వాడిన రాతిపని ముట్ల ఆనవాళ్ల కనిపించడంతో వాటిని సేకరించారు. దాదాపు 60 వేల సంవత్సరాల క్రితం మనిషి ఆఫ్రికా నుంచి భారత్ వచ్చారని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. జ్వాలాపురం గ్రామంలో సుమారు 74 వేల సంవత్సరాల క్రితం ఆదిమానవులు నివసించిన్నట్లు ఆనవాళ్లు లభించాయి.

### పరిశోధనలు ఇలా..

లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీకి చెందిన మైకెల్ పెట్రాగ్లియా, మరికొందరు శాస్త్రవేత్తలు జ్వాలాపురంలో సుమారు 20 ఏళ్ల క్రితం పరిశోధనలు చేశారు. పురావస్తుశాఖవారు ఈ ప్రాంతంలో పరిశోధనలు చేసి ఆదిమానవులు సంచరించిన ప్రాంతాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

### బళ్లారి మ్యూజియంలో భద్రంగా

జ్వాలాపురం గ్రామంలో రవికొరిసెట్టార్ శాస్త్రవేత్త 2004 నుంచి 2005 వరకు రెండు సంవత్సరాల పాటు తవ్వకాలు జరిపారు. ఆదిమానవుల అస్థిపంజరాలు, వారు వాడినరాతి పనిముట్లు ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి మ్యూజియంలో భద్రంగా ఉంచారు. జ్వాలాపురం గ్రామంలో శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి తవ్వకాల్లో లభించిన పాలి లిథిక్‌రాయి, మైక్రోలిథిక్ వస్తువులు లభించాయి. ఆది మానవులు వాడిన రాతి పనిముట్లు అస్థిపంజరాలు బళ్లారిలోని రాబర్ట్‌బ్రూస్‌పోర్ట్ సంకనకల్లు మ్యూజియంలో భద్రపరిచారు.



• అల్లు అర్జున్



• వెంకటేశ్ • వరుణ్ తేజ్



• నాని



• నిఖిల్

# ట్రిపుల్ ట్రీట్

తెలుగు చిత్ర పరిశ్రమలో ఒక్కోసారి ఒక్కో ట్రెండ్ నడుస్తుంటుంది. ప్రస్తుతం సీక్వెల్స్ ట్రెండ్ నడుస్తోంది. ఇప్పటికే హిట్ అయిన కథలకు కొనసాగింపుగా రెండు లేదా మూడు భాగాలుగా సినిమా తీయడానికి, అదేవిధంగా ఒకే కథను రెండు మూడు భాగాలుగా చెప్పడానికి ఆసక్తి చూపిస్తున్నారు మేకర్స్. పైగా సీక్వెల్స్ చిత్రాలకు అటు ప్రేక్షకుల్లో ఇటు ట్రేడ్ వర్గాల్లో ఫుల్ క్రేజ్ ఉండటంతో బాక్సాఫీస్ వద్ద వసూళ్లు ఫుల్‌గా ఉంటున్నాయి. దీంతో సీక్వెల్స్ తీయడానికి దర్శక-నిర్మాతలు, హీరోలు ఏమాత్రం ఆలోచించకుండా సై అంటున్నారు. ప్రస్తుతం తెలుగులో పలు సినిమాలు మూడో భాగంతో అలరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని సినిమాలు విడుదలకు సిద్ధం అవుతుండగా, మరికొన్ని చిత్రీకరణ జరుపుకుంటున్నాయి. అదే విధంగా ఇంకొన్ని సినిమాలకు మూడో భాగం ఉంటుందని ప్రకటించారు మేకర్స్. 'ట్రిపుల్ ట్రీట్' అంటూ ముచ్చటగా మూడో భాగంతో రానున్న ఆ సీక్వెల్స్ విశేషాలేంటో చూద్దాం.



• శ్రీ సింహాశ్రీశ్రీ



• సిద్ధు జొన్నలగడ్డ



• 'సత్యం' రాజేశ్

## పుష్పరాజ్... తగ్గేదే లే

హీరో అల్లు అర్జున్, డైరెక్టర్ సుకుమార్‌లది హిట్ కాంబినేషన్. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'ఆర్య' (2004) సూపర్ హిట్ సాధించింది. ఆ తర్వాత వచ్చిన 'ఆర్య 2' (2009) కూడా విజయం సాధించింది. దాదాపు పన్నెండేళ్ల గ్యాప్ అనంతరం వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం 'పుష్ప: ది రైజ్'. రష్మికా మందన్న హీరోయిన్‌గా నటించారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్ నిర్మించిన ఈ చిత్రం 2021 డిసెంబరు 17న విడుదలై పాన్ ఇండియా హిట్‌గా నిలిచింది. పుష్పరాజ్‌గా తన నటనకుగానూ ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్నారు అల్లు అర్జున్. 'పుష్ప: ది రైజ్'కి సీక్వెల్‌గా ఇదే కాంబోలో వచ్చిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. తొలి భాగం సూపర్ హిట్ కావడంతో రెండో భాగంపై అంచనాలు తార స్థాయిలో ఉండేవి. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గేదే లే అంటూ బ్లాక్‌బస్టర్ అందుకుంది 'పుష్ప 2: ది రూల్'. 2024 డిసెంబరు 5న రిలీజైన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.1800 కోట్లకుపైగా వసూళ్లు సాధించి, సరికొత్త రికార్డును సృష్టించింది. ఇక ఈ సీక్వెల్‌లో మూడో భాగం ఉంటుందని 'పుష్ప 2: ది రూల్' ప్రమోషన్స్‌లో హీరో అల్లు అర్జున్, డైరెక్టర్ సుకుమార్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మూడో భాగానికి 'పుష్ప: ది రోర్' అనే టైటిల్‌ని కూడా ఖరారు చేశారనే వార్తలు వినిపించాయి. అదేవిధంగా అల్లు అర్జున్, సుకుమార్‌ల కాంబినేషన్ వచ్చిన 'ఆర్య', 'ఆర్య 2' చిత్రాలకు సీక్వెల్‌గా 'ఆర్య 3' మూవీ ఉంటుందట. ఈ విషయాన్ని కూడా సుకుమార్ ఓ సందర్భంలో చెప్పారు. అయితే అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకులు త్రివిక్రమ్, అట్లీ సినిమాలు కమిట్ అయ్యారు. ఆ రెండు సినిమాల తర్వాతే సుకుమార్ కాంబినేషన్‌లో మూవీ ఉంటుందని ఊహించవచ్చు. మరి 'పుష్ప' మూడో భాగం, 'ఆర్య 3'.. ఈ రెండిట్లో ఏది ముందుగా సెట్స్‌పైకి వెళుతుందనేది తెలియాలంటే చాలా సమయం పట్టవచ్చని ఫిల్మ్‌నగర్ టాక్.

## అర్జున్ సర్కార్ వస్తున్నాడు

'క్రిమినల్స్ ఉంటే భూమ్మీద పదడుగుల సెల్‌లో ఉండాలి... లేకుంటే భూమిలో ఆరడుగుల గుంతలో ఉండాలి', 'జనాల మధ్య ఉంటే అర్జున్... మృగాల మధ్య ఉంటే సర్కార్' అంటున్నారు నాని. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'హిట్: ది ఫస్ట్ కేస్' (2020), అడివి శేష్ హీరోగా నటించిన 'హిట్: ది సెకండ్ కేస్' (2022) వంటి హిట్ చిత్రాల తర్వాత ఆ ఫ్రాంచైజీలో రూపొందిన మూడో చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. తొలి రెండు భాగాలకు దర్శకత్వం వహించిన శైలేష్ కొలను మూడో భాగాన్ని కూడా తెరకెక్కించారు. తొలి రెండు భాగాలను వాల్ పోస్టర్ సినిమాపై నిర్మించిన నాని 'హిట్: ది థర్డ్ కేస్'లో హీరోగా నటించడం విశేషం. ఈ మూవీలో శ్రీనిధీ శెట్టి కథానాయికగా నటించారు. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా మే 1న విడుదల కానుంది. ఈ మూవీలో అర్జున్ సర్కార్ అనే పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా నాని కనిపించబోతున్నారు. ఇటీవల విడుదలైన ఈ మూవీ ట్రైలర్‌కి అద్భుతమైన స్పందన వస్తోంది. దీంతో తొలి, మలి భాగాల్లానే మూడో భాగంతోనూ హ్యాట్రిక్ హిట్ అందుకుంటామనే బలమైన నమ్మకంతో ఉన్నారు మేకర్స్. కాగా 'హిట్' ఫ్రాంచైజీలో మొత్తం ఏడు భాగాలు ఉంటాయని డైరెక్టర్ శైలేష్ కొలను ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.

## నాలుగురెట్ల నవ్వులు

హీరో వెంకటేశ్, డైరెక్టర్ అనిల్ రావిపూడిలది సక్సెస్‌ఫుల్ కాంబినేషన్. వీరి కాంబినేషన్‌లో వచ్చిన తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. సంక్రాంతి కానుకగా ఈ జనవరి 14న విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దాదాపు రూ.300 కోట్లకుపైగా వసూళ్లు సాధించి వెంకటేశ్ కెరీర్‌లో సరికొత్త రికార్డు సృష్టించింది. ఇదిలా ఉంటే.. వెంకటేశ్, వరుణ్ తేజ్ హీరోలుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన మల్టీస్టారర్ చిత్రం 'ఎఫ్ 2: ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్'. 2019 జనవరి 12న విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల్లో నవ్వులు పూయించడంతో పాటు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబట్టింది. 'ఎఫ్ 2' కాంబినేషన్‌లోనే ఆ మూవీకి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'ఎఫ్ 3: ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్'. 2022 మే 27న విడుదలైన 'ఎఫ్ 3' కూడా మంచి విజయం సాధించింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన తొలి, ద్వితీయ భాగాలు సూపర్ హిట్ అయ్యాయి. కాగా ఈ ఫ్రాంచైజీలో 'ఎఫ్-4' మూవీ ఉంటుందని 'ఎఫ్ 3' చిత్రం ఎండింగ్‌లో ప్రకటించారు మేకర్స్. అయితే ఈ చిత్రం ఇంకా పట్టాలెక్కలేదు. కానీ, ఈ గ్యాప్‌లో వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సూపర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం చిరంజీవి హీరోగా 'మెగా 157' (వర్కింగ్ టైటిల్) సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు అనిల్ రావిపూడి. ఈ చిత్రం వచ్చే సంక్రాంతికి రిలీజ్ కానుంది. ఈ సినిమా తర్వాతే 'ఎఫ్ 4' సెట్స్‌కి వెళ్లే అవకాశాలున్నాయని ఫిల్మ్‌నగర్ టాక్. 'ఎఫ్-2', 'ఎఫ్-3'లతో పోలిస్తే 'ఎఫ్-4'లో నవ్వులు నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటాయట. ఈ చిత్రంలో వెంకటేశ్, వరుణ్ తేజ్‌తో పాటు మరో అగ్ర హీరో కూడా నటిస్తారని సమాచారం. మరి... ఈ సినిమాకి కొబ్బరికాయ కొట్టేదెప్పుడో తెలియాలంటే వేచి చూడాలి.



• 'ఓదెల 2' పోస్టర్

## ఓదెల 3

హీరోయిన్ తమన్నా లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'ఓదెల 2'. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్.సింహా ప్రధాన పాత్రల్లో నటించిన 'ఓదెల రైల్వేస్టేషన్' (2021)కి సీక్వెల్‌గా 'ఓదెల 2' రూపొందింది. తొలి భాగానికి దర్శకత్వం వహించిన అశోక్ తేజ ద్వితీయ భాగానికి కూడా దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి డైరెక్టర్ సంపత్ నంది కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు దర్శకత్వ పర్యవేక్షణ కూడా చేశారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి.మధు నిర్మించిన ఈ మూవీ గురువారం (ఏప్రిల్ 17న) విడుదలైంది. తొలిసారి నాగసాధువు భైరవి పాత్రలో తమన్నా నటించారు. ప్రేతాత్మ తిరుపతిగా వశిష్ఠ నటించారు. ఈ మూవీలో తమన్నా నటన హైలైట్‌గా నిలిచింది. 'ఓదెల రైల్వేస్టేషన్' ఓటీటీలో విడుదలైనా మంచి హిట్‌గా నిలవడంతో 'ఓదెల 2'పై ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ నెలకొంది. కాగా ఈ సినిమాకి కొనసాగింపుగా 'ఓదెల 3' ఉంటుందని చిత్రయూనిట్ ప్రకటించి, ట్విస్ట్ ఇవ్వడం విశేషం.

## తొలి, మలి భాగాలకు మించి...

హీరో నిఖిల్ సిద్ధార్థ్, దర్శకుడు చందు మొండేటిలది సూపర్ హిట్ కాంబినేషన్ అనే చెప్పాలి. వీరిద్దరి కలయికలో వచ్చిన మొదటి సినిమా 'కార్తికేయ' (2014) సూపర్ హిట్ అయింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'కార్తికేయ 2' 2022 ఆగస్టు 13న విడుదలై పాన్ ఇండియా హిట్ అందుకుంది. అంతేకాదు... రూ. 100కోట్లకు పైగా వసూళ్లు సాధించడంతో పాటు 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ తెలుగు చిత్రంగా నిలవడం విశేషం. ఈ కోవలోనే 'కార్తికేయ 3' ఉంటుందని దర్శకుడు చందు మొండేటి, నిఖిల్ సిద్ధార్థ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. 'కార్తికేయ, కార్తికేయ 2' సూపర్ హిట్స్ కావడంతో 'కార్తికేయ 3'పై అటు ఇండస్ట్రీలో, ఇటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు, క్రేజ్ నెలకొన్నాయి. అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా రూపొందనున్న ఈ మూవీ తొలి, ద్వితీయ భాగాలకు మించి అద్భుతంగా ఉంటుందని మేకర్స్ నమ్మకంగా ఉన్నారు. నాగచైతన్య హీరోగా 'తండేల్' సినిమాతో మరో హిట్‌ని తన ఖాతాలో వేసుకున్న చందు మొండేటి ప్రస్తుతం 'కార్తికేయ 3'కి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌పై పని చేస్తున్నారు. అదేవిధంగా నిఖిల్ ప్రస్తుతం 'స్వయంభూ' సినిమా చేస్తున్నారు. మరి 'కార్తికేయ 3' పట్టాలెక్కే సమయం ఎప్పుడు? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదు.

## సూపర్ హీరో కామెడీ

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' చిత్రాలతో ప్రేక్షకులను తనదైన యాటిట్యూడ్, మేనరిజమ్‌తో నవ్వించారు సిద్ధు జొన్నలగడ్డ. ఆ ఫ్రాంచైజీలో రూపొందనున్న మూడో చిత్రం 'టిల్లు క్యూబ్'. విమల్ కృష్ణ దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ, నేహా శెట్టి జంటగా నటించిన 'డీజే టిల్లు' (2022) సినిమా ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. ఆ సినిమాకి సీక్వెల్‌గా మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. 2024 మార్చి 29న రిలీజైన ఈ మూవీ తొలి భాగం మంచి హిట్‌గా నిలిచింది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ మూవీ రూ.వంద కోట్లకు పైగా వసూళ్లు సాధించి, సిద్ధు కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఇక ఈ రెండు చిత్రాలకు కొనసాగింపుగా 'టిల్లు క్యూబ్' సినిమా తెరకెక్కనున్నట్లు యూనిట్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాకి తొలి, మలి భాగాలకు దర్శకత్వం వహించిన విమల్ కృష్ణ, మల్లిక్ రామ్ కాకుండా కల్యాణ్ శంకర్(మ్యాడ్ ఫేమ్) దర్శకత్వం వహించనుండటం విశేషం. ఆ మధ్య ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అంతేకాదు... 'టిల్లు క్యూబ్'లో హీరో పాత్రను సూపర్ హీరోగా చూపించే ఆలోచనలో ఉన్నారట.



• రామ్, నార్నె నితిన్, సంగీత్

ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ మూవీ తర్వాత 'టిల్లు క్యూబ్' చిత్రీకరణ మొదలయ్యే అవకాశాలున్నాయి.

## మూడో పొలిమేరలో...

'సత్యం' రాజేశ్ కీలక పాత్రలో నటించిన 'మా ఊరి పొలిమేర' (2021), 'మా ఊరి పొలిమేర 2' (2023) సినిమాలు మంచి విజయం సాధించాయి. చేతబడి నేపథ్యంలో వచ్చిన ఈ రెండు చిత్రాలు హిట్ అయ్యాయి. కాగా ఈ ఫ్రాంచైజీలో 'పొలిమేర 3' రూపొందుతోన్న సంగతి తెలిసిందే. తొలి, మలి భాగాలకి దర్శకత్వం వహించిన అనిల్ విశ్వనాథ్ మూడో భాగాన్ని కూడా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీలో 'సత్యం' రాజేశ్, బాలాదిత్య, కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రవి వర్మ, రాకేందు మౌళి, 'చిత్రం' శ్రీను, సాహిత్య దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై భోగేంద్ర గుప్తాతో కలిసి వంశీ నందిపాటి నిర్మిస్తున్నారు. చిత్రయూనిట్ విడుదల చేసిన 'పొలిమేర 3' వీడియో గ్లింప్స్ చూస్తే మొదటి, ద్వితీయ భాగంతో పోలిస్తే ప్రేక్షకుల ఊహాకందని ట్విస్టులు మరిన్ని ఉంటాయని తెలుస్తోంది.

## మూడోసారి మత్తు వదలరా...

'మత్తు వదలరా', 'మత్తు వదలరా 2' చిత్రాల ఫ్రాంచైజీలో రూపొందనున్న చిత్రం 'మత్తు వదలరా 3'. శ్రీ సింహా కోడూరి, నరేశ్ అగస్త్య, సత్య లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'మత్తు వదలరా'. రితేష్ రానా దర్శకత్వం వహించిన ఈ మూవీ 2019లో విడుదలై హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'మత్తు వదలరా 2'. తొలి భాగాన్ని తెరకెక్కించిన రితేష్ రానా రెండో భాగానికి కూడా దర్శకత్వం వహించారు. శ్రీ సింహా కోడూరి, ఫరియా అబ్దుల్లా, సత్య ప్రధాన పాత్రల్లో నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా 2024 సెప్టెంబరు 13న విడుదలై హిట్‌గా నిలిచింది. ఈ ఫ్రాంచైజీలో 'మత్తు వదలరా 3' కూడా ఉంటుందని ప్రకటించింది చిత్రయూనిట్. అయితే వెంటనే షూటింగ్ ఉండదని దర్శకుడు రితేష్ రానా ప్రకటించారు. మరి ఈ సినిమా చిత్రీకరణ ఎప్పుడు ప్రారంభం అవుతుంది అనే విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## నవ్వులు మూడింతలు

సంగీత్ శోభన్, నార్నె నితిన్, రామ్ నితిన్ హీరోలుగా నటించిన చిత్రం 'మ్యాడ్'. కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం 2023 అక్టోబరు 6న రిలీజై ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. 'మ్యాడ్' కాంబినేషన్‌లోనే ఈ మూవీకి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. తొలి భాగం హిట్‌తో ద్వితీయ భాగంపై అంచనాలు నెలకొన్నాయి. ఈ మార్చి 28న విడుదలైన ఈ చిత్రం ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ మూవీ సక్సెస్‌మీట్‌కి హీరో ఎన్టీఆర్ రావడం విశేషం. కాగా 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలకు సీక్వెల్‌గా 'మ్యాడ్ 3' కచ్చితంగా ఉంటుందని చిత్రబృందం ప్రకటించింది. అయినప్పటికీ ఈ చిత్రం సెట్స్ పైకి వెళ్లేందుకు సమయం పడుతుందని స్పష్టం చేశారు.

పై సినిమాలే కాదు... మరికొన్ని చిత్రాలు కూడా మూడో భాగం రానున్నాయి.

**- దేరంగుల జగన్ మోహన్**



• తమన్నా

# నో ఎంట్రీ సీక్వెల్‌లో ఎంట్రీ?

**బాలీవుడ్**

'నో ఎంట్రీ' సీక్వెల్‌లో తమన్నాకు ఎంట్రీ లభించిందని సమాచారం. వరుణ్ ధావన్, అర్జున్ కపూర్, దిల్జిత్ సింగ్ ప్రధాన పాత్రల్లో నటించనున్న హిందీ చిత్రం 'నో ఎంట్రీ 2'. దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం అనిల్ కపూర్, సల్మాన్ ఖాన్, ఫర్దీన్ ఖాన్, బిపాసా బసు, ఈషా డియోల్ ప్రధాన పాత్రధారలుగా అనీస్ బాజ్మీ దర్శకత్వంలో బోనీ కపూర్ నిర్మించిన హిందీ బడ్డీ రొమాంటిక్ కామెడీ మూవీ 'నో ఎంట్రీ'. కాగా ఈ సినిమాకు సీక్వెల్‌గా 'నో ఎంట్రీ 2' సినిమా తీస్తున్నారు అనీస్ బాజ్మీ, బోనీ కపూర్. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ చిత్రంలో నలుగురు కథానాయికలకుపైగా నటిస్తారని టాక్. వీరిలో ఇప్పటికి తమన్నా, అదితీ రావ్ హైదరీలను సంప్రదించారని, కథ నచ్చడంతో ఈ కథానాయికలు ఈ సినిమా చేసేందుకు ఒప్పుకున్నారని బాలీవుడ్ సమాచారం. ఈ ఏడాదే ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించి, వీలైతే ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారని బీటౌన్ టాక్. కాగా ఈ విషయాలపై అధికారిక సమాచారం రావాల్సి ఉంది.



• సుధాకర్ రెడ్డి

# అరవైల పడుసోడు..

'అరవైల పడుసోడు.. ఎగిరెగిరి పడతాడు... తుమ్మాకో తంబాకో తెలవదు లెండీ..., ఇరవైల ముసలోడు ఎవ్వనికీ ఇనడీడు..'' అంటూ ముత్తయ్య క్యారెక్టరైజేషన్‌ను తెలిపే విధంగా సాగుతుంది 'అరవైల పడుసోడు..' పాట. కె. సుధాకర్ రెడ్డి, అరుణ్ రాజ్, పూర్ణ చంద్ర, మౌనికా బొమ్మ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ముత్తయ్య'. భాస్కర్ మౌర్య దర్శకత్వంలో హైలైఫ్ ఎంటర్‌టైన్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, పిక్చర్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్‌ఎల్‌పీ పతాకాలపై వృందా ప్రసాద్ ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా త్వరలో ఈటీవీ విన్ ఓటీటీలో డైరెక్ట్ స్ట్రీమింగ్ కానుంది. తాజాగా 'ముత్తయ్య' సినిమాలోని ''అరవైల పడుసోడు'' అనే పాట లిరికల్ వీడియోను సమంత విడుదల చేశారు. 'అరవైల పడుసోడు ఎగిరెగిరి పడతాడు... తుమ్మాకో తంబాకో తెలవదులేండి.... ఇరవైలా ముసలోడు ఎవ్వనికీ ఇనడీడు.. తుండేసి బండేసె ఆగం సుండి... ఎర్రి సోమరికాడు ఎడ్డి కొండడుకాడు జర్ర కిర్రాకు జేస్తాడు మట్టున జూడు... మల్లీ సోపతిగాడు ఈడో ఎచ్చులపోడు ఈళ్ళు ఓతాన కూడిర్నో అంగడె సూడు....' అంటూ ఈ పాట సాగుతుంది. 'అరవైల పడుసోడు..' పాటను మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్ రోడ్రిగ్స్ కంపోజ్ చేశారు. శివకృష్ణ చారి ఎర్రోజు సాహిత్యం అందించిన ఈ పాటను విద్యాసాగర్ బంకుపల్లి పాడారు.

# త్వరలో కిల్లర్

'శుక్ర, మాటరాని మౌనమిది, ఏ మాస్టర్ పీస్' వంటి వినూత్న చిత్రాలతో ఆకట్టుకున్న దర్శకుడు పూర్వాజ్ తెరకెక్కించిన తాజా సైంటిఫిక్ యాక్షన్ థ్రిల్లర్ 'కిల్లర్' పార్ట్ 1: డ్రీమ్ గర్ల్'. ఈ చిత్రంలో పూర్వాజ్ హీరోగా నటించగా, జ్యోతి పూర్వాజ్ హీరోయిన్‌గా నటించారు. విశాల్ రాజ్, గౌతమ్ ప్రధాన పాత్రల్లో కనిపిస్తారు. థింక్ సినిమా బ్యానర్ పై ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థలతో కలిసి పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభ రెడ్డి నిర్మించారు. ఈ నెల 30న ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ పేర్కొన్నారు. ''కిల్లర్' పార్ట్ 1: డ్రీమ్ గర్ల్' షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం ప్యాచ్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ సరికొత్త సైంటిఫిక్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ లవ్, రొమాన్స్, రివెంజ్, థ్రిల్లర్ అంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ సినిమాను త్వరలోనే విడుదల చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.



• జ్యోతి

## బిజినెస్ రీల్

### ఏడోసారి రేట్లను తగ్గించిన యూరోపియన్ బ్యాంక్

0.25% కోతతో 2.25 శాతానికి పరిమితం



**ఫ్రాంక్‌ఫర్ట్:** యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ) వరుసగా ఏడో విడత రేట్ల కోత చేపట్టింది. పావు శాతం తగ్గించడంతో బెంచ్‌మార్క్ రేటు 2.25 శాతానికి దిగొచ్చింది. 2022 నుంచి 2023 మధ్య పెరిగిపోయిన ద్రవ్యోల్బణానికి కళ్లెం వేసేందుకు వరుసగా రేట్లను పెంచుతూ పోయిన యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్.. ఆ తర్వాత నుంచి వరుసగా తగ్గింపును చేపడుతుండడం గమనార్హం. దీంతో రుణాలు మరింత చౌక రేటుకు లభించనున్నాయి. ట్రంప్ దూకుడైన వాణిజ్య విధానాలతో ఆర్థిక వృద్ధి తగ్గిపోతుందన్న ఆందోళనల నడుమ యూరప్ సెంట్రల్ బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ నిర్ణయం యూరప్ వ్యాప్తంగా 20 దేశాల ఆర్థిక వ్యవస్థలకు మేలు చేయనుంది. ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య ఉద్రిక్తతలు, అందుకు సంబంధించిన అనిశ్చితులు ఎగుమతులకు అవరోధం కలిగించి, యూరప్ వృద్ధిని తగ్గించొచ్చని ఈసీబీ ప్రెసిడెంట్ క్రిస్టీన్ లగార్డే పేర్కొన్నారు. ఇది పెట్టుబడులు, వినియోగాన్ని తగ్గించొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. 2024 చివరి మూడు నెలల్లో యూరప్ వృద్ధి 0.2 శాతంగానే నమోదు కావడం గమనార్హం. ద్రవ్యోల్బణం 2.2 శాతం స్థాయిలో ఉంది.

### విస్తరణ బాటలో వాయ్‌లర్ మోటర్స్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** కమర్షియల్ ఎలక్ట్రిక్ త్రీ-ఫోర్ వీలర్ల తయారీ సంస్థ వాయ్‌లర్ మోటర్స్ తమ కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తోంది. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పది స్టోర్స్‌ను ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో 5 స్టోర్స్, 30 శాతం మార్కెట్ వాటా ఉన్నట్లు సంస్థ బిజినెస్, సేల్స్ వైస్ ప్రెసిడెంట్ వాణి రికీ మెహ్రా తెలిపారు. హర్యానాలో ప్లాంటు ఉందని, అవసరాన్ని బట్టి కొత్త ప్లాంటు ఏర్పాటు చేసే అవకాశాలు పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఏడీబీ, హీరో మోటోకార్ప్ మొదలైనవి తమ సంస్థలో ఇన్వెస్ట్ చేసినట్లు వివరించారు.

### బోర్డు సమావేశాలు

జస్ట్ డయల్, మాస్టెక్, నెట్‌వర్క్ 18, అమల్ లిమిటెడ్, స్కై గోల్డ్ అండ్ డైమండ్స్, సెంథిల్ ఇన్ఫోటెక్, ఈస్టిండియా డ్రమ్స్, మహాన్ ఫుడ్స్, రోజ్ ల్యాబ్స్ ఫైనాన్స్

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-4-2025

| | |
|---|---|
| విశాఖ | 425-00 |
| చిత్తూరు | 460-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 410-00 |
| విజయవాడ | 420-00 |
| రిటైల్ ధర (డజను) | 60.00 |
| హైదరాబాద్ | 405-00 |
| వరంగల్ | 407-00 |
| రిటైల్ ధర | 4.65 |

### నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| ETERNAL | 232 | 4.47 |
| SUNPHARMA | 1,757.00 | 3.77 |
| ICICIBANK | 1,407.00 | 3.73 |
| BHARTIARTL | 1,882.90 | 3.31 |
| BAJAJFINSV | 2,031.00 | 3.14 |

### నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| WIPRO | 237.4 | -4.14 |
| HINDALCO | 608 | -0.31 |
| TECHM | 1,304.80 | -0.3 |
| HEROMOTOCO | 3,772.00 | -0.26 |
| JSWSTEEL | 1,008.00 | -0.14 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 5,954 |
| ఎన్ఎస్ఈ | 1,02,750 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 2,82,532 |
| ఎఫ్ఐఐ | + 4,668 |
| డీఐఐ | - 2,006 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 64.56 | $ 67.68 |
| బ్రెంట్ | 67.68 | $ 65.85 |

# కార్పొరేట్ డీల్స్ జోరు

- జనవరి-మార్చి క్వార్టర్లో వీటి మొత్తం విలువ 29 బిలియన్ డాలర్లు
- గత మూడేళ్లలోనే అత్యధికంగా 669 డీల్స్



**న్యూఢిల్లీ:** ప్రస్తుత క్యాలండర్ ఏడాది(2025) తొలి త్రైమాసికంలో డీల్స్ జోరు పెరిగింది. జనవరి-మార్చి(క్యూ1)లో 29 బిలియన్ డాలర్ల విలువైన 669 లావాదేవీలు జరిగాయి. గత మూడేళ్లలోనే ఇవి అత్యధికంకాగా.. 2022 క్యూ1 పరిమాణాన్ని మించాయి. విలువలో 2022 క్యూ3ను అధిగమించాయి. కన్సల్టింగ్ దిగ్గజం గ్రాంట్ థోర్న్‌టన్ భారత్ డీల్ ట్రాకర్ వివరాల ప్రకారం విలీనాలు, కొనుగోళ్లు(ఎంఅండ్ఏ), పీఈ లావాదేవీలు ప్రధాన పాత్ర పోషించాయి. ఐపీవోలు, క్విప్ లావాదేవీలను మినహాయిస్తే 24.4 బిలియన్ డాలర్ల విలువైన 636 డీల్స్ నమోదయ్యాయి. త్రైమాసికవారీగా అంటే 2024 క్యూ4తో పోలిస్తే పరిమాణంరీత్యా 28 శాతం, విలువరీత్యా 34 శాతం వృద్ధి సాధించాయి. వార్షికంగా చూస్తే డీల్ పరిమాణం 43 శాతం జంప్‌చేయగా.. విలువ 17 శాతం ఎగసింది. ఇందుకు ఇన్వెస్టర్ల విశ్వాసం, వ్యూహాత్మక పెట్టుబడులు పుంజుకోవడం సహకరించింది. ప్రధానంగా ఎంఅండ్ఏ విభాగంలో కొత్త చరిత్రను సృష్టిస్తూ 15.8 బిలియన్ డాలర్ల విలువైన 228 డీల్స్ నమోదుకావడం తోడ్పాటునిచ్చినట్లు గ్రాంట్ థోర్న్‌టన్ భారత్ పార్ట్‌నర్ శాంతి విజేత పేర్కొన్నారు.

**భారీ లావాదేవీలు**

ఈ ఏడాది క్యూ1లో ఆరు బిలియన్ డాలర్ల విలువైన లావాదేవీలు జరిగాయి. మొత్తం డీల్ విలువలో వీటి వాటా 41 శాతానికి చేరింది. తద్వారా భారీ డీల్స్ హవాకు తెరలేచింది. పూర్తి ఏడాది(2025) ఇవే పరిస్థితులు కొనసాగే వీలున్నట్లు శాంతి అంచనా వేశారు. రిటైల్, బ్యాంకింగ్, పునరుత్పాదక ఇంధనం, ఈమొబిలిటీ తదితర అత్యధిక వృద్ధి రంగాలలో ఇన్వెస్టర్లు వ్యూహాత్మకంగా పెట్టుబడులు చేపడుతున్నట్లు వివరించారు. కాగా.. కన్సాలిడేషన్ లావాదేవీలు సైతం జోరందుకున్నట్లు నివేదిక పేర్కొంది. అదానీ గ్రూప్, కోఫోర్జ్ లిమిటెడ్, జెన్ టెక్నాలజీస్, నిట్కో లిమిటెడ్ తదితరాలు పలు ఇతర సంస్థల కొనుగోళ్ల ద్వారా విస్తరిస్తున్నట్లు తెలియజేసింది. బజాజ్ అలియెంజ్ జనరల్ అండ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో బజాజ్ గ్రూప్ 26 శాతం వాటా కొనుగోలు చేయడాన్ని ఈ జాబితాలో ప్రధానంగా ప్రస్తావించింది. ఇందుకు బజాజ్ గ్రూప్ 2.7 బిలియన్ డాలర్లు వెచ్చించిన విషయం విదితమే. పీఈ విభాగంలో 408 డీల్స్ నమోదయ్యాయి. వీటి విలువ 8.6 బిలియన్ డాలర్లు. 2022 క్యూ3 తదుపరి ఇవి గరిష్టంకాగా.. డీల్ పరిమాణంలో 36 శాతం, పెట్టుబడుల్లో 66 శాతం పురోగతి నమోదైంది.

## చిన్న నగరాల్లో ఆతిథ్యం అదుర్స్

- సగం లావాదేవీలు ఇక్కడే
- 2024పై జేఎల్ఎల్ నివేదిక



**ముంబై:** దేశంలో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో (టైర్-2, 3) ఆతిథ్య రంగం జోరుమీదున్నది. ఇందుకు నిదర్శనంగా 2024లో ఆతిథ్య రంగంలో జరిగిన హోటల్ లావాదేవీల్లో సగం ఇక్కడే నమోదైనట్లు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ జేఎల్ఎల్ తెలిపింది. గతేడాది మొత్తం 25 లావాదేవీలు జరిగినట్లు తన తాజా నివేదికలో పేర్కొంది. వ్యాపార, విహార ప్రదేశాల్లో హోటల్స్ లావాదేవీలు (కొనుగోలు, విక్రయాలు) ఎక్కువగా ఉన్నట్టు తెలిపింది. దీంతో అమృత్‌సర్, మధుర, బికనేర్ తదితర నగరాల్లో నాణ్యమైన వసతి సదుపాయాలు పెరిగేందుకు దోహదపడినట్టు తెలిపింది. మొత్తం లావాదేవీల్లో 51 శాతం అధిక ధనవంతులు (హెచ్ఎన్ఐలు), ఫ్యామిలీ ఆఫీసులు, ప్రైవేటు హోటల్ యజమానులు నుంచి ఉన్నట్టు వెల్లడించింది. లిస్టెడ్ హోటల్ కంపెనీల నుంచి 34 శాతం లావాదేవీలు జరిగినట్టు తెలిపింది. ముంబై, బెంగళూరు, హైదరాబాద్, పుణె, చెన్నైలో 250 అంతంటే ఎక్కువ గదులున్న హోటల్ లావాదేవీలు చోటు చేసుకున్నాయి. ఈ నగరాల్లో వాణిజ్య కార్యకలాపాలు పెరగడం, బలమైన డిమాండ్ మద్దతుగా ఉన్నట్టు పేర్కొంది. ''2025 మొదటి త్రైమాసికంలో చెన్నై, గోవాలో ఇప్పటికే రెండు డీల్స్‌కు జేఎల్ఎల్ సేవలు అందించింది. కార్యకలాపాలు నిర్వహించే వాటితోపాటు భూముల పట్ల ఇన్వెస్టర్లలో పెరిగిన విశ్వాసాన్ని ఇవి సూచిస్తున్నాయి''అని జేఎల్ఎల్ ఇండియా ఎండీ జైదీప్ దంగ్ తెలిపారు.

## నిలిచిపోయిన బ్లూస్మార్ట్ క్యాబ్ సేవలు



**ముంబై:** నిధుల దుర్వినియోగం ఆరోపణలపై సహ-వ్యవస్థాపకుడిపై సెబీ చర్యలు ప్రకటించిన నేపథ్యంలో ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబైలో ఎలక్ట్రిక్ క్యాబ్ సర్వీసుల సంస్థ బ్లూస్మార్ట్ సేవలు గురువారం కూడా నిల్చిపోయాయి. తమ యాప్‌లో బుకింగ్స్‌ను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు కస్టమర్లకు పంపిన ఈమెయిల్‌లో కంపెనీ తెలిపింది. అయితే, నిర్దిష్ట కారణాలేమీ అందులో వెల్లడించలేదు. మూడు మెట్రో నగరాల్లో బ్లూస్మార్ట్ యాప్ ద్వారా 8,000 పైచిలుకు ట్యాక్సీలు సర్వీసులు అందిస్తున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి అకస్మాత్తుగా బుకింగ్స్‌ను ఆపివేయడంతో వేల మంది డ్రైవర్లకు జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారింది. సేవల నిలిపివేతపై కస్టమర్ల నుంచి సోషల్ మీడియాలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. బ్లూస్మార్ట్ సహ-వ్యవస్థాపకుడు, అలాగే జెన్సోల్ ఇంజినీరింగ్ సీఎండీ అన్మోల్ సింగ్ జగ్గీ, ఆయన సోదరుడు పునీత్ సింగ్ జగ్గీపై నిధుల దుర్వినియోగంపై ఆరోపణలతో సెక్యూరిటీస్ మార్కెట్లో పాల్గొనకుండా వారిపై నిషేధం విధిస్తూ సెబీ కొరడా ఝుళిపించిన సంగతి తెలిసిందే.

# భారత జాబ్ మార్కెట్ భేష్

- అనిశ్చితులున్నా మెరుగ్గానే నియామకాలు
- సాంకేతిక నైపుణ్యాల బలం
- మైఖేల్ పేజ్ ఇండియా ఎండీ ఖండేల్‌వాల్



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ భారత ఉద్యోగ మార్కెట్ బలంగా నిలబడిందని.. పలు రంగాల్లో నియామకాలు మెరుగ్గా సాగాయని మైఖేల్ పేజ్ ఇండియా (అంతర్జాతీయ నియామకాల సంస్థ) ఎండీ నిలయ్ ఖండేల్‌వాల్ తెలిపారు. సాంకేతిక నైపుణ్యాల్లో లోతైన అనుభవం, వ్యయ నియంత్రణలు, సిబ్బంది కొత్త నైపుణ్యాలను వేగంగా అలవరుచుకోవడాన్ని భారత్ బలాలుగా పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధి మందగమనంతో అంతర్జాతీయంగా కొన్ని ప్రాంతాల్లో నియామకాల పట్ల అప్రమత్త ధోరణి నెలకొనగా.. భారత్‌లో మాత్రం నిపుణులకు డిమాండ్ ఉన్నట్టు చెప్పారు. ముఖ్యంగా టెక్నాలజీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో ఈ పరిస్థితి ఉన్నట్టు తెలిపారు. స్టెమ్ విభాగంలో (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) ఆధిపత్యంతో భారత్ నైపుణ్య కేంద్రంగా కొనసాగుతోందని.. పోటీతో కూడిన వేతనాలు, ప్రభుత్వ మద్దతుతో నైపుణ్యాల కల్పన, అంతర్జాతీయ క్యాపబులిటీ కేంద్రాల (జీసీసీలు) విస్తరణ ఇందుకు మద్దతుగా నిలుస్తున్నట్టు పేర్కొన్నారు. జీసీసీలు ఏఐ, ఆటోమేషన్, ఆర్అండ్‌డీపై దృష్టి సారించడం వల్ల ఆవిష్కరణలకు భారత్ కీలక కేంద్రంగా మారినట్టు చెప్పారు. స్కిల్ ఇండియా, ఏఐ ఆధారిత నైపుణ్యాల అభివృద్ధి నిపుణులకు ఉపాధి అవకాశాలను పెంచుతాయన్నారు. భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగించాలంటే, నైపుణ్యాల అభివృద్ధిని వేగవంతం చేయాలంటూ.. ఏఐ, సెమీకండక్టర్ పరిశ్రమల్లో అధిక నైపుణ్య మానవ వనరుల అవసరం ఉంటుందని సూచించారు. ఉద్యోగం-వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం పెరుగుతున్నందున ఉత్పాదకత ఆధారిత పని నమూనాలపై కంపెనీలు దృష్టి సారించాల్సి ఉంటుందన్నారు. ఈవై జీసీసీ సర్వే, 2024ను ఉదహరిస్తూ.. అంతర్జాతీయ సంస్థల్లో 50 శాతం భారత్‌లో తమ జీసీసీ కార్యకలాపాలను విస్తరించాలని చూస్తున్నట్టు తెలిపారు.

## వాణిజ్య విధానాల్లో మార్పులు ఆందోళనకరం



- విధానాలు, దీర్ఘకాల దృష్టితో అధిగమిస్తాం
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**ముంబై:** ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య విధానాలు మారిపోతుండడం పట్ల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో చురుకైన విధానాలు, దీర్ఘకాల దృక్పథంతో ఈ సవాళ్లను అధిగమించడంపై దృష్టి సారిస్తామని ప్రకటించారు. సుంకాలపై తీవ్ర స్థాయిలో పోరు, పెరుగుతున్న రక్షణాత్మక విధానాలు అంతర్జాతీయ సరఫరా వ్యవస్థకు విఘాతం కలిగిస్తాయన్నారు. ఫలితంగా తయారీ వ్యయాలు పెరిగిపోయి ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడుల నిర్ణయాలపై అనిశ్చితికి దారితీస్తుందన్నారు. విధానపరమైన చైతన్యం, దీర్ఘకాల దృష్టితో ఈ అడ్డంకులను అధిగమిస్తామని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ముంబైలో గురువారం జరిగిన బీఎస్ఈ 150వ వార్షికోత్సవం సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రపంచం అల్లకల్లోలంతో, అనిశ్చితులు, సంక్లిష్టతలతో ఉందంటూ.. బలమైన ఆర్థిక మూలాలతో భారత్ ఈ వాతావరణలో స్థిరంగా నిలిచినట్టు చెప్పారు. విధానపరమైన స్థిరత్వం, వృద్ధి, చక్కని స్థూల ఆర్థిక విధానాలతో ఇన్వెస్టర్లకు భారత్ అవకాశాలను కల్పిస్తున్నట్టు చెప్పారు. దేశీ సామర్థ్యాలను వేగవంతం చేయడం, పోటీతత్వాన్ని పెంచుకోవడం ద్వారా ఆర్థికంగా బలంగా నిలదొక్కుకోవచ్చన్నారు. మౌలిక సదుపాయల అభివృద్ధి, సమ్మిళిత వృద్ధి, బలమైన ప్రాంతీయ సహకారంతో దేశీ మూలాలను మరింత బలంగా నిర్మిస్తామని మంత్రి చెప్పారు. అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ భారత ఫైనాన్షియల్ మార్కెట్లు బలంగా నిలడినట్టుతెలిపారు. మార్కెట్ల పట్ల రిటైల్ ఇన్వెస్టర్లు చూపుతున్న విశ్వాసాన్ని ఆమె అభినందించారు. ఈ దశాబ్దం చివరికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందన్నారు.

## అదానీ పోర్ట్స్ చేతికి ఆస్ట్రేలియా టెర్మినల్


**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాలోని బొగ్గు ఎగుమతుల టెర్మినల్‌ను గ్రూప్ సంస్థ నుంచి కొనుగోలు చేస్తున్నట్లు అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ (ఏపీసెజ్) వెల్లడించింది. కార్‌మైఖేల్ రైల్ అండ్ పోర్ట్ సింగపూర్ హోల్డింగ్స్ (సీఆర్‌పీఎస్‌హెచ్‌పీఎల్) నుంచి అబ్బాట్ పాయింట్ పోర్ట్ హోల్డింగ్స్‌ను (ఏపీపీహెచ్) తీసుకుంటున్నట్లు పేర్కొంది. వార్షికంగా 50 మిలియన్ టన్నుల బొగ్గు ఎగుమతి సామర్థ్యం గల కీలకమైన నార్త్ క్వీన్స్‌ల్యాండ్ ఎక్స్‌పోర్ట్ టెర్మినల్ (ఎన్‌క్యూఎక్స్‌టీ)కి ఏపీపీహెచ్ మాతృ సంస్థగా ఉంది. లావాదేవీ ప్రకారం



ఎన్‌క్యూఎక్స్‌టీ విలువను 2.4 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టారు. ఏపీపీహెచ్‌లో 100 శాతం వాటాల కొనుగోలుకు ప్రతిగా సీఆర్‌పీఎస్‌హెచ్‌ఎల్‌కు ఏపీసెజ్ 14.38 కోట్ల షేర్లను జారీ చేయనుంది. వాస్తవానికి ఎన్‌క్యూఎక్స్‌టీని 2011లో ఏపీసెజ్ 2 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేయగా, ఆ తర్వాత 2013లో అదానీ కుటుంబం దాన్ని అంతే మొత్తానికి దక్కించుకుంది. తద్వారా ఏపీసెజ్‌కి దేశీయంగా కార్యకలాపాల విస్తరణపై దృష్టి పెట్టేందుకు వీలు కల్పించింది. ప్రస్తుతం మళ్లీ అంతర్జాతీయంగా వృద్ధి వ్యూహంలో భాగంగా ఏపీసెజ్, అదే సంస్థను తిరిగి కొనుగోలు చేసినట్లవుతుంది.

## భారత్ వృద్ధి 6.4 శాతమే

**2025-26 అంచనాలు తగ్గించిన ఫిచ్**



**న్యూఢిల్లీ:** భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) 6.4 శాతం వృద్ధినే నమోదు చేస్తుందని ఫిచ్ రేటింగ్స్ తాజా అంచనాలను ప్రకటించింది. గత అంచనాలను 0.10 శాతం మేర తగ్గించింది. అదే మాదిరి గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సైతం (2024-25) జీడీపీ వృద్ధి అంచనాను 0.10 శాతం తగ్గించి 6.2 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. ఇక వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2026-27) సంబంధించి జీడీపీ వృద్ధి 6.3 శాతంలో ఎలాంటి మార్పు చేయలేదు. అంతర్జాతీయంగా వాణిజ్య ఉద్రిక్తతలు తీవ్రతరం అవడంతో వృద్ధి అంచనాలను తగ్గించినట్టు ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. ''యూఎస్ వాణిజ్య విధానాలను ఏ విధంగానూ ఊహించలేకున్నాం. తీవ్ర స్థాయిలో ఉన్న విధానపరమైన అనిశ్చితి వ్యాపారాలతోపాటు, పెట్టుబడుల అవకాశాలకు విఘాతం కలిగిస్తుంది. ఈక్విటీల పతనంతో గృహాల సంపద తగ్గిపోతుంది. ప్రతీకార చర్యలతో యూఎస్ ఎగుమతులు సైతం దెబ్బతింటాయి''అని ఫిచ్ త్రైమాసిక వారీ నివేదికలో వెల్లడించింది. 2025 సంవత్సరానికి సంబంధించి మార్చిలో ప్రకటించిన ప్రపంచ వృద్ధి రేటు అంచనాలను సైతం 0.4 శాతం తగ్గించింది. యూఎస్

### క్యూ4 ఫలితాలు

## హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ లాభం ప్లస్

- రూ. 477 కోట్లు
- షేరుకి రూ. 2 డివిడెండ్



**న్యూఢిల్లీ:** హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో స్టాండెలోన్ నికర లాభం 16 శాతం ఎగసి రూ. 477 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 412 కోట్లు ఆర్జించింది. నికర ప్రీమియం ఆదాయం రూ. 20,488 కోట్ల నుంచి రూ. 23,765 కోట్లకు జంప్‌చేసింది. వాటాదారులకు షేరుకి రూ. 2.10 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. పూర్తి ఏడాదికి నికర లాభం 15 శాతం వృద్ధితో రూ. 1,802 కోట్లను తాకింది. 2023-24లో రూ. 1,569 కోట్లు మాత్రమే ఆర్జించింది.

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ షేరు బీఎస్ఈలో 0.6 శాతం లాభంతో రూ. 720 వద్ద ముగిసింది.

## జియో ఫైనాన్షియల్ లాభం ఓకే

**రూ. 316 కోట్లు**

**న్యూఢిల్లీ:** రిలయన్స్(ఆర్ఐఎల్) గ్రూప్ కంపెనీ జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 2 శాతం స్వల్ప వృద్ధితో రూ. 316 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 311 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 24% ఎగసి రూ. 518 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 418 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 103 కోట్ల నుంచి రూ. 168 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు షేరుకి రూ. 0.5 డివిడెండ్ ప్రకటించింది. కాగా.. పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 1,605 కోట్ల నుంచి రూ. 1,613 కోట్లకు నామమాత్రంగా బలపడింది.

కంపెనీ షేరు బీఎస్ఈలో 2 శాతం పుంజుకుని రూ. 246 వద్ద ముగిసింది.

## హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ డివిడెండ్ రూ. 90

- లాభం రూ. 639 కోట్లు



**న్యూఢిల్లీ:** హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 18 శాతం ఎగసి దాదాపు రూ. 639 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 541 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 21 శాతం జంప్‌చేసి రూ. 1,026 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 851 కోట్ల టర్నోవర్ సాధించింది. వాటాదారులకు షేరుకి రూ. 90 చొప్పున అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎంసీ) తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. పూర్తి ఏడాదికి నికర లాభం 27 శాతం వృద్ధితో రూ. 2,460 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 28 శాతం అధికమై రూ. 4,060 కోట్లకు చేరింది.

హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ షేరు బీఎస్ఈలో 2 శాతం పుంజుకుని రూ. 4,216 వద్ద ముగిసింది.

# అమెరికా టారిఫ్‌లతో డిఫాల్టు రిస్కులు

- మాంద్యం అవకాశాలు మరింత పెరుగుతాయి
- మూడీస్ రేటింగ్స్ నివేదిక




**న్యూఢిల్లీ:** అమెరికా టారిఫ్‌ల వల్ల రుణాలకు సంబంధించిన పరిస్థితులు మరింతగా దిగజారవచ్చని, తక్కువ రేటింగ్, స్పెక్యులేటివ్ రేటింగ్ ఉన్న కార్పొరేట్లు డిఫాల్ట్ అయ్యే రిస్కులు పెరగవచ్చని మూడీస్ రేటింగ్స్ వెల్లడించింది. గ్లోబల్ వృద్ధి నెమ్మదించి, మాంద్యం వచ్చే అవకాశాలు పెరగవచ్చని ఓ నివేదికలో వివరించింది. 'ఫైనాన్షియల్ మార్కెట్లను టారిఫ్‌లు షాక్‌కు గురిచేశాయి. దీంతో అంతర్జాతీయంగా ఆర్థిక మాంద్యం వచ్చే రిస్కులు పెరుగుతున్నాయి. అనిశ్చితి కొనసాగడం వల్ల వ్యాపార ప్రణాళికలకు అవరోధంగా మారుతుంది. పెట్టుబడులు నిల్చిపోతాయి. వినియోగదారుల విశ్వాసం సన్నగిల్లుతుంది' అని మూడీస్ రేటింగ్స్ తెలిపింది. టారిఫ్‌ల అమలుకు తాత్కాలికంగా విరామం ఇవ్వడం వల్ల వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తి, కొనుగోళ్లను సర్దుబాటు చేసుకోవడానికి కాస్త సమయం లభించినప్పటికీ, 90 రోజుల తర్వాత టారిఫ్‌ల పరిస్థితి ఎలా ఉంటుందనే దానిపై స్పష్టత లేకపోవడంతో వ్యాపార ప్రణాళికలకు సమస్యలు తలెత్తవచ్చని వివరించింది. గత నెల రోజులుగా రుణ సంబంధ పరిస్థితులు (రుణాల లభ్యత, వడ్డీ రేట్లు, రుణ గ్రహీతలు చెల్లించే సామర్థ్యాలు మొదలైనవి) గణనీయంగా దిగజారినట్లు మూడీస్ రేటింగ్స్ వివరించింది.

**అమెరికా జీడీపీపైనా ప్రభావం..**

ఇక అమెరికా ఎకానమీ మీద కూడా టారిఫ్‌ల ప్రభావం ఉంటుందని మూడీస్ రేటింగ్స్ పేర్కొంది. అగ్రరాజ్యం జీడీపీ వృద్ధి కనీసం ఒక పర్సెంటేజీ పాయింట్ మేర తగ్గొచ్చని, అమెరికన్ వినియోగదారులు.. వ్యాపార సంస్థలకు ధరలు గణనీయంగా పెరిగిపోవచ్చని మూడీస్ తెలిపింది. టారిఫ్‌ల భారాన్ని నెమ్మదిగా బదలాయించినా, అంతిమంగా దాన్ని మోయాల్సింది అమెరికన్ వినియోగదారులేనని తెలిపింది. సుంకాల వల్ల కొనుగోలు శక్తి తగ్గుతుందని, పలు సంస్థల లాభాల మార్జిన్లు పడిపోతాయని వివరించింది. అటు చైనా విషయానికొస్తే వాణిజ్య యుద్ధంపరమైన ఉద్రిక్తతలు, గ్లోబల్ ఎకానమీ మందగమనం వల్ల ఎగుమతుల రంగంతో పాటు మొత్తం ఆర్థిక వ్యవస్థ కూడా తీవ్రమైన సవాళ్లు ఎదుర్కోనాల్సి వస్తుందని మూడీస్ రేటింగ్స్ పేర్కొంది. ఉద్రిక్తతలు కాస్త తగ్గుముఖం పట్టినా అమెరికా-చైనా సంబంధాలు వివాదాస్పదంగానే కొనసాగవచ్చని, దీనితో వ్యాపారవర్గాలు.. వినియోగదారుల సెంటిమెంటుపై ప్రతికూల ప్రభావం పడొచ్చని వివరించింది. ఫలితంగా దేశీయంగా వినియోగాన్ని పెంచేందుకు, ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అవరోధాలు ఏర్పడొచ్చని తెలిపింది.

# హంపి, దివ్య విజయం


హంపి



దివ్య

**పుణే:** అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ ఐదో అంచె చెస్ టోర్నమెంట్‌లో నాలుగో రోజు భారత స్టార్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి, ప్రపంచ జూనియర్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ మెరిశారు. హంపి వరుసగా రెండో విజయం నమోదు చేసుకోగా... దివ్య ఖాతాలో మూడో గెలుపు చేరింది. భారత్‌కే చెందిన ఇద్దరు గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక, వైశాలి రమేశ్‌బాబుల మధ్య జరిగిన ముఖాముఖి పోరు 'డ్రా'గా ముగిసింది. పొలీనా షువలోవా (రష్యా)తో జరిగిన గేమ్‌లో నల్లపావులతో ఆడిన హంపి 33 ఎత్తుల్లో గెలిచింది. మెలియా సలోమి (జార్జియా)తో జరిగిన గేమ్‌లో నల్లపావులతో ఆడిన మహారాష్ట్ర అమ్మాయి దివ్య 77 ఎత్తుల్లో విజయాన్ని అందుకుంది. హారిక, వైశాలి మధ్య జరిగిన గేమ్ 34 ఎత్తుల్లో 'డ్రా' అయింది. బత్ఖుయాగ్ మున్‌గున్‌తుల్ (మంగోలియా)తో జరిగిన గేమ్‌లో నుర్గల్ సలీమోవా (బల్గేరియా) 55 ఎత్తుల్లో... జు జినెర్ (చైనా) 39 ఎత్తుల్లో అలీనా కష్లిన్‌స్కాయా (పోలాండ్)పై గెలుపొందారు. 10 మంది క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. నాలుగో రౌండ్ తర్వాత జు జినెర్ 3.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... హంపి, దివ్య 3 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు. హారిక, పొలీనా, మున్‌గున్‌తుల్ 2 పాయింట్లతో ఉమ్మడిగా మూడో స్థానంలో ఉన్నారు. మరోవైపు బత్ఖుయాగ్ మున్‌గున్‌తుల్ (మంగోలియా) 34 ఎత్తుల్లో అలీనా కష్లిన్‌స్కాయా (పోలాండ్)పై గెలుపొందగా... జు జినెర్ (చైనా)–మెలియా సలోమి (జార్జియా) మధ్య గేమ్ 76 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది.




## స్వర్ణంతో శుభారంభం

**న్యూఢిల్లీ:** భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా 2025 సీజన్‌ను స్వర్ణ పతకంతో శుభారంభం చేశాడు. దక్షిణాఫ్రికాలో జరిగిన పాచెఫ్‌స్ట్రూమ్ ఇన్విటేషనల్ ట్రాక్ ఈవెంట్‌లో 27 ఏళ్ల నీరజ్ చోప్రా విజేతగా నిలిచాడు. ఆరుగురు పోటీపడ్డ ఈ ఈవెంట్‌లో నీరజ్ జావెలిన్‌ను 84.52 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. డూ స్మిట్ (దక్షిణాఫ్రికా; 82.44 మీటర్లు) రజతం, డంకన్ రాబర్ట్‌సన్ (దక్షిణాఫ్రికా; 71.22 మీటర్లు) కాంస్యం సాధించారు. నీరజ్ పాల్గొన్న ఈ మీట్‌కు వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ చాలెంజర్ ఈవెంట్‌గా గుర్తింపు ఉంది.

దిగ్గజం జాన్ జెలెజ్నీను కొత్త కోచ్‌గా నియమించుకున్నాక నీరజ్ పోటీపడ్డ తొలి టోర్నీలో టాప్ ర్యాంక్‌లో నిలువడం విశేషం. నీరజ్ తదుపరి మే 16వ తేదీన జరిగే దోహా డైమండ్ లీగ్ మీట్‌లో, ఆ తర్వాత మే 24న పంచ్‌కులాలో జరిగే నీరజ్ చోప్రా క్లాసిక్ జావెలిన్ త్రో టోర్నీలో పోటీపడతాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం నెగ్గి చరిత్ర సృష్టించిన నీరజ్... 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం కైవసం చేసుకున్నాడు. 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం సొంతం చేసుకున్న నీరజ్... 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో విశ్వవిజేతగా అవతరించాడు.




## డైమండ్ లీగ్ మీట్ బరిలో అవినాశ్ సాబ్లే

**న్యూఢిల్లీ:** భారత స్టీపుల్‌ఛేజ్ రన్నర్ అవినాశ్ సాబ్లే ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ సీజన్ తొలి మీట్‌లో బరిలోకి దిగనున్నాడు. డైమండ్ లీగ్ సీజన్ తొలి మీట్ ఈనెల 26న చైనాలోని జియామెన్ నగరంలో జరుగుతుంది. మహారాష్ట్రకు చెందిన 30 ఏళ్ల అవినాశ్ సాబ్లే పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో తన పేరిట జాతీయ రికార్డును లిఖించుకున్నాడు. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో 11వ స్థానంలో నిలిచిన సాబ్లే ఈ ఏడాది సెప్టెంబర్‌లో జపాన్‌లో జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు కూడా అర్హత సాధించాడు. డైమండ్ లీగ్ తొలి మీట్‌లో 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో ప్రస్తుత ఒలింపిక్, ప్రపంచ చాంపియన్ సుఫియాని ఎల్ బకాలి (మొరాకో)తోపాటు పారిస్ ఒలింపిక్స్‌లో, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు నెగ్గిన అబ్రహం కిబివోట్ (కెన్యా) కూడా పోటీపడుతున్నాడు. ఏప్రిల్ 26 నుంచి ఆగస్టు 27 వరకు జరిగే డైమండ్ లీగ్‌లో మొత్తం 15 మీట్‌లు జరుగుతాయి.

## భారత్‌కు రెండు కాంస్యాలు

**దమ్మామ్ (సౌదీ అరేబియా):** ఆసియా అండర్–18 యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మూడో రోజు భారత్‌కు రెండు కాంస్య పతకాలు లభించాయి. మహిళల డిస్కస్ త్రో ఈవెంట్‌లో రాజస్తాన్‌కు చెందిన లక్షిత మహ్లావత్... మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో శౌర్య అంబురే కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. లక్షిత డిస్క్‌ను 41.30 మీటర్ల దూరం విసిరి మూడో స్థానంలో నిలిచింది. మా చెన్‌యి (చైనా; 53.81 మీటర్లు) స్వర్ణం, జావో అంకి (చైనా; 47.89 మీటర్లు) రజతం దక్కించుకున్నారు. శౌర్య 100 మీటర్ల హర్డిల్స్ రేసును 13.80 సెకన్లలో ముగించి మూడో స్థానాన్ని సంపాదించింది. బావో యిన్‌యిన్ (చైనా; 13.71 సెకన్లు) బంగారు పతకం నెగ్గగా... హీ యిహుయ్ (చైనా; 13.76 సెకన్లు) రజత పతకం సాధించింది.



లక్షిత

## మునాఫ్ పటేల్‌కు జరిమానా



**న్యూఢిల్లీ:** ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్‌పై జరిమానా పడింది. బుధవారం రాజస్తాన్ రాయల్స్‌తో మ్యాచ్ సందర్భంగా ఐపీఎల్ నియమావళిలోని లెవల్–1 తప్పిదానికి పాల్పడినందుకుగానూ మునాఫ్ మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించారు. దీంతో పాటు ఒక డీ మెరిట్ పాయింట్ కేటాయించారు. హోరాహోరీగా సాగిన పోరులో ఇరు జట్ల స్కోర్లు సమం కాగా... 'సూపర్ ఓవర్'లో ఢిల్లీ విజయం సాధించింది. 'రాజస్తాన్‌తో మ్యాచ్ సందర్భంగా ఢిల్లీ బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్ నియమావళిని అతిక్రమించాడు. దీంతో అతడి మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించాం. ఆర్టికల్ 2.20 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఐపీఎల్ పాలక మండలి గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. అయితే మునాఫ్ చేసిన తప్పిదాన్ని మాత్రం ప్రస్తావించలేదు. ఆర్టికల్ 2.20 నిబంధన క్రీడా స్ఫూర్తికి సంబంధించింది.

## వన్డే వరల్డ్‌కప్ టోర్నీకి పాక్ అర్హత

**లాహోర్:** ఈ ఏడాది సెప్టెంబర్–అక్టోబర్‌లలో భారత్ వేదికగా జరగనున్న మహిళల వన్డే వరల్డ్‌కప్ క్రికెట్ టోర్నమెంట్‌కు పాకిస్తాన్ జట్టు అర్హత సాధించింది. పాకిస్తాన్‌లో జరుగుతున్న వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో టాప్–2లో నిలిచిన జట్లకు ప్రపంచకప్ బెర్త్‌లు లభిస్తాయి. గురువారం థాయ్‌లాండ్‌తో జరిగిన నాలుగో లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ 87 పరుగుల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 205 పరుగులు చేసింది. సిద్రా అమిన్ (80; 9 ఫోర్లు), కెప్టెన్ సనా ఫాతిమా (62 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించారు. అనంతరం థాయ్‌లాండ్ జట్టు 34.4 ఓవర్లలో 118 పరుగులకు ఆలౌటైంది. పాక్ బౌలర్లలో సనా ఫాతిమా, నష్రా సంధూ, రమీన్ షమీమ్ 3 వికెట్ల చొప్పున పడగొట్టారు. ఎనిమిది పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్న పాకిస్తాన్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ప్రపంచకప్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. శనివారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో పాకిస్తాన్ ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ ఓడిపోయినా ఆ జట్టుకు వచ్చిన ఢోకా లేదు. బంగ్లాదేశ్ గెలిస్తే ఎనిమిది పాయింట్లతో ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ప్రపంచకప్ టోర్నీకి అర్హత పొందుతుంది. బంగ్లాదేశ్ ఓడిపోయి... వెస్టిండీస్, స్కాట్లాండ్ జట్లు తమ చివరి లీగ్ మ్యాచ్‌ల్లో గెలిస్తే ఈ మూడు జట్లు 6 పాయింట్లతో సమఉజ్జీగా నిలుస్తాయి. ఈ నేపథ్యంలో మెరుగైన రన్‌రేట్ ఉన్న జట్టు ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తుంది. రన్‌రేట్ పరంగా బంగ్లాదేశ్‌కే మరో బెర్త్ దక్కే అవకాశం ఉంది.




# సమఉజ్జీల సమరం!

నేడు పంజాబ్ కింగ్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 'ఢీ'

రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



విరాట్ కోహ్లి
రజత్ పాటీదార్

**బెంగళూరు:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేకపోయిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), పంజాబ్ కింగ్స్ జట్లు ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నాయి. ఆరేసి మ్యాచ్‌లు ఆడిన ఇరు జట్లు నాలుగింట గెలిచి 8 పాయింట్లతో సమంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సమఉజ్జీలుగా కనిపిస్తున్న ఈ రెండు జట్ల మధ్య శుక్రవారం కీలక పోరు జరగనుంది. తాజా సీజన్‌లో ప్రత్యర్థి జట్ల మైదానాల్లో వరుస విజయాలు సాధిస్తున్న ఆర్‌సీబీ... బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో మాత్రం గెలుపు రుచి చూడలేకపోయింది. మాజీ చాంపియన్‌లు కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్, రాజస్తాన్ రాయల్స్‌ను వారి వారి సొంత మైదానాల్లో ఓడించిన ఆర్‌సీబీ... బెంగళూరు వేదికగా గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌ల్లో పరాజయం పాలైంది. మరోవైపు గత మ్యాచ్‌లో 111 పరుగులే చేసినా... బౌలింగ్ బలంతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను నిలువరించిన పంజాబ్ కింగ్స్ మంచి ఊపు మీద ఉంది. పంజాబ్ స్పిన్నర్లను బెంగళూరు బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారనే దానిపైనే మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది.

### చిన్నస్వామిలో బోణీ కొట్టేనా...

ఈ సీజన్ ఆరంభం నుంచి మెరుగైన ప్రదర్శనతో ముందుకు సాగుతున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ప్రధానంగా బ్యాటర్లపైనే ఆధారపడుతోంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి, ఫిల్ సాల్ట్ రూపంలో ఆ జట్టుకు ఇద్దరు విధ్వంసకర ఓపెనర్లు అందుబాటులో ఉన్నారు. దేవదత్ పడిక్కల్, కెప్టెన్ రజత్ పాటీదార్, లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, టిమ్ డేవిడ్‌తో మిడిలార్డర్ పటిష్టంగా కనిపిస్తోంది. అయితే పవర్‌ప్లేతో పాటు స్లాగ్ ఓవర్లలో ధాటిగా ఆడుతున్న ఆర్‌సీబీ... మధ్య ఓవర్లలో మాత్రం సులువుగా పరుగులు రాబట్టలేకపోతోంది. ప్రధానంగా స్పిన్నర్లను ఎదుర్కోవడంలో బెంగళూరు బ్యాటర్లు తడబడుతున్నారు. గుజరాత్ స్పిన్నర్ సాయికిషోర్, ఢిల్లీ స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, విప్రాజ్ నిగమ్ బౌలింగ్ ఆడలేక ఇబ్బంది పడ్డారు. బౌలింగ్‌లో హాజల్‌వుడ్, యశ్ దయాళ్, భువనేశ్వర్ కుమార్ పేస్ బారం మోయనుండగా... సుయాశ్ శర్మ, కృనాల్ పాండ్యా స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నారు.



శ్రేయస్ అయ్యర్
మ్యాక్స్‌వెల్

### చహల్ మ్యాజిక్ కీలకం...

శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రియాన్ష్ ఆర్య రూపంలో ప్రతిభావంతులైన ఓపెనర్లు అందుబాటులో ఉండగా... అయ్యర్, ఇన్‌గ్లిస్, నేహల్ వధేరా, మ్యాక్స్‌వెల్, శశాంక్ సింగ్‌తో మిడిలార్డర్ మెరుగ్గా ఉంది. చాంపియన్స్ ట్రోఫీ ఫామ్‌ను ఐపీఎల్‌లో సైతం కొనసాగిస్తున్న అయ్యర్... తనకు అనువైన రోజు భారీ స్కోర్లతో చెలరేగుతున్నాడు. అదే సమయంలో నిలకడ కొనసాగించలేకపోతున్నాడు. మ్యాక్స్‌వెల్ బౌలింగ్‌లో అదనపు స్పిన్నర్‌గా సేవలందిస్తున్నా... బ్యాటర్‌గా మాత్రం అతడి స్థాయి ప్రదర్శన ఇంకా రాలేదు. బౌలింగ్‌లోనూ పంజాబ్‌కు విభిన్న ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి. మార్కో యాన్సెన్, అర్ష్‌దీప్ సింగ్, జేవియర్ బార్ట్‌లెట్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. గత మ్యాచ్‌లో కోల్‌కతాపై 4 వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన పంజాబ్ ప్రధాన స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ కీలకం కానున్నాడు. బెంగళూరు పిచ్‌పై అతడికి మంచి అవగాహన ఉండటం పంజాబ్‌కు అదనపు ప్రయోజనం చేకూర్చనుంది.

### తుది జట్లు (అంచనా)

**రాయల్ చాలెంజర్స్ బెంగళూరు:** రజత్ పాటీదార్ (కెప్టెన్), విరాట్ కోహ్లి, ఫిల్ సాల్ట్, దేవదత్ పడిక్కల్, లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్, హాజల్‌వుడ్, యశ్ దయాల్, సుయాశ్ శర్మ.

**పంజాబ్ కింగ్స్:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ఇన్‌గ్లిస్, నేహల్ వధేరా, మ్యాక్స్‌వెల్, శశాంక్ సింగ్, యాన్సెన్, జేవియర్, అర్ష్‌దీప్, స్టొయినిస్, చాహల్.

**33** ఐపీఎల్ చరిత్రలో బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు ముఖాముఖిగా 33 సార్లు తలపడ్డాయి. 16 మ్యాచ్‌ల్లో బెంగళూరు, 17 మ్యాచ్‌ల్లో పంజాబ్ విజయం సాధించాయి. 2023లో పంజాబ్‌తో ఆడిన ఏకైక మ్యాచ్‌లోనూ, గత ఏడాది పంజాబ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ బెంగళూరు జట్టే గెలిచింది. పంజాబ్‌పై బెంగళూరు అత్యధిక స్కోరు 241 కాగా... అత్యల్ప స్కోరు 84. బెంగళూరుపై పంజాబ్ అత్యధిక స్కోరు 232 కాగా, అత్యల్ప స్కోరు 88.



ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని సెయింట్ జోసెఫ్ చర్చిలో గురువారం జరిగిన సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



సిక్కుల తొమ్మిదో గురువు తేజ్ బహదూర్ జయంతిని పురస్కరించుకుని గురువారం రంగురంగుల విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్న అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయం

## ఉపాధి కార్మికులను మోదీ ప్రభుత్వం అణచివేస్తోంది: ఖర్గే

**న్యూఢిల్లీ:** పేదల వ్యతిరేక మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ కార్మికులను అణచివేసేందుకు ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. ఉపాధి కార్మికులకు ఏడాదిలో 150 పనిదినాలను కల్పించాలని, రోజుకు కనీస కూలీని రూ.400గా నిర్ధారించాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఈ మేరకు గురువారం ఖర్గే 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఉపాధి కూలీల కనీస వేతనాన్ని పెంచాలంటూ రెండు పార్లమెంటరీ కమిటీలు సిఫారసులు చేసినప్పటికీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం లేదంటూ వచ్చిన మీడియా కథనాన్ని ప్రస్తావిస్తూ ఖర్గే..'ప్రజా వ్యతిరేక మోదీ ప్రభుత్వం ఉపాధి వేతనాలను పెంచేందుకు నిరాకరిస్తోంది. ఈ వైఖరి ఉపాధి కూలీల హక్కులను హరించడమే' అని ఆరోపించారు. ఉపాధి హామీ కూలీల రోజువారీ కనీస వేతనాన్ని రూ.400కు పెంచాలంటూ పార్లమెంటరీ కమిటీ ఇటీవల నివేదిక అందజేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 2023లో అమర్జీత్ సిన్హా కమిటీ సైతం ఉపాధి బడ్జెట్‌తోపాటు వేతనాలను పెంచాలంటూ సిఫార్సు చేసిందన్నారు. ఆధార కార్డు ఆధారంగా వేతనాలు చెల్లించాలనే షరతు విధించి ఏడు కోట్ల మంది ఉపాధి కూలీలను కేంద్రం తొలగించిందని ఖర్గే చెప్పారు. గత పదేళ్లలోనే ఉపాధి హామీకి అత్యంత తక్కువగా నిధులు కేటాయించిందని విమర్శించారు. దేశంలోని అత్యంత నిరుపేద కుటుంబాల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చిన విషయాన్ని ఖర్గే గుర్తు చేశారు.

### కుల గణనపై కర్ణాటక మంత్రివర్గం
## చర్చలు అసంపూర్ణం

**బెంగళూరు:** కర్ణాటకలో కుల గణనపై (సోషల్, ఎడ్యుకేషనల్ సర్వే రిపోర్టు) చర్చించడానికి గురువారం ప్రత్యేకంగా మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. అయితే, ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే సమావేశం ముగిసింది. రాష్ట్ర జనాభా, వెనుకబడిన వర్గాల జనాభాతోపాటు సర్వే కోసం పరిగణనలోకి తీసుకున్న అంశాలపై చర్చించారు. కుల గణనపై మరింత సమాచారం, సాంకేతిక వివరాలు ఇవ్వాలని అధికారులను కోరారు. సర్వే నివేదికపై కొందరు మంత్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ రోజు భేటీ అసంపూర్తిగానే ముగిసిందని కర్ణాటక న్యాయ శాఖ మంత్రి హెచ్.కె.పటేల్ చెప్పారు. సర్వే నివేదికపై వచ్చే నెల 2వ తేదీన మరోసారి కేబినెట్ సమావేశం జరుగనుంది. అయితే, కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన కుల గణనను రాష్ట్రంలోని రెండు బలమైన సామాజిక వర్గాలైన వొక్కలిగ, వీరశైవ లింగాయత్‌లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ సర్వే శాస్త్రీయంగా జరగలేదని ఆరోపిస్తున్నారు. దాన్ని పూర్తిగా పక్కనపెట్టి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీలోనూ కొన్ని వర్గాల నుంచి కుల గణనపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

# బీజేపీ నూతన చీఫ్ ఎంపిక వేగవంతం

### జాతీయ అధ్యక్షుడి ఎంపికపై బీజేపీ అగ్రనేతల కీలక మంతనాలు

- 20వ తేదీ తర్వాత అధ్యక్షుడి నామినేషన్ ప్రక్రియ షురూ
- త్వరలో మరిన్ని రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులు

**సాక్షి, న్యూఢిల్లీ:** బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియను పార్టీ అగ్ర నాయకత్వం వేగవంతం చేసింది. కొన్ని రాష్ట్రాల్లో అధ్యక్షుల ఎంపికను ఒకట్రెండు రోజుల్లో ఖరారు చేసేందుకు అగ్రనేతలు విస్తృత సంప్రదింపులు మొదలుపెట్టారు. మంగళవారం రాత్రి పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో మూడు గంటల పాటు కీలక సమావేశం జరిగింది. ఈ భేటీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్టీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత వ్యవహారాలు) బీఎల్ సంతోష్ పాల్గొన్నారు. ఈ చర్చల అనంతరం అమిత్ షా, రాజ్‌నాథ్, సంతోష్‌లు ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ భేటీ తర్వాత అమిత్ షా, నడ్డా విడిగా భేటీ అయ్యారు. వీలైనంత త్వరగా రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించడంతో పాటు ఈ నెల 20వ తేదీ తర్వాత జాతీయ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియను ప్రారంభించే లక్ష్యంగా ఈ భేటీలు జరిగాయి. కొన్ని రాష్ట్రాల అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ పూర్తయిన వెంటనే పార్టీ జాతీయ ఎన్నికల అధికారి తదుపరి జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ నెలాఖరులోగా లేదంటే వచ్చే నెల మొదటివారంలో ఎన్నికలు నిర్వహించే ప్రణాళికతో పార్టీ ముందుకెళ్లనుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత భేటీలో ఐదారుగురు నేతల పేర్లే ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయని తెలుస్తోంది. ఇందులో ప్రధానంగా కర్ణాటక నుంచి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ, బీఎల్ సంతోష్‌తో పాటు కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్, తెలంగాణకు చెందిన జి.కిషన్‌రెడ్డిల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఈసారి దక్షిణాది రాష్ట్రాల నుంచే కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటారని పార్టీ వర్గాలు సైతం భావిస్తున్నాయి. 2020 ఫిబ్రవరిలో నడ్డా తొలిసారిగా అధ్యక్షుడయ్యారు. పరిమిత మూడేళ్ల కాలం పూర్తయ్యాక కూడా ఆయన పదవీకాలాన్ని పొడిగించారు. దాంతో ఇప్పటికీ ఆయనే అధ్యక్షునిగా సేవలందిస్తున్నారు.

### త్వరలో తెలుగు రాష్ట్రాలకు అధ్యక్షుల ప్రకటన

బీజేపీ ఇప్పటివరకు 15 రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించింది. ఏప్రిల్ 19 లేదా 20వ తేదీన మరో ఆరేడు రాష్ట్రాలకు అధ్యక్షులను ప్రకటించాలని భావిస్తోంది. పార్టీ సొంత నియమనిబంధనావళి ప్రకారం 19 రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు జరిగిన తర్వాతే జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే అవకాశం ఉంది. అందుకే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, ఉత్తరాఖండ్ రాష్ట్రాల అధ్యక్షులను ఒకట్రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉందని పార్టీలోని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అధ్యక్షుల ప్రకటన తర్వాత మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్, ఢిల్లీ రాష్ట్రాల అధ్యక్షుల ప్రకటన ఉంటుందనే చర్చ మొదలైంది. తెలంగాణ నుంచి ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్‌తో పాటు కేంద్రమంత్రి బండి సంజయ్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రేసులో పురందేశ్వరి, మాధవ్, పార్థసారథి రెడ్డిల పేర్లపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఎంపిక ప్రక్రియలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర సైతం ఉంటుందని తెలుస్తోంది. బిహార్‌లో ఈ ఏడాది చివర్లో శాసనసభ ఎన్నికలు జరగొచ్చు. పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో వచ్చే ఏడాది ప్రథమార్థంలో ఎన్నికలు ఉండొచ్చు. ఈ రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆయా రాష్ట్రాల్లో కమలదళ సారథుల ఎంపిక కొనసాగనుంది.

## నూతన విద్యావిధానానికి మహారాష్ట్ర ఆమోదం
### హిందీని తృతీయ భాషగా తప్పనిసరి చేసిన ప్రభుత్వం

**ముంబై:** నూతన విద్యా విధానానికి మహారాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2025-26 విద్యాసంవత్సరం నుంచి జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ) 2020ని అమలు చేసేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను ప్రకటించింది. మరాఠీ, ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో చదివే 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు హిందీని తృతీయ భాషగా తప్పనిసరిగా ప్రవేశపెట్టడం ఈ ప్రణాళికలో ప్రధాన అంశం. ఎన్‌ఈపీ-2020 కింద కొత్త పాఠ్యప్రణాళిక దశలవారీ అమలుకానుంది. 2025-26 విద్యా సంవత్సరంలో 1వ తరగతితో ప్రారంభమై 2028-29 నాటికి అన్ని గ్రేడ్లకు విస్తరిస్తుంది. దీనికోసం 2025 నాటికి 80% మంది ఉపాధ్యాయులకు కొత్త బోధనా పద్ధతులు, డిజిటల్ సాధనాల వినియోగంలో శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

## టైమ్ అత్యంత ప్రభావవంతమైన నేతల జాబితాలో ట్రంప్, మస్క్, యూనస్
### భారతీయులకు దక్కని చోటు

**వాషింగ్టన్:** టైమ్ మేగజైన్-2025 '100 మంది అత్యంత ప్రభావశీల వ్యక్తుల' జాబితాలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌లతో పాటు ప్రపంచవ్యాప్తంగా అనేకమంది ప్రముఖుల పేర్లు ఉన్నాయి. అయితే ఈ జాబితాలో ఈ ఏడాది భారతీయులెవరికీ చోటు దక్కలేదు. 2024లో బాలీవుడ్ నటి ఆలియా భట్, ఒలింపియన్ రెజ్లర్ సాక్షి మాలిక్ ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. మేగజైన్ వార్షిక జాబితాను 'లీడర్స్', 'ఐకాన్స్', 'టైటాన్స్' వంటి పలు కేటగిరీలుగా విభజించారు. 'లీడర్స్' జాబితాలో భారత సంతతికి చెందిన పారిశ్రామికవేత్త, వెర్టెక్స్ ఫార్మాస్యూటికల్స్ సీఈఓ రేష్మా కేవల్‌రమణి కూడా ఉన్నారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, గతంలో నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్ బామ్, అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్, డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రెయేసస్, జర్మనీ కన్జర్వేటివ్ నేత ఫ్రెడరిక్ మెర్జ్, దక్షిణ కొరియా నేత లీ జే-మ్యుంగ్ ఈ ఏడాది 'లీడర్స్' జాబితాలో ఉన్నారు. 2025 టైమ్ మేగజైన్ ఐదు అంతర్జాతీయ కవర్లతో విడుదలైంది. ఒక్కొక్కటి ఒక విశిష్ట వ్యక్తిత్వాన్ని వెలుగులోకి తెచ్చాయి.

## త్వరలో ట్రంప్ గోల్డ్ కార్డు
### సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్న డోజ్

**వాషింగ్టన్:** సంపన్న వలసదారుల కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన గోల్డ్ కార్డు త్వరలోనే జారీ చేయనున్నారు. ట్రంప్ సన్నిహితుడు, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. మస్క్ నాయకత్వం వహిస్తున్న డోజ్ గోల్డ్‌కార్డు కోసం సాఫ్ట్‌వేర్‌ను తయారుచేస్తోంది. గోల్డ్ కార్డ్ ప్రాజెక్టుకు మార్కో ఎలెజ్, ఎడ్వర్డ్ కొరిస్టీన్ నాయకత్వం వహిస్తున్నారు. నెలరోజులుగా వారు దీనిపై పనిచేస్తున్నారు. వీసా, ఇమ్మిగ్రెంట్ వెరిఫికేషన్ ప్రక్రియను పర్యవేక్షించే వివిధ ఏజెన్సీల అధికారులతో సమావేశమై ప్రస్తుతం ఉన్న ప్రక్రియలను తమ కొత్త వ్యవస్థలో ఎలా చేర్చుకోవచ్చనే విషయాన్ని పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం రూపొందిస్తున్న కార్డు భవిష్యత్‌లో మార్పులుండొచ్చని, ఇందుకు సంవత్సరాలు పట్టవచ్చని వెల్లడించింది. అయితే, హోల్డర్లు అమెరికా పౌరులు అవుతారా లేదా అనే దానిపై వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ స్పష్టత ఇవ్వలేదు. వారు 5 మిలియన్ డాలర్లు చెల్లిస్తారని, మంచి వ్యక్తులుగా ఉన్నంత కాలం అమెరికాలో ఉండటానికి హక్కు ఉందని, వారు పరీక్షించబడతారని ఆయన అన్నారు. రెండు వారాల్లో ఈ గోల్డ్‌కార్డును ఆవిష్కరిస్తామని లుట్నిక్ తెలియజేశారు.

# ఆప్‌కు అక్రమంగా విదేశీ నిధులు

### దుర్గేశ్ పాఠక్ ఇంట్లో సీబీఐ సోదాలు

**న్యూఢిల్లీ:** నిబంధనలను ఉల్లంఘిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి విదేశాల నుంచి నిధులు అందాయనే ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే, పార్టీ గుజరాత్ ఎన్నికల సహ ఇన్‌చార్జి దుర్గేశ్ పాఠక్ ఇంటిపై గురువారం సీబీఐ అధికారులు దాడులు జరిపారు. విదేశీ విరాళాల నిబంధనల సవరణ చట్టం(ఎఫ్‌సీఆర్‌ఏ)-2010కు విరుద్ధంగా ఆప్ నిధులు అందుకుందనే ఆరోపణలపై హోం శాఖ నుంచి అందిన ఫిర్యాదు మేరకు సీబీఐ కేసు నమోదు చేసింది. ఇందులో ఆప్‌కు చెందిన మరో నేత దివంగత కపిల్ భరద్వాజ్ పేరు కూడా ఉంది. ఆప్ ఓవర్సీస్ ఇండియా పేరుతో ఏర్పాటైన విభాగానికి అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో వలంటీర్లు ఉన్నారని తెలిపింది. వీరు నిబంధనలకు విరుద్ధంగా నిధులు సేకరించి దుర్గేశ్ పాఠక్, కపిల్ భరద్వాజ్‌లకు పంపినట్లు ఎఫ్ఐఆర్ పేర్కొంది. కాగా, విచారణకు అవసరమైతే పార్టీ అగ్ర నేతలను కూడా ప్రశ్నించే అవకాశముందని సీబీఐ వర్గాలు తెలిపాయి. సోదాలపై దుర్గేశ్ స్పందించారు. గుజరాత్‌లో పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి భయంతోనే కేంద్ర ప్రభుత్వం తనను బెదిరించేందుకు ఈ కుట్ర పన్నిందని ఆరోపించారు. గురువారం ఉదయం ఆరుగురు సీబీఐ అధికారులు తన నివాసానికి వచ్చి, రెండు గదుల్లో దాదాపు 4 గంటల పాటు అణువణువూ గాలించారని, వారికేమీ దొరకలేదని ఆయన చెప్పారు. సెర్చ్ వారెంట్ చూపిన అధికారులు సోదాలకు కారణం మాత్రం చెప్పలేదన్నారు. భయపెట్టడం ద్వారా గుజరాత్‌లో తమ పార్టీని ఏకాకిని చేయడమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఉద్దేశమని ఆరోపించారు. తమ పార్టీని అంతం చేయడమే బీజేపీ ఉద్దేశమని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. దుర్గేశ్‌కు గుజరాత్‌లో 2027లో జరిగే అసెంబ్లీ ఎన్నికల బాధ్యతలను అప్పగించిన వెంటనే బీజేపీ ప్రభుత్వం దాడులకు దిగిందని ఆప్ నేత మనీశ్ సిసోడియా ఆరోపించారు.

# నటుడు విజయ్‌కు వ్యతిరేకంగా ఫత్వా

### ఇఫ్తార్ విందుతో ముస్లింలను అగౌరవపరిచారని ఆరోపణ


**బరేలీ:** తమిళనాడు నటుడు, రాజకీయ నాయకుడు దళపతి విజయ్‌పై ఫత్వా జారీ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో సున్నీ ముస్లిం సంస్థ ఈ ఫత్వాను జారీ చేసింది. విజయ్ ముస్లిం వ్యతిరేకి అని, అతని నేపథ్యం, మునుపటి చర్యలను ఇస్లాంకు వ్యతిరేక ఉదాహరణలుగా చూపింది. ''ఇఫ్తార్‌కు తాగుబోతులు, జూదగాళ్లను ఆహ్వానించడం చట్టవిరుద్ధం. పాపం కూడా. అలాంటి వారిని నమ్మకూడదు. మతపరమైన కార్యక్రమాల్లో చేర్చుకోవద్దు'' అని తమిళనాడులోని ముస్లింలకు సూచించింది. విజయ్ దళపతి చరిత్ర అంతా ముస్లిం వ్యతిరేక భావాలతో నిండి ఉందని, రాజకీయాలకోసం ముస్లింలను వాడుకుంటున్నరని మౌలానా రజ్వీ ఆరోపించారు. దళపతి విజయ్ పాత సినిమా 'ది బీస్ట్'లో ముస్లింలను, మొత్తం ముస్లిం సమాజాన్ని ఉగ్రవాదం, తీవ్రవాదంతో ముడిపెట్టారని మౌలానా రజ్వీ మండిపడ్డారు. ఇఫ్తార్ కార్యక్రమానికి తాగుబోతులను ఆహ్వానించి రంజాన్ పవిత్రతను విజయ్ ఉల్లంఘించారన్నారు. విజయ్ దళపతికి దూరంగా ఉండాలని, ఆయన కార్యక్రమాలకు హాజరు కావొద్దని, మతపరమైన కార్యక్రమాలకు ఆయనను ఆహ్వానించొద్దని ముస్లింలను కోరారు. టీవీకే వ్యవస్థాపకుడు, అధినేత దళపతి విజయ్.. మార్చి 8న చెన్నైలోని వైఎంసీఏ మైదానంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. టోపీ ధరించి, సాయంత్రం నమాజ్‌లో పాల్గొని, తన పార్టీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నవారితో కలిసి ఉపవాస దీక్ష విరమించారు. విజయ్ ఇఫ్తార్ విందు సరిగా నిర్వహించలేదని, ఇఫ్తార్‌తో సంబంధం లేని తాగుబోతులకు ఇఫార్త్ విందు ఇచ్చి విజయ్ ముస్లింలను అవమానించారని తమిళనాడు సున్నత్ జమాత్ మార్చి 11న చెన్నై పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది.

## 4,900 మంది ఖైదీలకు మయన్మార్ సైనిక జుంటా క్షమాభిక్ష

**బ్యాంకాక్:** మయన్మార్ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని గురువారం ఆ దేశ సైనిక జుంటా ప్రభుత్వం 4,900 మంది ఖైదీలకు క్షమాభిక్ష ప్రకటించింది. వీరిలో 22 మంది రాజకీయ ఖైదీలు, 13 మంది విదేశీయులు ఉన్నట్లు అధికార వార్తాసంస్థ తెలిపింది. ఉదయం సుమారు 19 బస్సుల్లో ఇన్‌సెయిన్ జైలు నుంచి ఖైదీలను అధికారులు బయటకు తరలించారని పేర్కొంది. హత్య, అత్యాచారం వంటి తీవ్ర నేరాలు ఇతర భద్రతపరమైన ఉల్లంఘనలకు పాల్పడిన వారికి మాత్రం సీనియర్ జనరల్ మిన్ ఔంగ్ హ్లెయింగ్ క్షమాభిక్ష ప్రకటించలేదని వివరించింది. విడుదలైన వారు మరోసారి చట్టాన్ని ఉల్లంఘిస్తే గత జైలు శిక్షను కూడా అందులో కలుపుతారని తెలిపింది. అంగ్ సాన్ సూకీ సారథ్యంలోని ఎన్నికైన ప్రభుత్వాన్ని సైన్యం 2021 ఫిబ్రవరి ఒకటో తేదీన కూలదోసి అధికారాన్ని హస్తగతం చేసుకోవడం తెల్సిందే. అప్పటి నుంచి సైనిక పాలకులకు వ్యతిరేకంగా రాజకీయ, సాయుధ పోరాటం సాగుతోంది. అంగ్ సాన్ సూకీ సహా సైన్యం 22 వేల మందికి పైగా రాజకీయ నాయకులను నిర్బంధించింది. వీరిలో స్టీల్‌గా పిలుచుకునే సినీ దర్శకుడు ద్వె మిట్టర్ కూడా తాజాగా విడుదలైన వారిలో ఉన్నారు. మార్చి 28వ తేదీన సంభవించిన శక్తివంతమైన భూకంపంలో 3,725 మంది చనిపోగా తీవ్ర నష్టం వాటిల్లింది. కాగా, నూతన సంవత్సరం రోజున గురువారం దేశంలోని అనేక ప్రాంతాల్లో సైన్యం, ప్రజాస్వామ్య అనుకూల సాయుధులకు మధ్య పోరు కొనసాగినట్లు చెబుతున్నారు.

# నక్సలిజం నిర్మూలనలో వెన్నెముక సీఆర్‌పీఎఫ్

### హోం మంత్రి అమిత్ షా వెల్లడి



**నీముచ్/జైపూర్:** 2026 మార్చి 31వ తేదీలోగా దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించాలనే లక్ష్యానికి కేంద్ర రిజర్వు పోలీస్ దళం (సీఆర్‌పీఎఫ్) వెన్నెముకగా ఉందని హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. సీఆర్‌పీఎఫ్ 86వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మధ్యప్రదేశ్‌లోని నీముచ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. నేపాల్‌లోని పశుపతినాథ్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి వరకు వామపక్ష తీవ్రవాదాన్ని విస్తరింపజేయాలని లక్ష్యంగా పెట్టుకున్న నక్సలైట్లను ప్రస్తుతం దేశంలోని కేవలం 4 జిల్లాలకే పరిమితం చేయగలిగామన్నారు. దేశంలోని నక్సలిజం నిర్మూలనలో కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు(సీఏపీఎఫ్), సీఆర్‌పీఎఫ్ ముఖ్యంగా అందులోని కోబ్రా బెటాలియన్ కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో 400కు పైగా శిబిరాలను ఏర్పాటు చేసుకుని సీఆర్‌పీఎఫ్ లక్ష్య సాధన దిశగా ముందుకు సాగుతోందని వివరించారు. కశ్మీర్‌లో ఉగ్రవాదంపై, ఈశాన్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, మావోయిస్టులను నాలుగు జిల్లాలకు పరిమితం చేయడం ద్వారా జాతి భద్రతలో సీఆర్‌పీఎఫ్ సేవలు నిరుపమానంగా మారాయని అమిత్ చెప్పారు. ధైర్యసాహసాలకు మారుపేరైన కోబ్రా కమాండోల పేరు వింటేనే నేడు కాకలు తీరిన నక్సలైట్లు సైతం వణికిపోతున్నారని ఆయన తెలిపారు. బ్రిటిష్ పాలనలో 1939లో 'క్రౌన్ రిప్రజెంటేటివ్ పోలీస్'గా ఏర్పడిన ఈ బలగాల పేరును 1949లో హోం మంత్రి సర్దార్ పటేల్ హయాంలో సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్‌గా మార్చారు.

**2047 కల్లా మనమే నంబర్ వన్**

దేశం వందేళ్ల స్వాతంత్ర్య వేడుకలను జరుపుకునే 2047 నాటికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అన్ని రంగాల్లో ప్రపంచంలోనే అగ్ర స్థానంలో నిలుస్తామని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఇప్పటికే ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా నిలిచిందన్నారు. మరికొద్ది సంవత్సరాల్లోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాజస్తాన్‌లోని సిరోహిలో బ్రహ్మ కుమారీస్ సంస్థలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. 'సాయుధ బలగాల త్యాగాలు, అంకితభావం, బలిదానాల ఫలితంగా దేశ ప్రజలు సురక్షితంగా ఉన్నారు. అత్యంత కఠినమైన పరిస్థితులను తట్టుకుంటూ వారు తమ జీవితాల్లోని అమూల్యమైన కాలాన్ని దేశ సరిహద్దులను కాపాడటానికి అంకితం చేస్తున్నారు' అని కొనియాడారు.



## ప్రపంచంలోనే తొలిసారిగా 3డీ ప్రింటెడ్ సైనిక బంకర్

- లేహ్‌లో అచ్చుపోసిన ఇండియన్ ఆర్మీ
- సాయపడిన ఐఐటీ హైదరాబాద్, సింప్లీఫోర్జ్ క్రియేషన్స్

**బెంగళూరు:** భారత రక్షణ మౌలిక వసతుల, నిర్మాణ రంగంలో నూతన అధ్యయనానికి శ్రీకారం చుడుతూ ప్రపంచంలోనే తొలిసారిగా 3డీ ముద్రిత సైనిక బంకర్‌ను లేహ్‌లో నిర్మించారు. సముద్రమట్టానికి 11,000 అడుగుల ఎత్తులో అసాధారణ పరిస్థితులను తట్టుకునేలా పటిష్టవంతంగా మిలటరీ బంకర్‌ను పోతపోయడం విశేషం. అప్పటికప్పుడు తయారుచేసిన ప్రత్యేక కాంక్రీట్ మిక్సర్‌ను ముందే డిజైన్ చేసిన విధంగా 3డీ విధానంలో నిర్మాణాన్ని పూర్తిచేశారు. ఇండియన్ ఆర్మీ తరఫున అరుణ్ కృష్ణన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)హైదరాబాద్‌తోపాటు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న బహుళ సాంకేతికతలు, ఉత్పత్తుల అంకుర సంస్థ సింప్లీఫోర్జ్ క్రియేషన్స్ సంయుక్తంగా 'ప్రబల్' ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ బంకర్‌ను నిర్మించారు. సముద్రమట్టానికి అత్యంత ఎత్తు, అత్యల్ప ఆక్సిజన్(హ్యాలో) పరిస్థితుల్లో ప్రపంచంలో నిర్మించిన తొలి బంకర్ ఇదేనని ప్రబల్ ప్రాజెక్ట్‌కు సారథ్యం వహించిన ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ కేవీఎల్ సుబ్రహ్మణ్యం చెప్పారు. ''అత్యంత మారుమూల ప్రదేశానికి ఈ ప్రింటర్‌ను తీసుకురావడం కూడా పెద్ద సవాల్‌గా మారింది. ఇంత ఎత్తులో దాదాపు కేవలం 40-50 శాతం ఆక్సిజన్ అందుబాటులోనే మేం, మా ప్రింటర్ పనిచేయాల్సి వచ్చింది. శత్రుసైన్యం బుల్లెట్లను తట్టుకునేలా అధునాతన డిజైన్‌లో పటిష్టంగా, పరిసరాల్లో కలిసిపోయే రంగులో బంకర్‌ను నిర్మించాం'' అని ఆయన వెల్లడించారు. గతంలో తెలంగాణలోని సిద్దిపేట జిల్లాలోని బురుగుపల్లి గ్రామంలో ప్రపంచంలోనే తొలిసారిగా 3డీ ప్రింటెడ్ హిందూ ఆలయాన్ని సైతం ఇదే సింప్లీఫోర్జ్ క్రియేషన్స్ నిర్మించింది.

## సైనిక దళాలను విరమించేది లేదు..

- గాజా, లెబనాన్, సిరియాలపై ఇజ్రాయెల్ ప్రకటన
- దక్షిణ సిరియాలో బఫర్ జోన్‌ను స్వాధీనం చేసుకున్న ఇజ్రాయెల్

**జెరూసలేం:** గాజా స్ట్రిప్, లెబనాన్, సిరియాలోని భద్రతా జోన్ల నుంచి తమ సైనిక దళాలను విరమించేది లేదని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. తమ భద్రతా దళాలు అక్కడ నిరవధికంగా ఉంటాయని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి బుధవారం తెలిపారు. ఇప్పటికే ఇజ్రాయెల్ దళాలు గాజాలో సగానికి పైగా స్వాధీనం చేసుకున్నాయి. గత ఏడాది హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూప్‌తో కాల్పుల విరమణ తర్వాత లెబనాన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి వైదొలగడానికి ఇజ్రాయెల్ నిరాకరించింది. డిసెంబర్‌లో సిరియా అధ్యక్షుడు బషర్ అసద్‌ను గద్దె దించిన తరువాత దక్షిణ సిరియాలోని బఫర్ జోన్‌ను సైతం ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది. దక్షిణ లెబనాన్‌లో బుధవారం ఇజ్రాయెల్ జరిపిన రెండు డ్రోన్ దాడుల్లో ఇద్దరు మృతి చెందినట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. నవంబర్‌లో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినప్పటి నుంచి లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 70 మందికి పైగా పౌరులు మరణించారని ఐక్యరాజ్య సమితి తెలిపింది.

# మహిళలు, దళితులకు రక్షణ లేదు

### యూపీ ప్రభుత్వంపై రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వ హయాంలో దళితులు, మహిళలకు భద్రత లేకుండాపోయిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. దళిత వ్యతిరేక, మహిళా వ్యతిరేక వైఖరి కలిగిన బీజేపీ పాలన వల్లే రాష్ట్రంలో వారిపై నేరాలు కొనసాగుతున్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. యూపీలోని రాంపూర్‌లో మంగళవారం అదృశ్యమైన 11 ఏళ్ల బధిర దళిత బాలిక అత్యాచారానికి గురైంది. బుధవారం ఆమె వ్యవసాయక్షేత్రంలో పడి ఉండగా గుర్తించి ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఘటనపై రాహుల్ గాంధీ గురువారం పై విధంగా స్పందించారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి తగు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

**లోకో పైలట్ల పరిస్థితి దారుణం**

లోకో పైలట్లు దారుణమైన పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం లోకో పైలట్ల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. అమానవీయ పరిస్థితుల్లో వారు పనిచేస్తున్నారన్నారు. వారికి తీవ్ర అన్యాయం చేస్తున్న ప్రభుత్వం, కోట్లాది మంది రైలు ప్రయాణికుల భద్రతతో ఆటలాడుకుంటోందని గురువారం ఆయన 'ఎక్స్'లో ఆరోపించారు. 14 గంటల షిఫ్టులో తమకు విరామ సమయం ఇవ్వాలన్న పైలట్ల వినతిని రైల్వే శాఖ తిరస్కరించిందని, కనీసం టాయిలెట్ల సౌకర్యం కూడా కల్పించకుండా మహిళా సిబ్బందితో ఏకబిగిన 8 గంటలపాటు పనిచేయిస్తున్నారన్నారు.

# గాజాపై భీకరదాడులు.. 23 మంది మృతి

### ఆహార సంక్షోభం తీవ్రమైందన్న ఐరాస

**గాజా:** గాజా ప్రాంతంపై బుధవారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ బలగాలు కొనసాగిస్తున్న దాడుల్లో ఒకే కుటుంబంలోని 10 మంది సహా మొత్తం 23 మంది ప్రాణాలు కోల్పోయారు. ఖాన్ యూనిస్ నగరంపై జరిగిన దాడిలో ఒకే కుటుంబంలోని 10 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో ఐదుగురు చిన్నారులు, నలుగురు మహిళలున్నారు. వీరంతా తీవ్రంగా కాలిన గాయాలతో చనిపోయారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఉత్తర గాజాపై జరిగిన మరో దాడిలో 9 మంది చిన్నారులు సహా 13 మంది మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇలా ఉండగా, గాజాలోని 20 లక్షల మందికి గాను దాతృత్వ సంస్థలు 10 లక్షల మంది కోసం తయారు చేసిన ఆహారమే ఏకైక ఆధారంగా మారిందని ఐక్యరాజ్య సమితి కార్యాలయం తెలిపింది. ఆహారం, మందులు వంటి అత్యవసరాల సరఫరాలను ఇజ్రాయెల్ అడ్డుకోవడంతో మానవీయ సంక్షోభం గత ఏడాదిన్నరలోనే అత్యంత తీవ్ర రూపం దాల్చిందని ఐరాస పేర్కొంది. గాజాలోని అత్యధికులకు రోజులో ఒక్కసారి మాత్రమే భోజనం అందుతోందని వివరించింది. నీటి కొరత సైతం ఎక్కువవుతోందని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. కనీస అవసరాలకు నీరు సరిపోవడం లేదని, రోజులో ఒక్కో వ్యక్తికి ఆరేడు లీటర్లకు మించి నీరు అందడం లేదని తెలిపింది. తమ వద్ద మరో 3 వారాలకు మాత్రమే సరిపోను ఆహారం ఉందని గాజా సూప్ కిచెన్ నిర్వాహకుడొకరు తెలిపారు. హమాస్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నుంచి బయటకువచ్చిన నాటి నుంచి ఇజ్రాయెల్ గత నెలరోజులుగా గాజా ప్రాంతాలపై యథేచ్ఛగా దాడులను కొనసాగిస్తోంది.

# సర్కారియా కమిషన్ ముఖ్య సిఫార్సులు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

## కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

### వివాదాలు - సమీక్షా కమిషన్లు

కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో తలెత్తిన వివాదాలను పరిశీలించి, పరిష్కరించడానికి అనేక కమిటీలను, కమిషన్లను నియమించారు. ఈ కమిటీలు వాటికి నిర్దేశించిన పరిధిలో కొన్ని సిఫార్సులు చేశాయి.
వాటిలో ముఖ్యమైనవి...

### పరిపాలనా సంస్కరణల సంఘం (1966)

కేంద్ర ప్రభుత్వం 1966లో ఆరుగురు సభ్యులతో మొరార్జీ దేశాయ్ అధ్యక్షతన పరిపాలనా సంస్కరణల కమిషన్‌ను నియమించింది. (మొరార్జీ దేశాయ్ రాజీనామా చేయడం వల్ల కె.హనుమంతయ్య ఈ కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవహరించారు). ఈ కమిటీ కేంద్ర రాష్ట్ర సంబంధాలను సమగ్రంగా పరిశీలించింది.

కేంద్ర, రాష్ట్ర సంబంధాల కోసం ఎం.సి. సెతల్వాడ్ అధ్యక్షతన ఒక అధ్యయన బృందాన్ని కూడా నియమించారు. పరిపాలనా సంస్కరణ సంఘం తుది నివేదికను 1969లో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలో 22 సిఫార్సులు చేసింది.

- ప్రకరణ 263 ప్రకారం, అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- ప్రజా జీవితంలో, పరిపాలనలో అనుభవం ఉన్న వ్యక్తినే గవర్నర్‌గా నియమించాలి.
- రాష్ట్రాల కోరిక మేరకే కేంద్ర బలగాలను పంపాలి.
- రాష్ట్రాలకు మరిన్ని ఆర్థిక వనరులను బదిలీ చేయాలి.

అయితే ఈ సిఫార్సులపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

### రాజమన్నార్ కమిటీ (1969)

1969లో తమిళనాడు ప్రభుత్వం జస్టిస్ పి.వి. రాజమన్నార్ అధ్యక్షతన, ఇద్దరు సభ్యులతో కేంద్ర, రాష్ట్ర సంబంధాల పరిశీలనకు ఒక కమిటీని నియమించింది. ఇది 1971లో నివేదికను సమర్పించింది. దీనిలోని ఇతర సభ్యులు లక్ష్మణస్వామి మొదలియార్, పి. చంద్రారెడ్డి.

ఇది దేశంలో ఉన్న ఏక కేంద్ర ధోరణులకు కారణాలను గుర్తించింది. అవి

- రాజ్యాంగం కేంద్రానికి ఇచ్చిన ప్రత్యేక అధికారాలు
- కేంద్రం, రాష్ట్రంలోనూ ఏక రాజకీయ పార్టీ పాలన
- రాష్ట్రాలకు ఆర్థిక వనరులు తగినన్ని లేకపోవడం, కేంద్రం మీద ఆధారపడటం
- కేంద్ర ప్రణాళిక రచన,ప్రణాళికా సంఘం పాలన

సిఫార్సులు

- రాష్ట్ర మంత్రివర్గంతో లేదా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక ఉన్నతాధికార సంఘంతో సంప్రదించి రాష్ట్రపతి, గవర్నర్‌ను నియమించాలి.
- రాష్ట్ర ప్రభుత్వాన్ని తొలగించి, రాష్ట్రపతి పాలన ప్రకటించే ప్రకరణ 356ను రద్దు చేయాలి.
- గవర్నర్ సంతృప్తి ఉన్నంత వరకే మంత్రివర్గ పదవుల్లో ఉండాలన్న ప్రకరణను తీసివేయాలి.
- కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ అవలంబించే ఏకపక్ష నియంతృత్వ చర్యలను నిరోధించడానికి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటానికి రాష్ట్రాలకు తగినన్ని రక్షణలను కల్పించాలి.
- ప్రధాని అధ్యక్షతన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఒక అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- రాజ్య సభలో రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి.
- కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రాల వారీగా ప్రాతినిధ్యం ఉండాలి.
- ప్రణాళికా సంఘం ఒక శాశ్వత సంస్థగా ఉండాలి. కేంద్ర ప్రభుత్వ నియంత్రణ తగ్గాలి.
- అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లను రద్దు చేయాలి.
- అవశిష్ట అధికారాలను రాష్ట్రాలకు బదిలీ చేయాలి.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను ప్రముఖ



న్యాయ శాస్త్రవేత్తలు తీవ్రంగా విమర్శించారు.

దేశంలో ఎన్నో వేర్పాటు శక్తులు తలెత్తుతుండగా జాతి నిర్మాణం, జాతి సమైక్యతా క్రమంలో విద్య, వ్యవసాయ, ఉత్పత్తి రంగాలను విస్తృతం చేసి సామాన్య మానవుని సమస్యలను తీర్చడంలో ప్రయత్నం చేయాల్సి ఉండగా ప్రాంతీయతత్వాన్ని బలోపేతం చేసే విధంగా సిఫార్సులు చేయడం అవాంఛనీయం అని పేర్కొన్నారు.

### ఆనంద్‌పూర్ సాహెబ్ తీర్మానం (1973)

1973లో పంజాబ్‌లో అకాలీదళ్ పార్టీ ఆనందపూర్ అనే ప్రాంతంలో ఒక తీర్మానాన్ని చేసింది. రక్షణ, అంతర్జాతీయ సంబంధాలు, కమ్యూనికేషన్లు, కరెన్సీ మొదలైన విషయాలకే కేంద్ర ప్రభుత్వ పరిధి పరిమితం కావాలని, దేశంలో నిజమైన సమాఖ్య స్ఫూర్తి తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

### పశ్చిమబెంగాల్ ప్రభుత్వ మెమొరెండం (1977)

1977లో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై ఒక విజ్ఞాపన సమర్పించింది. అందులోని కొన్ని ముఖ్యాంశాలు.

- రాజ్యాంగంలో యూనియన్ అనే పదాన్ని తొలగించి సమాఖ్య అనే పదాన్ని చేర్చాలి.
- కొత్త రాష్ట్రాల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోనికి తీసుకోవాలి.
- అఖిల భారత సర్వీసులను రద్దు చేయాలి.
- రాష్ట్రపతి పాలన, అలాగే ఆర్థిక అత్యవసర పరిస్థితి అధికారాలను తొలగించాలి.
- కేంద్ర ప్రభుత్వ అధికార పరిధిని కుదించాలి.
- రాజ్యసభకు లోక్‌సభతో సమానంగా అధికారాలు ఇవ్వాలి.
- జోనల్ కౌన్సిల్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలి.
- శాశ్వత ప్రాతిపదికపై అంతర్రాష్ట్ర ప్రభుత్వ మండలిని ఏర్పాటు చేయాలి.
- జాతీయాభివృద్ధి మండలి పేరును జాతీయ ఆర్థికాభివృద్ధి మండలిగా మార్చి అస్థిత్వాన్ని పరిరక్షించాలి.
- ఆర్థిక నిపుణులనే ఆర్థిక సంఘ సభ్యులుగా నియమించాలి.
- భారతదేశ సమష్టి సంస్కృతిని సంరక్షించడానికి జాతీయ కార్యక్రమాలను ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేయాలి.
- అవశిష్ట అంశాలపై పన్నులు విధించే శాసన నిర్మాణ అధికారాన్ని పార్లమెంటుకు అప్పగించాలి.
- కార్పొరేషన్ పన్నుల్లో కొంత భాగాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలి.
- రాష్ట్రాలతో సంప్రదించి ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసు, ఇండియన్ హెల్త్ సర్వీస్, ఇండియన్ ఎడ్యుకేషన్ సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- రాష్ట్రాల అనుమతి లేకుండా కేంద్ర బలగాలను పంపొద్దు.
- ఉమ్మడి జాబితాలో చట్టాలను రూపొందించే సమయంలో కేంద్రం రాష్ట్రాలను సంప్రదించాలి.
- గవర్నర్ నియామక సమయంలో ముఖ్యమంత్రిని విధిగా సంప్రదించే విధంగా రాజ్యాంగ సవరణ చేయాలి.
- త్రిభాషా సూత్రాన్ని అమలుపరిచేందుకు గట్టి ప్రయత్నం చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీసు చార్జీలను ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే విధించాలి.
- భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలవారికి ప్రత్యేక కమిషన్‌ను నియమించి క్రియాత్మకం చేయాలి.
- రేడియో, టెలివిజన్‌లకు స్వయం ప్రతిపత్తి అవసరం లేదు. అయితే వాటి పని తీరును వికేంద్రీకరణ చేయాలి.
- ఆర్థిక సంఘం, ప్రణాళికా సంఘం మధ్య ప్రస్తుత విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది. దాన్ని కొనసాగించాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ వేసే సందర్భంలో పార్లమెంటు అనుమతి తీసుకోవాలి.
- రాష్ట్ర ఎగువసభ రద్దు లేదా ఏర్పాటు విషయంలో పార్లమెంట్ నిర్ణీత సమయంలోనే తన అభిప్రాయాన్ని తెలపాలి.

### గాడ్గిల్ ఫార్ములా

సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ సక్రమంగా జరగాల్సిన ఆవశ్యకత ఉంది. కేంద్ర ప్రణాళికా సహాయాన్ని రాష్ట్రాలకు అందించే ప్రాతిపదికను ప్రణాళిక సంఘం మాజీ డిప్యూటీ చైర్మన్ డి.ఆర్.గాడ్గిల్ పేరుతో 1971లో ఓ ఫార్ములాను రూపొందించారు. దీన్ని 1981లో ఒకసారి, తిరిగి 1992లో మరోసారి సమీక్షించారు. డి.ఆర్.గాడ్గిల్ ఫార్ములా అనుసరించి జనాభా ఆధారంగా 60 శాతం, తలసరి ఆదాయం ఆధారంగా 25 శాతం, ఆదాయ, వ్యయాలను సరిచూసుకుని విత్తలోటు తగ్గించినందుకు 7.5 శాతం, ఇతర సమస్యల (ఎడారి ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, శిశు మరణాలు, ఆరోగ్యం మొదలైనవి) ఆధారంగా 7.5 శాతం కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు సహాయాన్ని అందిస్తుంది. అయితే వెనకబడ్డ, పేద రాష్ట్రాలకు ఈ ఫార్ములా అంత ఉపయోగకరంగా లేదు. విత్త రంగంలో చూపిన క్రమశిక్షణను ఈ ఫార్ములా ప్రోత్సాహపరుస్తున్నట్లుగా లేదని కొందరు విమర్శిస్తున్నారు.

### సర్కారియా కమిషన్ సిఫార్సులు (1987)

1983లో కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఆర్.ఎస్. సర్కారియా అధ్యక్షతన బి.శివరామన్, ఎస్.ఆర్.సేన్ సభ్యులుగా, కార్యదర్శిగా ఆర్.ఎం. సుబ్రహ్మణ్యం, రాజ్యాంగ సలహాదారుడుగా ఎల్.ఎన్.సిన్హాతో ఒక కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ 1987 అక్టోబర్ 27న 247 సిఫార్సులతో కూడిన 1600 పేజీల నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. 1988 జనవరిలో ప్రభుత్వం సర్కారియా కమిషన్ నివేదికను విడుదల చేసింది. అందులో 230 సిఫార్సులపై కేంద్ర ప్రభుత్వం తగిన నిర్ణయాలను తీసుకుంది. మొత్తం సిఫారసుల్లో 170 సిఫార్సులను అమలు చేసింది.

### ముఖ్య సిఫార్సులు

- గవర్నర్‌ల నియామకంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రులను సంప్రదించాలి.
- రాజకీయేతర రంగాలను చెందిన, వివాదాస్పదం కాని వ్యక్తులను, ప్రముఖులను మాత్రమే గవర్నర్‌లుగా నియమించాలి. రాష్ట్రేతర వ్యక్తినే గవర్నర్‌గా నియమించాలి.
- ముఖ్యమంత్రి నియామకం, రాష్ట్రమంత్రి మండలి కొనసాగింపు విషయంలో విధాన సభ మెజారిటీ సభ్యుల అభిప్రాయాలను తెలుసుకోవాలి. అరుదైన సందర్భాల్లో రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టాలి.
- అఖిల భారత సర్వీసులను మరింత బలోపేతం చేసి, మరిన్ని కొత్త సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీసు చార్జీలను ప్రత్యేక సందర్భాల్లోనే విధించాలి.
- భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలవారికి ప్రత్యేక కమిషన్‌ను నియమించి క్రియాత్మకం చేయాలి.
- రేడియో, టెలివిజన్‌లకు స్వయంప్రతిపత్తి అవసరంలేదు. అయితే వాటి పనితీరును వికేంద్రీకరణ చేయాలి.
- ఆర్థికసంఘం, ప్రణాళికా సంఘం మధ్య ప్రస్తుత విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది. దీనిని కొనసాగించాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ వేసే సందర్భంలో పార్లమెంటు అనుమతి తీసుకోవాలి.
- రాష్ట్ర ఎగువసభ రద్దు లేదా ఏర్పాటు విషయంలో పార్లమెంటు నిర్ణీత సమయంలోనే తన అభిప్రాయాన్ని తెలపాలి.

# 'పండుగ, పబ్బం, వేడుక' పదాలకు పర్యాయపదం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు

## వ్యుత్పత్త్యర్థాలు, పర్యాయపదాలు

డీసెట్ అభ్యర్థులకు భాషాంశాల్లో వ్యుత్పత్త్యర్థాలు, పర్యాయపదాలపై అవగాహన ఉండాలి. 8, 9, 10 తరగతుల పాఠ్యాంశాల ఆధారంగా వీటిపై ప్రశ్నలు ఉంటాయి. పదానికి సంబంధించిన పుట్టుక, నేపథ్యం, దాని అర్థం మొదలైన వాటిని తెలిపేదే వ్యుత్పత్త్యర్థం.

- పదానికి సంబంధించిన వ్యుత్పత్తిని ఇచ్చి పదాన్ని కనుక్కోవాలని అడుగుతారు.
- ఒక పదానికి ఒకే అర్థం వచ్చే వివిధ పదాలను పర్యాయపదాలు అంటారు.
- ఒక పదాన్ని ఇచ్చి దానికి పర్యాయపదం కనుక్కోవాలని అడుగుతారు.

### మాదిరి ప్రశ్నలు

1. 'లోకులను అంధులుగా చేసేది' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) కాటుక  2) అజ్ఞానం
   3) అంధకారం  4) అవివేకం
2. 'రెప్పపాటు లేనివారు' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) నిమిషులు  2) అనిమిషులు
   3) తారలు  4) రాక్షసులు
3. 'అనిలుడు' పదానికి వ్యుత్పత్తి?
   1) ప్రాణులను దహించువాడు
   2) ప్రాణులను బాధించువాడు
   3) ప్రాణులకు సంతృప్తినిచ్చువాడు
   4) ప్రాణులకు జీవాధారమైనవాడు
4. 'లోకమునకు జీవనాధారమైనవాడు' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) సూర్యుడు  2) అనిలుడు
   3) అనలుడు  4) చంద్రుడు
5. 'అక్షి' పదానికి వ్యుత్పత్తి?
   1) దగ్గరలో చూచేది
   2) సమీపంలో వ్యాపించేది
   3) దూరంగా వ్యాపించేది
   4) జాగ్రత్తను సూచించేది
6. 'మరణం లేకుండా చేసేది' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) మృతం  2) అమృతం
   3) సంజీవని  4) అమరం
7. 'అఖండలుడు' పదానికి వ్యుత్పత్తి?
   1) ఖండితం కాని బలశాలి
   2) సాటిలేని పరాక్రమం ఉన్నవాడు
   3) కొండల రెక్కలను ఖండించినవాడు
   4) కొండలతో యుద్ధం చేసేవాడు
8. 'ఇంటిలోని స్త్రీ' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) పనిమనిషి  2) తల్లి
   3) చెల్లి  4) ఇల్లాలు
9. 'స్వభావంతో ఐశ్వర్యం కలవాడు' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) ఇంద్రుడు  2) ఈశ్వరుడు
   3) విష్ణువు  4) బ్రహ్మ
10. 'ఇంద్రుని తమ్ముడు' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) విష్ణువు  2) బ్రహ్మ
   3) ఉపేంద్రుడు  4) హరుడు
11. 'నయన కాంతితో కాకులను దహించేది'?
   1) గద్ద  2) రాబందు
   3) జటాయువు  4) ఉలూకం(గుడ్లగూబ)
12. 'అజ్ఞానమనెడి అంధకారాన్ని పోగొట్టు వాడు' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) ఋషి  2) గురువు
   3) భగవంతుడు  4) దేవత
13. 'వివిధ వర్ణాలతో కూడిన కంఠం కలది' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) నెమలి  2) చాతకపక్షి
   3) చిత్రగ్రీవం (పావురం)
   4) కోయిల
14. 'పున్నామ నరకం నుంచి తల్లిదండ్రులను రక్షించువాడు' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) పౌరుడు  2) దేవుడు
   3) పాలకుడు  4) పుత్రుడు
15. 'వనంనందు పుట్టినది' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) తరువు  2) చందనం
   3) పద్మం  4) హంస
16. 'ప్రపంచానికి నాథుడు' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) బ్రహ్మ  2) విష్ణువు
   3) హరిహరుడు  4) విశ్వనాథుడు
17. కమలగర్భుడు పదానికి వ్యుత్పత్తి?
   1) కమలం నాభిలో ఉన్నవాడు
   2) కమలం గర్భంలో ఉన్నవాడు
   3) కమలం గర్భంగా కలవాడు
   4) కమలం ఆసనంలో కలవాడు
18. 'తుమ్మెదలాంటి నల్లని కురులు కలది' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) నీలవేణి  2) అలివేణి
   3) కృష్ణవేణి  4) మిళింద వేణి
19. 'పాదాలతో నడువనిది' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) చెట్టు  2) కొండ
   3) మొసలి  4) పన్నగం
20. 'శ్రియఃపతి' పదానికి వ్యుత్పత్తి?
   1) పార్వతీదేవికి భర్త
   2) సరస్వతీ దేవికి భర్త
   3) లక్ష్మీదేవికి భర్త
   4) అరుంధతీదేవికి భర్త
21. 'దీనిలో నీరు బంధింపబడేది' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) ఆకాశం  2) శంభుని శిరం
   3) శీతాద్రి  4) జీమూతం
22. 'దామోదరుడు' పదానికి వ్యుత్పత్తి?
   1) దామం కంఠంలో కలవాడు
   2) దామం ఉదరంలో ఉన్నవాడు
   3) దామం హృదయంలో ఉన్నవాడు
   4) దామం శిరస్సులో ఉన్నవాడు
23. 'భూమి మీద దేవతలు' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) భూపాలకులు  2) రాక్షసులు
   3) భూసురులు  4) భూప్రజలు
24. 'కలాపి' పదానికి వ్యుత్పత్తి?
   1) మధురమైన కంఠం కలది
   2) కిరీటం కలది
   3) పింఛం కలది
   4) అందమైన మెడ కలది
25. 'భారమైన జడలు కలవాడు' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) భారవి  2) భృగుమహర్షి
   3) ధూర్జటి  4) బాలాజీ
26. 'అంబోధి' పదానికి పర్యాయపదం?
   1) నది  2) సరస్సు
   3) సాగరం  4) ప్రవాహం
27. 'అసత్యం, బొంకు, అబద్ధం' అనే పర్యాయ పదాలు ఉన్న పదం?
   1) అన్నం  2) అనృతం
   3) అమృతం  4) మిథ్య
28. 'అహిమకరుడు' పదానికి పర్యాయపదం?
   1) సూర్యుడు  2) భానుడు
   3) భాస్కరుడు  4) పైవన్నీ
29. 'ఆగ్రహం' పదానికి పర్యాయపదం?
   1) శనిగ్రహం  2) కోపం
   3) అనుగ్రహం  4) అవగ్రహం
30. 'ఆస్యం' పదానికి పర్యాయపదం?
   1) హాస్యం  2) లాస్యం
   3) ముఖం  4) పరిహాసం
31. 'కఠారం' పదానికి పర్యాయపదం?
   1) గొడ్డలి  2) గునపం
   3) కత్తి  4) బాకు
32. 'అక్షి, చక్షువు, నయనం, నేత్రం' పదాలకు పర్యాయపదం?
   1) కాలు  2) చేయి
   3) కన్ను  4) ముఖం
33. 'కైరవం' పదానికి పర్యాయపదం?
   1) ఇందీవరం  2) కల్హారం
   3) కుముదం  4) పైవన్నీ
34. 'వెన్నెల, చంద్రిక, జ్యోత్స్న' పదాలకు పర్యాయపదం?
   1) కౌముది  2) హిమం
   3) పంకం  4) తమం
35. 'ఇందుడు, శశాంకుడు, నిశాకరుడు' పదాలకు పర్యాయపదం?
   1) ఇంద్రుడు  2) ఉపేంద్రుడు
   3) నిశాచరుడు  4) చంద్రుడు
36. 'భాగీరథి' పదానికి పర్యాయపదం?
   1) గంగానది  2) జాహ్నవి
   3) పావని  4) పైవన్నీ
37. 'సిగ, కొప్పు, శిఖ' పదాలకు పర్యాయ పదం?
   1) శిఖరం  2) జూటం
   3) మౌళి  4) శిరం
38. 'బంగారం, పుత్తడి, కాంచనం' పదాలకు పర్యాయపదం?
   1) రజతం  2) పసిడి
   3) ప్లాటినం  4) గోమేధం
39. 'రాత్రి' పదానికి పర్యాయపదం?
   1) నిశ  2) రజని
   3) యామిని  4) పైవన్నీ
40. 'వస్త్రం, పుట్టం, చేలం, గుడ్డ' పదాలకు పర్యాయపదం?
   1) పట్టు  2) నార
   3) పేలిక  4) వలువ
41. వివరం పదానికి పర్యాయపదం?
   1) రంధ్రం  2) కలుగు
   3) బలం  4) పైవన్నీ
42. మందాకినీ పదానికి పర్యాయపదం?
   1) భాగీరథీ  2) మిన్నేరు
   3) గంగ  4) పైవన్నీ
43. 'పండుగ, పబ్బం, వేడుక' పదాలకు పర్యాయపదం?
   1) జాతర  2) ఉత్సవం
   3) పర్వం  4) ఆహ్లాదం
44. 'పక్షి' పదానికి పర్యాయపదం?
   1) విహంగం  2) పులుగు
   3) ఖేచరం  4) పైవన్నీ
45. 'ఎలుగుబంటి, భల్లూకం, రుక్షం' పదాలకు పర్యాయపదం?
   1) సింహం  2) ఎలుగు
   3) పుండరీకం  4) జంబూకం
46. 'పవి' పదానికి పర్యాయపదం?
   1) వజ్రాయుధం  2) కులిశం
   3) అశని  4) పైవన్నీ
47. 'భృంగం, మిళిందం, భ్రమరం' పదాలకు పర్యాయపదం?
   1) కూర్మం  2) మూషికం
   3) తుమ్మెద  4) శునకం
48. 'అంబుజం' పదానికి పర్యాయపదం?
   1) పద్మం  2) తామర
   3) జలజం  4) పైవన్నీ
49. 'హలం, సీరం' పదాలకు పర్యాయపదం?
   1) శకటం  2) నాగలి
   3) పొలం  4) క్షీరం
50. 'అకూపారం' పదానికి పర్యాయపదం?
   1) సముద్రం  2) పయోధి
   3) జలధి  4) పైవన్నీ
51. 'క్షుధ' పదానికి పర్యాయపదం?
   1) దాహం  2) సుధ
   3) ఆకలి  4) అలసట
52. బ్రహ్మ, చతురాననుడు పదాలకు పర్యాయపదం?
   1) విధి  2) నిధి
   3) తిథి  4) ప్రజ్ఞ
53. 'కేదారం' పదానికి పర్యాయపదం?
   1) మందారం  2) సింధూరం
   3) పొలం  4) పతాకం
54. 'స్మరణ' పదానికి పర్యాయపదం?
   1) తలపు  2) జ్ఞప్తి
   3) యాది  4) పైవన్నీ
55. 'దేహం' పదానికి పర్యాయపదం?
   1) గేహం  2) యాచన
   3) తనువు  4) దేశం
56. 'మర్త్యుడు, మానవుడు, మనిషి' పదాలకు పర్యాయపదం?
   1) రాక్షసుడు  2) నరుడు
   3) వానరుడు  4) కష్టజీవి
57. 'జీవుని పాశం నుంచి విడిపించేది' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) స్వర్గం  2) నరకం
   3) మోక్షం  4) తపం
58. 'దశరథుని పుత్రుడు' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) దశరథుడు  2) దాశరథీ
   3) దాశరాజు  4) దిలీపుడు
59. 'సర్వభూతాలల్లో స్నేహయుక్తుడు' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) శివుడు  2) చంద్రుడు
   3) మిత్రుడు  4) హితార్థి
60. 'చతురంగా మాట్లాడు నేర్పు ఉన్న వాడు' అనే వ్యుత్పత్తి ఉన్న పదం?
   1) వక్త  2) నేత
   3) న్యాయవాది  4) వాగ్మి

### సమాధానాలు

| | | | | |
|---|---|---|---|---|
| 1) 3; | 2) 2; | 3) 4; | 4) 3; | 5) 3; |
| 6) 2; | 7) 3; | 8) 4; | 9) 2; | 10) 3; |
| 11) 4; | 12) 2; | 13) 3; | 14) 4; | 15) 3; |
| 16) 4; | 17) 3; | 18) 2; | 19) 4; | 20) 3; |
| 21) 4; | 22) 2; | 23) 3; | 24) 3; | 25) 3; |
| 26) 3; | 27) 2; | 28) 4; | 29) 2; | 30) 3; |
| 31) 3; | 32) 3; | 33) 4; | 34) 1; | 35) 4; |
| 36) 4; | 37) 3; | 38) 2; | 39) 4; | 40) 4; |
| 41) 4; | 42) 4; | 43) 3; | 44) 4; | 45) 2; |
| 46) 4; | 47) 3; | 48) 4; | 49) 2; | 50) 4; |
| 51) 3; | 52) 1; | 53) 3; | 54) 4; | 55) 3; |
| 56) 2; | 57) 3; | 58) 2; | 59) 3; | 60) 4. |

## విద్య, ఉద్యోగ సమాచారం

### డీఆర్‌డీవో-ఏఆర్‌డీఈ, పుణెలో 50 అప్రెంటిస్‌లు

పుణె(మహారాష్ట్ర)లోని డీఆర్‌డీవో-ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఏఆర్‌డీఈ).. వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 50.
» ఖాళీల వివరాలు: గ్రాడ్యుయేట్ ఇంజనీర్-పీజీ అప్రెంటిస్‌లు-32, డిప్లొమా అప్రెంటిస్‌లు-18.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్, డిప్లొమా, పీజీలో ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 01.04.2025 నాటికి 18 నుంచి 30 ఏళ్ల లోపు ఉండాలి.
» స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.15,000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.14,000.
» ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:20.04.2025
» వెబ్‌సైట్: https://drdo.gov.in

### హెచ్‌ఏఎల్, బెంగళూరులో 98 టెక్నీషియన్ పోస్టులు

Hindustan Aeronautics Limited

హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్).. వివిధ విభాగాల్లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 98.
» పోస్టుల వివరాలు: డిప్లొమా టెక్నీషియన్(మెకానికల్)-20, డిప్లొమా టెక్నీషియన్(ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్)-26, ఆపరేటర్(ఫిట్టర్)-34, ఆపరేటర్(ఎలక్ట్రీషియన్)-14, ఆపరేటర్(మెషినిస్ట్)-03, ఆపరేటర్(షీట్ మెటల్ వర్కర్)-01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, ఐటీఐలో ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 31.03.2025 నాటికి 28 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు డిప్లొమా టెక్నీషియన్‌కు రూ.47,868, ఆపరేటర్‌కు రూ.45,852.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:18.04.2025
» వెబ్‌సైట్: www.hal-india.co.in

# ‘మిస్కో’ పరిశ్రమ ఎక్కడ ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

## జనరల్ స్టడీస్

### జాగ్రఫీ

**భారతదేశంలో పారిశ్రామిక రంగం - 2**

**ఖనిజ ఆధారిత పరిశ్రమలు:** భారతదేశం ఇనుము - ఉక్కు ఉత్పత్తి పరంగా ప్రపంచంలో ఐదో స్థానంలో ఉంది. (చైనా, జపాన్, యూఎస్ఏ, రష్యాల తర్వాత). స్పాంజ్ ఐరన్ ఉత్పత్తిలో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. భారతదేశంలో ఇనుము ఉక్కు పరిశ్రమ ప్రగతి, అభివృద్ధిని రెండు దశల్లో పరిశీలించవచ్చు అవి...

- **స్వాతంత్ర్యానికి పూర్వం:** ఈ దశలో ఇనుము - ఉక్కు పరిశ్రమ ప్రగతి, అభివృద్ధి ప్రైవేటు రంగంలోనే జరిగింది.
- **స్వాతంత్ర్యానంతరం:** ఈ దశలో విదేశీ సహకారంతో ప్రభుత్వ రంగంలో ఇనుము - ఉక్కు పరిశ్రమ అభివృద్ధి చెందింది.

#### స్వాతంత్ర్యానికి పూర్వం

1. 1830 - భారత్‌లో మొట్టమొదటి ఇనుము - ఉక్కు కర్మాగారాన్ని చెన్నై సమీపంలోని పోర్టోనోవాలో స్థాపించారు.
2. 1864 - పశ్చిమ బెంగాల్‌లోని ‘కుల్టీ’ అనే ప్రదేశంలో ‘బెంగాల్ ఐరన్ వర్క్స్’ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.
3. 1907 - జార్ఖండ్‌లోని ‘జంషెడ్‌పూర్’ (సక్చి) అనే ప్రాంతంలో జంషెడ్ జీ టాటా మొదటిసారి సమీకృత ఇనుము ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు. దీన్నే టిస్కో (TISCO - టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ) అని పిలుస్తారు.

   ముడి పదార్థాల సరఫరా
   - ఐరన్ ఓర్- జార్ఖండ్‌లోని నేముండి, ఒడిశాలోని గురుమహ - సాని, బాదమ్ పహాడ్
   - బొగ్గు - ఝూరియా, రాణిగంజ్
   - మాంగనీస్ - జోడామైన్స్ (ఒడిశాలో కియోంజార్ జిల్లా)
   - నీరు - సువర్ణరేఖ
   - డోలమైట్ అండ్ లైమ్‌స్టోన్ - సుందరగఢ్
4. 1908 - కుల్టీ సమీపంలోని హీరాపూర్ అనే ప్రాంతంలో మరో ఇనుము ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు.
5. 1919 - బెంగాల్‌లోని బర్న్‌పూర్ వద్ద ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ (IISCO) ఏర్పాటు చేశారు. దీనిలో కుల్టీలోని బెంగాల్ ఐరన్ వర్క్స్, హీరాపూర్‌లోని హీరాపూర్ స్టీల్ ప్లాంట్లను విలీనం చేశారు. 1972లో IISCOను భారత ప్రభుత్వం జాతీయం చేసింది.

   ముడి పదార్థాల సరఫరా
   - ఐరన్‌ఓర్ - జార్ఖండ్‌లో సింగ్భమ్ జిల్లాలో ఉన్న ‘గువ’ గనులు
   - బొగ్గు - ఝూరియా, రాణిగంజ్
   - విద్యుత్ - దామోదర్ వ్యాలీ కార్పొరేషన్
   - నీరు - బార్కార్ నది
   - డోలమైట్, లైమ్‌స్టోన్ - సుందరగఢ్
6. 1923 - కర్ణాటకలోని భద్రావతి వద్ద ‘మిస్కో’ (మైసూర్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ) ఏర్పాటు చేశారు. 1929లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరుతో దీని పేరును విశ్వేశ్వరయ్య ఇనుము ఉక్కు కర్మాగారంగా మార్చారు. 1962లో దీన్ని భారత ప్రభుత్వం జాతీయం చేసింది.

   ముడి పదార్థాల సరఫరా
   ఐరన్ ఓర్ - కెమ్మంగుడి
   విద్యుత్ - శరావతి పవర్ ప్లాంట్
   నీరు - భద్రావతి నది
   లైమ్ స్టోన్ - బుందిగూడ
   మాంగనీస్ - షిమోగా, చిత్రదుర్గ

#### స్వాతంత్ర్యానంతరం

రెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో

7. 1957 - ఛత్తీస్‌గఢ్ (గతంలో మధ్యప్రదేశ్) యూఎస్ఎస్ఆర్ సహాయంతో ‘భిలాయ్’ ఇనుము - ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు.

   ముడి పదార్థాల సరఫరా
   ఐరన్ ఓర్ - రాజీహార
   బొగ్గు - కోర్బా, కార్గాలి
   లైమ్ స్టోన్ - నందిని
   విద్యుత్ - కోర్బా థర్మల్ పవర్ ప్లాంట్
   మాంగనీస్ - భాండారా, బాలాఘాట్
8. 1959 - బ్రిటన్ సహాయంతో పశ్చిమ బెంగాల్‌లో ఇనుము-ఉక్కు కార్మాగారాన్ని ‘దుర్గాపూర్’లో స్థాపించారు.

   ముడిపదార్థాల సరఫరా
   ఐరన్ ఓర్ - బొలానిమైన్స్
   కోల్ - ఝూరియా, రాణిగంజ్
   లైమ్‌స్టోన్ - బిర్‌మిత్రాపూర్
   మాంగనీస్ - కియోంజార్
   విద్యుత్ - దామోదర్ వ్యాలీ కార్పొరేషన్
9. 1959 - ఒడిశాలో పశ్చిమ జర్మనీ సహాయంలో ‘రూర్కెలా’ ఇనుము-ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు.

   ముడి పదార్థాల సరఫరా:
   ఐరన్‌ఓర్ - సుందరగఢ్, కియోంజార్
   బొగ్గు - ఝూరియా
   విద్యుత్ - హీరాకుడ్ హైడ్రోపవర్ ప్లాంట్
   మాంగనీస్ - బరాజమ్డా
   లైమ్‌స్టోన్ - పూర్ణాపాండ్

మూడో పంచవర్ష ప్రణాళిక కాలంలో

10. 1964 - జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో యూఎస్ఎస్ఆర్ సహాయంతో ‘బొకారో’ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.

    ముడిపదార్థాల సరఫరా
    ఐరన్ ఓర్ - కిరిబురు (ఒడిశా)
    బొగ్గు - ఝూరియా
    లైమ్‌స్టోన్ - పాలము
    విద్యుత్ - దామోదర్ వ్యాలీ కార్పొరేషన్

నాలుగో పంచవర్ష ప్రణాళికా కాలంలో

11. 1972 - ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖతీరంలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ సహాయంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. 1982లో నిర్మాణాన్ని ప్రారంభించగా 1992లో పూర్తైంది.
    - 1992 ఆగస్టు 1న దివంగత ప్రధాని పి.వి. నరసింహారావు ఈ కర్మాగారాన్ని జాతికి అంకితం చేశారు.
    - ఈ కర్మాగారం దేశంలో అత్యాధునికమైంది, తీర ప్రాంతంలోని ఏకైక ఇనుము - ఉక్కు కర్మాగారం.

ఆరో పంచవర్ష ప్రణాళికా కాలంలో

12. 1982 - తమిళనాడులోని సేలం వద్ద ఇనుము - ఉక్కు కర్మాగారాన్ని స్థాపించారు. ఇది నాణేల తయారీకి, స్టెయిన్‌లెస్ స్టీల్ ఉత్పత్తికి ప్రసిద్ధి.

ఏడో పంచవర్ష ప్రణాళిక

13. 1989 - కర్ణాటకలోని హోస్పేట్ వద్ద విజయనగర్ ఐరన్ - స్టీల్ కంపెనీని ఏర్పాటు చేశారు.

#### కొత్తగా ఏర్పాటు చేయనున్న స్టీల్ ప్లాంట్‌లు

1. ఒడిశాలో పోస్కో స్టీల్ కంపెనీ. దీన్ని దక్షిణ కొరియా సహాయంతో ఎంఓయూ పద్ధతిలో నిర్మించనున్నారు.
2. బైలడిల్లా - ఛత్తీస్‌గఢ్
3. సూరజ్‌గఢ్ - మహారాష్ట్ర

#### అల్యూమినియం పరిశ్రమ

భారతదేశంలో పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ సమీపంలో జయక్ నగర్‌లో అల్యూమినియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను స్థాపించారు. దీన్ని భారత ప్రభుత్వం 1954లో జాతీయం చేసింది. ప్రస్తుతం ఈ కార్పొరేషన్ పరిధిలో ఐదు ప్రభుత్వ రంగ కంపెనీల ఆధ్వర్యంలో అల్యూమినియం స్మెల్టింగ్ పరిశ్రమను నిర్వహిస్తున్నారు.

అవి....

1. బాల్కో (భారత్ అల్యూమినియం కంపెనీ - కోర్బా (ఛత్తీస్‌గఢ్), రత్నగిరి (మహారాష్ట్ర)
2. ఇండాల్కో (ఇండియన్ అల్యూమినియం కంపెనీ) - హీరాకుడ్, బెల్గాం, అలూపురం
3. నాల్కో (నేషనల్ అల్యూమినియం కంపెనీ) - కోరాపుట్ సమీపంలోని దామన్‌జోడి, అంగుల్
4. హిండాల్కో (హిందూస్థాన్ అల్యూమినియం కంపెనీ - రేణికూడ్ (ఉత్తరప్రదేశ్)
5. మాల్కో (మద్రాస్ అల్యూమినియం కంపెనీ - మెట్టూరు (తమిళనాడు)

#### కాపర్ పరిశ్రమ

భారత్‌లో మొదటి కాపర్ పరిశ్రమను జార్ఖండ్‌లోని ‘ఘాట్‌సీలా’ వద్ద ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న రాగి ఉత్పత్తి కేంద్రాలు...

1. మహుభాండార్ (జార్ఖండ్)
2. ఖేత్రి (రాజస్థాన్)




**హెచ్ఎంటీ (హిందూస్థాన్ మిషన్ టూల్స్):** 1953లో కర్ణాటకలోని బెంగళూరులో మొదటి హెచ్ఎంటీ యూనిట్‌ను స్థాపించారు. ప్రస్తుతం దేశంలో ఆరు హెచ్ఎంటీ యూనిట్లు ఉన్నాయి. అవి....

1) శ్రీనగర్ 2) బెంగళూరు
3) పింజోర్ 4) హైదరాబాద్
5) జైపూర్ 6) కాలమస్సేరి

**బీహెచ్ఈఎల్ (భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్):** 1956లో మొదటి బీహెచ్ఈఎల్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో ఆరు బీహెచ్ఈఎల్ యూనిట్లు ఉన్నాయి. అవి...

1) భోపాల్ 2) హరిద్వార్
3) రాణిపేట్ (తమిళనాడు)
4) బెంగళూరు 5) హైదరాబాద్
6) జగదీశ్‌పూర్

**హెచ్ఏఎల్ (హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్):** 1964లో బెంగళూరులో మొదటి హెచ్ఏఎల్ యూనిట్‌ను స్థాపించారు. దేశంలో ఆరు హెచ్ఏఎల్ యూనిట్లున్నాయి. అవి....

1) నాసిక్ 2) కోరాపుట్
3) హైదరాబాద్ 4) లక్నో
5) కాన్పూర్ 6) బెంగళూరు

**ఐడీపీఎల్ (ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్):**
ప్రస్తుతం దేశంలో ఐదు ఐడీపీఎల్ యూనిట్లు ఉన్నాయి. అవి...

1) రిషికేశ్ 2) హర్యానాలోని గుర్గావ్
3) హైదరాబాద్
4) ముజఫర్‌పూర్ 5) చెన్నై

#### మాదిరి ప్రశ్నలు

1. భారతీయ ఉక్కు నగరం అని దేన్ని పిలుస్తారు?
   1) దుర్గాపూర్ 2) రూర్కెలా
   3) భిలాయ్ 4) జంషెడ్‌పూర్
2. ‘భిలాయ్’ ఇనుము ఉక్కు కర్మాగారానికి ఏ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు?
   1) ఫరక్కా థర్మల్ పవర్ ప్లాంట్
   2) దామోదర్ వ్యాలీ కార్పొరేషన్
   3) కోర్బాథర్మల్ పవర్ ప్లాంట్
   4) హీరాకుడ్ పవర్ ప్లాంట్
3. కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య ఇనుము ఉక్కు కర్మాగారానికి అవసరమైన నీటిని ఎక్కడ నుంచి సరఫరా చేస్తారు?
   1) కావేరి నది 2) తుంగ
   3) నేత్రావతి 4) భద్రావతి
4. జర్మనీ సహకారంతో దేశంలో ఏర్పాటు చేసిన ఇనుము ఉక్కు కర్మాగారం ఏది?
   1) దుర్గాపూర్ 2) రూర్కెలా
   3) భిలాయ్ 4) విశాఖ
5. దేశంలో ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేసిన ఏకైక స్పాంజ్ ఇనుము - ఉక్కు కర్మాగారం ఎక్కడ ఉంది?
   1) హోస్పేట్ 2) మెట్టూరు
   3) విశాఖ
   4) పాల్వంచ(ఖమ్మం)
6. భారత్ అల్యూమినియం కంపెనీ (బాల్కో) ఆధ్వర్యంలో అల్యూమినియం స్మెల్టింగ్ యూనిట్ ఉన్న ప్రదేశం ఏది?
   1) రాణిపేట్ 2) రేణికూట్
   3) బెల్గాం 4) కోర్బా
7. కింది వాటిలో హెచ్ఎంటీ యూనిట్ లేని ప్రదేశం ఏది?
   1) రిషికేశ్ 2) పింజోర్
   3) కాలమస్సేరి 4) అజ్మీర్
8. రైల్వే ఎలక్ట్రిక్ ఇంజన్లను తయారు చేసే బీహెచ్ఈఎల్ (భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్) యూనిట్ ఏది?
   1) హరిద్వార్ 2) భోపాల్
   3) రాణిపేట్ 4) బెంగుళూరు
9. ట్రాక్టర్స్‌ను తయారుచేసే హెచ్ఎంటీ యూనిట్ ఏది?
   1) శ్రీనగర్ 2) కాలమస్సేరి
   3) అజ్మీర్ 4) పింజోర్
10. ‘సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్’ను తయారు చేసే ఐడీపీఎల్ యూనిట్ ఏది?
    1) రిషికేశ్ 2) చెన్నై
    3) ముజఫర్‌పూర్ 4) గుర్గావ్

**సమాధానాలు**

1) 4; 2) 3; 3) 4; 4) 2; 5) 4;
6) 4; 7) 1; 8) 2; 9) 4; 10)2.

# The local residents may protest against..




**MODEL QUESTIONS**

Read the questions carefully and answer the following:

***Directions (Q. No. 1-5):*** Given a statement followed by two assumptions numbered I and II. You have to consider the statement and the following assumptions and decide which of the assumptions is implicit in the statement.

Mark (a) if only assumption I is implicit
Mark (b) if only assumption II is implicit
Mark (c) if either I or II is implicit
Mark (d) if neither I nor II is implicit
Mark (e) if both I and II are implicit

1. **Statement:-**
   The government has decided to provide monetary relief to the farmers in the drought-hit areas.
   **Assumptions:**
   I. The farmers of the affected areas may accept the government relief.
   II. The government machinery may be able to reach the affected farmers to provide relief.
2. **Statement:-**
   All the students of a school were instructed by the Principal to reach school at least 15 minutes before the stipulated time for the coming month.
   **Assumptions:**
   I. The parents of the students of the school may protest against the Principal's instruction.
   II. The parents may request the Principal to withdraw the instruction.
3. **Statement:-**
   Railway authority has started Internet booking facility of long-distance trains and also delivering the tickets at the doorstep through courier service at a little extra cost.
   **Assumptions:**
   I. Many customers may now book their tickets through Internet, resulting into fewer crowds at ticket booking offices.
   II. Most of the customers may still buy their railway tickets at the booking counters.
4. **Statement:-**
   "If you have obtained 75 per cent or more marks in X Std examination, your admission to our coaching class for XII Std is guaranteed."_An advertisement.
   **Assumptions:**
   I. Bright students do not generally opt for attending coaching classes.
   II. The coaching class has adequate capacity to accommodate all such students.
5. **Statement:-**
   The municipal corporation has given permission for holding fun fairs in the local football ground during the holiday season.
   **Assumptions:**
   I. The local residents may protest against the corporation's decision.
   II. Many people may not participate in the fun fair.

***Directions (Q. No. 6-10):*** In making decisions about important questions, it is desirable to be able to distinguish between "strong" arguments and "weak" arguments in so far as they relate to the question. Strong arguments are those which are both important and directly related to the question. Weak arguments are those which are of minor importance and also may not be directly related to the question or may be related to a trivial aspect of the question.

**Instructions:** Each question below is followed by two arguments numbered I and II. You have to decide which of the arguments is a strong argument and which is a weak argument.

Give answer 1 if only argument I is strong
Give answer 2 if only argument II is strong
Give answer 3 if either I or II is strong
Give answer 4 if neither I nor II is strong and
Give answer 5 if both the arguments I and II are strong.

6. Should graduation be made minimum educational qualification for entry-level jobs in any public sector organization?
   **Arguments:-**
   I. Yes, graduates always perform better than non-graduates by virtue of their higher level of education.
   II. No, there are quite a few people who cannot afford to remain unemployed till the completion of graduation and are capable of performing equally well as the graduate candidates.
7. Should the examination bodies for all university examinations permit the use of calculators?
   **Arguments:-**
   I. No, it is necessary for the students to know the methods of manual calculations.
   II. Yes, manual calculations are no more required with extensive use of computers in all fields.
8. Should the knowledge of Hindi language be made compulsory for all the employees of public sector organizations?
   **Arguments:-**
   I. Yes, it is necessary for dealing with people from the educationally backward strata of the society.
   II. No, it is not necessary for every employee to have the knowledge of Hindi language.
9. Should it be made compulsory for all the private sector organizations to reserve quota for society backward classes?
   **Arguments:-**
   I. No, the private sector should not be governed by the Government rules.
   II. Yes, private sector organizations should also contribute in upliftment of socially backward classes.
10. Should the women be advised not to travel alone at night in view of the increasing incidences of rape and sexual abuse?
    **Arguments:-**
    I. No, instead the Government should take measures to control such incidences.
    II. Yes, it is difficult even for the police department to control such cases.

***Directions (Q. No. 11 - 13):*** Read the questions carefully and answer the following:

11. **Cause:-**
    All the major rivers in the state have been flowing way over the danger level for the past few weeks.
    Which of the following is /are possible effect (s) of the above cause?
    (A) Many villages situated near the riverbanks are submerged, forcing the residents to flee.
    (B) Govt has decided to provide alternate shelter to all the affected villagers residing near the river banks.
    (C) The entire state has been put on high flood alert.
    (1) Only (A) (2) Only (A) and (B)
    (3) Only (B) and (C)
    (4) All (A), (B) and (C)
    (5) None of these
12. **Effect:-**
    This year majority of the final year students of the management institute have opted for finance specialization.
    Which of the following can be a probable cause of the above effect?
    (1) Last year most of the students with HR specialization got better job offers than other specializations.
    (2) The management institute offers only finance specialization to its final year students.
    (3) Last year the students with finance specialization bagged most of the lucrative offers vis-à-vis students with other specializations.
    (4) The management institute has recently started its finance specialization in addition to Marketing and HR being offered earlier.
    (5) None of these
13. **Effect:-**
    Govt allowed all the airlines to charge additional amount as peak time congestion charges for the flights landing between 6.00 a.m. and 10.00 a.m.
    Which of the following is a probable cause of the above effect?
    (1) All the airline companies had threatened to suspend their services during peak hours.
    (2) The Govt has increased its tax for peak time flights.
    (3) The aircrafts are routinely put on hold over, causing extra fuel consumption.
    (4) The airline companies can now charge unlimited additional charge for peak time flights.
    (5) None of these

## Solutions

1. When the government has decided to provide relief to the farmers, it must be assuming that the plan can be executed, and the farmers respond positively. Hence, both I and II are implicit. **Ans: 5**
2. If Principal is instructing students, he must be assuming that the students will abide by his instruction, and the parents will also accept it. Hence, both I and II are not implicit **Ans: 4**
3. The initiative taken by the railway authority has been aimed at providing better service-customer. Hence, I is implicit. II may nor may not be an assumption. Hence II is not implicit **Ans: 1**
4. From the advertisement, it is clear that the advertiser must be assuming II. Hence, II is implicit. Assumption I is rather contradicting the statement. Hence, I is not implicit. **Ans: 2**
5. Since assumptions I and II go against the spirit of the given statement, both I and II are not implicit. **Ans: 4**
6. Note "graduates ALWAYS perform". Hence, I is not necessarily true. Hence I is not strong. II deviates from the core issue. Hence, II is not strong. **Ans: 4**
7. I is a simple declaration. Hence, it is not strong. II is strong as it explains the reason behind it. **Ans: 2**
8. I is strong because it is true to a large extent. But II is simplistic and hence weak. **Ans: 1**
9. I is not the correct way of arguing. Hence, I is not strong. Upliftment of socially backward classes is necessary. Hence, II is strong. **Ans: 2**
10. **Ans: 4.**
11. All the three are the possible effects of the given cause. **Ans: 4**
12. Only (3) seems to be the probable cause. **Ans: 3**
13. As aircrafts incur extra fuel consumption charges, government allowed all the airlines to charge additional amount. **Ans: 3**